వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

ఆశ్రమవాసిక, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వాలు



డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
విజయవాడ - 12.

వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

ఆశ్రమవాసిక, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వాలు

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894-82731
రామ - మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

ఆశ్రమవాసిక, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వాలు

ప్రథమ ముద్రణ : గీతా జయంతి (డిసెంబర్ 2010)

20• సంపుటాల వెల : రూ. 720/-

e27502

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C.No. 96370
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, **పోలకంపాడు,**
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

క్రీ॥శే॥ కరెడ్ల గోపాలకృష్ణమూర్తి గారి స్మృత్యర్థం

వారి ధర్మపత్ని కమలమ్మ

కుమారులు - కోడళ్లు :

వెంకట సీతారామశాస్త్రి - అనంతలక్ష్మి

సుందరశర్మ - లలితా రాజేశ్వరి, శ్రీనివాస్ - రోజాఘినాక్షి

టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్ముల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.



కీ॥శే॥ మోచర్ల రామకృష్ణ శర్మ గారు

వారి స్మృత్యర్థం

ట్రైటిల్ బోర్డు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని వరలక్ష్మి

కుమారుడు :

పూర్ణ వెంకట రామశర్మ

కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి స్మృత్యర్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని సుభద్ర

కుమారులు - కోడళ్లు :

శ్రీయుతులు శ్రీనివాస్ - సౌభాగ్యలక్ష్మి

సత్యనారాయణ (చినబాబు) - యామినీలక్ష్మి

కుమార్తెలు :

భవాని, విశాలాక్షి

కీ॥శే॥ బ్రహ్మశ్రీ పాలపర్తి వెంకట సుబ్బారావు

వారి ధర్మపత్ని పూర్ణాంబ

As a H˙ndu, every individual has to study,
observe, and realize the essence of

MAHABHARATHAM



An. Muthu Palaniappam
M. Meenakshi

As a Hindu, every individual has to study,
observe, and realize the essence of

MAHABHARATHAM

M. Bala Subramanyam
Smt. Anbuchelvi

మానవులలో మానవత్వాన్ని పెంపొందించే

మహాభారతానికి మా నమస్కారం

సిరిగిరి దుర్గారావు

వారి ధర్మపత్ని శ్రీమతి శారద

రచయిత :

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి,
వారి ధర్మపత్ని శ్రీమతి సీత

రచయిత :

డాక్టర్ సూరం శ్రీనివాసులు,

వారి ధర్మపత్ని శ్రీమతి సులోచన

ఎందరో మహానుభావులు

ఆశ్రమవాసిక, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వాలు ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి, శ్రీ వెలంపల్లి దాశరథి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంత తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది 'అభిగమ్యకృతే దానం' అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కొరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వం తానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకొంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా। పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా। ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా॥ ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	।	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.		శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

వీటిని అందంగా డి.టి.పి. తయారుచేసిన బెవర వెంకటరమణ, వి.యస్.గ్రాఫిక్స్ వారికి మా కృతజ్ఞతాభివందనములు.

అందరికీ వందనాలు

కార్యదర్శి.
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది, ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణ మని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులను ప్రతినిధులుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని

అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించాడు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యధాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం – వ్యాస మహాభారతం (తెలుగు వచనం).*

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాబ్జేషు యే
లోకానాం స్థితి మావహత్త్రివిహతాం స్త్రైపుంసయోగోద్భవాం
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమాబ్జభవ శ్రీకన్దరా శ్శ్రేయసే

ఇట్లు
అనువక్తలు

★ మహాభారతం యధాతథంగా అనగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య

ఆశ్రమవాసిక పర్వం

1. ఆశ్రమవాస పర్వము - 28

1.	యుధిష్ఠిరాదులు ధృతరాష్ట్రుని సేవించుట. (27)★	21
2.	గాంధారీధృతరాష్ట్రులపట్ల పాండవుల అనుకూల వర్తనము. (30)	23
3.	ధృతరాష్ట్ర నిర్వేదము. (87)	24
4.	వ్యాసుని అనుమతి. (22)	29
5.	ధృతరాష్ట్రోపదేశము. (43)	30
6.	ధృతరాష్ట్రుడు రాజనీతి నుపదేశించుట - 1 (20)	33
7.	ధృతరాష్ట్రుడు రాజనీతినుపదేశించుట - 2 (23)	35
8.	ధృతరాష్ట్రుడు వనగమనానికి అనుమతి కోరుట. (25)	36
9.	ధృతరాష్ట్రుడు ప్రజల క్షమనుకోరుట. (27+1)	38
10.	ప్రజాప్రతినిధిగా సాంబుడు మాటాడుట. (53)	39
11.	ధృతరాష్ట్రుడు విదురుని ద్వారా ధర్మజుని ధనమునకై అభ్యర్థించుట. (25)	42
12.	యుధిష్ఠిరుని అంగీకృతి. (13)	43
13.	విదుర వచనము. (15)	44
14.	దాన యజ్ఞానుష్ఠానము. (18)	45

★ బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య. రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
15.	గాంధారీ ధృతరాష్ట్రుల వనగమనము. (13)	46
16.	కుంతీ వన ప్రస్థానము. (32)	47
17.	కుంతి వచనము. (21)	49
18.	ధృతరాష్ట్రాదులు గంగాతీరమున విడిది చేయుట. (25)	50
19.	ధృతరాష్ట్రాదులు శతయూపాశ్రమమున నివసించుట. (18)	51
20.	నారదవచనము. (38)	53
21.	ధృతరాష్ట్రాదులను గూర్చి పాండవులు పౌరులు చింతించుట. (16)	55
22.	యుధిష్ఠిర యాత్ర. (26)	56
23.	పాండవులు కురుక్షేత్రమును చేరుట. (18)	57
24.	యుధిష్ఠిరాదులు ధృతరాష్ట్రాదులను కలియుట. (20)	58
25.	ఋషులకు పాండవాదులను పరిచయము చేయుట. (19)	60
26.	విదురనిర్యాణము. (38)	61
27.	వ్యాసుని రాక. (26)	63
28.	వ్యాసవాక్యము. (25)	65

2. పుత్ర దర్శన పర్వము - 8

29.	ధృతరాష్ట్రాదుల అభ్యర్థన. (53)	66
30.	కుంతి కర్ణజన్మ వృత్తాంతము చెప్పుట. (24)	69
31.	గంగాతీర గమనము. (25)	71

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
32.	గంగాజలమున భీష్మాదులు కనిపించుట. (21)	72
33.	క్షత్రియకాంతలు తమతమ భర్తల లోకాలను చేరుట. (31)	73
34.	వైశంపాయన వచనము. (18)	75
35.	వ్యాసుని కృపతో జనమేజయుడు తండ్రిని చూచుట. (18)	77
36.	యుధిష్ఠిరుడు తిరిగి వచ్చుట. (53)	78
	1. నారదాగమన పర్వము - 3	
37.	నారదాగమనపర్వము. (45)	81
38.	యుధిష్ఠిర విలాపము. (21)	84
39.	శ్రాద్ధదానము. (27)	85
	మౌసల పర్వం - 8	
1.	ముసలోత్పత్తి. (31)	87
2.	యదు వంశస్థులు తీర్థయాత్రకు బయలుదేరుట. (24)	89
3.	యాదవుల పరస్పరసంహారము. (47)	90
4.	బలరామశ్రీకృష్ణులు పరమధామము చేరుట. (28)	93
5.	అర్జునుడు ద్వారకకు వచ్చుట. (15)	95
6.	ద్వారకలో అర్జున వసుదేవ సంభాషణ. (28)	96
7.	వృష్ణికళత్రాదుల రాక. (76)	98

ఆధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
8.	అర్జున వ్యాసుల సంభాషణ. (38)	102

మహాప్రస్థానిక పర్వం - 3

1.	ద్రౌపదీ పాండవుల మహాప్రస్థానము. (46)	106
2.	ద్రౌపదీ సహదేవ నకుల అర్జున భీమసేనుల పతనము. (26)	109
3.	యుధిష్ఠిరుడు స్వర్గమున కేగుట. (38)	110

స్వర్గారోహణ పర్వం - 5 + 1

1.	నారద యుధిష్ఠిర సంవాదము. (26)	113
2.	యుధిష్ఠిరుడు నరకమును దర్శించుట. (54)	115
3.	యుధిష్ఠిర తనుత్యాగము. (44)	118
4.	యుధిష్ఠిరుడు స్వర్గలోకమున అర్జునాదులను చూచుట. (23)	120
5.	భీష్మాదులు తమ మూలస్వరూపాలను పొందుట - మహాభారతమాహాత్మ్యము. (68)	122

	మహాభారత శ్రవణ విధి (105)	127
	మహాభారత మాహాత్మ్యము (27)	133
	తప్పు - ఒప్పుల పట్టిక	136

। శ్రీమాత్రే నమః ।

వ్యాస

మహాభారతం

(తెలుగు వచనం)

ఆశ్రమవాసిక పర్వం

1. యుధిష్ఠిరాదులు ధృతరాష్ట్రుని సేవించుట.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరుల మనస్సులే నివాస స్థానమైన నారాయణునికీ, నరోత్తమునికీ, సరస్వతీ దేవికీ, వ్యాసమహర్షికీ నమస్కరించి శ్రీమహాభారతమును చదువవలెను/ చెప్పవలెను.

జనమేజయుడడిగాడు. "నా ప్రపితామహులు, మహాత్ములు అయిన పాండవులు రాజ్యాన్ని పొందిన తరువాత మహారాజు అయిన ధృతరాష్ట్రుని విషయంలో ఎలా ప్రవర్తించారు? ఆ రాజు అమాత్యులను, పుత్రులను కోల్పోయి నిరాశ్రయుడయ్యాడు గదా! ఐశ్వర్యహీనుడైన ఆ రాజు, యశస్విని అయిన గాంధారి ఎలా ఉన్నారు ? మహాత్ములైన ఆ నా ప్రపితామహులు ఎంతకాలం రాజ్యంలో ఉన్నారు? అది నాకు చెప్పవలసినది?"

వైశంపాయనుడు చెప్తున్నాడు. "మహాత్ములైన పాండవులు శత్రువులను సంహరించి, రాజ్యాన్ని పొంది, ధృతరాష్ట్రుని ముందుంచుకొని రాజ్యపాలన చేశారు. అప్పుడు విదురుడు, సంజయుడు, వైశ్యాపుత్రుడు, మేధావి అయిన యుయుత్సుడు ధృతరాష్ట్రుని సేవించారు. పాండవులు సర్వకార్యాలను ఆ రాజును అడిగేవారు. అలా ఆయన అనుమతితో పదిహేను సంవత్సరాలు పరిపాలించారు. వీరులైన ఆ పాండవులు ప్రతిదినమూ ఆ ధృతరాష్ట్ర నరపాలుని సేవించేవారు. ఆయన దగ్గరకు పోయి, పాదాలకు నమస్కరించి ధర్మజుని అధీనంలో నిలిచేవారు. ధృతరాష్ట్రుడు వారి శిరస్సుల నాఘ్రాణించేవాడు. ఆయన అనుమతితో వారు అన్ని పనులు చేసేవారు. కుంతికూడా గాంధారిని అనుసరించి ప్రవర్తించేది. ద్రౌపది, సుభద్ర, ఇతర పాండవస్త్రీలు కూడా కుంతి గాంధారి - ఈ అత్తలపై సమానభావంతోనే

యథావిధిగా ప్రవర్తించేవారు. మహారాజా! యుధిష్ఠిరుడు విలువైన శయ్యలను, వస్త్రాలను, నగలను రాజోచితాలైన సమస్తభక్ష్య భోజ్యాలను ధృతరాష్ట్రునకు సమర్పించేవాడు. అదే రీతిగా కుంతి గాంధారిపై గురుభావంతో ఆమెను సేవించేది. కౌరవా! కుమారులను కోల్పోయిన ఆ వృద్ధనరపాలుని విదురుడు, సంజయుడు, యుయుత్సుడు సేవిస్తుండేవారు. ద్రోణునకు ప్రియమైన బావమరిది కృపుడు. ఆయన మహాత్ముడు. మేటివిలుకాడు. ఆ బ్రాహ్మణుడు ఆ ధృతరాష్ట్రుని దగ్గరే ఎప్పుడూ ఉండేవాడు. పురాణముని, పూజ్యుడైన వ్యాసుడు నిత్యమూ దేవతలకు, ఋషులకు, పితరులకు, రాక్షసులకు సంబంధించిన కథలను చెపుతూ ధృతరాష్ట్రుని దగ్గరే ఉండేవాడు.

ధృతరాష్ట్రుని అనుమతితో విదురుడు ధర్మయుక్తాలైన కార్యాలను, సర్వవ్యవహారాలను చేయిస్తూ ఉండేవాడు. విదురుని ఉత్తమనీతి కారణంగా ఆ ధృతరాష్ట్రునకు ఇష్టమైన ఎన్నో పనులు స్వల్ప వ్యయంతోనే సామంతుల ద్వారా సమకూరేవి. బందీలను విడిపించేవాడు. మరణశిక్షను పొందినవారిని విడిపించేవాడు. అయినా రాజైన ధర్మసుతుడు ఎప్పుడూ, ఏమీ అనేవాడు కాదు. మహాతేజస్వి, కురురాజు అయిన ధర్మరాజు విహారయాత్రల సమయంలో ధృతరాష్ట్రుడు కోరిన వస్తువుల నన్నింటినీ సమకూర్చిపెట్టేవాడు. అందుకు ముందువలెనే ఆరాలికులు (ఆకుకూరలు వండేవారు), సూపకారులు (పప్పు మొ చేసేవారు), రాగఖాండవికులు (పానీయాలు చేసేవారు) ధృతరాష్ట్రసేవకై ఉండేవారు. పాండవులు యథోచితంగా విలువైన వస్త్రాలను, వివిధమాల్యాలను ధృతరాష్ట్రునికి కానుక చేసేవారు. అంతకుముందువలెనే సుఖంగా ఆస్వాదించగల ఫలరసాలను, తేలికైన పానకాలను, విచిత్ర భక్ష్యాలను ధృతరాష్ట్రునకై సమకూర్చిపెట్టేవారు. అంతకుముందువలెనే వివిధప్రాంతాల నుండి వచ్చిన రాజులు అందరూ ధృతరాష్ట్రుని సేవిస్తుండేవారు.

నరోత్తమా! కుంతి, ద్రౌపది, కీర్తిమతి అయిన సుభద్ర, నాగకన్య అయిన ఉలూపి, చిత్రాంగదా దేవి, ధృష్టకేతుని సోదరి, జరాసంధుని కుమార్తె – ఇంకా ఎందరో స్త్రీలు అందరూ సేవికలవలె గాంధారిని సేవించేవారు. పుత్రులను కోల్పోయిన ఈయన కొంచెం కూడా దుఃఖపడకూడ దని యుధిష్ఠిరుడు నిత్యమూ సోదరులను శాసించేవాడు. ధర్మజుని అర్థవంతమైన ఆ మాటను విని సోదరులు అందరూ – భీమసేనుడు తప్ప – అప్పుడు ఆయనను ప్రత్యేకంగా ఆదరించేవారు. ధృతరాష్ట్రుని దుర్బుద్ధి కారణంగా జూదం వలన కలిగిన అనర్థం ఆ భీమసేనుని హృదయంనుండి ఎప్పుడూ దూరమయ్యేది కాదు."

2. గాంధారీధృతరాష్ట్రులపట్ల పాండవుల అనుకూల వర్తనము.

ఈ రీతిగా పాండవులచే చక్కగా ఆదరింపబడుతున్న ధృతరాష్ట్రుడు అంతకుముందువలెనే ఋషులచే ఉపాసింపబడుతూ విహరించసాగాడు. ఆ కురుకులభూషణుడు బ్రాహ్మణులకివ్వవలసిన అగ్రహారాలను దానం చేశాడు. కొంతేయుడైన యుధిష్ఠిరనరపాలుడు దానినంతా ఆమోదించాడు. దయామయుడైన యుధిష్ఠిరనరపాలుడు ఆనందంగా సోదరులతో, అమాత్యులతో ఇలా అన్నాడు. "నేను, మీరు కూడా ఈ రాజును గౌరవించాలి. ధృతరాష్ట్రుని అదుపులో నిలిచినవాడు నాకు ఆత్మీయుడు. దానికి భిన్నంగా ప్రవర్తించిన నరుడు నాకు శత్రువు. నే నతనిని నియంత్రించవలసి వస్తుంది. పితృతిథులలో, పుత్రమిత్రుల శ్రాద్ధకర్మల సమయంలో తాను కోరినదంతా జరిగి తీరాలి. ఆ తరువాత మహామనస్వి, కౌరవ్యుడు అయిన ఆ ధృతరాష్ట్ర మహారాజు బ్రాహ్మణులకు వారియోగ్యతకు తగినట్లు అనేక ధనాలను దానం చేశాడు. ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు ధర్మజునకిష్టమైనది చేయాలన్న భావంతో ఆ ధృతరాష్ట్ర కార్యకలాపాలు అన్నింటికీ సహకరించేవారు.

పుత్రపౌత్ర మరణంతో బాధపడుతున్న ఈ వృద్ధనరపాలుడు మనవలన శోకాన్ని పొంది మరణించకూడదని వారు ఎప్పుడూ ఆలోచిస్తుండేవారు. పుత్రులు బ్రతికి ఉన్నప్పుడు కురువీరుడైన ధృతరాష్ట్రుడు ఎంత సుఖాన్ని, భోగాలను అనుభవించాడో అవన్నీ ఇప్పుడు కూడా అనుభవించేటట్లు వ్యవస్థీకరించారు. అటువంటి నడవడితో పాండునందనులు అయిదుగురు సోదరులు ఒకటిగా ధృతరాష్ట్రుని అనుశాసనంలో నిలిచారు. ధృతరాష్ట్రుడు కూడా వినయంతో, తన ఆదేశాలను పాటిస్తూ శిష్యులవలె తనను సేవిస్తున్న ఆ పాండవులను గురువువలె (తండ్రివలె) స్వీకరించేవాడు. గాంధారి కూడా పుత్రులకై వివిధశ్రాద్ధకర్మలను నిర్వహించి, విప్రులకు వారు కోరిన దానాలనిచ్చి, పుత్రఋణం నుండి విముక్తి పొందింది.

ఈ రీతిగా ధర్మవేత్తలలో శ్రేష్ఠుడు, ధీమంతుడు యుధిష్ఠిరుడు అయిన ధర్మరాజు సోదరులతో కలిసి ఆ రాజును పూజించాడు. మహాతేజస్వి, కురుకుల శిరోమణి, వృద్ధుడు అయిన ఆ ధృతరాష్ట్ర నరపాలుడు యుధిష్ఠిరునిలో తన మనస్సు కష్టపెట్టుకొనే ప్రవర్తనను కొంచెంకూడా చూడలేదు. మహాత్ములైన పాండవులు అలా సత్ప్రవర్తనతో ఉండగా అంబికాసుతుడైన ధృతరాష్ట్రుడు ప్రీతిని పొందాడు. సుబలపుత్రిక అయిన గాంధారికూడా తన పుత్రశోకాన్ని వీడి సొంతకొడుకుల మీదవలె పాండవులపై ఎప్పుడూ

ప్రేమ కలిగి ఉండేది. పరాక్రమవంతుడు, కురుకులశిరోమణి అయిన ధర్మరాజు ధృతరాష్ట్ర నరపాలునకు ప్రియమైనదే ఎప్పుడూ ఆచరించేవాడు, అప్రియకార్యాలు చేసేవాడు కాదు. మహారాజా! ధృతరాష్ట్ర మహారాజు కానీ, తపస్విని అయిన గాంధారి కానీ ఏ పని చెప్పినా – అది చిన్నదయినా పెద్దదయినా సరే – పరవీరహంత, పాండవధురంధరుడైన ధర్మరాజు వారి మాటలు మన్నిస్తూ ఆ పని చేసేవాడు. ధర్మజుని ఆప్రవర్తనతో ధృతరాష్ట్ర మహారాజు ధర్మజునిపై ప్రేమను ప్రకటించేవాడు. బుద్ధిహీనుడైన తన కుమారుని తలచుకొని పరితపించేవాడు. నిత్యమూ ఉదయమే లేచి ధృతరాష్ట్రరాజు జపం చేసి పవిత్రుడై పాండుపుత్రులకు యుద్ధాలలో విజయం కలగాలని ఆశీర్వదించేవాడు. బ్రాహ్మణులచే స్వస్తివచనాలను పలికించి, అగ్నిహోత్రం చేసి, ఆ రాజు పాండవుల ఆయుస్సు వర్ధిల్లాలని ఆశించేవాడు. కురుకుల శిరోమణి అయిన ఆ రాజు పాండుపుత్రుల ద్వారా నిత్యమూ పొందుతున్న ప్రీతిని గతంలో తన కుమారులద్వారా కూడా పొందలేకపోయాడు.

యుధిష్ఠిరుడు బ్రాహ్మణులతోనూ, క్షత్రియులతోనూ ప్రవర్తించినట్లే వైశ్యులతోనూ, శూద్రులతోనూ కూడా ప్రవర్తించేవాడు. దానితో తాను వారందరికీ ఇష్టుడయ్యాడు. గతంలో ధృతరాష్ట్ర కుమారులు తమతో పాప బుద్ధితో ప్రవర్తించిన దానిని మనస్సులో పెట్టుకోకుండా ఆ యుధిష్ఠిరుడు ధృతరాష్ట్రుని సేవించేవాడు. ధృతరాష్ట్రునకు అప్రియం కలిగేటట్లు ఏ నరుడు ప్రవర్తించినా ధీమంతుడైన ధర్మజునకతడు ద్వేషింపదగినవాడయ్యేవాడు. యుధిష్ఠిరునకు భయపడి, ధృతరాష్ట్ర దుర్యోధనులు చేసిన అకృత్యాలను గురించి ఏ నరుడూ కూడా మాటాడేవాడు కాదు. శత్రుసూదనా! ధృతరాష్ట్రుడు, గాంధారి, విదురుడు కూడా ఆ యుధిష్ఠిరుని ధైర్యంతో, పవిత్రతతో ఆనందించేవారు. కానీ భీముని ప్రవర్తనతో వారు సంతోషపడే వారు కాదు. భీముడు కూడా గట్టి నిశ్చయంతో ధర్మజుని అనుసరించే వాడు కానీ ధృతరాష్ట్రుని చూస్తే మాత్రం ఎప్పుడూ మనసులో చెడు తలపులు కలిగేవి. శత్రుసూదనుడైన భీముడు ధృతరాష్ట్రుని అనుసరిస్తున్న ధర్మజుని అనుసరించి తానూ ప్రవర్తించేవాడు. కానీ ధృతరాష్ట్రుడంటే విముఖంగానే ఉండేవాడు."

3. ధృతరాష్ట్ర నిర్వేదము.

"యుధిష్ఠిర నరపాలునకు, ధృతరాష్ట్రునకు ఒకరిపై ఒకరికి గల ప్రేమవిషయంలో రాజ్యంలోని ప్రజలు ఎవ్వరూ తేడాను చూడలేకపోయారు. రాజా! ధృతరాష్ట్రమహారాజు దుర్మతి అయిన తనకుమారుని తలచుకొన్నప్పుడంతా భీమసేనుని గురించి అప్రియంగానే

ఆలోచించేవాడు. రాజేంద్రా! అదే రీతిగా భీమసేనుడు కూడా ధృతరాష్ట్ర నరపాలుని మనసా దుష్టునిగానే భావించేవాడు. ఎప్పుడూ సహించగలిగేవాడు కాదు. భీమసేనుడు ధృతరాష్ట్రుని విషయంలో పైకి కనిపించని అప్రియాలు చేసేవాడు. భీమసేనుడు నియమించిన పురుషులు కృతజ్ఞతతో ధృతరాష్ట్రుని ఆదేశాలను భంగపరచేవారు కూడా. ధృతరాష్ట్రుడు గతంలో చేసిన దురాలోచనలను, కొన్ని దుశ్చేష్టలను భీమసేనుడు తలచుకొంటుండేవాడు. ఒకసారి మిత్రులమధ్యలో బాహువులనప్పళించి, తమ వైరులయిన దుర్యోధన, కర్ణ, దుశ్శాసనులను తలచుకొని తీవ్రకోపంతో, అసహనంతో గాంధారీధృతరాష్ట్రులు వింటుండగా ఇలా పరుషంగా మాటాడాడు. "నా బాహువులు గడియలవంటివి. వీటితో నేను నానాశస్త్రాస్త్రాలతో పోరాడుతున్న ఈ గ్రుడ్డిరాజు కొడుకులను అందరినీ యమలోకానికి పంపాను. గడియలవంటి ఈ నా భుజాలు ఎవరికీ చొరరానివి. వీటిలోనికి ప్రవేశించి ధృతరాష్ట్రుని కొడుకులు నశించిపోయారు. అటువంటి ఈ భుజాలు చందనచర్చితాలు. చందనానికి తగినవి. వీటితోనే దుర్యోధనుని పుత్రులతో, బంధువులతో పాటు నాశనం చేశాను."

ఈ మాటలను, ఇంకా ఇటువంటి మాటలనెన్నింటినో విన్నాడు ధృతరాష్ట్రరాజు. అవి ముళ్ళవలె గ్రుచ్చుకొన్నాయి. భీమసేనుని ఆ మాటలతో ఆయనకు నిర్వేదం కలిగింది. తారుమారయ్యే కాలాన్ని గురించి, సర్వధర్మాలను గురించి తెలిసిన ధీమతి - గాంధారీదేవి కూడా ఆ అప్రియవచనాలను విన్నది. ఆ రీతిగా పదిహేను సంవత్సరాలు గడచిపోయాయి. భీముని మాటలనే బాణాల పీడనకు గురి అయిన ధృతరాష్ట్రుడు నిర్విణ్ణుడయ్యాడు. కానీ కౌంతేయుడైన యుధిష్ఠిరునకు కానీ, అర్జునునకు కానీ, కుంతికి కానీ, కీర్తిమతి అయిన ద్రౌపదికి కానీ ఈ విషయం తెలియదు. ధర్మజ్ఞులయిన నకులసహదేవులు కూడా ధృతరాష్ట్రుని మనస్సుననుసరించి ప్రవర్తించేవారు. ఆయన మనస్సును మన్నిస్తూ అప్రియంగా ఒక్కమాటా అనేవారు కాదు. ఆపై ధృతరాష్ట్రుడు తన మిత్రులను పిలిపించాడు. కళ్ళనీరు క్రుక్కుకొని తీవ్రగద్గదస్వరంతో ధృతరాష్ట్రుడిలా అన్నాడు.

"కురువంశం ఎలా నశించిందో మీకు తెలుసు. నా తప్పువలననే అదంతా జరిగిందని కౌరవులకు తెలుసు. నేనే బుద్ధిహీనుడనై దుర్యోధనునకు కౌరవాధిపత్యాన్ని కట్టబెట్టాను. వాడు దుర్మతి. దాయాదులకు భయాన్ని పెంచేవాడు. అర్థవంతంగా వాసుదేవుడు చెప్పిన మాటలను నేను వినలేదు. దుర్మతి, పాపాత్ముడు అయిన ఈ దుర్యోధనుని అమాత్యులతోసహా వధింపుమని ధీమంతులు హితాన్ని కోరి చెప్పారు. అయినా

పుత్రవాత్సల్యానికి లోనై నేనాపని చేయలేదు. విదురుడు, భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, మహాత్ముడైన వ్యాసుడు, సంజయుడు, గాంధారి కూడా పదేపదే చెప్పారు. నేను వినలేదు. ఆ విషయం ఇప్పటికీ నన్ను తపింపజేస్తోంది. గుణవంతులు, మహాత్ములు అయిన పాండుపుత్రులకు పితృ పితామహులకు చెందిన ఈ రాజ్యసంపదను కూడా నేను ఇవ్వలేదు. సర్వరాజులు నశింపబోతున్నారని ముందే చూసి శ్రీకృష్ణుడు పాండవులకు రాజ్యమివ్వటం పరమశ్రేయస్సుగా భావించాడు. (కానీ నేను పట్టించుకోలేదు.) ఇలా అప్పుడు నేను చేసిన వేలకొలది అప్రియకార్యాలు ఇప్పటికీ హృదయశల్యాలై ఉన్నాయి. అవన్నీ భరిస్తున్నాను. పదిహేను సంవత్సరాల తర్వాత ఇప్పటికి దుర్మతినైన నా కళ్ళు తెరచుకొన్నాయి. ఈ పాపప్రక్షాళన కోసం నియమపాలన చేస్తున్నాను. రెండురోజుల కొకసారి లేదా నాలుగురోజుల కొకసారి ఆకలి తీరటానికి మాత్రమే భుజిస్తున్నాను. నా ఈ విషయం గాంధారికి తెలుసు. ఇతర పరిజనులు అందరు మాత్రం నేను నిత్యమూ భుజిస్తున్ననే భావిస్తున్నారు. జనం యుధిష్ఠిరునకు భయపడి నా దగ్గరకు వస్తున్నారు. యుధిష్ఠిరుడు నాకై ఎంతో తపిస్తున్నాడు. నేను, గాంధారి కూడా నియమపాలనమన్న సాకుతో మృగచర్మాలు ధరించి, దర్భాసనంపై కూర్చొని జపిస్తూ భూమిపై శయనిస్తున్నాము. యుద్ధంలో వెన్నుచూపని నూరుగురు కొడుకులు మాకున్నారు. వారంతా పోరాడుతూ చనిపోయారు. దానికి నేను బాధపడటం లేదు. వారికి క్షత్రధర్మమే తెలుసు." తన మిత్రులతో అలా పలికి ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

"కౌంతేయా! నీకు మేలు కలగాలి. నా మాట విను. నాయనా! నీ చక్కని పాలనలో నేను సుఖంగా బ్రతికాను. మహాదానాల నిచ్చాను. పదేపదే శ్రాద్ధకర్మలు నిర్వహించాను. నాయనా! ఈ గాంధారి తన శక్తిననుసరించి ఉత్తమపుణ్యకర్మల నాచరించింది. వందమంది కొడుకులను పోగొట్టుకొని కూడా ధైర్యంతో నా బాగోగులు చూస్తోంది. కురునందనా! ద్రౌపదికి అపకారం చేసి, నీ ఐశ్వర్యాన్ని అపహరించిన ఆ క్రూరులు క్షాత్రధర్మాన్ని అనుసరించి యుద్ధంలో మరణించి వెళ్ళిపోయారు. ఇకవారికై చేయలసినదేదీ లేదు. వారందరూ యుద్ధంలో ఎదురునిలిచి, మరణించి, శస్త్రధారులు పొందవలసిన లోకాలను పొందారు. ఇప్పుడు నేను, గాంధారి మాకు హితకరమైన పుణ్యకర్మలను చేసికోవాలి. రాజేంద్రా! దానికి అనుమతించాలి. నీవు శస్త్రధారులలో శ్రేష్ఠుడవు, నిత్యమూ ధర్మవత్సలుడవు. రాజు ప్రాణధారులకందరికీ గురువు వంటివాడు. కాబట్టి ఇలా చెప్తున్నాను. నీ అనుమతితో నేను అరణ్యానికి వెళ్తాను. ఈ గాంధారితో కలిసి నారచీరలను, వల్కలాలను

ధరించి, నీకు ఆశీస్సులనందించి, వనచరుడ నవుతాను. నాయనా! రాజా! పుత్రులకు రాజ్యాన్ని అప్పగించి, చివరివయస్సులో వనాలకు వెళ్ళటం మన వంశంలోని రాజులకు తగినదే. వీరా! అక్కడ నేను వాయుభక్షణ చేస్తూ, లేదా నిరాహారియై ఉంటూ ఈ నా భార్యతో కలిసి ఉత్తమతపస్సు నాచరిస్తాను. నాయనా! నీవు రాజువు కాబట్టి ఈ తపస్సులో నీకు కూడా భాగం లభిస్తుంది. రాజ్యంలోని సత్కర్మలలో, దుష్కర్మలలో కూడా రాజులు ఫలితాన్ని పంచుకొంటారు."

యుధిష్ఠిరుడిలా అన్నాడు. "రాజా! నీవిలా దుఃఖిస్తుంటే నాకు రాజ్యం ఇష్టంలేదు. ఛీ! ఎంత దుర్మతిని ! రాజ్యాసక్తితో ఏమరుపాటుకు లోనయ్యాను. దుఃఖంతో తపిస్తూ, ఉపవాసంతో బాగా కృశించి, ఆహారాన్ని నియంత్రించుకొని, నేలపై శయనిస్తున్న నిన్ను నేను గమనించలేకపోయాను. నా సోదరులూ అంతే. అయ్యో! నీవు మనస్సులో ఏదో పెట్టుకొని మూఢుడనైన నన్ను వంచించావు. ఇంతకు ముందు నన్ను నమ్మించి, ఇప్పుడు ఇలా దుఃఖపడుతున్నావు. మహీపాలా! నా దగ్గరనే ఉండి నీవు ఇలా దుఃఖింపవలసివస్తే ఇక నాకు రాజ్యమెందుకు? భోగాలెందుకు? యజ్ఞాలెందుకు? సుఖమెందుకు? జనేశ్వరా! నీవు దుఃఖంతో ఇలా మాటాడుతుంటే నేను, నా రాజ్యమూ కూడా బాధపడుతున్నట్లుంది. నీవు మాకు తండ్రివి. నీవే తల్లివి. నీవే మాకు పరమగురువువు. నీవు లేకుంటే మేము ఎక్కడ నిలువగలం? మహారాజా! నీ కన్నకొడుకైన యుయుత్సుని రాజుగా ఉండనీ. లేదా నీకు నచ్చిన ఎవరినైనా రాజును చేయి. నేను అరణ్యానికి వెళతాను. నీవు రాజ్యాన్ని పరిపాలించు. అపకీర్తితో తగులబడుతున్న నన్ను ఇంకా దహించవద్దు. నేను రాజును కాదు. నీవే రాజువు. నేను నీ సేవకుడను. ధర్మజ్ఞుడను, గురువువు అయిన నిన్ను నేనెలా అనుమతించేది ? అనఘా! సుయోధనుడు చేసినదానికి మా మనస్సులలో కొంచెం కూడా కోపం లేదు. అది అలా జరగవలసి ఉంది. మేమూ, వారు కూడా మోహానికి లోనయ్యాం. దుర్యోధనాదులవలె మేము కూడా నీ కొడుకులమే. నా దృష్టిలో గాంధారి, కుంతి ఒక్కటే. రాజేంద్రా! నీవు నన్ను విడిచి వెళ్ళిపోతే నా మీద ఒట్టు పెట్టుకొని సత్యం చెపుతున్నాను, నీ వెంటే నేను వస్తాను. ధనధాన్యాలతో నిండి సముద్ర పర్యంతమూ వ్యాపించిన ఈ భూమి నీవు లేకపోతే నాకు ప్రీతిని కలిగించలేదు. రాజేంద్రా! ఇదంతా నీవే. శిరస్సు వంచి ప్రార్థిస్తున్నా. మేమంతా నీకు లోబడినవారం. నీ మనోవ్యథ తొలగిపోవాలి. రాజా! నీవు కాలానికి లోబడినావని నేను అనుకొంటున్నాను. భాగ్యంకొద్దీ నిన్ను సేవించగలిగితే నా మనశ్చింత తొలగిపోతుంది."

ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "నాయనా! కురునందనా! నా మనస్సు తపస్సుమీదికి మళ్ళింది. చరమవయస్సులో వనగమనం మన వంశానికి తగినదే. కుమారా! చాలాకాలం ఇక్కడున్నాను. చాలాకాలం నీ సేవలు పొందాను. రాజా! వృద్ధుడనైన నన్ను నీవు అనుమతించాలి." అలా పలుకగా చేతులు జోడించి, వణుకుతూ నిలిచాడు ధర్మరాజు. అంబికాసుతుడైన ధృతరాష్ట్ర మహారాజు మహాత్ముడైన సంజయునితో, మహారథుడైన కృపునితో ఇలా అన్నాడు. "మీరు ఈ ధర్మరాజును అనునయించాలి. వయస్సు పైబడటం వలన, మాటాడి అలసిపోవటం వలన నా మనస్సు కలవరపడుతోంది నా నోరు ఎండిపోతోంది." అలా పలికి కురుకులశిరోమణి, ధర్మాత్ముడు, ధీశాలి, వృద్ధుడు అయిన ఆ ధృతరాష్ట్రుడు ప్రాణాలు పోయినవానివలె గాంధారిని ఆసరాగా చేసికొన్నాడు. ధృతరాష్ట్రుడు చైతన్యరహితుని వలె కూర్చోవటం చూసి, ధర్మరాజు ఎంతో దుఃఖించాడు. యుధిష్ఠిరుడన్నాడు. "లక్ష ఏనుగుల బలం గల ఈ ధృతరాష్ట్రుడు స్త్రీని ఆసరా చేసికొని ప్రాణాలుపోయినట్లు పడి ఉన్నాడు. గతంలో లోహంతో చేసిన భీమసేనుని ప్రతిమను పిండిపిండి చేసిన ఈ బలశాలి అబల అయిన స్త్రీని ఆశ్రయించాడు. ఛీ! నేను అధర్మజ్ఞుడను, నా జ్ఞానం! నా పాండిత్యం! ఛీఛీ! వాటివల్లనే ఈ రాజు తనకు తగని రీతిగా పండుకొనవలసివచ్చింది. నాగురువైన ఈ రాజు, యశస్విని అయిన ఈ గాంధారి భుజించే దాకా నేనుకూడా ఉపవాసం చేస్తాను."

ఆ తరువాత ధర్మవేత్త అయిన యుధిష్ఠిరుడు నీటితో తడిసిన చేతితో ధృతరాష్ట్రుని ముఖాన్ని, ఛాతీని మెల్లగా తుడిచాడు. రత్నాలతో, ఓషధులతో కూడి, పవిత్రమై, పరిమళాలు వెలార్చుతున్న ఆ ధర్మజుని కరస్పర్శతో ధృతరాష్ట్రుడు మరలా స్పృహలోనికి వచ్చాడు. ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "పాండునందనా! మరల నీ చేతితో నన్ను తాకు. కౌగిలించుకో! రాజీవనయనా! నీ సుఖస్పర్శతో మరల బ్రతికినట్లుంది. రాజా! నీ శిరస్సును ఆఘ్రాణింపగోరుతున్నాను. రెండు చేతులతో స్పృశింపదలచుకొన్నాను. అది నాకు ప్రీతి కలిగిస్తోంది. కురుశార్దూలా! నేను భుజించి ఇప్పటికి నాలుగురోజులైంది. అందువల్ల కదలలేకపోతున్నాను. నాయనా! నీ అనుమతిని అభ్యర్థిస్తూ మాటాడి ఎంతో అలసిపోయాను. దానితో మనస్సు నలిగింది. చైతన్యం కోలుపోయినట్లయింది. ప్రభూ! కురుకులోద్వహా! అమృతరసం వంటి ఈ నీ హస్తస్పర్శను పొంది మరల బ్రతికినట్లు భావిస్తున్నాను." పెదనాన్న అలా అనగానే యుధిష్ఠిరుడు స్నేహభావంతో అప్పుడు ధృతరాష్ట్రుని సర్వావయవాలను స్పృశించాడు. ధృతరాష్ట్ర మహారాజుకు ప్రాణాలు లేచివచ్చాయి. రెండు

చేతులలో ధర్మజుని కౌగిలించుకొని శిరస్సును ఆఘ్రాణించాడు. విదురుడు మొదలయిన వారందరూ కూడా తీవ్రదుఃఖంతో రోదించారు. దుఃఖాతిశయం వలన ధర్మజునితో ఏమీ పలుకలేకపోయారు.

ధర్మమెరిగిన గాంధారి మాత్రం మనస్సులో వేగంగా ప్రవహిస్తున్న దుఃఖాలను మనస్సులోనే నియంత్రించుకొని "ఏడవకండి" అని పలికింది. కుంతితో సహా ఇతర స్త్రీలందరూ కూడా తీవ్రంగా దుఃఖిస్తూ, కళ్ళనుండి నీరు కారుస్తూ, ధృతరాష్ట్రుని చుట్టూనిలిచారు. అప్పుడు మరల ధృతరాష్ట్రుడు యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "రాజా! నేను తపస్సుకై వెళ్ళటానికి అనుమతించు. నాయనా! పదే పదే మాటాడితే నా మనస్సు శక్తిహీనమవుతోంది. నన్ను ఇంకా ఎక్కువ కష్టపెట్టవద్దు." ఆ కౌరవనాథుడు యుధిష్ఠిరునితో అలా అనగానే సర్వయోధలలోను తీవ్రమైన ఆర్తనాదం చెలరేగింది. ధృతరాష్ట్రుడు కృశించి, పాలిపోయి, ఉపవాసంతో క్షీణించి, చర్మం, ఎముకలూ మాత్రమే మిగిలి తనకు తగని స్థితిలో ఉన్నాడు. మహాప్రభువైన ఆ తన తండ్రిని కౌగిలించుకొని ధర్మసుతుడు శోకంతో కన్నీరు కారుస్తూ మరలా ఇలా అన్నాడు. "రాజా! పరంతపా! నాకు జీవితమూ, రాజ్యమూ వద్దు. నీకు ఏది ఇష్టమో అదే చేస్తాను. నాపై అనుగ్రహభావముంటే, నేనంటే నీకిష్టముంటే ముందు ఆహారాన్ని స్వీకరించు. ఆపై జరుగవలసినది ఆలోచిద్దాం." అప్పుడు మహాతేజస్వి అయిన ధృతరాష్ట్రుడు "కుమారా! నీ అనుమతిని పొందిన తరువాతనే భుజించాలనుకొంటున్నాను" అని యుధిష్ఠిరునితో అన్నాడు. ధృతరాష్ట్రుడు యుధిష్ఠిరునితో అలా అంటున్న సమయంలోనే సత్యవతీసుతుడైన వ్యాసమహర్షి వచ్చి ఇలా అన్నాడు.

4. వ్యాసుని అనుమతి.

"యుధిష్ఠిరా! మహాబాహూ! కురునందనుడు, మహాతేజస్వి అయిన ధృతరాష్ట్రుడు చెప్పినది మరేమీ ఆలోచించకుండా చేయి. ఈ రాజు వృద్ధుడు, విశేషించి పుత్రులను పోగొట్టుకొన్నవాడు. ఈ కష్టాన్ని చిరకాలం సహించలేడని నా అభిప్రాయం. మహారాజా! మహాభాగ అయిన గాంధారి తెలివిగలది. కరుణ విలువ తెలిసినది. తీవ్రమైన పుత్రశోకాన్ని ధైర్యంతో సహిస్తోంది. నేను కూడా నీకిదే చెప్తున్నాను. నా మాటను పాటించు. రాజును అనుమతించు. లేకపోతే ఇక్కడ వృథాగా మరణిస్తాడు. ఈ రాజును ప్రాచీన రాజర్షుల బాటలో వెళ్ళనీ! రాజర్షులు అందరూ చరమవయస్సులో వనాలనే ఆశ్రయించారు." 'అప్పుడు అద్భుతకర్మలు చేసే వ్యాసుడు అలా చెప్పగానే మహాతేజస్వి అయిన ధర్మరాజు

ఆ మహామునితో ఇలా అన్నాడు. "తమరే మాకు మాన్యులు. తమరే మాకు గురువులు ఈ రాజ్యానికీ, ఈ వంశానికీ తమరే గతి. స్వామీ! నేను పుత్రుడను ధృతరాష్ట్రుడు మాకు తండ్రి. గురువు, ధర్మానుసారం కొడుకు తండ్రి ఆదేశాన్ని పాటించాలి." "యుధిష్ఠిరుడు అలా అనగానే వేదవేత్తలలో శ్రేష్ఠుడు, మహాకవి, మహాతేజస్వి అయిన వ్యాసుడు యుధిష్ఠిరునితో మరలా ఇలా అన్నాడు."

"మహాబాహూ! భారతా! నీవన్నది నిజమే. ఈరాజు వృద్ధుడు. అంతిమదశలో ఉన్నాడు. కాబట్టి ఈ రాజును నా అనుమతితో, నీ అనుమతితో తన అభిప్రాయానికి అనుగుణంగా నడవనీ! ఆటంకపరచవద్దు. యుధిష్ఠిరా! రాజర్షులకిదియే పరమధర్మం. యుద్ధంలో అయినా మరణించాలి. విధి పూర్వకంగా అరణ్యంలో అయినా చనిపోవాలి. రాజేంద్రా! నీ తండ్రి పాండురాజు ఈ ధృతరాష్ట్రరాజును గురువుగా భావించి శిష్యవృత్తితో సేవించేవాడు. రత్నపర్వతాలతో శోభించే మహాక్రతువుల నెన్నింటినో భూరిదక్షిణలతో నిర్వహించాడు. రాజ్యాన్ని అనుభవించాడు. ప్రజలను పాలించాడు. నీవు అరణ్యాలకు వెళ్ళినపుడు పుత్రుని అధీనంలో నున్న ఈ విశాలరాజ్యాన్ని పదమూడు సంవత్సరాలపాటు అనుభవించాడు. వివిధ ధనాలను దానం చేశాడు. నరోత్తమా! అనఘా! నీవు కూడా ఈ ధృతరాష్ట్రుని, యశస్వినీ అయిన గాంధారిని, గురుశుశ్రూషతో సేవకులతో కూడి ఆరాధించావు. తపోవిధికి తండ్రిని అనుమతించు. ఇది దానికి తగిన సమయం. యుధిష్ఠిరా! ఈయనకు నీపై లవలేశం కూడా కోపం లేదు." ఆ మాట చెప్పి, ధర్మజుని ఒప్పించి, 'అలాగే' అని ధర్మరాజుచే అనిపించి, వ్యాసుడు వనానికి వెళ్ళాడు.

వ్యాసభగవానుడు వెళ్ళిపోగానే పాండుకుమారుడైన ధర్మరాజు వృద్ధుడైన తండ్రితో వినయపూర్వకంగా మెల్లమెల్లగా ఇలా అన్నాడు. "వ్యాసభగవానుడు ఆదేశించినట్లు, మీ అభిప్రాయానికి అనుగుణంగా, మేటి విలుకాడైన కృపుడు, విదురుడు, యుయుత్సుడు, సంజయుడు చెప్పినరీతిగా నేను వెంటనే చేస్తాను. అందరూ నాకు గౌరవింపదగినవారే నా వంశహితాన్ని అభిలషించేవారే. రాజా! నేను శిరస్సు వంచి, ఒక్క ప్రార్థన చేస్తున్నాను. ముందు ఆహారాన్ని తీసికోండి. ఆ తరువాత ఆశ్రమానికి వెళ్ళవచ్చు."

5. ధృతరాష్ట్రోపదేశము.

"ఆపై ప్రతాపవంతుడైన ధృతరాష్ట్రుడు ధర్మరాజు అనుమతిని పొంది, గాంధారి వెంటరాగా తన భవనానికి వెళ్ళిపోయాడు. అప్పుడు ఆ ధీమంతుని ప్రాణశక్తి సన్నగిల్లింది.

ఆ రాజు అడుగుతీసి అడుగువేసేటప్పుడు ముసలి ఏనుగువలె కష్టంగా కదలగలిగాడు. విద్వాంసుడైన విదురుడు, సూతుడైన సంజయుడు, మేటివిలుకాడు అయిన కృపుడు ఆయనను అనుసరించారు. రాజా! ఆయన తన భవనంలో ప్రవేశించి పూర్వాహ్ణంలో చేయవలసిన క్రియలను ముగించి, బ్రాహ్మణోత్తములను తృప్తిపరచి, అప్పుడు ఆహారాన్ని తీసికొన్నాడు. భారతా! అలాగే ధర్మమెరిగిన మనస్విని అయిన గాంధారి కూడా కుంతితో కూడి, కోడళ్ళ వివిధోపచారాలను అందుకొంటూ భుజించింది. ఆ విదురాదులు, పాండవులు అందరూ ఆహారాన్ని తీసికొని, అప్పటికే భుజించి ఉన్న ఆ కురుశ్రేష్ఠుని - ధృతరాష్ట్ర నరపాలుని దగ్గర చేరారు. మహారాజా! ఆపై యుధిష్ఠిరుడు తన దగ్గరనే మౌనంగా కూర్చొని ఉండటం చూసి ధృతరాష్ట్రుడు చేతితో ఆయన వెన్ను నిమురుతూ ఇలా అన్నాడు.

"కురునందనా! రాజశార్దూలా! అష్టాంగాలతో కూడిన రాజ్యంలో ధర్మాన్ని ముందు నిలుపుకొని, దానిని సంరక్షించటంతో సర్వవిధాలా అప్రమత్తుడవై ఉండాలి. మహారాజా! పాండునందనా! కౌంతేయా! నీవు విద్వాంసుడవు - ధర్మంతోనే రాజ్యాన్ని రక్షించటం కుదురుతుంది. దానిని గ్రహించు. యుధిష్ఠిరా! విద్యావృద్ధులను నీవు సర్వదా ఉపాసించాలి. వారు చెప్పినది వినాలి. మరేమీ చర్చించకుండా చేయాలి. రాజా! ఉదయమే లేచి, వారిని యథావిధిగా అర్చించి, పనిబడ్డప్పుడు నీ కర్తవ్యాన్ని గురించి వారిని అడగాలి. నాయనా ! కార్యహితాన్ని కోరి, వారిని నీవు గౌరవిస్తే వారు సర్వవిధాలా నీకు హితాన్ని చెప్పగలరు. ఇంద్రియాల నన్నింటిని సారథి గుర్రాలను అదుపుచేసినట్లు అదుపుచేయాలి. అవి దాచుకొన్న ధనంవలె నీకు హితాన్నే కలిగిస్తాయి. ఆనువంశికంగా ఉంటూ, పవిత్రులై, ప్రలోభాలకు లొంగక, జితేంద్రియులై, జన్మకర్మలతో శుద్ధులైన మంత్రులనే సర్వకార్యాలలో నియోగించాలి. ఏదో ఒక సందర్భంలో పరీక్షింపబడి, నీ రాజ్యంలోనే నివసిస్తున్నవారినే అనేక విధాలుగా గూఢచారులనుగా పంపి శత్రురహస్యాలు తెలియాలి. నీ రహస్యాలు శత్రువులకు తెలియరాదు. నీ నగరాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. ప్రాకారాలు, తోరణాలు దృఢంగా ఉండాలి. దుర్గాలపై గట్టి బురుజులు ఉండాలి. అన్ని దిక్కులలో ప్రాకారం ఆరు వరుసలలో ఉండాలి. నగరద్వారాలన్నీ పెద్దవిగా, విశాలంగా ఉండాలి. అవి చక్కని విభాగాలు కలిగి, అన్నివైపులనుండి యంత్రరక్షణ కలిగి ఉండాలి.

వంశశీలాలు బాగా తెలిసిన మనుష్యులద్వారానే పనులు చేయించుకోవాలి. భోజనాది సమయాలలో ఎప్పుడూ తన్ను తాను రక్షించుకోవాలి. యుధిష్ఠిరా! ఆహార

విహార సమయాలలోనూ, మాలలు ధరించేటప్పుడు, పడుకొన్నప్పుడు, కూర్చున్నప్పుడు నిన్ను నీవే రక్షించుకోవాలి. శీలవంతులు, కులీనులు, విద్వాంసులు, ఆప్తులు అయిన వృద్ధుల నేతృత్వంలో అంతఃపురకాంతల రక్షణకై ఏర్పాటు చేసికోవాలి. విద్యావిశారదులు, వినీతులు, సద్వంశ సంజాతులు, ధర్మార్థ కుశలులు, సరళస్వభావులు అయిన ద్విజులను మంత్రులుగా నియమించుకోవాలి. వారితో ఆలోచనలు జరపాలి. కానీ మరీ ఎక్కువమందితో చర్చించకూడదు. మంత్రులందరితోనైనా, విడిగా కొందరితో అయినా సరే ఏదో నెపంతో ఆలోచనా మందిరాన్ని అన్నివైపుల మూసివేసి, దానిలో కానీ, విశాలమైన మైదానంలో కానీ చర్చించాలి. గడ్డిగాదం కూడా మొలవని అరణ్యంలోనయినా చర్చలు జరపవచ్చు. కానీ ఈ ప్రదేశాలలో ఎట్టిస్థితిలోనూ రాత్రిపూట చర్చించరాదు. మనుష్యులను అనుసరించి సంచరించే వానరులు లేదా పక్షులు, జడులు, అంగవికలురు - వీరెవ్వరూ ఆలోచనా మందిరంలో ఉండకూడదు.

రహస్యాలోచనలు బయటకు తెలిస్తే ఆ రాజులు పొందే సంకటాలకు ఎటువంటి సమాధానమూ, ఏ రీతిగానూ దొరకదని నా అభిప్రాయం. రాజా! మంత్రభేదం వలన కలిగే భేదాలను, రహస్యంగా ఉంచినందువలన కలిగే లాభాలను మంత్రిమండలిలో పదేపదేచెప్పాలి. యుధిష్ఠిరా! పౌరులు, జానపదులు రాజు విషయంలో శుద్ధంగా ఉన్నారో, వ్యతిరేకంగా ఉన్నారో తెలిసికొనటానికి వీలుగా ఏర్పాటు చేసుకోవాలి. రాజా! న్యాయ నిర్ణయవిషయంలో ఆప్తులు, సంతుష్టులు, హితైషులు మాత్రమే నియోగింపబడాలి. చారుల ద్వారా వారి చర్యలను గమనిస్తుండాలి. నీవు నియోగించిన న్యాయాధిపతులు దోషస్థాయిని సరిగా తెలిసికొని, దానికి తగిన రీతిగా దండింప దగినవారికి దండన విధించేటట్లు చూడాలి. న్యాయాధిపతులలో లంచగొండులు, పరాదారాసక్తులు, తీక్ష్ణదండన విధించేవారు, దొంగ తీర్పులు ఇచ్చేవారు, కటువుగా మాటాడేవారు, లోభులు, దొంగలు, సాహసప్రియులు, సభాభవనాలను తోటలను నాశనం చేసేవారు, వర్ణాలను కళంకితం చేసేవారు ఉండవచ్చు. వారిని దేశకాలాలకు అనుగుణంగా అపరాధరుసుముతో కానీ, మరణదండనతో కానీ శిక్షించాలి.

ఉదయమే లేచి రాజకార్యాలలో ముందుగా వ్యయకర్మను చేసేవారితోనే చర్చించాలి. ఆ తరువాతనే అలంకరించుకొనటం, భుజించటం వంటి పనులు చేయాలి. ఆ తరువాత నిత్యమూ సైనికులను కలిసి వారిలో హర్షోల్లాసాలను వృద్ధి చేయాలి. దూతలతో, చారులతో సంప్రదించటానికి ఎప్పుడూ సంధ్యాకాలం యోగ్యమైనది. ఎప్పుడూ రాత్రివేళ చివరిజాములో

కార్యక్రమాలను నిర్ణయించుకోవాలి. అర్ధరాత్రివేళ లేదా మిట్టమధ్యాహ్నం రాజ్యంలో సంచరించటానికి తగినవేళ. భరతర్షభా! పనులు చేయటానికి అన్ని సమయాలు తగినవే. మధ్యమధ్యలో అలంకరించుకొని నీవుండాలి. నాయనా! మహారాజా! చక్రంవలె పనులు ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. రకరకాలయిన కోశాలను (ధనాగారాలను) సమీకరించుకొని ప్రయత్నం ఎప్పుడూ న్యాయంగా జరుగుతూనే ఉండాలి. అన్యాయాన్ని పరిహరించాలి.

రాజా! రాజులలో లోపాలను గమనిస్తూండే రాజవిద్రోహులను, శత్రువులను, చారుల ద్వారా తెలిసికొని ఆప్తపురుషుల ద్వారా వారిని దగ్గరకు రాకముందే చంపించాలి. కురూద్వహా! ముందు పనిని గమనించి ఆపై సేవకులను నియోగించాలి. ఆశ్రితులు యోగ్యులైనా, అయోగ్యులైనా వారిచే పని చేయించుకోవాలి. నాయనా! నీ సేనాని దృఢవ్రతుడు, శూరుడు, హితాభిలాషి, నీ భక్తుడు, క్లేశాన్ని సహించగల మగాడు అయి ఉండాలి. పాండవా! జానపదులందరూ నీ పనులను చేస్తుంటారు గదా! ఎద్దులవలె గాడిదలవలె వారు పనిచేసేటట్లు నీవు వారి ఆలనా - పాలనా చూడాలి. వ్యవహార మెరిగినవారు అలాగే చేస్తారు. యుధిష్ఠిరా! నీవు నిత్యమూ నీలోనూ, ఇతరులలోనూ ఉన్న లోపాలను గమనించుకొంటూ ఉండాలి. నీ రాజ్యంలో పుట్టి తమ తమ కర్మలలో బాగా నిష్ణాతులైన వారిని, హితాభిలాషులను తగిన జీవికను కల్పించి అనుగ్రహించాలి రాజా! వివేకి గుణార్థుల గుణాలను వర్ధిల్లజేయాలి. వారిని గూర్చి చర్చించకూడదు. వారు పర్వతాలవలె నిశ్చలంగా, నిత్యమూ నీకు సహకరించగలరు."

6. ధృతరాష్ట్రుడు రాజనీతి నుపదేశించుట - 1

"భారతా! శత్రువులకు, ఉదాసీనులకు, మధ్యస్థులకు, నీకు సంబంధించిన మండలాలను గురించి తెలిసికోవాలి. శత్రుసూదనా! నాలుగురకాలైన శత్రువులను గురించి, ఆరువిధాలైన ఆతతాయులను గురించి, మిత్రులను గురించి, శత్రుమిత్రులను గురించి తెలిసికోవాలి. కురుశ్రేష్ఠా! అమాత్యులు, జనపదాలు, వివిధ దుర్గాలు, వివిధబలాలు - వీటిపై శత్రువుల దృష్టి ఉంటుంది. కౌంతేయా! పైన చెప్పిన పండ్రెండు రకాల మనుష్యులు రాజులకు ముఖ్యులు. మంత్రి అదుపులో ఉండే అరవైగుణాలు, పైన చెప్పిన పండ్రెండుమంది - వీటి నన్నింటినీ కలిపి నీతికోవిదులు మండల మంటారు. యుధిష్ఠిరా! సంధి విగ్రహాదులయిన ఆరు ఉపాయాలు మండలాల అధీనంలో ఉంటాయి. అది గ్రహించు, కురుసత్తమా! రాజు తన వృద్ధిక్షయాలనూ, స్థానాన్ని ఎప్పుడూ తెలిసి ఉండాలి. "మహాబాహూ! రాజప్రధానమైన

పండ్రెండు మందినీ, మంత్రి ప్రధానమైన అరవైగుణాలనూ - ఈ డెబ్బయి రెండింటిని గ్రహించి ఆపై షడ్గుణాలను (సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సమాశ్రయం) ప్రయోగించాలి.

కౌంతేయా! స్వపక్షం బలంగా ఉండి, శత్రుపక్షం బలహీనంగా ఉన్నప్పుడు రాజు శత్రువులతో యుద్ధంచేసి గెలుపొందాలి. తన పక్షం దుర్బలమై, పరపక్షం బలంగా ఉన్నప్పుడు వివేకి తన బలహీనతను గుర్తించి శత్రువులతో సంధిచేసికోవాలి. అలాగే ఎప్పుడూ ద్రవ్యసమీకరణను కూడా బాగా చేయాలి. శత్రువుల నాక్రమించటానికి సామర్థ్యమున్నప్పుడు జాగు చేయకుండా మరో ఆలోచన లేకుండా స్థిరంగా కర్తవ్యాన్ని పూర్తిగా నిర్వహించాలి. భారత! తనస్థితి బాగా లేనప్పుడు అల్పఫలాన్ని ఇచ్చే భూమిని, బంగారాన్ని, కంచు, రాగి వంటిలోహాలను, బలహీనుడైన మిత్రుని, సేనను ఇచ్చి శత్రువుతో సంధి చేసికోవాలి. శత్రువు పరిస్థితి విపరీతంగా ఉన్నప్పుడు వారిని బంధించాలి. శత్రువు సంధిని కోరితే సంధి విశారదుడైన రాజు సంధికి తగిన వాటిని స్వీకరించి సంధి చేసికోవాలి. సంధిలో భాగంగా శత్రు రాజకుమారుని కూడా తన వద్ద ఉంచమని కోరవచ్చు. భరతర్షభా! నాయనా! దీనికి భిన్నంగా ప్రవర్తించటం శ్రేయస్కరం కాదు.

ఆపద కలిగినపుడు మంత్రోపాయాలు తెలిసిన నీవు వాటినుండి బయటపడే ప్రయత్నం చేయాలి. రాజేంద్రా! ప్రజలలో నున్న దీనులను రాజు ఆదరించాలి. మహాబలుడైన రాజు తన శత్రువుపై క్రమంగా కానీ, ఒకేమారు కానీ ఉద్యమించాలి. అతనిని పీడించాలి. పనులను స్తంభింపజేయాలి. ధననష్టం కలిగించాలి. స్వరాజ్య సంరక్షణకై శత్రువులతో ప్రయత్నపూర్వకంగా మీద చెప్పినట్లు, ప్రవర్తించాలి. ఆత్మోన్నతి కోరుతున్న రాజు శరణుకోరిన సామంతుని ఎప్పుడూ హింసించరాదు. కౌంతేయా! భూమండలాన్ని అంతా గెలువదలచుకొన్న రాజు సామంతుని ఎప్పుడూ హింసించకూడదు. మంత్రులతో కలిసి ఆలోచించి శత్రుసమూహాలలో భేదాన్ని పుట్టించే కోరిక కలిగి ఉండాలి. సాధువులను దగ్గర తీయాలి. పాపులను దండించాలి. బలవంతుడైన రాజు దుర్బల శత్రువులవెంట ఎన్నడూ పడరాదు. రాజశార్దూలా! నీవు వేతనవృత్తిని స్వీకరించి ఉండాలి. బలశాలి అయిన రాజు దుర్బలునిపై దాడిచేస్తే క్రమంగా సామాది ఉపాయాలతో అతనిని మరలించే ప్రయత్నం చేయాలి. యుద్ధం చేయటానికి శక్తి చాలకపోతే మంత్రులతో కలిసి ఆ రాజు శరణుకోరి, కోశం, మనుష్యులు, దండం, - మరేదైనా తనకిష్టమైన వానిని సమర్పించి శత్రువులను మరలించే యత్నం చేయాలి. ఏ ఉపాయంతోనూ సంధికుదరనప్పుడు ముఖ్యసాధనాలను స్వీకరించి

యుద్ధానికి బయలుదేరాలి. అలా శరీరాన్ని విడిచినా వీరునకు ముక్తి లభిస్తుంది. శరీర సమర్పణమే దానికి ముఖ్యసాధనం."

7. ధృతరాష్ట్రుడు రాజనీతినుపదేశించుట - 2

ధృతరాష్ట్రుడు చెప్తున్నాడు. "యుధిష్ఠిరా! సంధి విగ్రహాలను కూడా నీవు గమనించాలి. బలవంతులతో సంధి, బలహీనులతో యుద్ధం - ఇవి సంధి విగ్రహాలకు కారణాలు. దీనికి వివిధోపాయాలు, వివిధ పద్ధతులు ఉంటాయి. కౌరవ్యా! తన బలాబలాలను గ్రహించుకొని, యుద్ధమో, సంధియో నిర్ణయించుకోవాలి. శత్రువు అభిమానియై, అతని సేన ఆనందంగా, బలిష్ఠంగా ఉన్నప్పుడు యుద్ధాన్ని మాని ఉపాయాంతరాన్ని అన్వేషించాలి. శత్రుసేన బలహీనంగా, అసంతృప్తితో ఉన్నప్పుడే ఆక్రమణ చేయాలి. శత్రువు మనలను దెబ్బతీస్తాడనిపిస్తే అక్కడ నుండి తప్పుకొని మరొక మిత్రరాజును ఆశ్రయించాలి. ఆపై శత్రువులలో భేదాన్ని కానీ, శత్రువులకు ఇబ్బందిని కానీ కలిగించగలగాలి. అప్పుడు శత్రువు క్షీణిస్తాడు. బెదురుతాడు. ఆపై యుద్ధంలో సేనను నష్టపోతాడు. శత్రువుపై దాడి చేయదలచుకొన్న రాజు శాస్త్రవిశారదుడై మూడురకాలుగా ఉన్న తన శక్తిని గురించి, శత్రుశక్తిని గురించి ఆలోచించాలి. భారతా! ఉత్సాహశక్తి, ప్రభుశక్తి, మంత్రశక్తి - మూడు చక్కగా ఉన్నప్పుడే రాజు శత్రువుపై దాడిచేయాలి. అవి సరిగా లేకపోతే యుద్ధాలోచనను విరమించాలి. రాజా! రాజు సైనికబలాన్ని, ధనబలాన్ని, మిత్రబలాన్ని, అటవీ బలాన్ని, భృత్యబలాన్ని, శ్రేణీబలాన్ని సమకూర్చుకోవాలి. రాజా! వీటిలో మిత్రబలం, ధనబలం, విశిష్టాలు. శ్రేణీబలం, భృత్యబలం తనకూ శత్రువుకూ సమానంగానే ఉంటాయని నా అభిప్రాయం. రాజా! అదే రీతిగా చారబలం కూడా ఇద్దరికీ సమానంగానే ఉంటుంది. రాజు అనేక సందర్భాలలో ఈ విషయాన్ని గుర్తుంచుకొనవలసిన అవసరముంటుంది.

రాజా! రాజులకు కలిగే ఆపదలు కూడా అనేకవిధాలుగా ఉంటాయి. వాటిని విడివిడిగా చెపుతాను విను. రాజా! పాండునందనా! ఆ ఆపదలకు సంబంధించి అనేక వికల్పాలుంటాయి. రాజు ఎప్పుడూ సామం మొదలయిన ఉపాయాల ద్వారా వాటిని మనస్సుకు తెచ్చుకొని పరిగణించాలి. పరంతపా! దేశకాలాలు అనుకూలించినప్పుడు సైనిక బలంతో, ఆత్మగుణాలతో కూడిన రాజు మంచిసేనను వెంటతీసికొని విజయయాత్రను చేయాలి. పాండుకుమారా! తన అభివృద్ధిని అందుకోవటంలో ఆసక్తిగలరాజు బలవంతుడై, సేనలు ఆనందంగా బలిష్ఠంగా ఉన్నప్పుడు యుద్ధకాలం కాకపోయినా శత్రువుపై

దాడిచేయవచ్చు. శత్రువినాశానికై రాజు తన సేన అనే నదిని ప్రవహింపజేయాలి. దానిలో బాణాలే బండలు. గుర్రాలు, రథాలు ప్రవాహం. ధ్వజాలే తీరాన్ని కప్పివేసే చెట్లు. పదాతిబలం, ఏనుగులే లోతైన బురద. భారతా! యుద్ధవేళలో శకట, పద్మ, వజ్రవ్యూహాలను యోజన చేయాలి. శుక్రాచార్యుని నీతిశాస్త్రంలో ఆ రీతిగానే విధింపబడింది. చారులద్వారా శత్రుబలాన్ని గ్రహించి, తన బలానికై ఎదురుచూసి, తగినవేళలో శత్రుభూమిపై కానీ స్వస్థానంలో కానీ యుద్ధాన్ని ప్రారంభించాలి.

రాజు బలిష్ఠులయిన నరులను సేనలో చేర్చుకోవాలి. సైన్యాన్ని సంతోషపెట్టాలి. తన బలాబలాలను సరిగా గ్రహించి సామం మొదలయిన ఉపాయాలతో ఉపక్రమించాలి. మహారాజా! ఏ రీతిగానైనా ఇహలోకంలో ఆత్మరక్షణం ముఖ్యం. ఇహపరలోకాలలో శ్రేయఃప్రాప్తికి ఉత్తమసాధనం శరీరసంరక్షణమే. మహారాజా! ఈ విషయాల నన్నింటినీ చక్కగా పాటిస్తూ, ధర్మబద్ధంగా ప్రజలను పాలిస్తున్న రాజు మరణానంతరం స్వర్గాన్ని చేరుతాడు. కురుశ్రేష్ఠా! ఈ రీతిగా నీవు ఇహపరలోక ప్రాప్తికై నిత్యమూ ప్రజాహితం కోసమే ప్రవర్తించాలి. రాజశ్రేష్ఠా! నీకు భీష్ముడు, కృష్ణుడు, విదురుడు అంతా చెప్పారు. అయినా నీ మీది ప్రేమతో నేను కూడా చెప్పవలసి వచ్చింది. భూరిదక్షిణా! ఈ నీతినంతా న్యాయబద్ధంగా పాటించు. దానితో నీవు ప్రజాప్రియుడవై మరణానంతరం స్వర్గంలో సుఖించవచ్చు. వేయి అశ్వమేధయాగాలు చేసిన రాజు, ధర్మబద్ధంగా ప్రజాపాలన చేసిన రాజు సమానఫలితాన్నే పొందుతారు."

8. ధృతరాష్ట్రుడు వనగమనానికి అనుమతి కోరుట.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. "రాజశ్రేష్ఠా! నీవు చెప్పినట్లే చేస్తాను. నీవు నాకు ఇంకా ఎన్నో విషయాలు చెప్పాలి. భీష్ముడు స్వర్గస్థుడై, మధుసూదనుడు ద్వారకకు వెళ్ళిపోయి, విదురసంజయులు నీవెంట వస్తుంటే ఇక నాకు చెప్పేవారెవరు? రాజా! నాహితాన్ని కోరి ఇక్కడ నీవు చెప్తున్నదంతా నేను తప్పక పాటిస్తాను. ఆనందంగా ఉండు." ధీమంతుడైన ధర్మరాజు అలా అనగానే రాజర్షి అయిన ఆ ధృతరాష్ట్రుడు ధర్మజుని అనుమతిని తీసికోవా లనుకున్నాడు. "కుమారా! విశ్రాంతి తీసికో. నేను కూడా ఎంతో అలసిపోయాను." అంటూ ధృతరాష్ట్రుడు గాంధారి భవనంలోనికి ప్రవేశించాడు. అక్కడ ఆసనంపై కూర్చున్నాడు. కాలజ్ఞానం గల ఆయన సహధర్మచారిణి – గాంధారీదేవి ప్రజాపతివంటి భర్తతో తగినవేళగా భావించి ఇలా అన్నది. "వ్యాసమహర్షియే స్వయంగా

నీకు అనుమతినిచ్చాడు. ఇక యుధిష్ఠిరుని అనుమతి తీసికొని అరణ్యానికి ఎప్పుడు వెళ్తావు?" అంది. ధృతరాష్ట్రుడు చెప్తున్నాడు. "గాంధారీ ! మహాత్ముడైన నా తండ్రి స్వయంగా అనుమతించాడు. ఇక యుధిష్ఠిరుని అనుమతి కూడా తీసికొని త్వరలోనే వనానికి వెళతాను. వెళ్ళేలోపు మన ఇంటికి ప్రజలనందరినీ పిలిపించి, చనిపోయిన జూదగాళ్ళయిన నాకుమారులనుద్దేశించి వారి పరలోకసుఖం కోసం ధనదానం చెయ్యాలనుకొంటున్నాను." అలా గాంధారితో పలికి ధృతరాష్ట్రుడు ధర్మరాజుకు కబురుచేశాడు. ధర్మజుడు ఆయన మాటమేరకు అదంతా సమకూర్చాడు.

కురుజాంగల దేశాలలోని బ్రాహ్మణులు. క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు ప్రసన్నమనస్కులై అక్కడకు వచ్చారు. ధృతరాష్ట్రమహారాజు అంతఃపురం నుండి వెలికివచ్చాడు, నాగరకులు, జానపదులు, అందరూ అక్కడ గుమిగూడారు. రాజా! గుంపులుగుంపులుగా అక్కడకు వచ్చిన ఆ పౌరులను, జానపదులను అందరినీ, సమస్తమిత్రజనాన్నీ, నానా దేశాలనుండి వచ్చిన బ్రాహ్మణులను పలుకరించి వారితో ధీమంతుడు, అయిన ధృతరాష్ట్రమహారాజు ఇలా అన్నాడు. "మీరు, కురువంశస్థులు చిరకాలం నుండి కలిసి జీవిస్తున్నారు. ఒకరికొకరు ఆప్తులు. ఒకరిహితంపై మరొకరు ఆసక్తి గలవారు. ఇప్పుడు నేను ప్రస్తుతావసరాన్ని బట్టి చెప్తున్నా. దానిని మీరు పాటించాలి. మరో ఆలోచన లేకుండా నా మాట వినాలి. గాంధారితో కలిసి నేను అరణ్యాలకు వెళ్ళదలచాను. వ్యాసుడు అనుమతించాడు. అలాగే కౌంతేయుడైన ధర్మజుడు నన్ను అనుమతించాడు. మీరుకూడా అనుమతించండి. మరో ఆలోచన చేయకండి. మీకు, మాకు శాశ్వతమైన ప్రీతిబంధముంది. ఇటువంటి ప్రణయం మరేదేశంలోనూ రాజులకు, ప్రజలకు మధ్యలేదని నా అభిప్రాయం. గాంధారి, నేను కూడా ఈ వార్ధక్యంలో అలసిపోయాం. పుత్రులను కోల్పోయాను. ఉపవాసంతో కృశించాను. యుధిష్ఠిరుని ఏలుబడిలో మహాసుఖాన్ని పొందాను. దుర్యోధనుని పాలనలో కన్న ఎక్కువ సుఖాన్నే పొందా ననుకొంటున్నాను. నేను అంధుడను, వృద్ధుడను, పుత్రులను కోల్పోయినవాడను. మహాభాగులారా! అరణ్యానికి వెళ్ళటం తప్ప నాకు మరోగతి ఏముంది ? అనుమతించండి". భరతర్షభా! ఆ ధృతరాష్ట్రుని మాట విని కురుజాంగల దేశీయులందరూ కన్నీటితో గొంతులు బొంగురుపోగా పెద్దగా రోదించారు. వారందరూ శోకపరాయణులై ఏమీ మాటాడకపోవటం గమనించి, మహాతేజస్వి అయిన ధృతరాష్ట్రుడు మరలా ఇలా అన్నాడు."

9. ధృతరాష్ట్రుడు ప్రజల క్షమనుకోరుట.

"శాంతనుడు ఈ రాజ్యాన్ని యథావిధిగా పరిపాలించాడు. అలాగే నా తండ్రి విచిత్రవీర్యుడు భీష్మసంరక్షణలో ఈ రాజ్యాన్ని పరిపాలించాడు. ఇది మీకు నిస్సంశయంగా తెలిసిందే. అలాగే నా సోదరుడు పాండురాజు పరిపాలించాడు. అతడు మీకిష్టమైనవాడు. ఆయన పరిపాలన కూడ మీరెరిగినదే. అనఘులారా! నేను కూడా పాండురాజు తరువాత మిమ్ము సేవించాను. మంచిగా చేశానో! మంచిగా చేయలేకపోయానో! మహాభాగులారా! పొరపాటుచేసి ఉంటే వెంటనే మీరు నన్ను క్షమించాలి. దుర్యోధనుడు ఈ రాజ్యాన్ని నిష్కంటకంగా అనుభవించాడు. అప్పుడు కూడా, తాను దుర్బుద్ధి, మూఢుడు అయినా మీ విషయంలో ఏ అపరాధమూ చేయలేదు. కానీ ఆ దుర్బుద్ధి అభిమానంతో, అవినీతితో, స్వయంకృతాపరాధంతో రాజులమధ్య తీవ్రసంగ్రామం జరిగింది. కౌరవులు చనిపోయారు. భూమి అంతా నశించినట్లయింది. కాబట్టి నేను సరిగానే ప్రవర్తించానో, లేక చెడుగా ప్రవర్తించానో, అది మీ మనస్సులలో పెట్టుకోకండి. ఇదిగో చేతులు జోడిస్తున్నాను. "ఈ రాజు వృద్ధుడు, కుమారులను కోల్పోయినవాడు. దుఃఖంలో ఉన్నవాడు. మన రాజవంశంవాడు" అని భావించి నన్ను క్షమించి, అనుమతించండి. ఈ గాంధారి వృద్ధురాలు. పుత్రులను కోల్పోయింది. తపస్విని, దీనురాలు, పుత్రశోకంతో కలతపడుతోంది. ఈమెకూడా నాతోపాటు మీ క్షమను కోరుతోంది. ఈ వృద్ధులిద్దరు పుత్రులను కోల్పోయి దుఃఖిస్తున్నారని గ్రహించి,మీరు అనుమతించండి. మిమ్ము శరణు కోరుతున్నాం. మీకు మేలు జరగాలి.

కుంతీపుత్రుడైన యుధిష్ఠిర మహారాజు మీకిప్పుడు పాలకుడు. మంచి, చెడు - అన్నివేళలలో మీరు యుధిష్ఠిరుని కనిపెట్టి ఉండాలి. ఇతడు ఎప్పుడూ విషమంగా ప్రవర్తించడు. లోకపాలకులవలె మహాతేజస్వులై, సర్వధర్మార్థాలనెరిగిన నలుగురు సోదరులు ఇతనికి మంత్రులు. ఆ భీమార్జున నకుల సహదేవులతో కూడి మహాబాహువైన ఈ ధర్మరాజు సర్వభూతాలకు, సర్వజగత్తుకు పతి అయిన బ్రహ్మవలె మహాతేజస్వియై మిమ్ము పరిపాలింపగలడు. తప్పక చెప్పా లనిపించి చెప్తున్నాను. ఈ యుధిష్ఠిరుని మీ దగ్గర న్యాసంగా ఉంచుతున్నాను. మిమ్ములను ఈవీరుని దగ్గర న్యాసంగా ఉంచుతున్నాను. నా కుమారులు కానీ, నా వారు మరెవరైనా కానీ మీకు అప్రియమేదైనా కలిగించి ఉంటే, దానిని క్షమించి, నన్ను వెళ్ళనివ్వండి. గతంలో మీరెన్నడూ ఏ రీతిగానూ నాపై కోపాన్ని ప్రకటించలేదు. మీరు పూర్తిగా గురుభక్తులు. ఇదిగో చేతులు జోడించి నమస్కరిస్తున్నాను. అనఘులారా! నా కుమారులు అస్థిరబుద్ధులు, లుబ్ధులు. కామచారులు. వారికోసం గాంధారితో

కలిసి నేను మిమ్మందరినీ క్షమార్పణ కోరుతున్నాను." ఆ ధృతరాష్ట్రుడలా అనగానే పౌరజానపదులైన జనులు అందరూ కన్నీరుకారుస్తూ, ఒకరినొకరు చూసుకొంటున్నారు. ఏమీ మాటాడలేదు."

10. ప్రజాప్రతినిధిగా సాంబుడు మాటాడుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "కౌరవ్యా! వృద్ధుడైన ఆ ధృతరాష్ట్రమహారాజు అలా అనగానే పౌరులు, జానపదులు అయిన ఆ ప్రజలు నిశ్చేష్టులయ్యారు. కన్నీరు గొంతుకల కడ్డుపడగా మౌనంగా ఉన్న ఆ ప్రజలను చూసి ధృతరాష్ట్ర మహీపతి మరలా ఇలా అన్నాడు. "సజ్జనులారా! నేను వృద్ధుడను. కుమారులను పోగొట్టుకొన్న వాడను. ఈ ధర్మపత్నితో సహా అనేకవిధాలుగా దీనంగా విలపిస్తున్నాను. నా తండ్రి కృష్ణద్వైపాయనుడు స్వయంగా వనవాసానికి అనుమతించాడు. ధర్మజ్ఞులారా! ధర్మజ్ఞుడైన ధర్మరాజు కూడా వనవాసానికి అనుమతించాడు. నేను మరలమరలా శిరస్సువంచి అడుగుతున్నాను. గాంధారితో నేను వనవాసానికి వెళ్ళటానికి అనుమతించండి." "రాజా! అక్కడ గుమిగూడిన కురుజాంగల దేశప్రజలందరూ ఆ కురురాజ దీనవాక్యాలను విని, ఉత్తరీయాలతో చేతులతో ముఖాలను కప్పుకొని, శోకసంతప్తులై తల్లి దండ్రులను విడుస్తున్నట్లుగా ముహూర్తకాలం రోదించారు. శూన్యహృదయులై, ధృతరాష్ట్రుని ప్రవాసంవలన కలుగుతున్న దుఃఖాన్ని ధరిస్తూ చైతన్యాన్ని కోల్పోయినట్లు అయ్యారు. వారు మెల్లగా ధృతరాష్ట్ర వియోగంవలన కలిగిన దుఃఖాన్ని దూరం చేసి, మెల్లమెల్లగా పరస్పరం మాటాడుకొని వనవాసానికి అనుమతించారు. రాజా! ఆ తరువాత వారందరూ కలిసి ఒక నిర్ణయానికి వచ్చి అందరి బదులు మాటాడే బాధ్యతను ఒక బ్రాహ్మణుని యందుంచారు.

రాజా! అప్పుడు సదాచారి, సర్వసమ్మతుడు, అర్థవిశారదుడు, వేదపండితుడు, ప్రగల్భుడు, మేధావి అయిన సాంబుడనే బ్రాహ్మణుడు మహారాజును గౌరవించి, సభాసదులను ప్రసన్నులను చేసికొని మాటాడనారంభించాడు. అతడు రాజుతో ఇలా అన్నాడు. "రాజా! వీరా! ఈ జనులందరి మాట చెప్పే బాధ్యతను పూర్తిగా నా మీద ఉంచారు. దానిని నేను చెప్తున్నాను. వినండి. రాజేంద్రా! నీవన్నది అంతా వాస్తవమే. దీనిలో అసత్యం కొంచెం కూడా లేదు. మా మీద మీకూ, మీ మీద మాకూ సౌహార్దం ఉంది. ఈ వంశంలోపుట్టి రాజ్యపాలన చేసిన రాజులలో ఒక్కరు కూడా ఎప్పుడూ ప్రజలకు అప్రియం కలిగేటట్లు ప్రవర్తించలేదు. మీరు తండ్రులవలె, సోదరులవలె మమ్ము పరిపాలించారు. దుర్యోధన

రాజు కూడా ఎటువంటి అనుచితప్రవర్తన చేయలేదు. మహారాజా! ధర్మాత్ముడు, సత్యవతీసుతుడైన వ్యాసముని చెప్పినట్లే చేయి. ఆయన మనందరికీ పరమగురువు. రాజా! నీచే విడువబడిన మేము చాలాకాలం దుఃఖ శోకాలలో మునిగి ఉండగలం. వందలకొలదిగ ఉన్న నీ గుణాలు మా మనస్సులలో తిరుగుతూనే ఉంటాయి. రాజా! శాంతనుడు, చిత్రాంగద మహారాజు, భీష్ముని, పరాక్రమంచే రక్షింపబడుతూ నీ తండ్రి (విచిత్ర వీర్యుడు), నీ కనుసన్నలలో నిలిచి పాండురాజు ఎలా మమ్ము పరిపాలించారో అదే రీతిగా దుర్యోధన నరపాలుని చేత కూడా చక్కగా పరిపాలించబడ్డాము. రాజా! నీ కుమారుడు కొంచెం కూడా అప్రియాన్ని చేయలేదు. ఆయన ఏలుబడిలో తండ్రిమీదవలె పూర్తిగా విశ్వాసంతో ఎలా ఉండేవారమో నీకు చక్కగా తెలుసు. రాజా! అదేరీతిగా ధీమంతుడు, ధైర్యవంతుడు అయిన కౌంతేయుని పాలనలో కూడా వేల సంవత్సరాలు సుఖాన్ని పొందగలం. యాగాలలో భూరిదక్షిణల నిచ్చే ఈ ధర్మాత్ముడు, ప్రాచీనరాజర్షులు అయిన కురు సంవరణాదుల నడవడిని, ధీమంతుడైన భరతుని నడవడిని చక్కగా అనుసరిస్తాడు. మహారాజా! ఈయనలో చిన్నచిన్న తప్పులు కూడా లేవు. ఇతని రాజ్యంలో నీచే పాలింపబడుతూ నిత్యమూ సుఖంగా ఉన్నాం. నీలో గానీ, నీ కుమారునిలో గానీ చిన్న తప్పు కూడా లేదు.

కురునందనా ! దాయాదుల పోరు విషయంలో దుర్యోధనుని గురించి తమరన్న మాటలను గురించి కూడా కొంత చెప్పాలి. కురువంశవినాశనం దుర్యోధనుడు చేసినదీ కాదు. తమరు చేసినదీ కాదు. కర్ణుడో, శకునియో చేసినదీ కాదు. దాన్ని దైవికంగా భావిస్తున్నాం. దానిని బాధించటం కుదరదు. పురుషప్రయత్నంతో దైవాన్ని తప్పించటం వీలుకాదు. మహారాజా! పద్దెనిమిది అక్షౌహిణుల సేనలు కలిశాయి. కౌరవపక్షంలోని శ్రేష్ఠయోధులయిన భీష్మద్రోణ కృపాదులు, మహాత్ముడైన కర్ణుడు, వీరులయిన యుయుధాన ధృష్టద్యుమ్నులు, పాండుపుత్రులు నలుగురు భీమార్జున నకుల సహదేవులు పద్దెనిమిది రోజులలో ఆ సేనలను నాశనం చేశారు. రాజా! ఇంతటి వినాశనం దైవశక్తితో తప్ప మరొక రీతిగా సాధ్యపడదు. యుద్ధంలో మనుష్యులు విశేషించి క్షత్రియులు సమయానుకూలంగా చంపాలి. ప్రాణాలను విడవాలి కూడా. విద్యాబాహుబల సంపన్నులైన ఆ పురుషోత్తములు గుర్రాలు, రథాలు, ఏనుగులతో సహా ఈ భూమిని నాశనం చేశారు. మహాత్ములైన ఆ రాజుల వధలో నీ కొడుకు కానీ, నీవు కానీ, నీ సేవకులు కానీ,

కర్ణశకునులుకానీ కారణం కాదు. కురుశ్రేష్ఠా! వేలకొలదిగ రాజులు సంహరింపబడటం అంతా దైవకృతమని గ్రహించు. దీనిని గూర్చి ఎవ్వరూ ఏమీ చెప్పలేరు. మీరు ఈ సమస్తజగత్తుకు ప్రభువులు, గురువులు, ధర్మాత్ముడవైన మీ వనగమనానికి అనుమతిస్తున్నాం.

మీ కొడుకుని గురించి ఒక్క మాట. ఆ దుర్యోధనరాజు సహాయకులతో సహా ఈ బ్రాహ్మణోత్తముల ఆశీస్సులతో స్వర్గానికి వెళ్ళి అక్కడ సుఖాన్ని అనుభవిస్తాడు. మీరు కూడా పుణ్యధర్మాల పరమస్థితిని పొందగలరు. ధర్మాన్ని గురించి పూర్తిగా తెలిసిన మీరు చక్కని వ్రతాలను అనుష్ఠించండి. మా మంచి చెడులు చూడటానికి ఈ పాండవులను ఆదేశించవలసిన పనిలేదు. వారు స్వర్గాన్ని అయినా పరిపాలించగలవారు. ఇక ఈ భూపరిపాలన లెక్కలోనిది కాదు. శీలభూషణులైన ఈ పాండవులను ప్రజలు సమవిషమస్థితులన్నింటిలోనూ అనుసరిస్తారు. ఈ యుధిష్ఠిర మహారాజు బ్రాహ్మణులకు గత పాలకులు ఇచ్చిన అగ్రహారాలనూ, తాను ఇవ్వవలసిన అగ్రహారాలను, పురస్కారాలను చక్కగా రక్షించగలడు. మహామనస్వి అయిన ఈ యుధిష్ఠిరుడు సర్వదా కుబేరుని వలె దీర్ఘదృష్టి గలవాడు. మృదుస్వభావుడు. జితేంద్రియుడు ఈయన మంత్రులు కూడా ఉన్నతులు. భరతశ్రేష్ఠుడైన ఈ యుధిష్ఠిరుడు శత్రువులపై కూడా జాలిపడేవాడు. పవిత్రుడు సరళంగా చూడగలవాడు. మమ్ము కన్న బిడ్డలవలె రక్షింపగలడు. రాజర్షీ! ఈ ధర్మజునితో సంసర్గంవలన భీమార్జునాదులు కూడా ఈ ప్రజలకు ఎప్పుడూ అప్రియం చేయరు. కౌరవ్యా! ఈ పాండవులు పరాక్రమవంతులు, మహాత్ములు, పౌరులహితంపై ఆసక్తిగలవారు. మృదుస్వభావుల పట్ల మృదు స్వభావులు. తీక్ష్ణ స్వభావుల పట్ల పాములవంటివారు. కుంతి కానీ, ద్రౌపది కానీ, ఉలూపి కానీ, సుభద్ర కానీ ఎప్పుడూ వీరికి ప్రతికూలంగా ప్రవర్తించరు. తమకు ప్రజలతో ఉన్న స్నేహబంధాన్ని యుధిష్ఠిరుడు పెంపొందింపజేశాడు. పౌరులు కానీ, జానపదులు కానీ దానినెప్పుడూ వెనకకు నెట్టరు. మహారథులయిన కౌంతేయులు ధర్మపరాయణులై అధర్మంగా ప్రవర్తించే మానవులను కూడా రక్షింపగలరు. రాజా! పురుషోత్తమా! యుధిష్ఠిరుని విషయమై నీ మనస్సులోని దుఃఖాన్ని తొలగించుకొని, ధర్మబద్ధకార్యాలను అనుష్ఠించు. నీకు ఇవే మా నమస్సులు."

"ధర్మానుకూలంగా, ఉత్తమగుణ సహితంగా ఆ సాంబుడు చెప్పిన మాటలను విని, జనులందరూ "భళీ! భళీ!!" అని వాటిని ఆమోదించారు. ధృతరాష్ట్రుడు కూడా మాటిమాటికీ ఆ మాటలను అభినందించి అప్పుడు మెల్లమెల్లగా ప్రజలను పంపించివేశాడు.

వారు ఆయనను మన్నిస్తూ శుభంకరంగా చూస్తూ వెళ్ళారు! భరతర్షభా! ధృతరాష్ట్రుడు చేతులు జోడించి, ఆ బ్రాహ్మణుని గౌరవించి, గాంధారితో కలిసి, తన భవనంలోనికి వెళ్ళిపోయాడు. రాత్రి గడవగానే ఏంచేశాడో చెపుతాను, విను."

11. ధృతరాష్ట్రుడు విదురుని ద్వారా ధర్మజుని ధనమువకై అభ్యర్థించుట.

"ఆ రాత్రిగడిచి తెల్లవారగానే అంబికాసుతుడైన ధృతరాష్ట్రుడు విదురుని యుధిష్ఠిరుని భవనానికి పంపాడు. రాజు ఆదేశం మేరకు మహాతేజస్వి, ధీమంతులలో శ్రేష్ఠుడు అయిన విదురుడు వెళ్ళి అచ్యుతుడైన యుధిష్ఠిర నరపాలునితో ఇలా అన్నాడు. "రాజా! ధృతరాష్ట్ర మహారాజు వనవాస దీక్షను స్వీకరించాడు. దగ్గరలోనే రాబోతున్న కార్తికపూర్ణిమనాడు వనానికి వెళతాడు. కురుకులశ్రేష్ఠా! ఆ ధృతరాష్ట్రుడు మహాత్ముడైన భీష్మునకు, ద్రోణునకు, సోమదత్తునకు, ధీమంతుడైన బాహ్లీకునకు, తన కుమారులకు, యుద్ధంలో మరణించిన ఇతర మిత్రులకు శ్రాద్ధాన్ని పెట్టదలచుకొన్నాడు. కొంత ధనాన్ని కోరుతున్నాడు. నీకిష్టమైతే నరాధముడైన జయద్రథునకు కూడా శ్రాద్ధాన్ని పెట్టదలచాడు." విదురుని ఆ మాట విని, యుధిష్ఠిరుడు , గుడాకేశుడైన అర్జునుడు ఆనందించి, దానిని అభినందించారు.

మహాతేజస్వి, దృఢక్రోధుడు అయిన భీమసేనుడు దుర్యోధనుడు చేసిన అకృత్యాలను తలచుకొంటూ విదురుని మాటను అంగీకరించలేదు. అర్జునుడు భీమసేనుని అభిప్రాయాన్ని గ్రహించి, కొంచెం, వంగి, నరర్షభుడైన భీమునితో ఇలా అన్నాడు. "భీమా! ధృతరాష్ట్రరాజు వృద్ధుడు, వనవాసానికి దీక్షగొని ఉన్నాడు. తన ఆప్తులకందరకూ ఔర్ధ్వదైహికశ్రాద్ధాన్ని చేయదలచుకొన్నాడు. మహాబాహూ! ఆ ధృతరాష్ట్రుడు నీవు గెలిచికొన్న ధనాన్ని భీష్మాదులనుద్దేశించి దానం చేయదలచుకొన్నాడు. నీవు అంగీకరించాలి. మహాబాహూ! ఇది అదృష్టం. గతంలో మనం యాచించిన ధృతరాష్ట్రుడు ఇప్పుడు మనలను యాచిస్తున్నాడు. కాలవైపరీత్యమెటువంటిదో చూడు. ఒకప్పుడు ఈ భూమండలానికంతటికీ రాజైన ధృతరాష్ట్రుడు, అమాత్యులనందరినీ శత్రువులు సంహరించగా, అరణ్యానికి వెళ్లగోరుతున్నాడు. పురుషవ్యాఘ్రా! దానం చేయటం తప్ప మరొక దృష్టి కోణంలో దీనిని చూడవద్దు. మహాభుజా! మరో రీతిగా ఆలోచిస్తే అధర్మమూ, అపకీర్తి కారణమూ అవుతుంది. ఐశ్వర్యవంతుడు, రాజు అయిన అన్నను చూసి నేర్చుకో. భరతర్షభా! నీవు ఇవ్వదగినవాడవే కానీ తీసికొనదగిన వాడవు కావు." అలా పలుకుతున్న అర్జునుని ధర్మరాజు అభినందించాడు.

భీమసేనుడు మాత్రం క్రోధంతో ఇలా అన్నాడు. "అర్జునా! మనమే భీష్మునకు, సోమదత్తరాజుకు, భూరిశ్రవునకు, రాజర్షి అయిన బాహ్లీకునకు, ద్రోణునకు, ఇతర బంధువులకు అందరకు ప్రేతకార్యాలు నిర్వహిద్దాం. కుంతి కర్ణునకై పిండప్రదానం చేస్తుంది. పురుషశ్రేష్ఠా! ధృతరాష్ట్ర నరపాలుడు ఈ మహానుభావులకు శ్రాద్ధాలు పెట్టనక్కరలేదని నా భావం. దీనిని శత్రువులు కూడా నిందించరు. కులపాంసనులైన దుర్యోధనాదులు ఈ భూమినంతా నాశనం చేశారు. వారు కష్టాతికష్టాలను అనుభవించాలి. గతవైరాన్ని పండ్రెండు సంవత్సరాల వనవాసాన్ని, ద్రౌపదికి శోకాన్ని పెంచిన క్లిష్టమైన అజ్ఞాతవాసాన్ని ఎలా మరచిపోయావు ? మనతో ఇప్పుడు ధృతరాష్ట్రుడు చూపుతున్న స్నేహం అప్పుడేమయింది? నీ హస్తాభరణాలనన్నింటినీ పోగొట్టుకొని, మృగచర్మంతో శరీరాన్ని కప్పుకొని, ద్రౌపదితో కలిసి రాజు వెంట నడిచావు. అప్పుడు ద్రోణభీష్ములు ఎక్కడున్నారు? సోమదత్తుడు ఎక్కడకు పోయాడు. పదమూడు సంవత్సరాల పాటు అరణ్యంలో వన్యఫలాదులతో జీవించారు కదా! అప్పుడు పెదనాన్న నిన్ను తండ్రిగా చూశాడా? అర్జునా! కులపాంసనుడు, దుర్బుద్ధి అయిన ఈ ధృతరాష్ట్రుడు "సభలో గెలిచామా?" అని విదురుని అడిగాడే! అది నీవు మరచిపోయావా?" భీముడలా మాటాడుతుంటే ధీమంతుడు కౌంతేయుడైన యుధిష్ఠిర నరపాలుడు అతనిని గదుముతూ "ఊరుకో" అన్నాడు."

12. యుధిష్ఠిరుని అంగీకృతి.

అర్జునుడిలా అన్నాడు. "భీమా! నీవు నా కన్నా పెద్దవాడివి, గురుతుల్యుడవు. అందువలన ఇంకేమీ చెప్పాలనుకోవటం లేదు. ధృతరాష్ట్రుడు రాజర్షి. సర్వవిధాలా గౌరవింపదగినవాడు. సాధువులై ఆర్యమర్యాదలను అతిక్రమించని పురుషోత్తములు ఇతరుల అపరాధాలను తలచుకోరు. మంచిపనులనే స్మరిస్తారు." మహాత్ముడు అయిన అర్జునుడు అలా పలుకగా విని, ధర్మాత్ముడు అయిన ధర్మరాజు విదురునితో ఇలా అన్నాడు. "విదురా! నా మాటగా కురురాజుతో చెప్పు. పుత్రుల శ్రాద్ధానికై ఎంత కావాలంటే అంతా ఇస్తాను. అపకారులైన భీష్మాది సుహృజ్జనుల కందరకు శ్రాద్ధానికై నాకోశాగారం నుండి ధనం వస్తుంది. దీనితో భీముని మనస్సు కష్టపడనవసరం లేదు." అలా పలికి ధర్మరాజు అర్జునుని అభినందించాడు. భీమసేనుడు కనుకొనలతో అర్జునుని వైపు చూశాడు. ఆపై ధీమంతుడైన యుధిష్ఠిరుడు విదురునితో ఇలా అన్నాడు.

"ఆ ధృతరాష్ట్రరాజు భీమసేనునిపై కోపించగూడదు. ధీమంతుడైన భీముడు

అరణ్యంలో మంచు, వాన, ఎండలతో బహువిధ దుఃఖాలతో కష్టపడవలసి వచ్చింది ఇది నీ వెరిగినదే! భరతర్షభా! అయినా నా మాటగా రాజుతో చెప్పు. ఏది ఏది ఎంతెంత కావాలో అదంతా నా ఇంటినుండి తీసికొనవచ్చు. తీవ్రదుఃఖానికి లోనైన భీముడు ఈర్ష్యను ప్రకటించినా దానిని మనస్సులో పెట్టుకోవద్దని ఆ రాజుకు చెప్పు. నాకున్న కొద్దిపాటి ధనానికీ, అర్జునుని ఇంట ఉన్న ధనానికీ, ధృతరాష్ట్రుడే యజమాని అని ఆ రాజుకు చెప్పు. ధృతరాష్ట్రరాజు బ్రాహ్మణులకు దానాలు చేయవచ్చు. స్వేచ్ఛగా ఖర్చు పెట్టవచ్చు. పుత్రుల ఋణం, ఆప్తుల ఋణం తాను నేడు తీర్చుకొనవచ్చు. "రాజా! ఈ శరీరం కూడా తమ అధీనమే. ధనాలు కూడా మీవే అని గ్రహించండి. ఈ విషయంలో సంశయం లేదు" అని కూడా చెప్పు."

13. విదుర వచనము.

"ధర్మరాజు అలా పలుకగానే బుద్ధిసత్తముడైన విదురుడు ధృతరాష్ట్రుని దగ్గరకు పోయి మహార్థంతోగూడిన మాటలను ఇలా చెప్పాడు." "నీ మాటను మొదటినుండి యుధిష్ఠిరునకు చెప్పాను. ఆ మహాతేజస్వి అది విని నీ మాటను ప్రశంసించాడు. మహాతేజస్వి అయిన అర్జునుడు కూడా తన ఇంటినంతా నీకు అర్పిస్తున్నాడు. తన ఇంటిలోని ధనాన్నే కాక ప్రాణాలనైనా ఇవ్వటానికి సిద్ధపడ్డాడు. రాజర్షే! నీ కుమారుడైన ధర్మరాజు కూడా రాజ్యాన్నీ, ప్రాణాలనూ, ధనాలను, ఇంకేమయినా ఉంటే దానిని కూడా నీకిస్తున్నాడు. కానీ భీమసేనుడు గతంలో అనుభవించిన లెక్కకందని సర్వదుఃఖాలను తలచుకొని నిట్టూరుస్తూ, ఎంతో కష్టంమీద అంగీకరించాడు. రాజా! ధర్మశీలుడైన యుధిష్ఠిరరాజు, అలాగే అర్జునుడు ఆ మహాబాహువును అనునయించి, నీపై సద్భావాన్ని కలిగించారు. భీమసేనుడు గతవైరాన్ని తలచుకొని ఎప్పుడైనా అన్యాయంగా ప్రవర్తించినా, అతనిపై కోపగించవద్దని ధర్మరాజు నీతో చెప్పమన్నాడు. 'నరాధిపా! క్షత్రియధర్మం ప్రాయికంగా ఇటువంటిదే. యుద్ధంలోనూ క్షాత్రధర్మంలోను ఈ వృకోదరునకు ఆసక్తి ఎక్కువ. వృకోదరుని ప్రవర్తనకు నేను, అర్జునుడు మరలా, మరలా నీ క్షమను అర్థిస్తున్నాం. రాజా! ప్రసన్నుడవు కమ్ము ! ఇక్కడ నా దగ్గరున్న దానికి నీవే ప్రభువువు. రాజా! భారతా! ఎంత ధనమివ్వదలచుకొంటే అంత ఇవ్వవచ్చు. ఈ రాజ్యానికీ నా ప్రాణాలకూ కూడా మీరే ప్రభువులు. బ్రాహ్మణులకివ్వవలసిన అగ్రహారాలనూ, పుత్రుల ఔర్ధ్వదైహిక క్రియలకవసరమైన ద్రవ్యాన్ని, రత్నాలను, గోవులను, దాసదాసీజనాన్ని, గొర్రెలు, మేకలు మొదలయిన వాటిని

ఇక్కడనుండి తెప్పించుకొని ధృతరాష్ట్రుడు బ్రాహ్మణులకివ్వవచ్చు. విదురా! ధృతరాష్ట్రుని అనుమతితో దీనులు, అంధులు, బుద్ధిహీనులకై అక్కడక్కడ వివిధాన్నరస పానీయాల కేంద్రాలను కల్పించు. గోవులు నీరు త్రాగటానికి అవసరమైన దొరువులను ఏర్పాటుచేయి. వివిధ పుణ్యకర్మలను చేయించు. అని ధర్మరాజు, అర్జునుడు నాతో అన్నాడు. ఇకపై జరిపించవలసిన పనిని నీవు ఆదేశించు." జనమేజయా! విదురుడలా చెప్పగానే ధృతరాష్ట్రుడు వారిని అభినందించి కార్తికపూర్ణిమనాడు మహాదానాలను చేయాలని సంకల్పించాడు."

14. దాన యజ్ఞానుష్ఠానము.

"రాజా! విదురుడలా చెప్పగానే ధృతరాష్ట్ర మహారాజు ధర్మజుడు, అర్జునుడు చేసిన పనికి ఎంతో ప్రసన్నుడయ్యాడు. ఆపై భీష్మునికోసం, తన కుమారులకోసం ఋషిశ్రేష్ఠులైన బ్రాహ్మణులను, ఆప్తులను చక్కగా పరిశీలించి వేలకొలదిగ నియంత్రించాడు. వారికై అన్నపానాలను, వాహనాలను, వస్త్రాలను, సువర్ణమణి రత్నాలను, దాసదాసీజనాలను, గొర్రెలను, మేకలను, కంబలాలను, రత్నాలను, గ్రామాలను, పొలాలను, ధనాన్ని, అలంకరణతో పాటు ఏనుగులను, గుర్రాలను, అందమైన కన్యలను సిద్ధం చేశాడు. ఆ తరువాత ఆ రాజశ్రేష్ఠుడు మృతులనుద్దేశించి ఒకొక్కరి పేరున అందరికీ దానాలు చేశాడు. భీష్మని, ద్రోణుని, సోమదత్తుని, బాహ్లీకుని, దుర్యోధన నరపాలుని, ఇతర కుమారులను, జయద్రథుడు మొదలయిన ఆత్మీయులను అందరినీ ఉద్దేశించి విడివిడిగా అన్నిదానాలను చేశాడు. ఆ శ్రాద్ధయజ్ఞం ధర్మజుని అనుమతితో అప్పుడు అధిక ధనదక్షిణలతో, అనేక ధనరత్న సమూహాలతో విస్తరించింది. యుధిష్ఠిరుని అనుమతితో అక్కడ గణకులు, లేఖకులు (లెక్కలు వ్రాసేవారు) నిరంతరమూ అక్కడే ఉండి చెప్పండి. వీరికెంత ఇవ్వాలి? ఏమివ్వాలి? కావలసినంత ఇక్కడుంది." అని అడుగుతూ ధృతరాష్ట్రుడు చెప్పగానే అదంతా ఇచ్చేవారు. ధీమంతుడైన యుధిష్ఠిరనరపాలుని ఆదేశంతో వంద ఇవ్వవలసినచోట వెయ్యి, వేయి ఇవ్వవలసిన చోట పదివేలు ఇస్తున్నారు. ఈ రీతిగా ఆ రాజు అనే మేఘం, మేఘం వానతో పైరును తృప్తిపరిచినట్టు వసుధారలను కురిపిస్తూ విప్రులను తృప్తిపరిచింది.

మహామతీ! ఆ తరువాత ఆ రాజు సర్వవర్ణాలవారిని అన్నపాన రసప్రవాహంలో ముంచెత్తాడు. ఆ శ్రాద్ధయజ్ఞం మహాసాగరం వలె కనిపించింది. వస్త్రధనరత్నాలు అక్కడ ప్రవాహం. మృదంగధ్వని సాగరఘోష. గోవులు, గుర్రాలు దానిలోని మొసళ్ళు సుళ్ళు, అది వివిధ రత్నాల నిలయం. గ్రామాలు, అగ్రహారాలు అక్కడ ద్వీపాలు. మణులు,

బంగారం అక్కడ నీరు. ధృతరాష్ట్రుడనే చంద్రుని చూసి అది పొంగుతోంది. అలా ఆ శ్రాద్ధయజ్ఞం జగత్తును ముంచెత్తింది. మహారాజా! ఆ రీతిగా ఆ ధృతరాష్ట్రుడు పుత్రపౌత్రులకు, తన పితరులకు, తనకు గాంధారికి కూడా ఔర్ధ్వదైహికమైన శ్రాద్ధవిధిని నిర్వర్తించాడు. అనేక రీతులుగా దానాలు చేస్తూ అలసిపోయిన తరువాత ఆ రాజు దాన యజ్ఞాన్ని ముగించాడు. కౌరవ్యా! ఈ రీతిగా ఆ రాజు దానమనే మహాయాగాన్ని చేశాడు. అక్కడ విరివిగా అన్న రసదక్షిణలతోపాటు నటనర్తకుల గాననృత్యాలు కూడా బాగా సాగాయి. భరతర్షభా! ఈ రీతిగా పదిరోజులు దానాలు చేసి ధృతరాష్ట్రుడు పుత్రపౌత్రుల ఋణం తీర్చుకొన్నాడు".

15. గాంధారీ ధృతరాష్ట్రుల వనగమనము.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "ఆపై తెలవారగానే అంబికాసుతుడైన ఆ ధృతరాష్ట్ర మహారాజు గాంధారితో సహా వనవాసానికి సిద్ధమై వీరులైన పాండవులను పిలిపించి యథావిధిగా అభినందించాడు. కార్తికపూర్ణిమనాడు వేదవేత్తలయిన బ్రాహ్మణులచే యాత్రానుగుణంగా యాగాన్ని చేయించి, వల్కలాజినాలను ధరించి, అగ్ని హోత్రుని ముందుంచుకొని, కోడళ్ళు చుట్టూ నిలువగా ధృతరాష్ట్ర మహారాజు భవనం నుండి వెలుపలికి వచ్చాడు. అప్పుడు ధృతరాష్ట్రమహారాజు బయలుదేరగానే కౌరవ పాండవకాంతలు, కౌరవరాజవంశానికి చెందిన ఇతర స్త్రీలు ఏడవసాగారు. వారి ఏడుపు అప్పుడు అంతటా వ్యాపించింది. ఆపై ధృతరాష్ట్రుడు పేలాలతో, విచిత్ర పుష్పాలతో ఆ గృహాన్ని పూజించి, భృత్యవర్గాన్ని అంతటినీ ధనదానంతో మన్నించి, వారిని వీడి బయలుదేరాడు. ఆపై యుధిష్ఠిరనరపాలుడు చేతులు జోడించి, వణుకుతూ, కన్నీటితో బొంగురుపోయిన గొంతుతో "నాయనా! సజ్జనా! ఎక్కడికి వెళ్తున్నావు?" అని పెద్దగా ఏడుస్తూ నేలపై పడ్డాడు. అలాగే భారతశ్రేష్ఠుడైన అర్జునుడు తీవ్రదుఃఖంతో తపిస్తూ, మాటిమాటికీ నిట్టూర్చుతూ, ఏడవవద్దు. అని యుధిష్ఠిరునితో అంటూ ధర్మజుని పట్టుకొని దీనుడై కూలబడ్డాడు. వృకోదరుడు, అర్జునుడు వీరులైన నకులసహదేవులు, విదురుడు, సంజయుడు, యుయుత్సుడు, కృపుడు, ధౌమ్యుడు, ఇతర బ్రాహ్మణులు కంటనీరు క్రుక్కుకొని ఆయనను అనుసరించారు.

గాంధారి కళ్ళకు గంతలు కట్టుకొనియే ఉంది. ఆమె కుంతీభుజంపై చేతులు ఆన్చింది. కుంతి ఆ చేతులు పట్టుకొని నడుస్తోంది. ధృతరాష్ట్రుడు గాంధారి భుజంపై చేయి పెట్టుకొని నిశ్చితంగా నడువసాగాడు. అప్పుడు ద్రుపదపుత్రి అయిన కృష్ణ, సుభద్ర,

పసికందునెత్తుకొని ఉత్తర, ఉలూపి, చిత్రాంగద, ఇతరస్త్రీలు కొందరు కోడళ్ళతో కలిసి ధృతరాష్ట్రుని వెంట నడిచారు. రాజా! వారంతా దుఃఖంతో క్రొంచపక్షులవలె ఏడుస్తుంటే అప్పుడు ఆ కోలాహలం అంతటా వ్యాపించింది. దానితో నగరంలోని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రకాంతలు అన్నివైపులా ఇళ్ళనుండి వెలుపలికి వచ్చారు. రాజా! పూర్వం జూదంలో ఓడి, కౌరవసభ నుండి పాండవులు వెళ్తుంటే ఎటువంటి దుఃఖానికి పౌరసమూహం లోనయిందో అటువంటి దుఃఖం ధృతరాష్ట్రుడు వెళుతుంటే హస్తినపురిలో పెల్లుబికింది. గతంలో ఎప్పుడూ సూర్యచంద్రులను కూడా చూడని స్త్రీలు కౌరవరాజైన ఆ ధృతరాష్ట్రుడు మహావనానికి వెళ్తుంటే శోకంతో ఆర్తులై రాజమార్గంలో ప్రవేశించారు."

16. కుంతీ వన ప్రస్థానము.

"రాజా! ఆ తరువాత మేడలపైభాగాలలో నేలపై స్త్రీ పురుషుల రోదన ధ్వని పెద్దగా చెలరేగింది. ధీమంతుడైన ఆ రాజు చేతులు జోడించి వణుకుతూ రాజమార్గంలోని ఆ స్త్రీ పురుషుల గుంపులలోనుండి కష్టంమీద బయటకు వచ్చాడు. ఆ ధృతరాష్ట్రుడు హస్తినగరం నుండి వర్ధమానద్వారం గుండా బయటకు వచ్చాడు. మాటిమాటికీ ఆ జనసమూహానికి వీడ్కోలు చెప్పాడు. విదురుడు, సంజయుడు రాజుతో పాటు వనగమనానికి సిద్ధమయ్యారు. ధృతరాష్ట్రమహారాజు కృపుని, మహారథుడైన యుయుత్సుని యుధిష్ఠిరున కప్పగించి వెనుకకు మళ్ళించాడు. పౌర సమూహం వెనుదిరగగా యుధిష్ఠిరుడు ధృతరాష్ట్రుని అనుమతితో అంతఃపురస్త్రీలతో సహా వెనుదిరగదలచాడు. అప్పుడు ధృతరాష్ట్రుని అనుసరించి వనానికి వెళ్ళదలచిన కుంతీమాతతో ఇలా అన్నాడు. "నేను ధృతరాష్ట్రుని అనుసరిస్తాను. నీవు కోడళ్ళతో కలిసి నగరంలోనికి వెళ్ళు. ధర్మాత్ముడైన ఈ ధృతరాష్ట్రమహారాజు తపస్సు చేయాలన్న దృఢ నిశ్చయంతో వెళ్తున్నాడు. వెళ్ళనివ్వాలి." అప్పుడు ధర్మరాజు అలా అనగానే కుంతి కన్నీటితో కలతబడిన కళ్ళతో గాంధారిని పట్టుకొనియే ఇలా అన్నది.

కుంతి అంటోంది. "మహారాజా ! సహదేవునిపై ఎప్పుడు ప్రసన్నతను వీడవద్దు. ఇతడు ఎప్పుడూ నాపై, నీపై అనురక్తి గలవాడు. రణరంగంలో ఎప్పుడూ వెన్నుచూపని కర్ణుని నిత్యమూ స్మరించు. ఆ వీరుడు నా దుర్గతి కారణంగా యుద్ధంలో చనిపోయాడు. కుమారా! బుద్ధిహీనురాలను నేను. నా మనస్సు నిజంగా లోహనిర్మితం. అందుకే కర్ణుని చూడకపోయినా వందముక్కలు కావటం లేదు. అరిందమా! ఈ స్థితిలో నేనేం చెప్పగలను.

అది నేను చేసిన తీవ్రదోషం. కర్ణుని గురించి మీకు చెప్పలేదు. మహాబాహూ! అరిమర్దనా! సూర్యసుతుడైన ఆ కర్ణుని కోసం నీవు ఎప్పుడూ సోదరులతో కలిసి ఉత్తమ దానాలు చేయాలి. నీవు ఎప్పుడూ ద్రౌపదికి నచ్చినట్లు నడుచుకోవాలి. భీమార్జున నకులులను తృప్తిపరచాలి. వంశ భారమంతా ఇప్పుడు నీ మీద ఉంది. రాజా! నేను గాంధారితో కలిసి తాపసినై, మలపంకాలను భరిస్తూ, ఈ అత్తమామల పాదసేవ చేస్తూ అరణ్యంలో నివసిస్తాను."

"కుంతి అలా పలుకగానే ధర్మాత్ముడు, జితేంద్రియుడు, ధీమంతుడు అయిన ఆ యుధిష్ఠిరుడు సోదరులతో సహా దుఃఖానికి లోనయ్యాడు. ఏమీ అనలేక పోయాడు. రెండుక్షణాలు ఆలోచించి ధర్మరాజు చింతా శోకపరాయణుడై, దీనుడై తల్లితో ఇలా అన్నాడు. "నీవు ఏం చేయదలచుకొన్నావు? ఇలా మాటాడవద్దు. నేను నీవు వెళ్ళటాన్ని అంగీకరించను. నన్ను అనుగ్రహించాలి. ప్రియదర్శనా! గతంలో మేము ఉద్యమించి వెళ్తున్నప్పుడు విదులమాటల ద్వారా క్షాత్రధర్మపాలనకై ప్రోత్సహించావు. ఇప్పుడిలా మమ్ములను వీడిపోదగదు. నరోత్తముడైన వాసుదేవుని ద్వారా నీ ఆలోచనను విని, రాజులనందరినీ సంహరించి, నేను ఈ రాజ్యాన్ని పొందాను. ఆ బుద్ధి ఇప్పుడెక్కడకు పోయింది ? నేను విన్న నీ ఆలోచన ఏమయింది? క్షత్రధర్మంలో నిలవాలని మాకు చెప్పి, ఇప్పుడు దానినుండి జారిపోవాలనుకొంటున్నావు. యశస్వినీ! మమ్ములను, ఈ నీ కోడళ్ళను, రాజ్యాన్ని వీడి ఆ దుర్గమారణ్యాలలో ఎలా జీవిస్తావు? నాపై దయచూపు". ఆ రీతిగా కన్నీటితో నిండిన కుమారుని మాటలను వింటూ కుంతి కూడా కళ్లనిండా నీరు తెచ్చుకొన్నది.

అప్పుడు భీముడు ఆమెతో ఇలా అన్నాడు. అమ్మా ! కుమారులు గెలిచిన రాజ్యాన్ని అనుభవించవలసిన సమయంలో, రాజధర్మాలను పాటించవలసిన సమయంలో నీకెందుకీ ఆలోచన? గతంలో మాచేత భూమండల వినాశనాన్ని ఎందుకు చేయించావు? ఇప్పుడు ఏ కారణంగా మమ్ములను వీడి అరణ్యానికి వెళ్ళదలచుకొన్నావు? బాలకులుగా ఉన్న మమ్ములను, దుఃఖశోకంలో మునిగి ఉన్న నకులసహదేవులను అరణ్యం నుండి ఎందుకు తీసికొని వచ్చావు? యశస్వినీ! తల్లీ! దయచూపు, ఇప్పుడు వనానికి వెళ్లవద్దు. బలంతో గెలుచుకొన్న యుధిష్ఠిరసంపదను అనుభవించు". పుత్రులు ఆ రీతిగా అనేక విధాలుగా విలపిస్తున్నా, వెంటనే వన వాసానికే నిశ్చయించుకొన్న ఆ కుంతి వారి మాట వినలేదు. అప్పుడు ద్రౌపది కూడా విషణ్ణవదన అయింది. సుభద్రతో పాటు రోదిస్తూ, వనవాసానికి బయలుదేరిన కుంతి వెంట నడువసాగింది. అయితే మహామేధావిని అయిన

ఆమె వనగమనానికే నిశ్చయించుకొని, ఏడుస్తున్న పుత్రులను మాటిమాటికీ చూస్తూ ముందుకు సాగింది. పాండవులు సేవకులతో, అంతఃపురకాంతలతో సహా ఆమెను అనుసరించారు. అప్పుడు ఆమె కన్నీరు తుడుచుకొని కొడుకులతో ఇలా అన్నది."

17. కుంతి వచనము.

కుంతి ఇలా చెప్తోంది. "మహాబాహూ! పాండవా! నీవు చెప్పినది వాస్తవమే. రాజులారా! గతంలో మీరు బాధపడుతున్నప్పుడు మిమ్ము యుద్ధానికి ప్రోత్సహించాను. జూదంలో రాజ్యాన్ని పోగొట్టుకొని, సుఖానికి కూడా దూరమై, దాయాదులచే పరాభవింపబడినప్పుడు నేను యుద్ధానికై ప్రోత్సహించాను. పురుషశ్రేష్ఠులారా! పాండురాజ సంతానం నశించకూడదనీ, మీ కీర్తికూడా నశించకూడదనీ అప్పుడు ప్రోత్సహించాను. మీరు ఇంద్రసమానులు అందరూ దేవతల వంటి పరాక్రమం గలవారు. అటువంటి మీరు ఇతరుల ముఖాలు చూస్తూ నిలువ కూడదని నేను అలా చేశాను. నీవు ధర్మవంతులలో శ్రేష్ఠుడవు. ఇంద్రసమానుడవు. రాజువైన నీవు మరలా అరణ్యంలో దుఃఖించకుండా ఉండేటట్లు నేను మిమ్ము యుద్ధానికి రెచ్చగొట్టాను. పదివేల ఏనుగుల శక్తి కలిగి, పౌరుష పరాక్రమాలలో ప్రసిద్ధికెక్కిన ఈ భీముడు ఓడిపోగూడదని నేను యుద్ధానికి పురికొల్పాను. ఇంద్రసమానుడైన ఈ భీమసేనుని తమ్ముడు - అర్జునుడు శిథిలమైపోకూడదని నేను యుద్ధానికి ప్రోత్సహించాను. పెద్దలమాటననుసరించి నడచుకొనే ఈ నకుల సహదేవులు ఆకలితో అలమటించగూడ దని యుద్ధానికై పురికొల్పాను.

గొప్ప ఆకృతి, శ్యామలవర్ణం, విశాలనేత్రాలు గల ఈ ద్రౌపది మరల సభాస్థలంలో నిరర్థకంగా క్లేశాలననుభవించ గూడదని అలా చేశాను. భీమా! మీరంతా చూస్తుండగానే అరటి చెట్టువలె వణికిపోతూ, జూదంలో పరాధీనమై, రజస్వలయై, అదుపు తప్పిన శరీరావయవాలు గల ఈ ద్రౌపదిని దుశ్శాసనుడు మూర్ఖత్వంతో దాసినివలె లాగాడు. అప్పుడు. ఈ వంశం పరాభవానికి లోనైనదని (కళంకితమైనదని) నాకు తెలుసు. అప్పుడు నామామ మొదలయిన కౌరవులందరూ మౌనంగా కూర్చున్నారు. ద్రౌపది దైవాన్నే దిక్కుగా భావించి, క్రౌంచపక్షివలె విలపించసాగింది. రాజులారా! బుద్ధిచెడిన ఆ పాపాత్ముడు - దుశ్శాసనుడు ఈ ద్రౌపదిని జుట్టు పట్టుకొనిలాగాడు. అప్పుడే నేను మూర్ఛిల్లినట్లయింది. అప్పుడు మీ తేజస్సును పెంపొందింపజేయటానికి నేను విదుల ద్వారా మిమ్ము యుద్ధానికి రెచ్చగొట్టాను. కుమారులారా! అది గ్రహించండి.

కుమారులారా! నాకు, పాండురాజుకు పుట్టిన కొడుకులు పొందటం ద్వారా ఈ రాజవంశం నశించకుండా ఉండాలని మిమ్ము యుద్ధానికి ప్రోత్సహించాను. రాజా! వంశం నశిస్తే ఆ వంశంలోని పుత్రులు కానీ, పౌత్రులు కానీ పుణ్యలోకాలను పొందలేరు. ఆ వంశమే నశించి పోతుంది గదా! కుమారులారా! గతంలో నా భర్త సంపాదించిన విపుల రాజ్యఫలాన్ని అనుభవించాను. మహాదానాల నిచ్చాను. యథావిధిగా సోమపానం చేశాను. నా లాభం కోసం నేను వాసుదేవుని ప్రేరేపించలేదు. విదుల మాటలను విని ఆమె ద్వారా పంపిన సందేశం కూడా మీ రక్షణకోసమే. కుమారులారా! పుత్రులు గెలిచిన రాజ్యఫలాన్ని నేను కోరుకోవటం లేదు. రాజా! తపస్సుతో పుణ్యప్రదాలయిన భర్త లోకాలను మాత్రమే నేను కోరుతున్నాను. యుధిష్ఠిరా ! వనవాసం చేస్తున్న ఈ అత్తమామలకు సేవలు చేస్తూ తపస్సుతో శరీరాన్ని శుష్కింపచేస్తాను. కురుశ్రేష్ఠా! భీమసేనాదులతో కలిసి వెనుదిరుగు. నీ బుద్ధిని ధర్మంమీదనే ప్రసరించనీ! నీ మనసును విశాలంగా ఉండనీ!"

18. ధృతరాష్ట్రాదులు గంగాతీరమున విడిది చేయుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "రాజసత్తమా! పాపరహితులైన పాండవులు కుంతి మాట విని, సిగ్గుపడి ద్రౌపదితో సహా వెనుదిరిగారు. ఆ స్థితిలో నున్న కుంతిని చూసి అంతఃపురకాంతలు ఏడవసాగారు. దానితో పెద్ద కోలాహలం ఏర్పడింది. ఆపై పాండవులు ధృతరాష్ట్రరాజుకు ప్రదక్షిణం చేసి, నమస్కరించి, కుంతిని మరలించటంలో విఫలులై వెనుదిరిగారు. మహాతేజస్వి, అంబికాసుతుడైన ధృతరాష్ట్రుడు గాంధారిని, విదురుని, సంబోధించి, వారి చేతులు పట్టుకొని ఇలా అన్నాడు. "యుధిష్ఠిరుని తల్లి – కుంతీదేవిని మంచిగా వెనుకకు మరల్చండి. యుధిష్ఠిరుడు చెప్పినదంతా వాస్తవమేగదా! పుత్రులు సంపాదించిన మహాఫలదాయకమైన ఈ మహైశ్వర్యాన్ని వీడి, పుత్రులను వీడి, మూర్ఖురాలివలె వనానికి ఎవరై వెళుతుంది? ఈమె రాజ్యంలోనే ఉండి కూడా తపస్సు చేయవచ్చు. మహాదానవ్రతాన్ని పాటించవచ్చు. కాబట్టి నా మాట వినాలి. ధర్మజ్ఞా! గాంధారీ! ఈ కోడలి శుశ్రూషచే నేను సంతోషపడ్డాను. కాబట్టి నీవే ఈమెను వెనుకకు వెళ్ళమని ఆదేశించాలి. "ధృతరాష్ట్రుడిలా అనగానే గాంధారి, ఆ రాజవచనాన్ని విశేషించి తన వచనాన్ని కుంతితో ఇలా చెప్పింది. కానీ ధర్మపరాయణ, పతివ్రత అయి వనవాసానికే నిశ్చయించుకొని ఉన్న ఆ కుంతీదేవిని మరల్చలేకపోయింది. అప్పటి ఆమె స్థితిని వనవాస

నిశ్చయాన్ని, పాండవులు వెనుకకు మరలటాన్ని చూసి అప్పుడు కురుకాంతలు పెద్దగా ఏడవసాగారు. కౌంతేయులు, కోడళ్ళు అందరూ వెనుదిరిగారు. అప్పుడు మహాప్రాజ్ఞుడైన ధృతరాష్ట్ర నరపాలుడు వనానికి బయలుదేరాడు. దుఃఖశోకపరాయణులై అతిదీనంగా ఉన్న పాండవులు అందరూ స్త్రీలతో కలిసి వాహనాలపై నగరంలో ప్రవేశించారు.

అప్పుడు స్త్రీ బాలవృద్ధులతో సహా హస్తిన నగరమంతా హర్షానికీ, ఆనందానికి దూరమై ఉత్సవశూన్యంగా కనిపించింది. సమస్తపాండవులలో ఉత్సాహం నశించింది. వారిలో ఉక్రోషం కలిగింది. కుంతి లేకపోవటంతో తల్లిలేని ఆవుదూడలవలె దుఃఖంతో కలతపడ్డారు. ధృతరాష్ట్రమహారాజు ఆ రోజు చాలాదూరం ప్రయాణం చేసి భాగీరథీతీరంలో విడిది చేశాడు. తపోవనంలో వేదపండితులైన ద్విజశ్రేష్ఠులు అక్కడక్కడ విధిపూర్వకంగా అగ్నులను ప్రజ్వలింపజేసి ఉన్నారు. అవి విరాజిల్లుతున్నాయి. భారతా! ఆ వృద్ధరాజు కూడా అగ్నులను ప్రజ్వలింపజేశాడు. ఆ రాజు అగ్నులను ఉపాసించి, యథావిధిగా హోమం చేసి, సంధ్యాకాలంలో సూర్యోపాసన చేశాడు. విదురుడు, సంజయుడు కురువీరుడైన ఆ ధృతరాష్ట్ర నరపాలునకు దర్భలతో శయ్యను ఏర్పాటుచేశారు. దగ్గరలోనే గాంధారికి కూడా ఒక పక్కను సమకూర్చారు. ఉత్తమ వ్రతాన్ని పాటిస్తున్న యుధిష్ఠిరుని తల్లి - కుంతి, గాంధారికి దగ్గరగా దర్భాసనంపై సుఖంగా కూర్చుంది. వారి పలుకులు వినిపించేటంత దూరంలోనే విదురాదులు, యాజకులు, అనుసరించి వచ్చిన బ్రాహ్మణులు తగిన స్థానాలలో కూర్చున్నారు. ద్విజముఖ్యులందరూ స్వాధ్యాయం కొనసాగిస్తున్నారు. అగ్నులు ప్రజ్వలిస్తున్నాయి. వారికి ఆ రాత్రి బ్రాహ్మరాత్రివలె ఆనందాన్ని వృద్ధిపొందించింది. ఆ రాత్రి గడచిపోగానే వారు ప్రాతఃకాల కృత్యాలను ముగించి, యథావిధిగా అగ్నిహోత్రం చేసి, క్రమంగా అందరూ బయలుదేరారు. ఉపవాసపరాయణులై ఉన్నవారు ఉత్తరముఖంగా చూస్తూ నడవసాగారు. పౌరులు, జానపదులు వారికై శోకిస్తున్నారు. వారు కూడా దుఃఖిస్తున్నారు. ఆ స్థితిలో వారికి ఆ మొదటిరోజు ఉనికి చాలా కష్టంగా అనిపించింది."

19. ధృతరాష్ట్రాదులు శతయూపాశ్రమమున నివసించుట.

"పుణ్యాత్ములకు తగిన ఆ పవిత్ర గంగాతీరంలో ధృతరాష్ట్రుడు విదురుని అభిప్రాయాన్ని అనుసరించి నివసించాడు. భరతర్షభా! వనవాసులైన బ్రాహ్మణులు క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు ఎందరో అక్కడే ధృతరాష్ట్రుని సేవిస్తున్నారు. వారంతా చుట్టూ

96370

తిరగగా ధృతరాష్ట్రుడు వివిధ విషయాలతో వారిని ఆనందింపజేసి, యథావిధిగా పూజించి, శిష్యులతో సహా వారు వెళ్ళటానికి అనుమతించాడు. ఆ రాజు, యశస్వినీ అయిన గాంధారి సాయంకాలం గంగను చేరి యథావిధిగా శౌచకర్మలు చేశాడు. భారతా! అక్కడున్న ఆ విదురాదులు అందరూ కూడా విడివిడిగా తీర్థాలలో మునిగి సంధ్యోపాసనాది సర్వక్రియలను ముగించారు. రాజా! శౌచకర్మను ముగించిన ఆ వృద్ధుని కుంతిభోజసుత అయిన పృథ, గాంధారి గంగాతీరానికి తీసికొనివచ్చారు. అక్కడ యాజకులు ధృతరాష్ట్రునికి యజ్ఞవేదిని ఏర్పాటు చేశారు. సత్యసంగరుడైన ఆ రాజు అక్కడ అగ్నిహోత్రం చేశాడు. నియతేంద్రియుడు, నియమశీలుడు, వృద్ధుడు అయిన ఆ రాజు అనుచరులతో సహా భాగీరథీ తీరం నుండి కురుక్షేత్రానికి బయలుదేరాడు. ధీమంతుడైన ఆ రాజు అక్కడి ఆశ్రమపదానికి చేరి, మేధావి అయిన శతయూపరాజర్షిని సమీపించాడు. ఆ శతయూపరాజర్షి కేకయదేశరాజు. పరంతపుడు, తన కుమారుని ప్రజాపాలనలో నియమించి వనానికి వచ్చాడు. ధృతరాష్ట్ర మహారాజు ఆ శతయూపునితో కలిసి వ్యాసాశ్రమానికి వెళ్ళాడు.

అక్కడ కురూద్వహుడైన ధృతరాష్ట్ర నరపాలుడు యథావిధిగా వ్యాసమహర్షిని అర్చించాడు. అక్కడ వనవాసదీక్షను స్వీకరించి కౌరవనందనుడైన ధృతరాష్ట్రుడు శతయూపాశ్రమానికి మరలివచ్చి అక్కడ నివసించసాగాడు. మహారాజా! అప్పుడు వ్యాసుని అనుమతితో మహామతి అయిన ఆ శతయూపమహారాజు ఆరణ్యవిధినంతా ధృతరాష్ట్ర మహారాజుకు చెప్పాడు. రాజా! ఈ రీతిగా మహామనస్వి అయిన ధృతరాష్ట్రుడు తనను తపస్సులో నిమగ్నం చేసికొన్నాడు. అప్పుడు ఆ అనుచరులను కూడా లగ్నంచేశాడు. మహారాజా! అదే రీతిగా గాంధారీదేవి కూడా వల్కలాలను, మృగచర్మాన్ని ధరించి కుంతీదేవితో కలిసి ధృతరాష్ట్రునితో సమానంగా వ్రతపాలన చేయసాగింది. రాజా! ఆ కుంతీ గాంధారులు ఇంద్రియ సమూహాన్ని నియంత్రించి మనసా, కర్మణా, వాచా, నేత్రాలద్వారా కూడా పరమతపస్సును చేయసాగారు. ధృతరాష్ట్రుని శరీరంలోని మాంసం ఎండిపోయింది. చర్మం, ఎముకలు, మిగిలాయి. ఆయన జటాజినాలను ధరించాడు. నారచీరలతో దేహాన్ని కప్పుకొన్నాడు. మోహాన్ని విడనాడి మహర్షులవలె తీవ్రతపస్సు చేయసాగాడు. ధర్మార్థవేత్త, మహామతి, జితేంద్రియుడు అయిన విదురుడు కూడా కృశించి, నారచీరలను ధరించి సంజయునితో కలిసి ధృతరాష్ట్ర గాంధారులను సేవిస్తూ ఘోరతపస్సు నాచరించాడు."

20. నారదవచనము.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "జనమేజయా! ఆ తరువాత మునిశ్రేష్ఠులయిన నారదుడు, పర్వతుడు, మహాతపస్వి అయిన దేవలుడు, శిష్యులతో పాటు వ్యాసుడు, ఇతరసిద్ధులు, మేధావులు ధృతరాష్ట్రుని చూడవచ్చారు. వృద్ధుడు, పరమధార్మికుడు అయిన శతయూపరాజర్షి కూడా వచ్చాడు. మహారాజా! కుంతి వారికి యథావిధిగా పూజ చేసింది. ఆ తాపసులు కూడా ఆమె పరిచర్యతో సంతోషించారు. మహాత్ముడైన ధృతరాష్ట్ర మహారాజును ఆనందింపజేస్తూ ఆ మహర్షులు ధర్మసంబద్ధమైన విషయాలనెన్నింటినో చర్చించారు. అంతటినీ ప్రత్యక్షంగా చూడగలవాడు. దేవర్షి అయిన నారదుడు ఏదో ప్రసంగసందర్భంగా ఆయన ఈ కథ చెప్పాడు. నారదుడు చెప్తున్నాడు. "సహస్రచిత్యుడనే కేకయరాజు ఉండేవాడు. ఆయన శ్రీమంతుడు. దేనికీ భయపడనివాడు. ఆయన ఈ శతయూపుని పితామహుడు. ధర్మాత్ముడైన ఆ సహస్రచిత్యరాజు పరమధార్మికుడైన జ్యేష్ఠకుమారునిపై రాజ్యభారముంచి అరణ్యంలో ప్రవేశించాడు. మహాతేజస్వి అయిన ఆ రాజు తీవ్రతపస్సును చేసి స్వర్గలోకాన్ని పొందాడు. రాజా! నేను ఇంద్రసదనానికి వెళ్ళినపుడు చాలా సార్లు నిష్కల్మషుడైన ఆ రాజును చూశాను. అదే రీతిగా భగదత్తుని పితామహుడైన శైలాలయ నరపాలుడు తపోబలంతోనే మహేంద్రసదనానికి వెళ్ళాడు. రాజా! అలాగే ఇంద్రసమానుడైన పృషధ్రనరపాలుడు ఉండేవాడు. ఆయనకూడా తపస్సుతో ఈ లోకం నుండి స్వర్గలోకానికి వెళ్ళాడు. రాజా! ఈ అరణ్యంలోనే మాంధాతకుమారుడైన పురుకుత్సమహారాజు ఉండేవాడు. ఆయనభార్య నదీమతల్లి అయిన నర్మద. ఆయన కూడా ఈ అరణ్యంలో తపస్సుచేసి, మహాసిద్ధిని పొంది, స్వర్గానికి చేరగలిగాడు. రాజా! శశలోముడనే రాజుండేవాడు. ఆయన పరమధార్మికుడు. ఈ అరణ్యంలోనే చక్కగా తపస్సు చేసి స్వర్గాన్ని పొందగలిగాడు.

రాజా! వ్యాసుని అనుగ్రహం వలన నీవు కూడా ఈ తపోవనానికి వచ్చావు. భవిష్యత్తులో దుర్లభమైన సిద్ధిని పొందగలవు. రాజశ్రేష్ఠా! నీవు తపస్సు ముగించి, సంపన్నుడవై, గాంధారితో కలిసి ఆ మహాత్ముల స్థితిని పొందగలవు. మహారాజా! ఇంద్రుని సమీపంలో ఉన్న పాండురాజు నిన్ను నిత్యమూ తలచుకొంటుంటాడు. ఆయన కూడా నీ శ్రేయస్సిద్ధికి దోహదపడగలడు. ధర్మజుని తల్లి, నీ కోడలైన ఈ కుంతి నిన్ను, యశస్విని అయిన గాంధారిని సేవించి భర్తపొంది ఉన్న లోకాలకే వెళ్ళగలదు. ఆ యుధిష్ఠిరుడు సనాతన ధర్మస్వరూపుడు. రాజా! మేము దివ్యదృష్టితో స్పష్టంగా చూడగలుగుతున్నాం. విదురుడు కూడా మహాత్ముడైన యుధిష్ఠిరుని శరీరంలో ప్రవేశిస్తాడు. సంజయుడు ఆ యుధిష్ఠిరుని

గురించి చింతించిన కారణంగా ఇక్కడనుండి స్వర్గానికి వెళతాడు." ఈ మాటలు విని మహాత్ముడైన కౌరవాధిపతి, గాంధారి ఎంతో ఆనందించారు. విద్వాంసుడైన ఆ ధృతరాష్ట్రుడు నారదుని వచనాలను అభినందించి అసామాన్యరీతిలో ఆయనను పూజించాడు. రాజా! తరువాత బ్రాహ్మణులు అందరూ ఆనందంతో నారదుని విశేషంగా పూజించారు. ధృతరాష్ట్రనరపాలుని ప్రసన్నతతో వారు పదేపదే అప్పుడు ఆనందించసాగారు. బ్రాహ్మణశ్రేష్ఠులు నారదుని ఆ వచనాలను ప్రశంసించారు. రాజర్షి అయిన శతయూపుడు నారదునితో ఇలా అన్నాడు. "మహాతేజస్వీ! పూజ్యులైన తమరు కురురాజులోనూ, ఈ జనులలోనూ, నాలోనూ శ్రద్ధను పెంచారు. లోకపూజితా! దేవమునీ! ధృతరాష్ట్రుని విషయంలో నాకొక సందేహముంది. చెపుతాను విను. బ్రహ్మర్షీ! సర్వవృత్తాంతతత్త్వమెరిగిన నీవు దివ్యదృష్టి ననుసంధానించి వివిధ రాజులు పొందే గతులను చూస్తున్నావు. ఎందరో రాజులు ఇంద్రలోకాన్ని పొందినట్లు చెప్పావు. కానీ మహాముని! ఈ ధృతరాష్ట్ర మహారాజు పొందే లోకాలను గురించి చెప్పలేదు. విభూ! ఈ రాజు పొందబోయే స్థానాన్ని గురించి కూడా ఎప్పుడో, ఎటువంటిదో నీ ద్వారా తెలియగోరుతున్నాను. దాన్ని ఉన్నదున్నట్టు నాకు చెప్పవలసినది."

ఆ శతయూపమహారాజు అలా అడుగగానే దివ్యదృష్టి గల మహాతపస్వి అయిన నారదుడు అందరి మనస్సులకు అనుగుణంగా సభామధ్యంలో ఇలా అన్నాడు. "రాజర్షీ ! ఒకప్పుడు యాదృచ్ఛికంగా ఇంద్రభవనానికి వెళ్ళి ఇంద్రుని కలిశాను. అక్కడ పాండురాజును చూశాను. అక్కడ ఈ ధృతరాష్ట్రుని ప్రసక్తి వచ్చింది. ఈ రాజు కొనసాగిస్తున్న దుష్కరతపస్సును గురించి ప్రస్తావన జరిగింది. అప్పుడు ఈ రాజు ఆయుర్దాయం ముగియటానికి ఇంక మూడు సంవత్సరాలే మిగిలి ఉన్నాయని ఇంద్రుడు స్వయంగా చెప్పగా విన్నాను. ఆపై ఈ ధృతరాష్ట్రుడు గాంధారితో సహా కుబేరభవనానికి వెళ్ళి, అక్కడ ఆ రాజరాజ సత్కారాల నందుకొంటాడు. ఋషిపుత్రుడు, మహాభాగుడు, ధర్మాత్ముడు అయిన ఈ ధృతరాష్ట్రుని పాపాలు తపస్సు కారణంగా దహించుకొనిపోతాయి. ఆ కుబేరలోకంలో దివ్యాభరణభూషితుడై, మన ఇచ్ఛను బట్టి పయనించే విమానం ఎక్కి ఈయన దేవగంధర్వరాక్షసలోకాలలో స్వేచ్ఛగా సంచరిస్తాడు. ఇది గొప్ప దేవరహస్యం. మీ మీదున్న ప్రీతితో మీకు చెప్పాను. మీరంతా వేదధనులు. తపస్సుచే పాపాలను దహించినవారు."

రాజా ! దేవర్షి పలికిన ఆ మధురవచనాన్ని విని మంచిమనస్సుగల వారంతా

ప్రసన్నులయ్యారు. ఆ రాజు (ధృతరాష్ట్రుడు) కూడా ప్రీతి చెందాడు. ఈ రీతిగా ధీమంతులైన ఆ మునులు కథాప్రసంగాలతో ధృతరాష్ట్రుని ఆనందింపజేసి సిద్ధమార్గాన్ని ఆశ్రయించి, వారి వారి కిష్టమైన ప్రదేశాలకు వెళ్ళారు."

21. ధృతరాష్ట్రాదులను గూర్చి పాండవులు పౌరులు చింతించుట.

"రాజా ! కౌరవ నాథుడు అరణ్యానికి వెళ్ళగానే పాండవులు దుఃఖశోకాలకు లోనయ్యారు. మాతృవియోగశోకం కూడా వారిలో నెలకొన్నది. అలాగే పౌరజనులు కూడా ధృతరాష్ట్రమహారాజును గూర్చి దుఃఖపడసాగారు. బ్రాహ్మణులు అక్కడక్కడ ఆ రాజును గూర్చి ఇలా మాటాడుకొంటున్నారు. "వృద్ధుడైన ఆ రాజు ఆ నిర్జనారణ్యంలో ఎలా నివసిస్తాడు ? మహాభాగ అయిన గాంధారి, కుంతిభోజకుమారి అయిన ఆ కుంతి ఎలా జీవిస్తారు ? కొడుకులను కోల్పోయిన ప్రజ్ఞాచక్షువయిన ఆ రాజర్షి సుఖాల ననుభవింపదగినవాడు. కానీ ఆ మహారణ్యంలో సుఖానికి నోచుకోక ఏ అవస్థపడుతున్నాడో ! కుంతీదేవి ఎంతో దుష్కరమైన పని చేసింది. కుమారులను చూసుకోవటం మాని, రాజ్యసంపదలు వీడి, వనానికి వెళ్ళటానికే ఇష్టపడింది. తన సోదరునికి సేవ చేయదలచుకొన్న మహామనస్వి విదురుడు ఏ స్థితిలో ఉన్నాడో ? యజమాని శరీరాన్ని సంరక్షించే ధీమంతుడైన సంజయుడు ఏ స్థితిలో ఉన్నాడో !" చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు పౌరులు చింతాశోకాలలో మునిగి, అక్కడక్కడ పరస్పరం కలుసుకొన్నప్పుడు ఇలా మాటాడుకొనసాగారు. పాండవులందరూ కూడా తీవ్రంగా శోకానికి లోనై, వృద్ధురాలైన తల్లిని గురించియే ఆలోచిస్తూ ఎక్కువకాలం నగరంలో నిలువలేకపోయారు.

అదే రీతిగా తన కుమారులను కోల్పోయిన వృద్ధుడైన ధృతరాష్ట్రమహారాజును, మహాభాగ అయిన గాంధారిని, మహామతి అయిన విదురుని గూర్చి ఆలోచిస్తూ పాండవులు ఆనందంగా ఉండలేకపోయారు. రాజ్యం మీద కానీ, స్త్రీల మీద కానీ, వేదాధ్యయనాదుల మీద కానీ వారి మనస్సు పోలేదు. ధృతరాష్ట్ర మహారాజును గురించి తలోచిస్తూ ఎంతో నిర్వేదానికి గురి అయ్యారు. ఆ దాయాదుల ఘోరసంహారాన్ని మాటిమాటికి స్మరించుకొనసాగారు. రణరంగంలో బాలుడైన అభిమన్యుని వినాశనాన్నీ, యుద్ధంలో ఎప్పుడూ వెన్నుచూపని కర్ణుని వధను తలచుకొంటున్నారు. అదే రీతిగా ద్రౌపది కొడుకుల వధను, ఆత్మీయులైన ఇతరుల వధను తలచుకొంటూ ఆ వీరులు మనసా ప్రసన్నంగా ఉండలేకపోయారు. భారతా ! పృథివి వీరులను కోల్పోయింది. రత్నాలను కోల్పోయింది.

ఆ స్థితిని గురించి సర్వదా చింతిస్తున్న ఆ పాండవులు శాంతిని (సుఖాన్ని) పొందలేకపోయారు. రాణులయిన ద్రౌపది, సుభద్ర పుత్రులను కోల్పోయినందు వలన ఎప్పుడూ అప్రసన్నంగా, హర్షరహితంగా గడుపుతున్నారు. అప్పుడు నీ పూర్వపితామహులందరూ ఉత్తరకొడుకు పరీక్షిత్తును చూస్తూ ప్రాణాలను నిలుపుకొనసాగారు."

22. యుధిష్ఠిర యాత్ర.

"పురుషోత్తములు, వీరులు, తల్లికి ఆనందం కలిగించే ఆ పాండవులు తల్లిని తలచుకొంటూ ఎంతో దుఃఖించారు. గతంలో నిత్యమూ రాజ్యకార్యాలలో ఆసక్తులై ఉండేవారు ఇప్పుడు నగర మందంతటా రాజకార్యాలను సరిగా నిర్వర్తించలేకపోతున్నారు. శోకం వారిలో ప్రవేశించింది. ఏ విషయాన్నీ అభినందించ లేకపోతున్నారు. మాటాడుతూనే ఉన్నారు కానీ దానిపై ధ్యాస ఉండటం లేదు. ఆ వీరులు ఎవరికీ ఎదిరింపరాని వారు. గాంభీర్యంలో సాగరమంతటివారు. అయినా శోకంతో వారి జ్ఞానమంతా నశించిన ట్లయింది. చైతన్యశూన్యులవలె మారిపోయారు. ఆ పాండుకుమారులు తమ తల్లిని గురించి ఆలోచిస్తున్నారు. "కుంతి బాగా చిక్కిపోయి ఉంటుంది. ఆ వృద్ధుల జంటను ఎలా సేవించగలుగుతున్నదో ? ఆ రాజు కుమారులను కోల్పోయాడు. ఆశ్రయాన్ని వదలుకొన్నాడు. క్రూరజంతువులు తిరుగాడే ఆ వనంలో, భార్యతో పాటు నిస్సహాయంగా ఎలా మనగలుగుతున్నాడో ? మహాభాగ ఆ గాంధారీదేవి బాంధవులను కోల్పోయింది ఆ నిర్జనవనంలో గ్రుడ్డివాడు, అంధుడు అయిన భర్తను ఎలా అనుసరించగలుగుతోందో ?" ఈ రీతిగా మాటాడుకొంటున్న వారిలో అప్పుడు ఉత్సుకత కలిగింది. ధృతరాష్ట్రుని చూడటానికి వెళ్దామని బుద్ధిపుట్టింది. సహదేవుడు యుధిష్ఠిరునికి నమస్కరించి ఇలా అన్నాడు.

"నీవు అరణ్యానికి వెళ్ళాలనుకొంటున్నట్లు నాకనిపిస్తోంది. ఇది మంచి ఆలోచన. రాజేంద్రా ! నీ మీది గౌరవంతో నేను వెంటనే వనగమనాన్ని గురించి చెప్పలేకపోయాను. ఇప్పుడు చెప్పటానికి సమయం వచ్చింది. తపస్వినియై చరిస్తున్న ఆ కుంతిని నా భాగ్యంకొద్దీ చూడబోతున్నాను. ఆ వృద్ధురాలు తాపసియై, జటలుదాల్చి, దర్భలు, రెల్లుపై పడుకొని గాయపడి ఉండవచ్చు. అత్యంతమూ సుఖాల ననుభవిస్తూ మేడలపై భాగాన పెరిగిన ఆ తల్లి ఇప్పుడు ఎంతో దుఃఖానికీ, అలసటకు లోనై ఉంటుంది. ఆమె నెప్పుడు చూడగలనో ? భరతర్షభా ! **మానవుల గమనాలు అస్థిరాలు.** కాకపోతే రాజకుమారి అయిన కుంతి

అరణ్యంలో సుఖానికి దూరమై నివసిస్తుందా ?" స్త్రీలలో శ్రేష్ఠురాలైన ద్రౌపది సహదేవుని మాటలు విని, యుధిష్ఠిరుని అర్చించి, అభినందించి ఇలా అన్నది. "రాజా ! కుంతీదేవిని ఎప్పుడు చూడగలను ? ఆమె జీవించియే ఉన్నది గదా ! ఆమె జీవిస్తూ ఉంటే, ఇప్పుడు ఆమెను చూడటం నాకెంతో ప్రీతిని కలిగిస్తుంది. రాజేంద్రా ! నీ బుద్ధిని ఎప్పుడూ ఇలాగే ఉండనీ ! నీ మనస్సును ధర్మంతోనే ఆనందించనీ ! ఎందుకంటే ఇప్పుడు మాకు కుంతీదర్శనం కలిగిస్తూ పరమశ్రేయస్సును సమకూర్చుతున్నావు. రాజా ! కుంతిని, గాంధారిని, మామగారిని చూడగోరుతూ ఇప్పుడు కోడండ్ర మందరమూ మునివ్రేళ్ళ మీద నిలిచి సిద్ధంగా ఉన్నామని గ్రహించు." భరతర్షభా !

ద్రౌపదీదేవి అలా అనగానే ధర్మరాజు సేనాధ్యక్షులను అందరినీ పిలిపించి వారితో ఇలా అన్నాడు. "అరణ్యంలో ఉన్న ధృతరాష్ట్రమహారాజును చూడాలి. రథాలు, ఏనుగులతో పెద్దసేనతో బయల్దుదేరండి." ధర్మరాజు అంతఃపురాధ్యక్షులను ఇలా ఆదేశించాడు. "వివిధ వాహనాలను, వేలకొలదిగ ఉన్న పల్లకీల నన్నింటిని సిద్ధం చేయండి. బండ్లు, బజార్లు, దుకాణాలు, ధనాగారం, పనివారు, కోశాధ్యక్షులు అందరు కురుక్షేత్రాశ్రమానికి బయలుదేరండి. పురజనులలో ఎవరైనా ధృతరాష్ట్రమహారాజును చూడదలచుకొంటే నిరాటంకంగా, సురక్షితంగా, చక్కని ఏర్పాట్లతో వారు కూడా బయలుదేరవచ్చు. పాకశాలాధ్యక్షులు, వంటవారు, వంటకు సంబంధించిన దంతా వివిధ భక్ష్యభోజ్యాలతో నా బండ్లపైకి ఎక్కించి బయలుదేరదీయండి. రేపు ఉదయమే ప్రయాణమని ప్రకటించండి. జాగు చేయవద్దు. దారిలో విశ్రాంతికై రకరకాల గుడారాలను ఈ రోజే ఏర్పాటు చేయండి." రాజా ! అలా ఆదేశించి పాండునందనుడైన ధర్మరాజు సోదరులను వెంట బెట్టుకొని, అంతఃపురకాంతలనూ, వృద్ధులను ముందుంచుకొని మరునాడు ఉదయమే బయలుదేరాడు. అలా బయలుదేరి ఆ రాజు ప్రజలకై నిరీక్షిస్తూ నగరం వెలుపల అయిదురోజులు గడిపి, ఆ పై వారితో కలిసి వనానికి బయలుదేరాడు."

23. పాండవులు కురుక్షేత్రమును చేరుట.

"భరతవంశసత్తముడైన ధర్మరాజు ఆపై లోకపాలకులతో సమానులైన అర్జునాది వీరుల రక్షణలో నున్న ఆ సేనను బయలుదేరటానికి ఆదేశించాడు. వెంటనే "బయలుదేరండి, బయలుదేరండి" అంటూ ఆనందంగా చేసిన పెద్ద కోలాహలధ్వని చెలరేగింది. "గుర్రాలను కట్టండి, కట్టండి" అని గుర్రపురౌతుల అరుపులు వినిపించాయి. కొందరు నరులు

పల్లకీలపై బయలుదేరారు. కొందరు మహావేగంగల గుర్రాలపై బయలుదేరారు. కొందరు ప్రజ్వలించే అగ్నివలె ప్రకాశిస్తున్న రథాలపై బయలుదేరారు. మరికొందరు ఏనుగుల మీద, కొందరు ఒంటెల మీదా బయలుదేరారు. తీక్ష్ణప్రాసాలతో యుద్ధంచేసే కొందరు పదాతులు బయలుదేరారు. అదే రీతిగా పౌరులు, జానపదులు వివిధవాహనాలతో ధృతరాష్ట్రుని చూడగోరి ధర్మరాజును అనుసరించారు. యుధిష్ఠిర నరపాలుని ఆదేశం మేరకు సేనాని అయిన కృపాచార్యుడు కూడా సేనను తీసికొని ఆశ్రమానికి బయలుదేరాడు. ఆపై బ్రాహ్మణులు తన చుట్టూ నిలువగా సూతులు, మాగధులు, వందులు స్తుతిస్తుండగా కురురాజైన యుధిష్ఠిరుడు, తన తలపై తెల్లని గొడుగును ధరించి, పెద్ద రథసేనతో బయలుదేరాడు. భీకర పరాక్రమాన్ని ప్రదర్శించగల భీముడు పర్వతాలవంటి ఏనుగులపై యంత్రాలను, ఆయుధాలను సిద్ధంచేసికొని బయలుదేరాడు. మాద్రికొడుకులైన నకుల సహదేవులు కూడా కవచాలను, ధ్వజాలను సన్నద్ధం చేసికొని అశ్వసేన తమ చుట్టూ నిలువగా గుర్రాలనెక్కి, వేగంగా బయలుదేరారు. మహాతేజస్వి, జితేంద్రియుడు అయిన అర్జునుడు కూడా సూర్యతేజస్సు గల దివ్యరథానికి, తెల్లగుర్రాలను పూన్చి యుధిష్ఠిర రాజును అనుసరించాడు. ద్రౌపదిమొదలయిన స్త్రీ సమాజాలు కూడా పల్లకీల నధిరోహించి, అమితంగా ధనదానం చేస్తూ, అంతఃపురాధ్యక్షుల రక్షణలో బయలుదేరారు.

అప్పుడు ఆ పాండవసైన్యం సమృద్ధమైన రథాలతో, ఏనుగులతో, గుర్రాలతో, వేణువీణా నాదాలతో శోభించింది. రాజా ! ఆ కురు పుంగవులు అందమయిన నదీతీరాలలో సరస్తీరాలలో విడిది చేస్తూ క్రమంగా ముందుకు సాగారు. మహాతేజస్వి అయిన యుయుత్సువు, పురోహితుడైన. ధౌమ్యుడు యుధిష్ఠిరుని ఆదేశం మేరకు పురరక్షణ చేస్తున్నారు. ఆపై యుధిష్ఠిర నరపాలుడు పరమపవిత్ర అయిన యమునను దాటి క్రమంగా కురుక్షేత్రానికి చేరాడు. ఆ యుధిష్ఠిరుడు దూరం నుండియే ధీమంతుడైన శతయూపుడు, ధృతరాష్ట్రుడు ఉన్న ఆశ్రమాన్ని చూశాడు. ఆపై జనమంతా ఆనందించి, పెద్ద కోలాహలంతో ఆ ఆశ్రమాన్ని నింపుతూ త్వరత్వరగా దానిలో ప్రవేశించారు."

24. యుధిష్ఠిరాదులు ధృతరాష్ట్రాదులను కలియుట.

"పాండవులు దూరంలోనే వాహనాలు దిగి, కాలినడకతో, వినయంతో తలలువంచి ఆ నరపతి ఆశ్రమంలోనికి వెళ్ళారు. అప్పుడు తోడు వచ్చిన యోధులందరూ, పురవాసులు, కురుముఖ్యుల భార్యలు కాలినడకతోనే అనుసరించారు. ఆ పై పాండవులు అరటిచెట్లతో

అందగిస్తూ, మృగగణాలతో నిండిఉన్న ఆ ధృతరాష్ట్రుని నిర్జనాశ్రమంలో ప్రవేశించారు. అప్పుడు పాండవులు వచ్చారని తెలిసి, వారిని చూడాలన్న కుతూహలంతో కూడి, నియతవ్రతులయిన తాపసులు అక్కడకు వచ్చారు. కౌరవ వంశభారాన్ని మోస్తున్న ఆ ధర్మరాజు కళ్ళనీరు నింపుకొని 'మా పెదనాన్న ఎక్కడ' అని ఆ తాపసుల నడిగాడు. రాజా ! అప్పుడు వారు "యమునలో స్నానం చేసి, పూలు మంచినీళ్ళు తెచ్చుకొనేందుకు వెళ్ళాడు" అని బదులిచ్చారు. ఆ మాటవిని, వారు చూపిన బాటలో, పాదచారులై వేగంగా వెళ్ళారు. దగ్గరలోనే వారినందరినీ చూశారు. ఆపై వారు తండ్రిని చూడాలని వేగంగా వెళ్ళారు. సహదేవుడు వేగంగా కుంతి ఉన్న చోటుకు వెళ్ళాడు. ఆ ధీమంతుడు తల్లిపాదాలను తాకి పెద్దగొంతుతో ఏడ్చాడు. ఆమె కూడా కన్నీటితో ముఖం కళవళపడగా ప్రియపుత్రుని చూసింది. కుమారుని పైకి లేపి బాహువులతో కౌగిలించుకొని సహదేవుడు వచ్చాడని గాంధారికి చెప్పింది. అంతలో ధర్మరాజు, భీమసేనుని, అర్జునుని, నకులుని చూసి కుంతి త్వరత్వరగా బయలుదేరింది.

ఆ కుంతి కుమారులను కోలుపోయిన ఆ దంపతులను నడిపిస్తూ ముందు నడుస్తోంది. ఆపై వారు ఆ కుంతిని చూడగానే ఆమె పాదాలపై పడ్డారు. మేధావి, మహామనస్వి అయిన ధృతరాష్ట్రమహారాజు కంఠస్వరాన్ని బట్టి, స్పర్శను బట్టి వారిని గుర్తించి ఊరట చెందాడు. ఆపై మహాత్ములైన ఆ పాండవులు ధృతరాష్ట్రునకు, గాంధారికి, కుంతికి యథావిధిగా నమస్కరించారు. అప్పుడు తల్లిచే మాటిమాటికీ అనునయింపబడి, స్వస్థులయిన పాండవులు వారి చేతులలోని జలకలశాలను తాము స్వయంగా గ్రహించారు. అలాగే ఆ నరోత్తముల భార్యలు, ఇతరాంతఃపురకాంతలు, పౌరులు, జానపదులు ఆ రాజును చూశారు. అప్పుడు యుధిష్ఠిరనరపాలుడు వారిని నామగోత్రాలతో విడివిడిగా తెలియజేశాడు. ధృతరాష్ట్రుడు వారిని పలుకరించి ఆదరించాడు. వారంతా తనచుట్టూ నిలువగానే ధృతరాష్ట్రుడు ఆనందబాష్పాలతో కన్నులు కలతపడగా తాను హస్తినాపురిలో ఉన్నట్టే భావించాడు. ద్రౌపది మొదలయిన కోడళ్ళు నమస్కరింపగా ధీమంతుడైన ఆ ధృతరాష్ట్రమహారాజు గాంధారితో, కుంతితో కలిసి ఆనందించాడు. ఆ తరువాత సిద్ధచారణులచే, దర్శనానికై వచ్చిన వారిచే నిండి తారాగణాలతో కూడిన ఆకాశంవలె ఉన్న ఆశ్రమానికి వచ్చాడు."

25. ఋషులకు పాండవాదులను పరిచయము చేయుట.

"భరతర్షభా ! ఆ యుధిష్ఠిర నరపాలుడు అందమైన తామరల వంటి కన్నులు గల తన సోదరులతో కలిసి ఆ ఆశ్రమంలో ఉన్న సమయానికే అక్కడకు నానాదేశాల నుండి మహాభాగులైన తాపసులు కురురాజకుమారులు, విశాలవక్షస్థలం గల పాండవులను చూడటానికి వచ్చి ఉన్నారు: వీరిలో యుధిష్ఠిరుడెవరో, భీమార్జునులెవరో, నకుల సహదేవులెవరో యశస్వినీ అయిన ద్రౌపది ఎవరో తెలియ గోరుతున్నామని వారన్నారు. అప్పుడు సూతుడైన సంజయుడు ఆ పాండవులను అందరినీ, ద్రౌపదిని, ఇతర కురుకాంతలను పేరుపేరునా ఇలా పరిచయం చేశాడు."

"బంగారం వంటి గౌరవర్ణంతో, మహాసింహం వలె కనిపిస్తూ, మొనదేరిన ముక్కుతో, కొంచెం ఎర్రబడ్డ విశాల నేత్రాలతో, పెద్దగా కనిపిస్తున్నవాడే యుధిష్ఠిరుడు. ఇతడు వృకోదరుడు, మదపుటేనుగువలె నడుస్తాడు. మేలిమి బంగారం వంటి కొంచెం పసుపు తిరిగిన వన్నె, భుజాలు విశాలంగా, బలిష్ఠంగా ఉన్నాడు. పొడవైన పెద్ద బాహువులు. ఇతడిని చూడండి, చూడండి. ఆ భీముని ప్రక్కనే ఉన్నవాడు అర్జునుడు. గొప్ప విలుకాడు, యువకుడు, గజరాజు వంటి వాడు. శ్యామవర్ణుడు, సింహం వలె ఉన్నతమైన భుజాలు గలవాడు. కమలాయతాక్షుడు. ఏనుగువలె విలాసంగా నడిచేవాడు. కుంతికి దగ్గరలో నిలిచిన ఈ నకుల సహదేవులు పురుషోత్తములు. విష్ణుమహేంద్ర సమానులు. మానవలోకంలో ఎవ్వరూ రూప బల శీలాలలో వీరికి సాటికారు. పద్మదళాల వంటి విశాలనేత్రాలతో, నల్లకలువల వంటి కాంతితో, సురదేవతవలె, మూర్తీభవించిన లక్ష్మివలె ఉన్న ఈమె ద్రౌపది. ఇప్పుడు నడిమివయస్సులో అడుగుపెట్టింది.

ఆమె ప్రక్కన మేలిమి బంగారం వంటి కాంతితో, రూపు కట్టిన చంద్రకాంతి వలె ప్రకాశిస్తూ స్త్రీలమధ్య నున్న ఈమె అసామాన్యుడైన చక్రాయుధుని సోదరి - సుభద్ర. బంగారంవలె శుద్ధగౌరవర్ణంతో నున్న ఈమె అర్జునుని భార్య ఉలూపి. క్రొత్త ఇప్పపూలవంటి దేహకాంతి గల ఈమె రాజ కుమారి - చిత్రాంగద. చక్కగా వికసించిన నల్లకలువలమాల వంటి వన్నెగల ఈమె రాజసేనాపతి చెల్లెలు. వృకోదరుని భార్య. ఆ సేనాపతి ఎప్పుడూ శ్రీ కృష్ణునితో పోటీపడేవారు. ఈమె జరాసంధుడని ప్రసిద్ధికెక్కిన మగధరాజకుమారి చంపకమాలవలె గౌరవర్ణంగలది. మాద్రి చిన్నకొడుకైన సహదేవుని భార్య. ఆమెకు దగ్గరగా నల్లకలువవంటి దేహకాంతితో నిలిచి ఉన్న ఈ కమలవిశాలనయన మాద్రి పెద్దకొడుకైన నకులుని భార్య. ఒడిలో కొడుకును పెట్టుకొని తప్తకాంచనవర్ణంతో

శోభిస్తున్న ఈమె విరాటరాజకుమారి. అభిమన్యుని భార్య. రణభూమిలో ద్రోణాదులు రథాలపై ఉండి విరథుడైన ఆ అభిమన్యుని సంహరించారు. తెల్లని ఉత్తరీయాలు ధరించిన ఈ వందమంది రాజపత్నులు వృద్ధుడైన ఈ ధృతరాష్ట్ర మహారాజు కోడళ్ళు. వీరి పుత్రులను, భర్తలను యుద్ధంలో శత్రువీరులు సంహరించారు. సీమంతం మాత్రమే వీరికి కేశాలంకారంగా ఉంది. బ్రాహ్మణత్వం కారణంగా ఋజుబుద్ధి, నిర్మలాంతకరణులు గల మీరు అందరి పరిచయాన్ని అడిగారు. వీరిలో ముఖ్యులను గురించి చెప్పాను. ఈ రాజపత్ను లందరూ పవిత్రహృదయులు."

ఈ రీతిగా సంజయుడు చెప్పినది విని ఆ తాపసులందరూ నిష్క్రమించగా కురువృద్ధశ్రేష్ఠుడైన ధృతరాష్ట్రమహారాజు అక్కడకు వచ్చిన ఆ రాజకుమారుల నందరినీ కుశల మడిగాడు. పాండవయోధులు ఆ ఆశ్రమమండలపు హద్దులకు కొంచెం దూరంగా వాహనాలను విప్పి, గుడారాలు వేసికొన్నారు. స్త్రీలు, వృద్ధులు, బాలురు స్తిమితపడ్డారు. అప్పుడు ధృతరాష్ట్రుడు యథోచితంగా వారి" కుశలమడిగాడు.

26. విదురనిర్యాణము.

ధృతరాష్ట్ర డడిగాడు. "మహాబాహూ ! యుధిష్ఠిరా ! నీ సోదరులందరితోనూ, పౌరులతోనూ, జానపదులతోనూ కలిసి కుశలంగానే ఉన్నావుగదా ! రాజా ! నీ ఆశ్రయంలో జీవించే మంత్రులు, భృత్యులు, గురువులు బాగానే ఉన్నారు కదా ! నీ రాజ్యంలో నివసిస్తున్న వారంతా నిర్భయంగానే ఉన్నారు గదా ! రాజర్షులు పాటించిన ప్రాచీన ప్రవృత్తినే పాటిస్తున్నావు కదా ! న్యాయానికి దూరం కాకుండానే నీ ధనాగారం నిండుతోంది గదా ! శత్రువులు, మధ్యస్థులు, మిత్రుల విషయంలో తగినరీతిగా ప్రవర్తిస్తున్నావు కదా ! భరతర్షభా ! బ్రాహ్మణులకు అగ్రహారాల నిచ్చి, యథోచితంగా చూస్తున్నావు గదా ! నీ నడవడితో వారు ఆనందిస్తున్నారు కదా ! రాజేంద్రా ! పౌరులు, భృత్యులు, బంధువుల విషయమటుంచు. నీ శత్రువులు కూడా నీ ప్రవర్తనతో తృప్తి పడుతున్నారు గదా ! శ్రద్ధతో పితరులను, దేవతలను యజిస్తున్నావు గదా ! భారతా ! అతిథులను అన్నపానాలతో సేవిస్తున్నావు కదా ! నీ రాజ్యంలో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యవర్గాలు, శూద్రులు, గృహస్థులు న్యాయమార్గంలో నిలిచి తమతమ కర్తవ్యాలను ఆసక్తితో చేస్తున్నారు గదా ! స్త్రీలు, బాలురు, వృద్ధులు దుఃఖించటం లేదు కదా ! జీవికకై వారు యాచనకు దిగలేదు గదా ! నరర్షభా ! నీ ఇంట కూతుళ్ళను, కోడళ్ళను ఆదరిస్తున్నావు కదా ! మహారాజా !

ఈ రాజర్షివంశం నిన్ను రాజుగా పొంది యథోచితంగా ప్రతిష్ఠనందుతోంది కదా ! ఆ ప్రతిష్ఠను కోల్పోయి అప్రతిష్ఠతో బాధపడటం లేదు గదా !"

"ధృతరాష్ట్రుడు ఆ రీతిగా అడుగగా న్యాయవేత్త, మాట్లాడటంలో కుశలుడైన యుధిష్ఠిరుడు కుశలప్రశ్నలు వేస్తూ ఇలా అన్నాడు. రాజా ! నీ తపస్సు, శమదమాలు వర్ధిల్లుతున్నాయి గదా ! ఈ నా తల్లి శ్రమపడకుండా మిమ్ము సేవిస్తోంది గదా ! ఈ నా పెద్దమ్మ - గాంధారీ దేవి చలితో, గాలితో, మార్గాయాసంతో, ఘోరతపస్సుతో కృశించిపోతూ బాధపడటం లేదు గదా ! క్షత్రధర్మపరాయణులై చనిపోయిన మహాపరాక్రమవంతులైన తన కొడుకులను తలచుకొని దుఃఖించటం లేదు గదా ! ఆ పాపం చేసి మాకు ఎప్పుడూ ఏ అనిష్టాన్ని తలపెట్టడం లేదు గదా ! రాజా ! విదురుడెక్కడ ? మాకు కనిపించటం లేదు. సంజయుడు కుశలంగా, స్థిరంగా తపస్సులో లగ్నమై ఉన్నాడు కదా !"

యుధిష్ఠిరుడు అలా అనగానే ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. "కుమారా ! విదురునికి కుశలమే. ఘోరతపస్సును ఆశ్రయించి ఉన్నాడు. నిరాహారుడై, వాయుభక్షణ చేస్తూ కృశించిపోయాడు. నరాలు బయటకు కనిపిస్తున్నాయి. ఈ నిర్జనారణ్యంలో ఎప్పుడో, ఎక్కడో బ్రాహ్మణులకు కనిపిస్తున్నాడు." "రాజా ! ధృతరాష్ట్రుడు అలా చెపుతున్నప్పుడే దూరం నుండి వస్తూ విదురుడు కనిపించాడు. ఆయన ముఖంపై చిన్న చిన్న రాళ్ళముక్కలు గ్రుచ్చుకొని ఉన్నాయి. తల జడలు కట్టి ఉంది. మనిషి కృశించాడు. దిగంబరంగా ఉన్నాడు. శరీరం మురికిపట్టి ఉంది. వనంలోని ధూళికణాలతో స్నానం చేసినట్లున్నాడు. ఆయన రాకను ధర్మజునకు సూచించారు, ఇంతలో విదురుడు ఆశ్రమంవైపు చూసి వెంటనే వెనుదిరిగాడు. యుధిష్ఠిరుడు ఒంటరిగా ఆయన వెంటబడ్డాడు. ఆయన కనిపిస్తూ, కనిపించక తిరుగుతున్నాడు. ఒక ఘోరకాననంలో ప్రవేశించే సమయంలో యుధిష్ఠిరుడు ఆయన వైపు పరుగెత్తుతూ "ఓయీ ! విదురా ! నేను యుధిష్ఠిరరాజును నీకు ఇష్టమైన వాడను" అంటూ అరిచాడు. అప్పుడు బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన ఆ విదురుడు ఆ అరణ్యంలో ఒక నిర్జన ప్రదేశంలో, ఒంటరిగా, ఒక చెట్టును ఆసరాగా చేసికొని నిలిచాడు.

మహామేధావి అయిన యుధిష్ఠిరనరపాలుడు పూర్తిగా కృశించి, ఆకారంతో మాత్రమే గుర్తింపబడుతున్న మహామేధావి అయిన విదురుని గుర్తించాడు. "నేను యుధిష్ఠిరుడను" అని పలికి ఆయన ఎదుట నిలిచాడు. విదురునకు వినిపించేంత దూరం నుండియే ఆ మాట పలికి ధర్మరాజు ఆపై దగ్గరకు వెళ్ళి విదురుని సత్కరించాడు.

ఆపై విదురుడు రెప్పవాల్చకుండా ధర్మరాజును చూశాడు. ధర్మజుని దృష్టితో; తన దృష్టిని కలిపి ఏకాగ్రతతో నిలిచాడు. ధీమంతుడైన విదురుడు ధర్మజుని శరీరంలో తన శరీరాన్ని, ప్రాణాలలో ప్రాణాన్ని, ఇంద్రియాలలో ఇంద్రియాలను లీనం చేశాడు. ఆ విదురుడు తేజస్సుతో ప్రజ్వలిస్తూ, యోగబలాన్ని ఆశ్రయించి యుధిష్ఠిర నరపాలుని శరీరంలో ప్రవేశించాడు. అప్పుడు ధర్మజుడు విదురుని శరీరాన్ని చూశాడు. అది ఆలాగే రెప్పవాలకుండా, అచేతనంగా, చెట్టునానుకొని ఉంది. అప్పుడు ధర్మజుడు తనను బలవంతునిగా, బహుగుణవంతునిగా భావించుకొన్నాడు. మహాతేజస్వి, విద్వాంసుడు అయిన ధర్మరాజు తన ప్రాచీన రూపాన్ని పూర్తిగా గుర్తుతెచ్చుకొన్నాడు. వ్యాసమహర్షి చెప్పిన యోగధర్మాన్ని కూడా జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు.

అప్పుడు విద్వాంసుడైన ధర్మరాజు ఆ శరీరానికి అక్కడే దహనసంస్కారం చేయాలని సంకల్పించాడు. ఇంతలో అశరీరవాణి ఇలా పలికింది. "రాజా ! విదురు డన్న పేరు గల ఈ శరీరాన్ని ఇక్కడే దహించటం తగదు. ఇతడు సంన్యసించినవాడు. దహించకపోవటమే సనాతనధర్మం. భారతా ! ఈ విదురుడు సాంతానికలోకాలను పొందగలడు. పరంతపా ! ఇతనికై శోకింపవలదు." అలా అశరీరవాణి పలుకగానే ధర్మరాజు అక్కడ నుండి వెనుకకు మరలి ధృతరాష్ట్రమహారాజుకు అదంతా తెలియజేశాడు. అప్పుడు తేజస్వి అయిన ఆ ధృతరాష్ట్రుడు, సర్వజనులు, భీమసేనాదులు పరమాశ్చర్యాన్ని పొందారు. దానిని విని ధృతరాష్ట్రరాజు ప్రసన్నుడై ధర్మజునితో ఇలా అన్నాడు. "నేను ఇచ్చే నీటిని, దుంపలను, పండ్లను స్వీకరించు. రాజా ! నరుడు తానే పదార్థాలు స్వీకరిస్తే వాటినే అతిథికి కూడా ఇవ్వాలని శాస్త్రవిధి." ఆ మాట విని ధర్మజుడు 'అలాగే' అని ధృతరాష్ట్రునితో అన్నాడు. ఆ రాజు ఇచ్చిన ఫలమూలాలను సోదరులతో కలిసి భుజించాడు. ఆపై సర్వజనులును ఫలమూలజలాలను స్వీకరించి, చెట్ల క్రిందనే పడుకొని ఆ రాత్రిని గడిపారు."

27. వ్యాసుని రాక.

"ఆ ఆశ్రమంలో గడుపుతున్న ఆ పుణ్యకర్ముల కందరికీ నక్షత్రసంపన్నమై శుభకరమైన ఆ రాత్రి గడిచింది. అప్పుడు అక్కడ వారి విచిత్రపదప్రయోగాలతో, అనేక శ్రుతివచనాలతో కూడుకొని ధర్మార్థసంబంధాలయిన వివిధకథలు అక్కడ చోటుచేసికొన్నాయి. రాజా ! అప్పుడు పాండవులు విలువైన పడకలను వీడి తల్లి ఎదురుగా నేలపై పడుకొన్నారు. అప్పుడు మహామనస్వి అయిన ధృతరాష్ట్రుడు తీసికొన్న ఆహారాన్నే నరవీరులయిన ఆ

పాండవులు కూడా తీసికొని ఆ రాత్రి అక్కడ నివసించారు. రాత్రి గడచిపోగానే, తెలవారి, పూర్వాహ్ణక్రియలను ముగించి ధర్మరాజు ధృతరాష్ట్రుని అనుమతిని పొంది, సోదరులతో అంతఃపురకాంతలతో, భృత్యులతో, పురోహితులతో కలిసి యథాసుఖంగా విభిన్నప్రాంతాలలో తిరుగుతూ ఆశ్రమమండలాన్ని సందర్శించాడు. అక్కడ అగ్ని ప్రజ్వలిస్తున్న యజ్ఞవేదికలను చూశాడు. మునులు స్నానాలుచేసి, ఆ అగ్ని దగ్గర కూర్చొని ఆహుతుల నిస్తున్నారు. అడవి పూలమొత్తాలు, ఆజ్యం వలన పైకెగుస్తున్న పొగలు ఆ వేదులకు అందాన్నిస్తున్నాయి. వేదధ్వని కారణంగా ఆ వేదులు వేదమయ శరీరాలుగా కనిపిస్తున్నాయి. మునిగణాలు నిత్యమూ మునిజనులతో కూడి ఉంటాయి.

ఆశ్రమాలలో అక్కడక్కడ జింకల సమూహాలు నిర్భయంగా సంచరిస్తున్నాయి. పక్షుల గుంపులు కొంకు లేకుండా పాటలు పాడుకొంటున్నాయి. నెమళ్ళకేకలు, వానకోయిలల కూజితాలు, కోకిలల కుహూరవాలు శ్రవణ మనోహరంగా, సుఖంగా వినిపిస్తున్నాయి. అక్కడక్కడ ద్విజుల స్వాధ్యాయ ఘోషలు (వేదమంత్రధ్వనులు) వినిపిస్తున్నాయి. ఇవన్నీ ఆశ్రమాలకు వన్నె తెస్తున్నాయి. పండ్లు, దుంపలను తినే మహాత్ములు ఆశ్రమాలలో శోభిస్తున్నారు. ఆ తరువాత ధర్మరాజు తాపసులకై తెచ్చిన బంగారు కలశాలను, రాగి కలశాలను, మృగచర్మాలను, కంబళ్ళను, స్రుక్‌స్రువాలను, కమండలాలను, తప్పేలాలను, చిన్నబాణళ్ళను, లోహపాత్రలను ఇంకా ఉపయోగపడే చిన్న చిన్న వస్తువులను వారికిచ్చాడు. ఇంకా మరేదైనా ఎవరెవరు ఏదికోరితే ఎంత కోరితే అంతా ఇచ్చాడు. ఈ రీతిగా ధర్మాత్ముడైన ఆ యుధిష్ఠిర నరపాలుడు ఆశ్రమాలన్నీ తిరిగి ధనమంతా వారికిచ్చి మరలివచ్చాడు.

అప్పుడు నిత్యకర్మలు ముగించి, ప్రశాంతంగా గాంధారితో పాటు కూర్చొని ఉన్న ధృతరాష్ట్రమహారాజును చూశాడు. శిష్టాచారంతో కూడి, వారి దగ్గరలోనే శిష్యురాలివలె వినయంగా నిలిచి ఉన్న తన తల్లి కుంతిని కూడా ఆ ధర్మాత్ముడు చూశాడు. ధర్మరాజు ధృతరాష్ట్రమహారాజును సమర్చించి తన పేరు వినిపించి, 'కూర్చో' అని ఆయన అనుమతించగా దర్భాసనంపై కూర్చున్నాడు. భరతర్షభా ! భీమసేనాది పాండవులు కూడా ఆయన పాదాలనంటి నమస్కరించి, ఆయన అనుమతితో కూర్చున్నారు. వారందరూ చుట్టూ కూర్చొనగానే ఆ ధృతరాష్ట్ర మహారాజు దేవతలు చుట్టూ ఉన్న బృహస్పతివలె, బ్రహ్మతేజస్సును ధరించి ఎంతో శోభించాడు. వారు అలా కూర్చొని ఉండగా కురుక్షేత్రంలో నివసిస్తున్న శతయూపాది మహర్షులు అక్కడకు వచ్చారు. దేవర్షులు సేవించే మహాతేజస్వి, బ్రహ్మర్షి అయిన వ్యాస

భగవానుడు కూడా శిష్యసహితంగా ధృతరాష్ట్రునకు దర్శనమిచ్చారు. ఆ పై కౌరవరాజు అయిన ధృతరాష్ట్రుడు, పరాక్రమవంతుడైన యుధిష్ఠిరుడు, భీమసేనాదులు లేచి, నమస్కరించారు. వ్యాసుడు రాగానే శతయూపాదులు ఆయన చుట్టూ చేరారు. "కూర్చో" అని వ్యాసుడు ధృతరాష్ట్ర మహారాజుతో అన్నాడు. అప్పుడు వ్యాసుడు కూడా శ్రేష్ఠమైన దర్భాసనంపై కూర్చున్నాడు. ఆ ఆసనంపై మృగచర్మాన్ని పరిచారు. అది వ్యాసుని కొరకే ఏర్పాటుచేసింది. మహాతేజస్సు లయిన ఆ ద్విజశ్రేష్ఠులందరూ వ్యాసుని అనుమతితో అన్నివైపులా ఆసనాలపై కూర్చున్నారు."

28. వ్యాసవాక్యము

"ఆ తరువాత మహాత్ములైన పాండవులు కూర్చొని ఉండగా సత్యవతీసుతుడయిన వ్యాసుడు ఇలా పలికాడు. "మహాబాహూ ! ధృతరాష్ట్రా ! నీ తపస్సు వర్ధిల్లుతున్నదా ? రాజా ! వనవాసంలో నీ మనస్సు తృప్తి నందుతున్నదా ? రాజా ! పుత్రమరణ శోకం నీ మనస్సులో కలగటం లేదుగదా ! అనఘా ! నీ జ్ఞానేంద్రియాలన్నీ సరిగా పనిచేస్తున్నవా ? బుద్ధిని గట్టిని చేసికొని ఆరణ్యకవిధిని ఆచరిస్తున్నావా ? కోడలు - గాంధారి దుఃఖానికి లోను కావటం లేదు గదా ! గాంధారీదేవి ధర్మార్థాలను చూడగలది. బుద్ధిమంతురాలు. జనన మరణ తత్త్వమెరిగినది. ఆమె శోకించటం లేదుగదా ! రాజా ! తన కుమారులను కూడా విడిచిపెట్టి గురుసేవాసక్తితో ఉన్న కుంతి నిన్ను అహంకారం లేకుండా సేవిస్తున్నదా ? ధర్మసుతుడైన యుధిష్ఠిర మహారాజు నీ చేత అభినందింప బడినాడు కదా ! ఈ భీమార్జున నకులసహదేవులను అనునయించావా ? రాజా ! వీరిని చూసి ఆనందిస్తున్నావా ? నీ మనస్సు నిర్మలమే గదా ! జ్ఞానవంతుడవై హృదయాన్ని పరిశుద్ధంగా నిలుపుకొన్నావా ? **మహారాజా ! భారతా ! సర్వప్రాణులలోనూ శత్రుత్వం లేకపోవటం, సత్యం, క్రోధరాహిత్యం - ఈ మూడు గుణాలు గొప్పవి.*** భారతా ! వనవాసంలో ఆటవికమైన ఆహారం నీకు అందుబాటులో ఉండవచ్చు. లేదా ఉపవసించవలసి రావచ్చు. ఈ స్థితిలో వనవాసం నీకు మోహాన్ని కలిగించటం లేదు గదా !

రాజేంద్రా ! మహాత్ముడైన విదురుడు ధర్మస్వరూపుడు ఈ విధితోనే ఆ మహాత్ముడు లోకాన్ని విడిచివెళ్ళటం నీకు తెలిసినదే గదా ! మహాబుద్ధి, మహాయోగి,

---

* ఏతద్ధి త్రితయం శ్రేష్ఠం సర్వభూతేషు భారత ।
నిర్వైరతా మహారాజ సత్యమక్రోధ ఏవ చ ॥ 9

మహామనస్వి, మహాత్ముడైన విదురుడు మాండవ్యశాపం వలన అలా పుట్టిన ధర్ముడే. దేవతలలో బృహస్పతి గానీ, రాక్షసులలో శుక్రుడు కానీ పురుషశ్రేష్ఠుడైన ఆ విదురునివలె బుద్ధిసంపన్నులు కారు. మాండవ్యముని చిరకాలం ప్రోగుచేసికొన్న తపశ్శక్తిని ఖర్చుచేసి సనాతనుడైన ధర్ముని పరాభవించాడు (శాపమిచ్చి) నేను గతంలో బ్రహ్మనియోగం వలన నా తపోబలంతో ఆ మహామతిని విచిత్రవీర్యుని భార్యయందు కన్నాను. మహారాజా ! నీ సోదరుడైన విదురుడు దేవతలకే దేవుడు, సనాతనుడు అయిన ధర్ముడే. ధారణ వలన, మనసా ధ్యానించటం వలన ఆయనను ధర్ముడని పండితులంటారు. ధర్ముని సత్యం, దమం, శమం, అహింస, దానం - ఈ రూపాలతో సేవిస్తే లోకాన్ని వర్ధిల్ల చేస్తాడు. ఆ సనాతనుడే విదురుడు. రాజా ! ప్రాజ్ఞుడు, మహామతి అయిన కురురాజైన యుధిష్ఠిరునకు యోగ బలంతో జన్మనిచ్చిన ధర్ముడే ఈ విదురుడు.

అగ్ని, గాలి, నీరు, నేల, ఆకాశం - ఇహపరలోకాలలో ఉన్నట్టే ధర్మం కూడా ఇహపరలోకాలలో ఉంటుంది. రాజేంద్రా ! ధర్మం అంతటా సంచరిస్తుంది. చరాచర జగత్తునంతటినీ వ్యాపించి ఉంటుంది. సిద్ధులు, పాపవిముక్తులు అయిన దేవతలు ఆ ధర్మాన్ని చూడగలరు. ధర్ముడే విదురుడు. విదురుడే యుధిష్ఠిరుడు. రాజా ! అతడే ఇప్పుడు ఇదిగో ఈ రూపంలో నీ ఎదుట దాసునివలె నిలిచి ఉన్నాడు. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు, మహాత్ముడు అయిన ఆ నీ సోదరుడు - విదురుడు, మహాత్ముడైన యుధిష్ఠిరుని చూసి మహాయోగబలంతో అతనిలో లీనమయ్యాడు. భరతర్షభా ! కుమారా ! త్వరలోనే నీవు కూడా శ్రేయస్సుతో కూడగలవు. నీ సంశయాన్ని తీర్చటానికే నేను వచ్చానని గ్రహించు. గతంలో లోకంలో ఏ మహర్షులూ చేయని పనిని నేను నేడు చూపిస్తాను. అది తపస్సుచే పొందగల ఆశ్చర్యకరమైన ఫలం. రాజా ! నా ద్వారా నీ కిష్టమైన దేది పొందగోరుతున్నావో చెప్పు. అనఘా ! అది దృశ్యం కావచ్చు. స్పర్శనీయం కావచ్చు, వినదగినది కావచ్చు. దానిని చేస్తాను.

29. ధృతరాష్ట్రాదుల అభ్యర్థన.

జనమేజయుడు ఇలా అడిగాడు. "బ్రాహ్మణా ! రాజశ్రేష్ఠుడైన ధృతరాష్ట్ర మహారాజు భార్యతో, కుంతితో కూడా వనవాసానికి వెళ్ళాడు. విదురుడు సిద్ధిపొంది ధర్మరాజులో లీనమయ్యాడు. పాండుకుమారులందరూ ఆశ్రమ మండలంలో నివసిస్తున్నారు. పరమతేజస్వి అయిన వ్యాసమహర్షి ఆశ్చర్యాన్ని ప్రకటిస్తానన్నాడు గదా ! అదెలా జరిగిందో

నాకు చెప్పు. అప్పుడు యుధిష్ఠిరనరపాలుడు తనవారితో కూడి వనవాసంలో ఎంత కాలమున్నాడు ? ప్రభూ ఆ మహాత్ములు అంతఃపురకాంతలతో, సైన్యాలతో సహా ఏం ఆహారం తీసికొంటూ నివసించారు ? అనఘా ! దానిని నాకు చెప్పు"

వైశంపాయనుడు చెప్తున్నాడు. "రాజా ! ధృతరాష్ట్ర మహారాజు అనుమతితో పాండవులు వివిధాన్నపానాలను, విశ్రాంతిని అనుభవించారు. అంతఃపురకాంతలతో, సైన్యాలతో సహా ఆ వనంలో ఒక నెల గడిపారు. అప్పుడు నేనింతకు ముందు చెప్పినట్లు వ్యాసుడు అక్కడకు వచ్చాడు. ధృతరాష్ట్రమహారాజు దగ్గర, వ్యాసుని వెంట కూర్చున్న వారంతా వివిధ విషయాలు మాటాడుకొంటున్నప్పుడు ఇతర మునులు కూడా అక్కడకు వచ్చారు. భారతా ! వారిలో నారదుడు, పర్వతుడు, మహాతపస్వి అయిన దేవలుడు, విశ్వావసువు, తుంబురుడు, చిత్రసేనుడు కూడా ఉన్నారు. ధృతరాష్ట్రుని ఆదేశంతో మహాతపస్వి అయిన కౌరవరాజు యుధిష్ఠిరుడు వారినందరినీ కూడా యథోచితంగా పూజించాడు. ఆపై వారందరూ యుధిష్ఠిరుని పూజను గ్రహించి, నెమలి ఈకలతో చేసిన పవిత్రశ్రేష్ఠాసనాలపై కూర్చున్నారు. వారు అక్కడ కూర్చోగానే మహామతి అయిన ధృతరాష్ట్ర మహారాజు కూడా కూర్చున్నాడు. పాండవులు ఆయన చుట్టూ ఉన్నారు. ఆపై గాంధారి, కుంతి, ద్రౌపది, సుభద్ర, ఇతర స్త్రీలు తమ తోటిస్త్రీలతో కలిసి కూర్చున్నారు. రాజా ! అక్కడ వారి మధ్య ధర్మబద్ధాలయిన దివ్యకథలు కొనసాగాయి. ప్రాచీన ఋషులకు, దేవతలకు, రాక్షసులకు సంబంధించిన చర్చలు సాగాయి.

ఆ తరువాత ఆ కథలు ముగియగానే వాగ్మిశ్రేష్ఠుడు మహాతేజస్వి, సర్వవేదవేత్తలలో మేటి అయిన వ్యాసుడు ప్రసన్నుడై మరలా అదే మాట అన్నాడు. "రాజేంద్రా ! ఏం చెప్పాలని నీవు అనుకొంటున్నావో తెలుసు నాకు. పుత్రకారణంగా ఏర్పడిన శోకంతో నీవు దగ్ధమవుతున్నావు. నిత్యమూ గాంధారి హృదయంలో రేగుతున్న దుఃఖమూ తెలుసు. కుంతి మనస్సులో, ద్రౌపది మనస్సులో ఏమున్నదీ తెలుసు. కృష్ణుని సోదరి అయిన సుభద్ర పుత్రవినాశనం వలన ఏర్పడిన తీవ్రదుఃఖాన్ని ఎలా భరిస్తోందో కూడా నేనెరుగుదును. వాస్తవంగా మీరందరూ ఇక్కడ కలుస్తున్నారని తెలిసియే, సంశయాలను పోగొట్టటానికి ఇక్కడకు వచ్చాను. ఈ దేవతలు, గంధర్వులు, ఈ మహర్షులందరూ నేను చిరకాలంగా కూడబెట్టుకొన్న తపశ్శక్తిని చూస్తారు. కాబట్టి ధృతరాష్ట్రా ! చెప్పు. నీ కోరికను దేన్ని తీర్చాలి ? వరమివ్వటానికి సిద్ధంగా ఉన్నాను. నా తపః ఫలితాన్ని చూడు."

అమితమేధావి అయిన వ్యాసుడు అలా అనగానే ఆ ధృతరాష్ట్రనరపాలుడు ముహూర్తకాలం ఆలోచించి, ఇలా చెప్పసాగాడు. "నేను ధన్యుడను. అనుగ్రహింపబడినవాడను. మీ వంటి సాధువులతో నేడు ఇక్కడ సమాగమం కలిగింది. నా జీవితం సఫలమైంది. తపోధనులారా ! బ్రహ్మతుల్యులైన మీతో నేను కలియ గలిగానంటే నాకు ఇష్టమైన గతి నాకు లభించిందనే భావిస్తున్నాను. అనఘులారా ! మీ దర్శనం చేతనే నేను పవిత్రుడనయ్యా ననటంలో సంశయం లేదు. నాకు పరలోక భయం కూడా లేదు. కానీ దుర్బుద్ధి, మందమతి అయిన ఆ దుర్యోధనుని అవినీతితో పుత్రులను కోల్పోయాను. పుత్రవ్యామోహంతో దానినే తలచుకొంటున్న నా మనస్సు నిరంతరమూ తీవ్రదుఃఖానికి లోనవుతోంది. పాపచింతనతో ఆ దుర్యోధనుడు పాపమెరుగని పాండవులను వంచించాడు. గుర్రాలతో, సైనికులతో, ఏనుగులతో సహా భూమిని నాశనం చేశారు. మహాత్ములై, వివిధ జనపదాలకు పాలకులైన రాజులు నా కొడుకుకోసం వచ్చారు. అందరూ మరణించారు. ఎందరో పితరులను, భార్యలను, ప్రాణాలను, మనోభీష్టాలను వీడి వచ్చిన శూరులు యమసదనానికి వెళ్ళిపోయారు. బ్రాహ్మణా ! మిత్రుల కోసం యుద్ధంలో మరణించిన వారు పొందిన గతి ఏమిటి ? అలా యుద్ధంలో చనిపోయిన నా కొడుకులు, మనుమల గతి ఏమిటి ? వృద్ధుడు, భీష్ముడనీ, ద్విజశ్రేష్ఠుడైన ద్రోణుని చంపించి నా మనస్సు ఎప్పుడూ ఖేదపడుతోంది. మూఢుడు, పాపాత్ముడు, బుద్ధిహీనుడు అయిన నా కుమారుడు భూమండలాధిపత్యాన్ని కోరి వెలుగుతున్న వంశాన్ని నాశనం చేశారు. ఇదంతా తలచుకొంటూ రేబవళ్ళు దహించుకొనిపోతూ దుఃఖశోకాల దెబ్బతిని శాంతిని పొందలేకపోతున్నాను. తండ్రీ ! అదంతా తలచుకొంటున్న నాకు శాంతి లభించదా ?"

ఆ రాజర్షి అలా వివిధ గతులలో విలపించటాన్ని చూసిన గాంధారిలోని శోకం మళ్లీ క్రొత్తగా మొదలయింది. ఉత్తమకాంతలైన కుంతి, ఉత్తర, సుభద్ర. ఆ ధృతరాష్ట్రుని కోడళ్ళలో కూడా మరల శోకం చెలరేగింది. పుత్రశోకానికి లోనయి ఉన్న గాంధారీదేవి కళ్ళగంతలతోనే లేచి, చేతులు జోడించి, మామగారితో ఇలా అన్నది. ప్రభూ ! మునిపుంగవా ! చనిపోయిన పుత్రులను తలచుకొంటూ నాకూ, ఈ మహారాజుకూ పదహారు సంవత్సరాలు గడచిపోయాయి. కానీ శాంతి లేదు. మహామునీ ! ఈ ధృతరాష్ట్ర భూపతి పుత్రశోక సమావిష్టుడై ఎప్పుడూ నిట్టూరుస్తూనే ఉంటాడు. రాత్రంతా మేలుకొనే ఉంటారు.

నీ తపోబలంతో సర్వలోకాలను కూడా మరల సృష్టించగలవాడవు. లోకాంతరగతులైన కొడుకులను మరల రాజుకు చూపలేవా ? ఈ ద్రౌపది కోడళ్ళ

కందరికీ కూడా ఇష్టమైన కోడలు దాయాదులను, పుత్రులను పోగొట్టుకొని తీవ్రంగా దుఃఖిస్తోంది. అదే రీతిగా, భద్రభాషిణి, ద్రౌపది చెల్లెలు అయిన ఈ సుభద్ర అభిమన్యుని వధతో తపించిపోతూ తీవ్రంగా దుఃఖిస్తోంది. ఈమె భూరిశ్రవుని భార్య. అందరికీ ఇష్టమైనది. ఈ కళ్యాణమయి భర్తమరణశోకంతో తీవ్రంగా బాధపడుతోంది. ఈమె మామగారు కురుశ్రేష్ఠుడు, ధీమంతుడు అయిన బాహ్లికుడు కూడా మరణించాడు. సోమదత్తుడు కూడా మహాసంగ్రామంలో తండ్రితో పాటు మరణించాడు. (బాహ్లిక -సోమదత్త-భూరిశ్రవ) మహామతి, శ్రీమంతుడు, యుద్ధంలో వెన్నుచూపనివాడు అయిన ఈ నీ కుమారుని వందమంది కొడుకులూ యుద్ధరంగంలో మరణించారు. వారి భార్యలు వందమంది దుఃఖశోకసహితలై నాకు, ఈ రాజుకు మాటిమాటికి శోకాన్ని పెంచుతున్నారు.

మహామునీ ! తీవ్రదుఃఖంతో వారు నా చుట్టూ కూర్చొని ఉన్నాడు. శూరులు, మహాత్ములు, మహారథులు, నా మామలు అయిన సోమదత్తాదులు పొందిన గతి ఏది ? భగవంతుడా ! నీ అనుగ్రహంతో ఈ రాజు, నేను మా కోడలు - ఈ కుంతి శోకానికి దూరమయ్యేటట్టు చూడు. గాంధారి అలా అనగానే వ్రతాలతో కృశించిన ముఖంకల కుంతి తనకు రహస్యంగా పుట్టిన, సూర్యసమానుడైన ఆ కుమారుని స్మరించింది. దూరంనుండియే వినటం, చూడటం, గ్రహించటం - ఈ శక్తులు గల వరదుడైన ఆ వ్యాసమహర్షి సవ్యసాచి తల్లి అయిన కుంతీదేవి దుఃఖాన్ని అర్థం చేసికొన్నాడు. అప్పుడు వ్యాసుడు "మహాభాగా ! నీ చెప్పదలచుకొన్న పని ఏదైనా ఉంటే చెప్పు. నీ మనస్సులో ఏమున్నదో తెలియజేయి" అని కుంతితో అన్నాడు. దానితో అప్పుడు కుంతి శిరసా మామగారికి నమస్కరించి, సిగ్గుపడుతూ, గడచిపోయిన విషయాన్ని వివరిస్తూ ఇలా అన్నది."

30. కుంతి కర్ణజన్మ వృత్తాంతము చెప్పుట.

కుంతి ఇలా చెప్పింది "పూజ్యుడా ! నాకు మామవు. నా దేవతలకు కూడా దేవుడవు. కాబట్టి నాకు దేవాధిదేవుడవు. నా సత్యవచనాన్ని వినుము. తపస్వి, కోపశీలుడు, విప్రుడు అయిన దుర్వాసుడు నా తండ్రి దగ్గరకు భిక్షకై వచ్చాడు. నేను పవిత్రతతో, పొరపాట్లు జరగకుండా, శుద్ధమనస్సుతో, నేను సేవలతో ఆయనను సంతోషపెట్టాను. బాగా కోపం వచ్చే అవకాశమున్నప్పుడు కూడా ఎప్పుడూ ఆయన కోపపడలేదు. దానితో సంతసించి, ఆ మహాముని వరమిస్తా నన్నాడు. తప్పక స్వీకరించవలసిందే అని నాతో

అన్నాడు. దానితో శాపభయంతో మరలా ఆయనతో 'స్వామీ ! అలాగే కానివ్వండి' అన్నాను. ఆ విప్రుడు మరలా నాతో ఇలా అన్నాడు. "భద్రా ! శుభాననా ! నీవు ధర్మునకు తల్లి కాగలవు. నీవు ఆహ్వానించిన దేవతలు నీకు లోబడి ఉంటారు." అలా పలికి ఆ విప్రుడు అంతర్ధానమయ్యాడు. నేను ఆశ్చర్యానికి లోనయ్యాను. సర్వావస్థలలో కూడా ఆ మాటను నేను మరువలేకపోయాను.

ఆ పై నేను మేడపైభాగాన నిలిచి ఉదయిస్తున్న సూర్యుని చూసి, ఆ ఋషి వాక్యాన్ని స్మరించి, పగలూ, రేయి ఆ సూర్యుని కోరుకొన్నాను. నేను బాలను. అలా కోరటం తప్పని నేనెరుగను. ఆ తరువాత సూర్యభగవానుడు నా దగ్గరకు వచ్చాడు. తన శరీరాన్ని రెండుగా విభజించి, ఒక శరీరంతో లోకాలను తపింపజేస్తూ, మరొక శరీరంతో నా దగ్గరకు వచ్చాడు. వణికిపోతున్న నన్ను చూసి 'నా నుండి వరం కోరుకో' అన్నాడు. నేను తలవాల్చి నమస్కరించి 'వెళ్ళు' అన్నాను. ఆ సూర్యుడు "వ్యర్థంగా నన్ను పిలవటం నేను సహించను. నిన్నూ, నీకు వరమిచ్చిన ఆ బ్రాహ్మణుని దగ్ధం చేస్తాను' అన్నాడు. ఏ అపరాధమూ చేయని ఆ విప్రుని శాపం నుండి రక్షింపదలచి నేను "దేవా ! నీ వంటి కొడుకు కావాలి" అన్నాను. అప్పుడు సూర్యుడు నన్ను మోహింపజేసి, తన తేజస్సుతో నాలో ప్రవేశించి "నీకు కొడుకు పుడతాడు" అన్ని చెప్పి ఆకాశంలోనికి వెళ్ళిపోయాడు.

ఆపై నేను ఈ విషయాన్ని తండ్రికి తెలియకుండా రక్షించాలని అంతఃపురంలోనే ఉంటూ రహస్యంగా కొడుకును కన్నాను. ఆ బాలుని నీటిలో విడిచాను. అతడే కర్ణుడు. బ్రాహ్మణా ! ఆ సూర్యదేవుని అనుగ్రహంతోనే నేను మరలా కన్యగానే మిగిలిపోయాను. ఆ ఋషి చెప్పినట్లే జరిగింది. నేను మూఢురాలనై ఆ కర్ణుని గుర్తించి కూడా ఉపేక్షించాను. అది నన్ను దహించివేస్తోంది. బ్రహ్మర్షీ ! ఆ విషయం నీ వెరిగినదే. పాపమో ! పుణ్యమో జరిగింది. నేను నీకు వివరించాను. స్వామీ ! నన్ను అది దహించివేస్తోంది. ఆ బాధను నీవు పోగొట్టాలి. అనఘా ! ఈ మహారాజు మనస్సులో నున్నది కూడా నీకు తెలుసు. మునిసత్తమా ! ఈ రాజుకున్న ఆ కోరిక తీరేటట్లుగా నేడే అనుగ్రహించాలి."

కుంతి అలా అనగానే వేదవేత్తలలో శ్రేష్ఠుడైన వ్యాసుడు ఇలా అన్నాడు. "బావుంది. నీవు చెప్పినదంతా అలా జరుగవలసి ఉన్నదే. నీవు అప్పటికింకా కన్యవు. నీ తప్పేమీ లేదు. దేవతలు ఐశ్వర్యసంపన్నులు. ఇతరుల శరీరాలలో ప్రవేశింపగలరు. కొన్ని దేవగణాలున్నాయి. వారు సంకల్పంతో, మాటతో, దృష్టితో, స్పర్శతో, సమాగమంతో -

ఇలా అయిదు రకాలుగా పుత్రులను కనగలరు. దేవధర్మం కారణంగా మానవధర్మం దూషితం కాదు. కుంతీ ! ఈ విషయాన్ని అర్థం చేసికో ! నీ మనోవ్యథను తొలగించుకో ! **బలవంతులకు ఏదైనా లాభహేతువే. బలవంతులకు ఏదైనా పవిత్రమే. బలవంతులకు ఏదైనా ధర్మమే. బలవంతులకు ఏదైనా స్వకీయమే."***

31. గంగాతీర గమనము.

వ్యాసుడు చెప్తున్నాడు. "అమ్మా ! గాంధారీ ! ఈ రోజు రాత్రి నీవు పుత్రులను, సోదరులను, మిత్రులను చూడగలవు. నీ కోడళ్ళను కూడా భర్తలతో కలిసి నిదురించి, మేల్కొన్నరీతిగా చూడగలవు. కుంతి కర్ణుని చూడగలదు. సుభద్ర అభిమన్యుని చూడగలదు. ద్రౌపది అయిదుగురు కొడుకులను, తండ్రులను, సోదరులను కూడా చూడగలదు. నీవు, ధృతరాష్ట్రుడు, కుంతి - మీరు అడగకముందే అలా చూపించాలని నా మనస్సులో నిశ్చయమేర్పడి ఉంది. ఆ నరోత్తములు, మహాత్ములు అందరూ క్షాత్రధర్మాన్ని ఆశ్రయించి మరణించిన వారు. వారి కోసం శోకింపదగదు. సాధ్వీ ! అది తప్పక జరిగి తీరవలసిన దేవకార్యం. అందువలన వారంతా దేవతాంశలతో భూమిపై జన్మించారు. గంధర్వులు, అప్సరలు, పిశాచులు, గుహ్యకులు, రాక్షసులు, పుణ్యజనులు, సిద్ధులు, దేవర్షులు, దేవతలు, దానవులు. అలాగే పవిత్రులయిన దేవర్షులు భూమిపై అవతరించి కురుక్షేత్రంలో రణభూమిలో మరణించారు. ధృతరాష్ట్రుడనే పేరు గల ధీమంతుడైన గంధర్వరాజే మానవలోకంలో ధృతరాష్ట్రుడుగా జన్మించాడు. ఆయనే నీ భర్త. పాండురాజు ధర్మం తప్పనివాడు. ఎంతో గొప్పవాడు. ఆయన మరుద్గణాంశకు చెందినవాడు. విదురుడు, యుధిష్ఠిరుడు ధర్ముని అంశగా పుట్టినవారు. దుర్యోధనుడు కలి. శకుని ద్వాపరుడు. శుభదర్శనా ! దుశ్శాసనాదులు రాక్షసులు.

బలశాలి, అరిందముడు అయిన భీమసేనుడు మరుద్గణాలకు చెందినవాడు. ధనంజయుడైన అర్జునుడు నరుడనే మహర్షి. శ్రీకృష్ణుడు నారాయణమహర్షి. నకులసహదేవులు అశ్వినీ కుమారులు. శుభదర్శనా ! కేవలం వైరాన్ని కల్గించటానికి, సంఘర్షణను పెంచటానికి పుట్టినవాడు కర్ణుడు. అతడే సూర్యుడు. ఆరుగురు మహారథులు కలిసి చంపిన సుభద్రా కుమారుడు - అభిమన్యుడు చంద్రుడే. ఆ చంద్రుడు యోగబలంతో తనను రెండుగా

---

* సర్వం బలవతాం పథ్యం సర్వం బలవతాం శుచి ।
సర్వం బలవతాం ధర్మః సర్వం బలవతాం స్వకమ్ ॥ 24

విభజించుకొన్నాడు. శోభనా ! తపించేవారిలో శ్రేష్ఠుడైన సూర్యుడు తన శరీరాన్ని రెండుగా విభజించుకొని, ఒక శరీరంతో లోకాలను తపింపజేస్తూ మరో శరీరంతో కర్ణుడుగా పుట్టాడు. అగ్ని నుండి ద్రౌపదితో పాటు పుట్టిన ధృష్టద్యుమ్నుడు అగ్ని యొక్క పవిత్రాంశ శిఖండి రాక్షసుడు. ద్రోణుడు బృహస్పతి అంశ. అశ్వత్థామ రుద్రుని అంశ. గంగాసుతుడైన భీష్ముడు మానవత్వాన్ని పొందిన వసువు. మహాప్రజ్ఞా ! శోభనా ! ఈ రీతిగా ఈ దేవతలందరూ మనుష్యత్వాన్ని పొంది, పని ముగియగానే మరల స్వర్గానికి వెళ్ళిపోయారు. మీ అందరి హృదయాలలో ఎప్పటినుండియో నిలిచి ఉన్న దుఃఖాన్ని, పరలోక భయాన్ని ఈ రోజు పోగొడతాను. మీరంతా గంగానదీ తీరానికి బయలుదేరండి. అక్కడ యుద్ధంలో మరణించిన వారినందరినీ చూడగలరు."

వ్యాసుని ఆ మాట విని అక్కడున్న జనమంతా పెద్దగా సింహనాదాలు చేస్తూ గంగవైపు బయలుదేరారు. ధృతరాష్ట్రుడు అమాత్యులతో, పాండవులతో, అక్కడకు వచ్చి ఉన్న మునివరులతో, గంధర్వులతో కలిసి బయలుదేరాడు. ఆపై ఆ జనసముద్రమంతా క్రమంగా గంగాతీరాన్ని సమీపించి యథాసుఖంగా, యథానందంగా విడిచి చేసింది. ధీమంతుడైన ఆ ధృతరాష్ట్ర మహారాజు స్త్రీలను, వృద్ధులను ముందుంచుకొని, పాండవులతో, ఇతరానుచరులతో కలిసి తనకు నచ్చినచోట విడిది చేశాడు. మృతరాజులను చూడగోరి రాత్రికి నిరీక్షిస్తున్న వారికి ఆ పగలు వంద సంవత్సరాల వలె గడిచింది. అప్పుడు సూర్యుడు పవిత్రమైన అస్తాద్రిని చేరుకొన్నాడు. ఆపై వారంతా స్నానాలు చేసి సంధ్యానుష్ఠానాలు పూర్తి చేశారు."

32. గంగాజలమున భీష్మాదులు కనిపించుట.

"ఆపై రాత్రి కాగానే అక్కడ చేరినవారందరూ సాయంకాలం చేయవలసిన అనుష్ఠానాలను ముగించి వ్యాసుని దగ్గరకు చేరారు. అప్పుడు ధర్మాత్ముడైన ధృతరాష్ట్రుడు పవిత్రుడై, తదేకమనస్సుతో పాండవులతో, ఋషులతో కలిసి కూర్చున్నాడు. మహాతేజస్సు అయిన వ్యాసమహర్షి పవిత్రగంగాజలంలో స్నానంచేసి అందరినీ పిలిచాడు. పాండవ యోధులను, కౌరవయోధులను, నానాదేశ నివాసులై యుద్ధానికి వచ్చిన మహాభాగులయిన రాజులను అందరినీ ఆహ్వానించాడు. జనమేజయా ! ఆ తరువాత కురుపాండవసేనలలో యుద్ధసమయంలో చెలరేగినట్లు నీటిలో భీకరశబ్దం వినిపించింది. ఆ తరువాత భీష్ముడు, ద్రోణుడు మొదలయిన రాజులందరూ వేలకొలదిగ సైన్యాలతో సహా ఆ నీటి నుండి

పైకి లేచారు. పుత్రులతో, సైనికులతో కలిసి విరాటద్రుపదులు, ద్రౌపదికొడుకులు, అభిమన్యుడు, రాక్షసుడైన ఘటోత్కచుడు నీటినుండి పైకి లేచారు. కర్ణుడు, దుర్యోధనుడు, మహారథుడైన శకుని, మహాబలశాలులైన దుశ్శాసనాది ధార్తరాష్ట్రులు, జరాసంధసుతుడు, భగదత్తుడు, వీర్యవంతుడైన జలసంధుడు, భూరిశ్రవుడు, శలుడు, శల్యుడు, సోదరులతో సహా వృషసేనుడు, రాజకుమారుడైన లక్ష్మణుడు, ధృష్టద్యుమ్నుని కొడుకులు, శిఖండి కొడుకులు, తమ్ములతో పాటు ధృష్టకేతువు, అచలుడు, వృషకుడు, రాక్షసుడైన అలాయుధుడు, బాహ్లికుడు, సోమదత్తుడు, చేకితానరాజు – ఇంకా ఎందరో లెక్కకు మిక్కిలిగా ఉన్నందువలన పేరు పలకని రాజులు అందరూ భాసురశరీరాలతో ఆ నీటి నుండి పైకి లేచారు. పైకి లేచిన వీరులయిన ఆ రాజులు తమ తమ వేషాలతో, ధ్వజాలతో, వాహనాలతో సహా కన్పించారు. అందరూ దివ్యాంబరాలను ధరించి, ప్రకాశించే కుండలాలను అలంకరించుకొని ఉన్నారు. వీరిలో శత్రుత్వం లేదు. అహంకారం లేదు. కోపం గానీ, మాత్సర్యం గానీ లేవు. గంధర్వులు వారి కీర్తిని గానం చేస్తున్నారు. వందులు స్తుతిస్తున్నారు. దివ్యమాల్యాలనూ, వస్త్రాలనూ ధరించి అప్సరసల మధ్య నిలిచి ఉన్నారు.

రాజా ! అప్పుడు సత్యవతీపుత్రుడైన వ్యాసమహర్షి తన తపోబలంతో ధృతరాష్ట్రుని యెడ ప్రసన్నుడై దివ్యదృష్టి నిచ్చాడు. యశస్విని అయిన గాంధారి దివ్యజ్ఞానాన్ని, దివ్యబలాన్ని పొంది ఆ కొడుకులనందరినీ, యుద్ధంలో మరణించిన ఇతరులనూ చూసింది. అది అద్భుతంగా ఉంది. ఆలోచన కందనిది. ఎంతో రోమాంచాన్ని కలిగిస్తోంది. జనమంతా ఆశ్చర్యంతో రెప్ప వాల్చకుండా చూశారు. స్త్రీలు, పురుషులు హర్షంతో నిండిపోయి పరమాశ్చర్యహేతువయిన ఆ ఉత్సవతీవ్రత వస్త్రంపై గీచిన బొమ్మలా కనిపిస్తోంది. భరతశ్రేష్ఠా ! వ్యాసమహర్షి అనుగ్రహంతో ధృతరాష్ట్రుడు వారినందరినీ దివ్యనేత్రంతో చూస్తూ ఎంతో ఆనందించాడు."

33. క్షత్రియకాంతలు తమతమ భర్తల లోకాలను చేరుట.

"క్రోధమాత్సర్యశూన్యులు, పాపరహితులు అయిన ఆ శ్రేష్ఠపురుషులందరూ బ్రహ్మర్షి అయిన వ్యాసుడు ఏర్పరచిన ఉత్తమ ప్రణాళిక ననుసరించి పరస్పరం కలుసుకొన్నారు. వారందరూ దేవలోకంలోని అమరులవలె హర్షపూర్ణమనస్కులయ్యారు. రాజా! కొడుకు తల్లిదండ్రులతో, భార్యలు భర్తలతో, సోదరులు సోదరులతో, మిత్రులు మిత్రులతో కలిశారు. పాండవులు మేటివిలుకాడైన కర్ణుని, అభిమన్యుని, ద్రౌపది కొడుకులను–

అందరినీ ఆనందంతో కలిశారు. రాజా! పాండవులు ఆనందంగా కర్ణునితో కలిసి ఆత్మీయతతో వ్యవహరించారు. వ్యాసముని అనుగ్రహంతో ఆ క్షత్రియయోధులందరు కోపాన్ని వీడి పరస్పరం కలిశారు. వైమనస్యాన్ని వీడి సౌమనస్యంతో నిలిచారు. ఈ రీతిగా అక్కడ చేరిన పురుష శ్రేష్ఠులైన కౌరవులు, ఇతర రాజులు గురువులతో, బంధువులతో, పుత్రులతో కలిశారు. ఆ రాత్రి అంతా అలా విహరించి, ప్రీతమనస్కులై రాజు లందరూ స్వర్గలోకవాసులవలె ఎంతో ఆనందించారు. భరతర్షభా! పరస్పరం కలిసిన ఆ యోధులలో శోకంగానీ, భయంకానీ, బెదురు కానీ, అనాసక్తి కానీ, అపకీర్తి కాని లేదు. అక్కడచేరి ఉన్న స్త్రీలు తండ్రులతో, సోదరులతో, భర్తలతో, సుతులతో కలిసి, పరమానందాన్ని పొంది దుఃఖాన్ని వీడారు. ఆ వీరులు, ఆ కాంతలు ఒక రాత్రి విహరించి, ఒకరి దగ్గర ఒకరు వీడ్కోలు తీసికొని, కౌగిలించుకొని వచ్చిన రీతిగానే వెళ్ళిపోయారు.

ఆ పై ఆ మునిపుంగవుడు ఆ లోకాలను విసర్జించాడు. క్షణకాలంలోనే చూస్తుండగానే ఆ మహాత్ములు పవిత్రగంగా నదిలో మునిగి రథాలతో, ధ్వజాలతోపాటు అదృశ్యులై తమ తమ నివాసాలకు వెళ్ళిపోయారు. కొందరు దేవలోకానికి వెళ్ళారు. కొందరు బ్రహ్మ సదనానికి వెళ్ళారు. కొందరు వరుణలోకానికి, కొందరు కుబేరలోకానికి వెళ్ళిపోయారు. కొందరు రాజులు సూర్యలోకానికి వెళ్ళారు. కొందరు రాక్షసలోకాలకు, కొందరు పిశాచలోకాలకు, కొందరు ఉత్తరకురుప్రాంతాలకూ వెళ్లారు. ఈ రీతిగా అందరు విచిత్రగతులను పొందారు. ఆ మహాత్ములు అక్కడ నుండి వాహనాలతో, అనుచరులతో సహా వచ్చారు. వారంతా వెళ్ళిపోగానే ధర్మశీలుడు, మహాతేజస్వీ, కురువంశ హితకారి అయిన వ్యాసమహాముని నీటిలోనే నిలిచి భర్తలను కోల్పోయి ఉన్న క్షత్రియ కాంతలతో ఇలా అన్నారు. "భర్తలు వెళ్లిన లోకాలకు వెళ్ళ దలచిన ఉత్తమకాంతలు వెంటనే జాగుసేయక గంగానదిలో మునగండి." ఆ పై ఆ మాట విని, దానిపై శ్రద్ధనుంచి, ఆ శ్రేష్ఠస్త్రీలు మామగారి అనుమతితో గంగానదిలో ప్రవేశించారు. రాజా! అప్పుడు ఆ సాధ్వులందరూ మానవశరీరాలను వీడి భర్తల దగ్గరకు చేరారు. ఈ రీతిగా క్రమంగా శీలవతులయిన ఆ క్షత్రియపతివ్రతలందరూ శరీరాలను వీడి తమ తమ భర్తలతో వెళ్ళిపోయారు. వారంతా భర్తలవలె దివ్యరూపంతో కూడిన వారు, దివ్యాభరణాలంకృతులు, దివ్యమాల్యాలను, వస్త్రాలనూ ధరించినవారు. సర్వసద్గుణాలతో కూడి శీలసంపన్నులయిన వారంతా కష్టాలను వదిలించుకొని, విమానాలనెక్కి తమస్థానాలను చేరారు.

ఆ సమయంలో ఎవరికే కోరిక కలిగితే దాన్ని తీర్చాడు ధర్మవత్సలుడు, వరదుడు అయిన వ్యాసుడు. యుద్ధంలో మరణించిన ఆ రాజులు తిరిగి వచ్చారని విని నానాదేశాలలోని ప్రజలు ఆశ్చర్యపోయారు. ఆనందించారు. ప్రియులతో వారి సమాగమాన్ని గూర్చి చక్కగా విన్న నరుడు నిత్యమూ ఇహలోకంలో ప్రియాలను పొందగలడు. అంతేగాక అనాయాసంగా ఇష్టబంధుసమాగమాన్ని పొందగలరు. దుఃఖానికి లోనుగాడు. ధర్మ విత్తముడైన పండితుడు. ఈ వృత్తాంతాన్ని విద్వాంసునకు వినిపిస్తే ఇహలోకంలో యశస్సును, పరలోకంలో శుభగతిని పొందవచ్చు. భారతా! స్వాధ్యాయ తత్పరులు, తపస్సంపన్నులు, సదాచారులు, దమనశీలులు, దానాలు చేసి పాపవిముక్తి నందినవారు, సరళ స్వభావులు, పవిత్రులు, శాంతులు, హింసాసత్యాలను విడిచినవారు, ఆస్తికులు, శ్రద్ధావంతులు, ధీరులు అయిన నరులు ఆశ్చర్యకరమైన ఈ పర్వం వింటే ఉత్తమగతిని పొందగలరు."

34. వైశంపాయన వచనము.

సౌతి చెప్తున్నాడు. "తన పితామహులందరి గమనాగమనవృత్తాంతరూపమైన దీనిని విని విద్వాంసుడైన జనమేజయరాజు ఆనందించాడు. 'ఆనందంతో కూడి శరీరాన్ని విడిచినవారు మరలా ఆ రూపాలతో ఎలా కనిపించా'రని వారి పునరాగమనాన్ని గూర్చి ప్రశ్నించాడు. ఆ జనమేజయుడలా అడగ్గానే ద్విజశ్రేష్ఠుడు, వాగ్మి ప్రతాపవంతుడయిన ఆ వ్యాసశిష్యుడు వైశంపాయనుడు జనమేజయ నరపాలునితో ఇలా అన్నాడు. వైశంపాయను డంటున్నాడు. "రాజా! సమస్తకర్మలు ఫలానుభవం లేక నశించవు. శరీరాలు కానీ, ఆకారాలు కానీ ఆ కర్మలవలన ఏర్పడినవే. **భూతాధిపతి అయిన భగవంతుని ఆశ్రయించి ఉన్నందు వలన మహాభూతాలు నిత్యాలు నశించేవికావు. శరీరం నశించినప్పుడు శరీరానికి దూరమవుతాయి కానీ నశించవు. కర్తృత్వాభిమానం లేకుండా చేసిన కర్మ సత్యం, శ్రేష్ఠం ఫల (ముక్తి)దాయకం. కర్తృత్వాభిమానంతో చేసిన కర్మలతో కూడి జీవుడు సుఖదుఃఖాల నమభవిస్తాడు.*** ఈ రీతిగా క్షేత్రజ్ఞుడు కర్మలతో

---

* మహాభూతాని నిత్యాని భూతాధిపతిసంశ్రయాత్ ।
తేషాం చ నిత్యసంవాసో న వినాశో వియుజ్యతామ్ ॥ 5
అనాయాసకృతం కర్మ సత్యం శ్రేష్ఠం ఫలాగమం ।
ఆత్మా చైభిః సమాయుక్తం సుఖదుఃఖముపాశ్నుతే ॥ 6

చిక్కినా నశించకుండానే ఉంటాడన్నది నిశ్చయం. కాని పంచభూతాలతో తాదాత్మ్యాన్ని పొందినందువలన జ్ఞాన సిద్ధి లేకపోతే వాటినుండి విడివడడు. కర్మక్షయం జరిగేవరకు లోకంలోనే జీవుడు మరొక రూపాన్ని పొందుతాడు. భూతాలు, ఇంద్రియాలవంటి అనేక పదార్థాలు శరీరాన్ని పొంది ఒక్కటౌతాయి. దేహం ఆత్మ వేరువేరని గ్రహించిన వారికి ఆ పదార్థాలన్నీ నిత్యాలు ఆత్మ స్వరూపాలు.

అశ్వమేధయాగంలో అశ్వవధ జరిపినపుడు "సూర్యం తే చక్షుః వాతం ప్రాణం" మొదలైన మంత్రం చదువుతారు. దీనిని బట్టి శరీరుల ప్రాణాలు ఇంద్రియాలు ఎప్పుడూ పరలోకంలోనే ఉంటాయని తెలుస్తుంది. రాజా! నీకు ఇష్టమైతే నీకు హితకరమైన మాట చెపుతాను. యజ్ఞారంభవేళలో వినిపించే దేవయానమార్గాలే నీకు తగినవి. నీవు యజ్ఞాన్ని ఆరంభించినప్పుడే దేవతలు నీకు హితాభిలాషులయ్యారు. దేవతలు ఇలా మైత్రిని ప్రదర్శించినపుడు వారు జీవులను లోకాంతరగమన సమయంలో అభీష్టలోకాలకు పంపగలరు. కాబట్టి నిత్యులయిన జీవులు యాగాల ద్వారా లోకాంతరగతిని పొందగలుగుతారు. పంచభూతాలు నిత్యాలు ఆత్మ నిత్యం. ఆ స్థితిలో ఆత్మకు దేహ సంబంధాన్ని, జనన మరణాలను భావించే వాని బుద్ధి వ్యర్థం. వియోగంలో తీవ్రంగా బాధపడేవాడు బాలుడని (మూఢుడని) నా అభిప్రాయం. వియోగంలో దోషాన్ని చూసేవాడు సంయోగాన్ని విడనాడాలి. అసంగుడైన ఆత్మకు సంయోగాలు లేవు. ఉందని భావించినవాడు వియోగజన్యమైన దుఃఖాన్ని అనుభవించవలసి వస్తుంది. స్వపరభేదాన్ని మాత్రమే గ్రహించగలవారు అభిమాన దశను దాటి పైకి వెళ్ళలేరు. ఆత్మ ఎవ్వరికీ పరాయివాడు కాదని తెలిసినవాడు ఉత్తమ బుద్ధిని పొంది మోహం నుండి బయటపడతాడు. ఆ పురుషుడు అవ్యక్తం నుండి వచ్చాడు. మరలా అవ్యక్తంలో లీనమయ్యాడు. నాకతడు తెలియదు. అతనికి నేను తెలియను. నేను బంధవిముక్తిని ఎందుకు పొందలేదంటావేమో ! నాలో వైరాగ్యమే లేదు. **పరాధీనుడైన జీవుడు ఏ శరీరంతో కర్మచేస్తే ఆ శరీరంతోనే ఫలిత మనుభవిస్తాడు. మానసకర్మకు మానసఫలం శరీరకర్మకు శరీరంతోనే ఫలానుభవం".***

---

* యేన యేన శరీరేణ కరోత్యయమనీశ్వరః ।
తేన తేన శరీరేణ తదవశ్యముపాశ్నుతే ।
మానసం మనసాప్నోతి శరీరం చ శరీరవాన్ ॥ 18

35. వ్యాసుని కృపతో జనమేజయుడు తండ్రిని చూచుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "కురూద్వహా! ధృతరాష్ట్రుడు అంతవరకు కుమారులను చూడలేదు. కాని వ్యాసముని అనుగ్రహంతో పుత్ర స్వరూప దర్శనాన్ని పొందగలిగాడు. నరశ్రేష్ఠుడైన ఆ ధృతరాష్ట్రుడు రాజధర్మాలను, బ్రహ్మోపనిషత్తును, బుద్ధి నిశ్చయాన్ని కూడా పొందగలిగాడు. మహాప్రాజ్ఞుడైన విదురుడు తనతపోబలంతో సిద్ధిని పొందాడు. కానీ ధృతరాష్ట్రుడు తపస్వి అయిన వ్యాసుని ఆశ్రయించి సిద్ధిపొందాడు. జనమేజయుడు అడిగాడు"వరదాయకుడైన వ్యాసముని నా తండ్రిని కూడా అదే రూపంతో, అదే వేషంతో, అదే వయస్సుతో చూపగలిగితే నీవు చెప్పిన దంతా నమ్ముతాను. నాకు ప్రియమైనది లభిస్తుంది. నేను కృతార్థుడను కాగలను. నిశ్చయజ్ఞానాన్ని పొందగలను. ఆ మునిముఖ్యుని అనుగ్రహంతో నా కోరిక కూడా సఫలం కావాలి."

జనమేజయ నరపాలుడు అలా అడుగగానే ప్రతాపవంతుడు, ధీమంతుడు అయిన వ్యాసుడు అనుగ్రహించి, పరీక్షిత్తును అక్కడకు రప్పించాడు. అప్పుడు అదే రూపంతో అదే వయస్సుతో స్వర్గం నుండి వచ్చిన తేజోవంతుడైన తన తండ్రిని పరీక్షిన్మహారాజును జనమేజయుడు చూశాడు. ఆయనతోపాటు మహాత్ముడైన శమీకమహర్షిని, ఆయన కుమారుడైన శృంగిని, ఆ నరపాలుని అమాత్యులను కూడా జనమేజయుడు చూశాడు. ఆ పై ఆనందించిన జనమేజయనరపాలుడు అవభృథస్నానసమయంలో ముందు తండ్రికి స్నానం చేయించి, ఆ పై తాను స్నానం చేశాడు. పరీక్షిత్తు అక్కడే అంతర్ధానమయ్యాడు

ఆ జనమేజయరాజు స్నానం చేసి, అప్పుడు యాయావరవంశంలో పుట్టిన, జరత్కారు సుతుడైన ఆస్తీకునితో ఇలా అన్నాడు. "ఆస్తీకా! ఈ యజ్ఞం వివిధాశ్చర్యకర సంఘటనలతో సాగిందని నా అభిప్రాయం. నా శోకాన్ని నశింపజేస్తూ ఈ నాడు నాతండ్రి కూడా వచ్చాడు." ఆస్తీకుడిలా అన్నాడు. "కురుకుల శ్రేష్ఠా! ప్రాచీన తపోనిధి అయిన వ్యాసమహర్షి సమక్షంలో యజ్ఞం సాగితే ఆ యజమాని ఇహపరలోకాలను గెలుచుకొన్నట్లే. పాండవ నందనా! నీ ద్వారా విచిత్రమైన ఆఖ్యానాన్ని విన్నాను. పాములన్నీ దగ్ధమయ్యాయి. నీ జనకుని స్థానానికే చేరాయి. పార్థివా! నీవు సత్యవంతుడవు కనుక అతి కష్టంమీద తక్షకుడు తప్పించుకొనగలిగాడు. ఋషులందరూ పూజలనందుకొన్నారు. మహాత్ముడైన వ్యాసుడు ఏ స్థాయిని పొందాడో కూడా చూశాం. **పాపవినాశకమైన ఈ కథను విని విపులధర్మాన్ని పొందగలిగాం. ఉదార హృదయులైన సజ్జన దర్శనం వలన**

హృదయగ్రంథి విడిపోయింది.* ధర్మ పక్షపాతులు, సత్ప్రవర్తనాభిలాషులు, తమ దర్శన మాత్రంచేత పాపం పోగొట్టగలవారు. అటువంటి మహాత్ములకు (వ్యాసులకు) నీవు నమస్కరించాలి."** సౌతి ఇలా అన్నాడు "ద్విజముఖ్యుడైన ఆస్తీకుడు అలా అనగానే జనమేజయనరపాలుడు ఆ వ్యాసమహర్షిని అనేక పర్యాయాలు పూజించి సత్కరించాడు. సజ్జన శ్రేష్ఠా! ఆ పై ఆ ధర్మజ్ఞుడు అచ్యుతుడైన వైశంపాయనుని ఆశ్రమవాసకథాశేషాన్ని గూర్చి ప్రశ్నించాడు".

36. యుధిష్ఠిరుడు తిరిగి వచ్చుట.

జనమేజయు డడిగాడు. "పుత్రులను పౌత్రులను, బంధువులను చూసిన తరువాత ధృతరాష్ట్రరాజు, యుధిష్ఠిర నరపాలుడు ఏం చేశారు ? "వైశంపాయనుడు చెప్తున్నాడు. "రాజా! మహాశ్చర్యకరమయిన ఆ పుత్రదర్శనాన్ని పొంది, రాజర్షి అయిన ధృతరాష్ట్రుడు శోకాన్ని విడిచి, మరల ఆశ్రమానికి వెళ్ళాడు. ఇతరజనులు అందరూ, ఆ మహర్షులు ధృతరాష్ట్రుని అనుజ్ఞతో వారివారి కిష్టమైన చోటికి మరలి పోయారు. మహాత్ములు అయిన పాండవులు బాగా తక్కువ సేనతో భార్యలతో కలిసి మహాత్ముడైన ఆ ధృతరాష్ట్రుని దగ్గరకు మరలా వెళ్ళారు. అప్పుడు సత్యవతీసుతుడు, ధీమంతుడు లోకపూజితుడు, బ్రహ్మర్షి అయిన వ్యాసుని కూడా ఆశ్రమపదానికి వెళ్ళి ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. మహాబాహూ! కౌరవనందనా! ధృతరాష్ట్రా! శ్రద్ధాళువులై, వంశవర్ధనులై, వేదవేదాంగవేత్తలై జ్ఞానవృద్ధులై, పుణ్యకర్మాసక్తులై, ధర్మజ్ఞులైన ప్రాచీన ఋషులు చెప్పిన వివిధ కథలను విన్నావు. మనస్సునుండి శోకాన్ని తొలగించుకో ! వివేకి ప్రారబ్ధవిధికి దుఃఖించడు. దేవదర్శనంగల నారదుని ద్వారా నీవు దేవరహస్యాన్ని విన్నావు. ఆ వీరులందరూ క్షత్రధర్మాన్ని పాటిస్తూ, శస్త్రాఘాతాలతో పవిత్రులై శుభగతిని పొందారు. నీ కుమారులందరూ స్వర్గస్థులై యథేచ్ఛగా విహరించటం నీవు చూశావు. ధీమంతుడైన యుధిష్ఠిరుడు సోదరులందరితో, భార్యలతో, సుహృజ్జనంతో సహా నీ సేవకై స్వయంగా సిద్ధపడి ఉన్నాడు. ఇతనిని విడిచిపెట్టు. నగరానికి వెళ్ళనీ! తన రాజ్యాన్ని పరిపాలించనీ! అరణ్యవాసానికి వారు వచ్చి నెలరోజులు

---

* ప్రాప్తః సువిపులో ధర్మః శ్రుత్వా పాపవినాశనమ్ ।
విముక్తో హృదయగ్రంథిః ఉదారజనదర్శనాత్ ॥ 15

** యే చ పక్షధరా ధర్మే సద్వృత్తరుచయశ్చ యే ।
యావ్ దృష్ట్వా హీయతే పాపం తేభ్యః కార్యా నమస్క్రియా ॥ 16

దాటి పోయాయి. నరాధిపా! కురూద్వహా! రాజ్యమంటే ఎందరో శత్రువులుంటారు. కాబట్టి నిత్యమూ, ప్రయత్నపూర్వకంగా ఆ స్థానాన్ని కాపాడుకోవాలి".

అనుపమ తేజస్వి అయిన వ్యాసుడు అలా అనగానే మాటకారి అయిన ధృతరాష్ట్ర మహారాజు యుధిష్ఠిరుని పిలిపించి, ఇలా అన్నాడు. "అజాతశత్రూ! నీకూ నీ సోదరులకు శుభం జరగాలి. నా మాట విను. రాజా! నీ అనుగ్రహం వలన మమ్ములను శోకం బాధించటం లేదు. కుమారా! వివేకి నీవంటి రక్షకుని పొంది, నీతో కలిసి ఉంటూ, గతంలో హస్తినాపురంలో వలె నేను ఆనందంగా ఉన్నాను. ప్రియజనసేవలో లగ్నమవుతున్న నీ ద్వారా నేను పుత్ర ఫలాన్ని పొందాను. నీ మీద నాకెంతో ప్రీతి. మహాబాహూ! నాకేమీ కోపంలేదు. కుమారా! నగరానికి వెళ్ళు. జాగు చేయవద్దు. నిన్ను ఇక్కడ చూస్తుంటే నా తపస్సు క్షీణిస్తోంది. నేను శరీరాన్ని తపస్సులో లగ్నం చేశాను. నిన్ను చూసి మరల శరీర రక్షణ చేయా లనిపించింది. అలాగే ఈ నీ తల్లులు కూడా పండుటాకులను ఆహారంగా స్వీకరిస్తూ బ్రతుకుతున్నారు. నాతో సమానంగా వ్రతధారణ చేస్తున్నారు. ఎక్కువ కాలం జీవించరు. వ్యాసుని తపోబలం వలన, నీ సమాగమం వలన లోకాంతరాలకు వెళ్ళిన దుర్యోధనాదులను చూశాను. అనఘా! నా జీవిత ప్రయోజనాన్ని సాధించాను. తీవ్ర తపస్సు చేయబోతున్నాను. నీవు అనుమతించాలి. మహాబాహూ! ఇప్పటి నుండి పితృపిండ ప్రదానం, వంశకీర్తి, ఈ వంశమూ నీ మీద ఆధారపడ్డాయి. నేడో, రేపో నగరానికి వెళ్ళు. కుమారా! జాగు చేయవద్దు. భరతర్షభా! నీవు ఎన్నో మార్లు రాజనీతిని విన్నావు. రాజా! నేను నీకు ఉపదేశించవలసిన దేదీ కనిపించటం లేదు. నీవు నాకెంతో చేశావు".

ధృతరాష్ట్ర డలా పలుకగానే ధర్మరాజు ఆ రాజుతో ఇలా అన్నాడు. "ధర్మజ్ఞా! నిరపరాధినైన నాతో నీవిలా అనరాదు. నా సోదరులు, అనుచరులు అందరినీ స్వేచ్ఛగా వెళ్ళనీ! నేను మాత్రం నియమబద్ధుడనై నిన్ను, తల్లులను అనుసరిస్తాను." గాంధారి ధర్మరాజుతో ఇలా అన్నది "కుమారా! అట్లనవద్దు. మాట విను. కురుకులమంతా ఇప్పుడు నీ అధీనంలో ఉన్నది. నా మామగార్ల పిండాలు కూడా నిన్ను ఆశ్రయించియే ఉన్నాయి. కుమారా! మహారాజు ఆదేశించినట్లుగా నీవు చేయాలి. తండ్రిమాట వినాలి."

గాంధారి అలా ఆదేశించగా ధర్మరాజు వాత్సల్యంతో కంటతడిపెట్టి కళ్ళు తుడుచుకొని ఏడుస్తున్న కుంతితో ఇలా అన్నాడు. "ధృతరాష్ట్ర నరపాలుడు, యశస్వి అయిన గాంధారి నన్ను వదలిపెడుతున్నారు. నా మనస్సు నీతో ముడిపడి ఉంది. ఎలా

వెళ్ళగలను. ధర్మచారిణి! కానీ నీ తపస్సుకు విఘ్నం కలిగించాలని ఉత్సాహపడటం లేదు. తపస్సును మించినదిలేదు. తపస్సుతో పరమాత్మను పొందవచ్చు.* రాణీ! నాకు కూడా అంతకు ముందువలె రాజ్యపాలనపై మనస్సు లేదు. సర్వవిధాలా నా మనస్సు తపస్సుమీదనే అనురక్తమై ఉంది. కళ్యాణీ! ఈ భూమి అంతా నాకు శూన్యంగా ఉంది. ఆనందాన్ని కలిగించటం లేదు. మన బంధువులంతా నశించారు. ఇంతకుముందువలె మనకిప్పుడు సేనాబలం కూడా లేదు. కళ్యాణీ! పాంచాలురు పూర్తిగా నశించారు. కథా మాత్రంగా మిగిలారు. వారి వంశాన్ని నిలిపేవాడు ఎవ్వడూ నాకు కనిపించటం లేదు. రణరంగంలో ద్రోణుడు అందరినీ భస్మం చేశాడు. మిగిలిన వారిని అశ్వత్థామ రాత్రిపూట చంపివేశాడు. అంతకు ముందు మన కళ్ళముందున్న చేది దేశస్థులు, మత్స్యదేశస్థులు ఇప్పుడు లేరు. వాసుదేవుని అనుగ్రహం వలన వృష్ణి వంశస్థులు మాత్రం మిగిలారు. ఆ వాసుదేవుని చూసి, నేను కేవలం ధర్మం కోసం బ్రతుకగోరుతున్నాను. అర్థం కోసం కాదు. మమ్ములనందరిని శుభంగా చూడు. నీ దర్శనం దుర్లభమవుతుంది. ధృతరాష్ట్రుడు సహింపరాని తీవ్రతపస్సును ప్రారంభింపబోతున్నాడు."

ఆ మాటలు విని యోధులకధిపతి, మహాబాహువు అయిన సహదేవుడు కన్నీటితో కళ్లు కలతపడగా యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "భరతర్షభా! నేను అమ్మను వదలి రాలేను. నీవు వెంటనే వెళ్ళిపో! రాజా! నేను తపస్సు నాచరిస్తాను. ఈ శరీరాన్ని తపస్సుతో ఇక్కడే శుష్కింపజేస్తాను. ధృతరాష్ట్ర మహారాజుకు, ఈ తల్లులకూ పాదసేవ చేయటంలో అనురక్తుడనై ఉంటాను." అప్పుడు మహాభుజుడైన సహదేవుని కౌగిలించి, కుంతి ఇలా అన్నది "కుమారా! వెళ్ళు. నీ విలా అనవద్దు. నా మాట వినుమీకు బాట శుభకరమవుతుంది. కుమారులారా! క్షేమంగా ఉండండి. మీ ఉనికి నా తపస్సుకు ఆటంకమవుతుంది. మీ స్నేహపాశాలతో చిక్కి మహా తపస్సునుండి జారిపోగలను. కుమారా! కాబట్టి వెళ్ళు. రాజా! మేము పెద్ద కాలం బ్రతుకబోము." రాజేంద్రా! ఈ రీతిగా వివిధ వాక్యాలు పలికి కుంతీదేవి సహదేవుని మనస్సును, విశేషించి యుధిష్ఠిర నరపాలుని మనస్సును కట్టి పడవేసింది. కురుశ్రేష్ఠులైన వారందరూ తల్లి అనుమతిని, ధృతరాష్ట్రుని అనుమతిని తీసికొని ఆయనకు నమస్కరించి వీడ్కోలు తీసికొంటున్నారు.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. "రాజా! తమ ఆశీర్వాదంతో ఆనందించి, మేమంతా

---

* న చోత్స హే తపోవిఘ్నం కర్తుం తే ధర్మచారిణి ।
తపసో హి పరం వాస్తి తపసా విందతే మహత్ ॥ 29

క్షేమంగా రాజ్యానికి వెళతాం. తమ అనుమతితో నిష్కల్మషులమై బయలుదేరతాం." మహాత్ముడైన ధర్మరాజు అలా అనగానే రాజర్షి అయిన ఆ ధృతరాష్ట్రుడు కురువంశీయుడైన యుధిష్ఠిరుని అభినందించి వెళ్ళడానికి అనుమతించాడు. బలవంతులలో శ్రేష్ఠుడైన భీమసేనుని ధృతరాష్ట్రుడు అనునయించాడు. మేధావి, పరాక్రమశాలి అయిన భీముడు ఆయన మాటలను చక్కగా స్వీకరించాడు. ఆ ధృతరాష్ట్రుడు అర్జునుని, పురుష శ్రేష్ఠులైన నకుల సహదేవులను కౌగిలించుకొని, అభినందించి వెళ్ళడానికి అనుమతించాడు. వారు గాంధారి అనుమతికూడా తీసుకొని ఆమె పాదాలకు నమస్కరించారు. తల్లి కుంతి వారిని దగ్గరకు తీసికొని శిరస్సుల నాఘ్రాణించింది. ఆవు పాలను కుడవ నివ్వనప్పటి దూడలవలె వారు మాటిమాటికీ ఆ ధృతరాష్ట్రుని వైపూ, తల్లుల వైపూ చూస్తూ ప్రదక్షిణం చేశారు. ద్రౌపది మొదలయిన కౌరవ కాంతలందరూ యథాన్యాయంగా మామగారికి నమస్కరించారు. గాంధారి, కుంతి వారిని కౌగిలించుకొని, అభినందించి, గమనానికి అనుమతించి, వారికి కర్తవ్యాన్ని ఉపదేశించారు. ఆపై వారు భర్తలతో కలిసి బయలుదేరారు. అప్పుడు "గుర్రాలు కట్టండి" అంటూ సూతులు పెద్దగా చప్పుడు చేయసాగారు. ఒంటెలు అరుస్తున్నాయి. గుర్రాలు సకిలిస్తున్నాయి. ఆపై యుధిష్ఠిర నరపాలుడు భార్యలతో, సైనికులతో, బంధువులతో సహా మరలా హస్తినపురానికి వచ్చి చేరాడు"

37. నారదాగమనపర్వము.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "రాజా! పాండవులు రెండు సంవత్సరాలు గడిపిన తరువాత దేవర్షి అయిన నారదుడు దైవికంగా యుధిష్ఠిరుని దగ్గరకు వచ్చాడు. మహాబాహువు, కురురాజు అయిన యుధిష్ఠిరుడు ఆయనను పూజించి ఆసనంపై అలంకరింపజేశాడు. నారదుడు కొంత విశ్రమించిన తరువాత వాగ్మి శ్రేష్ఠుడైన ధర్మరాజు ఇలా అడిగాడు. "పూజ్యులయిన తమరు చాలాకాలం తర్వాత కనిపించారు. బ్రాహ్మణా! కుశలమేగదా! శుభం సమకూరుతూనే ఉన్నదిగదా! "ఏ ఏ దేశాలు చూశారు ? తమకై నేనే పనిచేయాలి. బ్రాహ్మణ శ్రేష్ఠా! చెప్పండి 'తమరే మాకు పరమగతి". నారదుడు చెప్తున్నాడు. "నిన్ను చూసి చాలా కాలమయిందని తపోవనం నుండి వచ్చాను. రాజా! గంగను ఇతరతీర్థాలను చూశాను." యుధిష్ఠిరు డడిగాడు. "గంగాతీరంలో నివసిస్తున్న జనులు మహాత్ముడైన ధృతరాష్ట్రుడు తీవ్రతపస్సు చేస్తున్నాడని చెప్తున్నారు. కురూద్వహుడయిన ఆయన అక్కడ క్షేమంగా ఉండటం చూశారా ? గాంధారి, కుంతి, సూతసుతుడైన సంజయుని చూశావా ?

ఆ రాజు నా పెదతండ్రి ఇప్పుడెలా ఉన్నాడు. స్వామీ ఆ రాజును నీవు చూసి ఉంటే ఆ విషయాన్ని వినగోరుతున్నాను."

నారదుడు చెప్తున్నాడు. "మహారాజా! తపోవనంలో జరిగిన దానిని నేను విన్నట్లుగా, చూసినట్లుగా నీకు చెపుతాను. కుదురుగా ఉండి విను. కురునందనా! రాజా ! మీరు వనవాసం నుండి వెనుదిరిగి రాగా, నీ పెదతండ్రి కురుక్షేత్రం నుండి గంగా ద్వారానికి వెళ్ళాడు. ఆ ధీమంతుడు గాంధారితో, కోడలైన కుంతితో సూతుడైన సంజయునితో కూడి అగ్నిహోత్రాలతో, యాజకులతో సహా బయలుదేరాడు. తపోధనుడైన ఆ నీ తండ్రి తీవ్ర తపస్సు చేశాడు. నోటిలో చిన్న రాతి ముక్క నుంచుకొని గాలి భుజిస్తూ మౌనంగా ఉన్నాడు. మహాతపస్వి అయిన ఆ ధృతరాష్ట్రరాజు అరణ్యంలో సర్వమునుల పూజల నందుకొంటూ ఆరు మాసాలు గడిపాడు. శరీరంలో చర్మం, ఎముకలు మాత్రం మిగిలాయి. భారతా! గాంధారి నీటినే ఆహారంగా స్వీకరించింది. కుంతి నెలకొకసారి భుజించేది. సంజయుడు మూడు రోజుల కొకసారి భుజించేవాడు. రాజా! ఆరాజు ఆవనంలో కనిపించినా కనిపించక పోయినా యాజకులు మాత్రం అక్కడ యథావిధిగా అగ్నిహోత్రం చేసేవారు. ఆ రాజు ఎక్కడా నిలవకుండా వనంలో తిరుగసాగాడు. ఆ రాణులు గాంధారికుంతులు, సంజయుడు కూడా ఆయన ననుసరించేవారు. సమవిషమస్థానాలలో సంజయుడు ధృతరాష్ట్రుని నడిపించే వాడు. అనిందిత అయిన కుంతి గాంధారికి కూడ నేత్ర మయింది.

ధీమంతుడైన ఆ నృపశ్రేష్ఠ డొకసారి గంగ ఒడ్డున ఉన్న పల్లపు ప్రదేశంలో గంగా స్నానం చేసి ఆశ్రమంవైపు బయలుదేరాడు. అప్పుడు గాలి చెలరేగి మహాదావాగ్ని పుట్టింది. అంతటా చుట్టుముట్టి ఆ వనాన్ని మొత్తంగా దహించసాగింది. జంతు సమూహాలు, పాములు తగులబడసాగాయి. పందుల గుంపులు జలాశయాలను ఆశ్రయించసాగాయి. రాజా! ఆ వనమంతా అలా తగులబడగా, పెద్ద సంకటం కలుగగా, ఆహారం లేనందువలన ప్రాణులు, చేష్టలు మందగించి ఆ రాజు, కృశించిన నీ తల్లులు పారిపోలేకపోయారు. అప్పుడు మంట దగ్గరవుతుండటం గమనించి జయశీలులలో శ్రేష్ఠుడైన ఆరాజు సూతుడైన సంజయునితో ఇలా అన్నాడు. "సంజయా! అగ్నిముట్టని చోటు ఎక్కడో అక్కడ చూసుకొని వెళ్ళు, ఇక్కడ మేము అగ్నిలో కలిసి ఉత్తమగతిని పొందుతాము." అప్పుడు వాగ్మి శ్రేష్ఠుడైన సంజయుడు కలతపడి "రాజా! ఈ అగ్నితో నీవు వృథాగా అనిష్టమైన మృత్యువు బారిన పడుతున్నావు. ఈ అగ్నినుండి తప్పించే ఉపాయం కనిపించటం లేదు. ఇప్పుడు

కర్తవ్యమేమిటో నీవే చెప్పాలి."

సంజయుడలా అనగానే ఆ రాజు తిరిగి ఇలా చెప్పాడు. "ఈ మృత్యువు మాకు అనిష్టమేమీ కాదు. గృహస్థాశ్రమాన్ని వీడి వచ్చిన వారికి, తపసులకు అగ్ని ద్వారా కాని, గాలి ద్వారాకానీ, నీటి ద్వారా కానీ, ఉపవాసం ద్వారా కాని ప్రాణత్యాగం ప్రశస్తమే. సంజయా! వెళ్ళు ఆలస్యం చేయవద్దు'. అలా పలికి ధృతరాష్ట్రుడు సంజయుని మనస్సును సమాధాన పరచి అప్పుడు తూర్పు ముఖంగా గాంధారి, కుంతులతో కలిసి కూర్చున్నాడు. సంజయుడు ఆస్థితిలోని ధృతరాష్ట్రుని చూసి ప్రదక్షిణం చేశాడు. "ప్రభూ! నిన్ను యోగంలో నిలుపుకో" అని ఆ మేధావి ధృతరాష్ట్రునకు సూచించాడు. వ్యాసముని కుమారుడు, ధీమంతుడు అయిన ధృతరాష్ట్ర మహారాజు ఆ సంజయుని మాట ననుసరించి, ఇంద్రియ సమూహాన్ని నిరోధించి, అప్పుడు కట్టెవలె నిలిచాడు. మహాభాగ అయిన గాంధారి, నీ తల్లి పృథ, నీ పెద తండ్రి ధృతరాష్ట్రుడు దావాగ్నిలో కాలి బూడిదయ్యారు. మహాత్ముడైన సంజయుడు మాత్రం ఆ దావాగ్ని నుండి తప్పించుకొన్నాడు.

గంగ ఒడ్డున తాపసులు చుట్టుముట్టి ఉన్న సంజయుని చూశాను. ఆ తేజస్వి వారిని విడిచి, ఇదంతా నాకు చెప్పాడు. ధీమంతుడైన ఆ సంజయుడు హిమగిరికి వెళ్ళిపోయాడు. రాజా! ఈ రీతిగా మహా మనస్వి అయిన కురురాజు నీతల్లులు కుంతి, గాంధారి ఈ విధంగా మరణించారు. భారతా! వనంలో తిరుగుతున్నప్పుడు నేను అనుకోకుండా ఆ ధృతరాష్ట్ర, గాంధారీ కుంతుల కళేవరాల (అవశేషాల)ను నేను చూశాను. ఆ తరువాత ఆ రాజమరణ వృత్తాంతాన్ని విని తపోధనులంతా ఆ తపోవనానికి వచ్చారు. వారు ధృతరాష్ట్రుడు ఉత్తమగతిని పొందే విషయంలో సంశయంచలేదు. పురుషసత్తమా! పాండవా! ధృతరాష్ట్ర మహారాజు ఆ మహారాణులు దగ్ధులయిన విషయమంతా నేను అక్కడనే విన్నాను. రాజేంద్రా! ఆ ధృతరాష్ట్ర మహారాజు, గాంధారి, నీతల్లి అందరూ కూడా స్వయంగానే అగ్ని సంయోగాన్ని పొందారు. కాబట్టి వారికై మీకు శోకింపనవసరం లేదు."

ఈ రీతిగా ధృతరాష్ట్రనిర్యాణం విషయాన్ని విని, మహాత్ములైన పాండవు లందరిలో మహాశోకం చెలరేగింది. మహారాజా! ధృతరాష్ట్ర మహారాజు యొక్క గతిని తెలిసికొని అంతఃపురకాంతలలో పౌరులలో తీవ్రమైన ఆర్తనాదం వీర్పడింది. "అయ్యో ఎంత పని జరిగింది" అనుకొంటూ యుధిష్ఠిరుడు తీవ్ర దుఃఖానికి లోనై తల్లిని తలచుకొంటూ చేతులెత్తి రోదించ సాగాడు. భీమసేనుడు మొదలయిన సోదరులందరూ కూడా

రోదించసాగారు. మహారాజా! కుంతి అలా చనిపోయిందని తెలిసి అంతఃపురంలోనుండి కూడా మహారోదనధ్వని వెలువడింది. కుమారులను కోల్పోయి వృద్ధుడై ఆ రీతిగా మరణించిన ధృతరాష్ట్రమహారాజును గురించి, తపస్విని అయిన గాంధారిని గురించి అందరూ దుఃఖించారు. కొద్దిసేపట్లో ఆ శోకధ్వని చల్లారింది. ధర్మరాజు కన్నీటిని తుడుచుకొని ధైర్యంతో ఇలా అన్నాడు."

38. యుధిష్ఠిర విలాపము.

"బంధువులమైన మేమందరమూ ఉండగానే తీవ్రతపస్సులో నున్న ఆ మహాత్ముడు అలా దిక్కులేని వానివలె మరణించటం ఎంత బాధాకరం ! బ్రాహ్మణా! పురుషులు ఎప్పుడు ఏ గతి పొందుతారో గ్రహించలేమని నా అభిప్రాయం. కాకపోతే ఈ ధృతరాష్ట్రుడు కూడా దావాగ్నిలో దగ్ధమవుతాడా ? బాహుబలశాలి అయిన ఆయనకు వందమంది చక్కని కొడుకులున్నారు. ఆయన స్వయంగా పదివేల ఏనుగుల బలంగల రాజు. ఆయనకూడా దావాగ్నిలో దగ్ధమయ్యాడు. గతంలో శ్రేష్ఠకాంతలు తాళవృంతాలతో ఆయనకు వీచేవారు. కానీ దావాగ్నిలో దగ్ధమవుతున్న సమయంలో గ్రద్దలు తమ రెక్కలతో ఆయనకు విసిరాయి. ఆయన మేల్కొనే సమయంలో సూతమాగధసమూహాలు ఆయనను మేల్కొలిపేవారు. ఆరాజు పాపాత్ముడనైన నా కర్మల కారణంగా నేలపై శయనించవలసి వచ్చింది. పుత్రులను కోలుపోయిన యశస్విని అయిన గాంధారిని గురించి నేను దుఃఖించటం లేదు. ఎందుకంటే ఆమె భర్త సేవావ్రతంలో నిలిచి పతి ననుసరించి ఉత్తమలోకాన్ని పొందింది. కానీ కుంతిని గురించి దుఃఖిస్తున్నాను. ఆమె సముజ్జ్వలమైన సమృద్ధమైన పుత్రైశ్వర్యాన్ని వీడి వనవాసాన్ని ఇష్టపడింది. ఛీ! మా రాజ్యమెందుకు ? బలమెందుకు ? పరాక్రమమెందుకు ? క్షత్రధర్మం కూడా ఛీ ఛీ! ఆ క్షాత్ర ధర్మంవలననే జీవన్మృతుల మయ్యాం.

ద్విజవరోత్తమా ? కాలగతి ఎంతో సూక్ష్మమైనది. లేకపోతే ఆమె రాజ్యాన్ని వీడి వనవాసాన్ని కోరుతుందా ? యుధిష్ఠిరునకు, భీమునకు, అర్జునునకు తల్లి అయిన ఆమె అనాథవలె ఎలా దగ్ధమయిందో అన్న చింతతోనే మోహపడుతున్నాను. ఖాండవవనంలో అర్జునుడు అగ్నిని వ్యర్థంగా తృప్తిపరిచాడు. ఆ ఉపకారాన్ని గుర్తుంచుకోకుండా ఆ కృతఘ్నుడు ప్రవర్తించాడని నా అభిప్రాయం. ఒకప్పుడు బ్రాహ్మణ వేషంతో వచ్చి అర్జునుని నుండి భిక్షకోరాడు. ఆ అగ్నియే ఆ అర్జునుని తల్లిని దహించాడు. ఛీ! ఏమగ్ని ? లోక

ప్రసిద్ధికెక్కిన అర్జునుని సత్యసంధత ఏమిటి ? స్వామీ! ధృతరాష్ట్ర మహారాజు వ్యర్థంగా అగ్నితో సంయోగాన్ని పొందటమే అత్యంతమూ క్లేశకరమైన మరోఅంశంగా నాకనిపిస్తోంది. ఈ భూమినంతా పరిపాలించి, అంతిమంగా తపస్సు నాశ్రయించిన ఆ కౌరవ రాజర్షి ఇటువంటి మృత్యువును పొందాడు. మంత్రపవిత్రాలైన ఆ ధృతరాష్ట్రుని అగ్నులు ఆ మహావనంలోనే ఉన్న నా తండ్రి వ్యర్థమైన (లౌకికమైన) అగ్నిలో దగ్ధమయ్యారు. బాగా కృశించి నాడులు పైకి కనిపిస్తున్న కుంతి అగ్ని చుట్టుముట్టినందువలన మహాభయాన్ని పొంది వణుకుతూ "హా! నాయనా! ధర్మరాజా!" అని ఆక్రోశించి ఉంటుంది. భీమా! ఈ భయంనుండి నన్ను కాపాడు అంటూ ఆక్రోశిస్తూ ఉంటే ఆ అమ్మను దావాగ్ని చుట్టుముట్టి ఉంటుంది. ఆమెకు కొడుకు లందరిలోను సహదేవుడు ప్రియపుత్రుడు కానీ వీరుడైన ఆ మాద్రి కొడుకు కూడా ఆమెను తప్పించలేక పోయాడు. ఈ మాటలను విని, పాండవులు అయిదుగురు పరస్పరం కౌగిలించుకొని దుఃఖార్తులై ప్రళయకాలంలోని పంచభూతాల వలె అందరూ విలపించారు. ఆ పురుషోత్తములు అలా రోదిస్తూంటే ఆ రోదనధ్వని భవనాల పై కప్పులకు తగిలి భూమ్యాకాశాలలో ప్రతిధ్వనించసాగింది."

39. శ్రాద్ధదానము.

నారదుడిలా అన్నాడు. "సువ్రతా! నేను అక్కడ విన్నదాన్ని బట్టి ఆ ధృతరాష్ట్రరాజు లౌకికాగ్నిలో తగులబడలేదు. దానిని చెపుతాను. విను. నేను విన్న దేమిటంటే గాలిని ఆహారంగా స్వీకరిస్తూ ఈ ధీమంతుడు అరణ్యంలో ప్రవేశించేముందు యాజకులద్వారా ఇష్టిని జరిపించియే అగ్నులను పరిత్యజించాడు. భరతసత్తమా! ఆయన యాజకులు ఆ అగ్నులను నిర్జనవనంలో వదలిపెట్టి స్వేచ్ఛానుసారం వెళ్లిపోయారు. ఆ అగ్నియే పెరిగి వనమంతా వ్యాపించింది. దానితో ఆ వనమంతా మండిందని తాపసులు చెప్పారు. భరతర్షభా! ఆ ధృతరాష్ట్ర రాజు నేనింతకు ముందు చెప్పినట్టు గంగాతీరంలో స్వయంగా ఆ అగ్నితో సంయోగం చెందాడు. అనఘా! యుధిష్ఠిరా ! భాగీరథీ తీరంలో నేను చూసిన మునులు అలాగే చెప్పారు. రాజా! ఈ రీతిగా ఆరాజు తన అగ్నిలోనే కలిశాడు. ఈరాజును గురించి నీవు శోకించవద్దు. ఆయన ఉత్తమగతిని పొందాడు. జనాధిపా! నీ తల్లికూడా గురు శుశ్రూషతో మహాసిద్ధిని పొంది ఉంటుంది. ఈ విషయంలో నాకు సంశయం లేదు.

రాజేంద్రా ! నీవు నీ సోదరులందరితో కలిసి వారికి జలాంజలిని సమర్పించాలి.

దానికి ఏర్పాటు చేయించు." ఆ తరువాత నరోత్తముడు, పాండవ ధురంధరుడు అయిన ఆ ధర్మరాజు సోదరులతో, భార్యలతో సహా బయలుదేరాడు. పౌరులు, జానపదులు కూడా రాజభక్తిని పురస్కరించు కొని, ఏక వస్త్ర ధారులై గంగ దగ్గరకు బయలుదేరారు. ఆ పై ఆ నరపుంగవు లందరూ నీట మునిగి, యుయుత్సుని ముందు నిలుపుకొని మహాత్ముడైన ధృతరాష్ట్రునకు జలాంజలి నిచ్చారు. గాంధారికి కుంతికి కూడా నామగోత్రాలు చెప్పి యథావిధిగా శౌచాన్ని నిర్వర్తిస్తూ, వారు నగరం వెలుపలనే నిలిచారు. నరశ్రేష్ఠుడైన ఆ ధృతరాష్ట్రుడు శాస్త్రవిధి నెరిగిన ఆప్తులను దగ్గమైన గంగాద్వారానికి పంపించి అక్కడే వారికి శ్రాద్ధకర్మలు నిర్వర్తించాలని ఆదేశించాడు. అప్పుడే దానం చేయటానికి తగిన వివిధ వస్తువులను కూడా పంపించాడు. పాండుకుమారుడైన ఆ యుధిష్ఠిర నరపాలుడు శౌచం కోసం దశాహాదులను నిర్వర్తించి పన్నెండవ రోజు యథావిధిగా తగినంత దక్షిణలతో శ్రాద్ధం పెట్టాడు. ఆ రాజు ధృతరాష్ట్రుని ఉద్దేశించి బంగారం, వెండి, గోవులు, విలువైన పతకాలు దానం చేశాడు. ఆ తేజస్వి గాంధారీకుంతుల పేర్లను విడివిడిగా సంకీర్తించి ఉత్తమదానాలను ఇచ్చాడు. ఏ నరుడు ఏది, ఎంత కోరితే అది, అంత పరిమాణంతో పొందగలిగాడు. ఆ రోజు ఆ ధర్మరాజు తల్లుల నుద్దేశించి పడక, భోజనం, వాహనం, మణులు, రత్నాలు, ధనం, శకటాలు, వస్త్రాలు, వివిధ భోగాలు, చక్కగా అలంకరించిన దాసీజనాన్ని ఇచ్చాడు. ఆపై రాజు ఆ రీతిగా అనేక శ్రాద్ధాలను నిర్వర్తించి, హస్తిన అనుపేరుగల నగరంలో ప్రవేశించాడు.

రాజాదేశాన్ని అనుసరించి గంగాద్వారానికి వెళ్ళిన పురుషులు ఆ ముగ్గురి ఎముకలను సంచయనం చేసి మరల గంగా తీరానికి వచ్చారు. ఆ ఎముకలను పూలమాలతో, గంధాలతో యథావిధిగా అర్చించి, గంగలో కలిపి, ఆ విషయాన్ని రాజుకు చెప్పారు. రాజా! ధర్మాత్ముడైన యుధిష్ఠిరనరపాలుని ఊరడించి, పరమముని అయిన నారదుడు యథేచ్ఛగా వెళ్లిపోయాడు. రణరంగంలో పుత్రులు చనిపోగా వారికై, దాయాదులకై, వియ్యాలవారికై, మిత్రులకై, సోదరులకై, బంధువులకై నిత్యమూ దానాలు చేస్తూ ధీమంతుడైన ధృతరాష్ట్రుడు నగరంలో పదిహేను సంవత్సరాలు, వనవాసంలో మూడు సంవత్సరాలు గడిపాడు. యుధిష్ఠిరుడు దాయాదులను, బంధువులను నష్టపోయాడు. దానితో ఆ రాజు అప్పుడు పెద్దగా ప్రీతి లేకుండానే రాజ్యపాలన చేయసాగాడు."

ఇది ఆశ్రమవాసిక పర్వం

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
మౌసల పర్వం

1. ముసలోత్పత్తి.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరుల మనస్సులే నివాస స్థానమైన నారాయణునికీ, నరోత్తమునికీ, సరస్వతీ దేవికీ, వ్యాసమహర్షికీ నమస్కరించి శ్రీమహాభారతమును చదువవలెను/ చెప్పవలెను.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "యుద్ధానంతరం ముప్పదియారు సంవత్సరాలు గడిచిన తరువాత యుధిష్ఠిరునకు విపరీత శకునాలు కన్పించసాగాయి. ఉరుములు మెరుపులతో, ఇసుక కురుస్తూ ప్రచండంగా గాలులు వీచసాగాయి. పక్షులు అపసవ్యంగా వలయాకారంగా ఎగురసాగాయి. మహానదులు లోలోన ప్రవహించసాగాయి. దిక్కులన్నీ మంచుతో నిండిపోసాగాయి. తోకచుక్కలు నిప్పులు కురుస్తూ గగనం నుండి నేలపై పడసాగాయి. రాజా! సూర్యమండలం దుమ్ముతో కప్పబడి ఉదయవేళలో తేజోహీనంగా ఉంటోంది. అది నిత్యమూ మొండెములతో కూడి కనిపిస్తోంది. చంద్ర సూర్యుల చుట్టూ భయంకరంగా గుళ్ళు కనిపిస్తున్నాయి. వాటిలో మూడు రంగులు కన్పిస్తున్నాయి. వాటి అంచులు నల్లగా, బండగా కనిపిస్తున్నాయి. మధ్యలో బూడిదరంగు, చుట్టూ ఎర్రరంగు కనిపిస్తోంది. ఇవేగాక మరెన్నో ఉత్పాతాలు భయాన్ని సూచిస్తూ, హృదయాలకు ఉద్వేగానికి గురిచేస్తూ కనిపించసాగాయి. ఆ పై కొంతకాలానికి కురురాజైన యుధిష్ఠిరుడు వృష్ణివంశంలో రోకలి కారణంగా యుద్ధం జరిగిందని విన్నాడు. వాసుదేవుడు, బలరాముడు కూడా ఆ సంహారం నుండి తప్పించుకొన్నారని విని ధర్మరాజు సోదరులను పిలిపించి "ఇప్పడేం చేద్దా"మని అడిగాడు. బ్రాహ్మణశాపబలం వలన ఒకరితో ఒకరు కలబడి వృష్ణివంశీయులు నశించారని విని పాండవులు వ్యధ చెందారు. వాసుదేవవధ సముద్రం ఎండిపోవటం

వంటిది. అందువలన ఆ పాండవులు శార్ఙ్గధన్వుని వినాశాన్ని నమ్మలేక పోయారు. ఆ మౌసల వృత్తాంతం కారణంగా పాండవులు దుఃఖ శోకాలకు లోనయ్యారు. విషణ్ణులై, హతాశులై కూర్చున్నారు పాండవులు".

జనమేజయుడు అడిగాడు "భగవానుడా! వాసుదేవుడు చూస్తుండగానే వృష్ణులు, అంధకులు, మహారథుడైన భోజులు ఎలా చనిపోయారు ?" వైశంపాయనుడు చెప్తున్నాడు. "యుద్ధానంతరం ముప్పదియారు సంవత్సరాలు గడిచిన తర్వాత వృష్ణులలో అన్యాయంగా మహాకలహం జరిగింది. కాలచోదితులై పరస్పరం సంహరించుకొన్నారు". జనమేజయుడు అడిగాడు. "ద్విజవర్యా! ఆ వృష్ణి అంధకవీరులు, భోజవంశస్థులు ఎవరిశాపం వలన నశించిపోయారు ? నాకు వివరంగా చెప్పు". వైశంపాయనుడు చెప్తున్నాడు. విశ్వామిత్రుడు, కణ్వుడు, తపోధనుడైన నారదుని ద్వారా ద్వారకను చూడబోయారు. అప్పుడు సారణుడు మొదలయిన వీరులు వారిని దర్శించారు. వారు కాలప్రభావం చేత సాంబుని స్త్రీగా అలంకరించి, ముందుంచుకొని, వారిని కలిసి ఇలా అన్నారు. "ఈమె అమిత తేజస్వి అయిన బభ్రుని భార్య. ఆయన కొడుకు కావాలని అభిలషిస్తున్నాడు. మునులారా! బాగాచూసి చెప్పండి. ఈమె కడుపున ఎవరు పుడతారు ?"

నరాధిపా! అప్పుడు ఆ మోసంతో తిరస్కారానికి గురి అయిన ఆ మునులు వారితో ఏమన్నారో విను. ఆ దురాత్ముల మోసంతో ఆ మునుల కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి. వారు ఒకరి వైపు మరొకరు చూసికొని ఇలా అన్నారు. "దుర్మార్గులారా! వాసుదేవుని దాయాది అయిన ఈ సాంబుని కడుపున వృష్ణి-అంధక వినాశానికై ఘోరమయిన ఉక్కు రోకలి పుడుతుంది. అది మీ వంశాన్ని మొత్తం నాశనం చేస్తుంది. బలరామ జనార్దనులకు దానినుండి మినహాయింపు. శ్రీమంతుడైన బలరాముడు శరీరాన్ని విడిచి సముద్రంలో కలిసిపోతాడు. మహాత్ముడైన కృష్ణుడు నేలపై పడుకొని ఉండగా 'జరా' అనే పేరుగల బోయ ఆయనను చంపుతాడు." అలా పలికి ఆ మునులు కేశవుని దగ్గరకు వెళ్ళారు. అది వినగానే మధుసూదనుడు వృష్ణులతో ఇలా అన్నాడు. 'అది అలాగే జరగాలి' అని వారితో అని హృషీకేశుడు నగరంలో ప్రవేశించాడు. ఆ కృష్ణుడు ధీమంతుడు. అందరి ముగింపు తెలిసినవాడు. జగత్ప్రభువైన ఆయన కాల నిర్ణయాన్ని మార్చటానికి ఇష్టపడలేదు.

మరునాడు ఆ సాంబుడు ముసలాన్ని కన్నాడు. ఆ ముసలంతో వృష్ణ్యంధక వంశీయులైన సమస్త పురుషులు భస్మమయ్యారు. వృష్ణ్యంధక వినాశనంలో ఆ రోకలి

పెద్ద యమదూత వంటి దయింది. సాంబుడు శాపం వలన భీకరముసలాన్ని కనగానే యదువులు దానిని రాజుకు-ఉగ్రసేనునకు ఇచ్చారు. ఆ రాజు విషాదానికి లోనై దానిని పూర్తిగా చూర్ణం చేయించాడు. రాజా! రాజపురుషులు ఆ చూర్ణాన్ని సముద్రంలో పడవేశారు రాజయిన ఉగ్రసేనుడు, శ్రీకృష్ణుడు, బలరాముడు మహాత్ములైన బభ్రువు - వీరి ఆదేశంతో నగరంలో ఇలా చాటింపు వేయించారు "నేటినుండి నగరవాసులైన వృష్ణి- అంధక వంశీయులెవ్వరూ మదిరను తయారుచేయరాదు. ఎవరైనా, ఎక్కడయినా మాకు తెలియకుండా ఆ పానీయాన్ని తయారుచేస్తే, స్వయం కృతాపరాధంతో ఆ నరుడు బంధువులతో సహా బ్రతికి ఉండగానే శూలారోపణకు గురి అవుతాడు. ఆ పై ఆ బలరాముని శాసనాన్ని తెలిసికొని ఆ నరులు అందరూ రాజభయంతో అప్పుడు ఆ నియమాన్ని పాటించారు."

2. యదు వంశస్థులు తీర్థయాత్రకు బయలుదేరుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "ఈ రీతిగా వృష్ణివంశస్థులు, అంధక వంశస్థులు సమస్య నుండి బయటపడటానికి ప్రయత్నిస్తుండగా కాలుడు ప్రతినిత్యమూ అందరి ఇండ్లలో సంచరించసాగాడు. కరాల రూపంతో, వికటవేషంతో, చామన ఛాయతో, గుండు చేయించుకొన్న కాలుడు వృష్ణివంశీయుల ఇళ్ళలో ప్రవేశించి అందరినీ చూస్తూ మధ్య మధ్యలో మాయమయ్యేవాడు. అప్పుడు మేటి విలుకాండ్రు లక్షబాణాలతో అతనిని కొట్టారు కానీ అతనిని బాధించలేకపోయారు. అతడు సర్వప్రాణి సంహారకుడు. దినదినమూ వృష్ణి అంధకవంశ వినాశాన్ని సూచిస్తూ, రోమాంచం కల్గిస్తూ పెనుగాలులు భీకరంగా వీచసాగాయి. వీధులలో మూషిక సంచారం పెరిగింది. అవి బానలను బ్రద్దలు చేస్తున్నాయి. రాత్రి వేళలో నిదురిస్తున్నవారి వెంట్రుకలను గోళ్లను తింటున్నాయి. వృష్ణివంశస్థుల ఇళ్ళలో సారికలు "చీచీ కూచీ" అరుపులు అరుస్తున్నాయి. పగలైనా, రేయైనా ఆ శబ్దం ఆగటం లేదు. అదేరీతిగా సారసాలు గుడ్లగూబల అరుపులను అనుకరిస్తున్నాయి. భారతా! మేకలు నక్కల కూతలను అనుకరిస్తున్నాయి. ఎర్రని పాదాలు గల తెల్ల పావురాలు కాలప్రేరణచే వృష్ణి-అంధక వంశస్థుల ఇళ్ళలో తిరుగసాగాయి. ఆవులకు గాడిదలు పుట్టాయి. కంచర గాడిదలకు ఏనుగులు, కుక్కలకు పిల్లులు, ముంగిసలకు ఎలుకలు పుడుతున్నాయి. అప్పుడు వృష్ణివంశీయులు పాపాలు చేస్తూ సిగ్గు పడటం లేదు. బ్రాహ్మణులను, పితరులను, దేవతలను వారు ద్వేషించసాగారు.

పెద్దలను కూడా అవమానిస్తున్నారు. కానీ బలరామ జనార్దనుల విషయంలో

ఆ స్థితి లేదు. భార్యలు భర్తలను, భర్తలు భార్యలను అతిక్రమిస్తున్నారు. అగ్ని మండుతూ, తన జ్వాలలతో అప్రదక్షిణంగా తిరుగుతున్నాడు. జ్వాలలు నల్లగా, ఎర్రగా, ముదురు ఎరుపు రంగుతో విడివిడిగా బయటకు వస్తున్నాయి. నిత్యమూ ఆ నగరంలో నివసించే వారికి ఉదయ అస్తమయ వేళలలో సూర్యుడు మాటిమాటికీ మొండెములతో చుట్టు ముట్టబడి కనిపిస్తున్నాడు. భారతా! వంట ఇళ్ళలో చక్కగా తయారుచేసికొని సిద్ధమైన అన్నాన్ని తినటానికి కూర్చున్నప్పుడు వేలకొలదిగా పురుగులు వాటిలో కనిపిస్తున్నాయి. పుణ్యాహవాచనాలు జరుగుతున్నప్పుడు, మహాత్ములు జపిస్తున్నప్పుడు ప్రజలు పారిపోతున్న చప్పుడు వినిపిస్తోంది. కానీ ఎవ్వరూ కనిపించటం లేదు. నక్షత్రాలు, గ్రహాలు ఒకదానితో ఒకటి ఢీకొనటం అందరూ మాటిమాటికీ చూస్తున్నారు. కానీ తమ నక్షత్రాన్ని ఎవ్వరూ చూడలేకపోతున్నారు. కృష్ణుడు పాంచజన్య శంఖాన్ని పూరించినప్పుడు వృష్ణి-అంధకుల ఇళ్లలో అన్ని వైపులనుండి దారుణ స్వరంతో గాడిదలు అరుస్తున్నాయి. శ్రీ కృష్ణుడు ఈ రీతిగా ప్రాప్తించిన కాలవైపరీత్యాలను చూస్తూ త్రయోదశి-అమావాస్యల కలయికను భావించి వారందరితో ఇలా అన్నాడు.

"ఇప్పుడు రాహువు మరల చతుర్దశిని అమావాస్యను చేశాడు. మహాభారతయుద్ధ సమయం వంటి సమయం ఇప్పుడు వచ్చింది. ఇది మనకు వినాశసూచం." ఈ రీతిగా కాలాన్ని పర్యాలోచన చేస్తూ కేశిని సంహరించిన కృష్ణుడు ముప్పది ఆరవ సంవత్సరం వచ్చినట్టుగా గ్రహించాడు. ఇలా అన్నాడు - బాంధవులను పోగొట్టుకొని పుత్రశోకంతో తపిస్తున్న గాంధారి ఆర్తితో ఇచ్చిన శాపం ఇదిగో ఇప్పుడు దగ్గరకు వచ్చింది. ఇంతకు ముందు సేనలు వ్యూహాత్మకంగా నిలిచిన తరువాత దారుణంగా ఉన్న అపశకునాలను చూసి, యుధిష్ఠిరుడు సూచించిన స్థితి ఇప్పుడు ఇలా కనిపిస్తుంది." అలా పలికి అరిందముడైన వాసుదేవుడు దానిని సత్యం చేయదలచి అప్పుడు తీర్థయాత్రకు ఆదేశించాడు. అక్కడ కృష్ణుని ఆదేశం మేరకు రాజ పురుషులు "పురుషశ్రేష్ఠులారా! మీరు తీర్థయాత్రకై సముద్రతీరానికి చేరాలి" అని ప్రకటించారు."

3. యాదవుల పరస్పరసంహారము.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "ద్వారకలోని స్త్రీలకు రాత్రివేళ కలలో నల్లని స్త్రీ, తెల్లటి దంతాలతో నవ్వుతూ, స్త్రీల సౌభాగ్యాలను అపహరించి ద్వారకలో పరుగెత్తుతూ కనిపిస్తోంది. అగ్నిహోత్రగృహాలలో, వాస్తుపూజ జరిగి ఉన్న మధ్యభాగాలలో భీకరంగా

ఉన్న గ్రద్దలు వృష్ణివంశీయులను, అంధక వంశస్థులను తింటూ కలలలో కనిపిస్తున్నాయి. తీవ్రభయంకరాకారాలతో రాక్షసులు అలంకారాలను, గొడుగులను, ధ్వజాలను, కవచాలను అపహరించుకొనిపోతూ కనిపిస్తున్నారు. కేంద్రస్థానంలో వజ్రముండి, లోహమయమై, అగ్నియిచ్చిన శ్రీకృష్ణ సుదర్శన చక్రం కూడా అప్పుడు వృష్ణివంశస్థులు చూస్తుండగానే దివ్యలోకానికి వెళ్లిపోయింది. ఆదిత్య వర్ణంగల కృష్ణుని దివ్యరథాన్ని దారుకుడు చూస్తుండగానే గుర్రాలు లాగుకొని పోయాయి. మనో వేగం గల నాలుగు మేటి గుర్రాలు సముద్ర జలాలమీద తేలుతూ, తేలుతూ వెళ్లిపోయాయి. బలరాముడు, శ్రీకృష్ణుడు నిత్యమూ పూజించే తాళధ్వజ, గరుడధ్వజాలను అప్సరసలు పైకి తీసికొని వెళ్లిపోయారు. పగలు రేయీ కూడా తీర్థయాత్రకు బయలుదేరండి అని పలుకసాగారు. ఆ పై వృష్ణి-అంధకమహారథులందరూ తీర్థయాత్రకు బయలుదేర దలచారు. ఆ నరోత్తములు అంతఃపుర కాంతలతో సహా తీర్థయాత్ర చేయగోరారు.

ఆ తరువాత అంధక వంశీయులు, వృష్ణి వంశీయులు భోజ్య, భక్ష్య, పేయాలను ఎన్నో రకాలయిన మద్యాలను, వివిధ మాంసాలను పెద్ద ఎత్తున సమకూర్చుకొన్నారు. ఆ తరువాత శోభా సంపన్నులు, తీక్ష్ణతేజస్సులు అయిన సైనిక సమూహాలు రథాలతో, గుర్రాలతో, ఏనుగులతో నగరం నుండి వెలుపలకు వచ్చాయి. అప్పుడు ఆ యాదవులందరూ భక్ష్యాలనూ, పానీయాలనూ మిక్కిలిగా తీసికొని భార్యలతో పాటు ప్రభాసతీర్థంలో వాళ్ల ఉద్దేశాలకు తగినట్లుగా గృహాలలో విడిది చేశారు. సముద్రతీరంలో వారంతా విడిది చేయటం చూసి, అర్థశాస్త్రవేత్త, యోగవేత్త అయిన ఉద్ధవుడు వారి దగ్గర సెలవు తీసికొని అక్కడ నుండి బయలుదేరాడు. చేతులు జోడించి నమస్కరించి, బయలుదేరిన ఆ మహాత్ముని కృష్ణుడు నివారింపదలచలేదు. వృష్ణి వంశ వినాశం కృష్ణునకు తెలుసుగదా! ఆ పై కాలం చుట్టుముట్టిన ఆ వృష్ణి-అంధక మహారథులు అందరూ తన తేజస్సుతో భూమ్యాకాశాలను ఆవరించి వెళ్తున్న ఉద్ధవుని చూశారు. మహాత్ములయిన యాదవులు బ్రాహ్మణులకై సిద్ధం చేసిన అన్నంలో కల్లు కలిపి ఆ వాసనతో కూడిన ఆ అన్నాన్ని వానరాలకు పెట్టారు. ఆపై వందల తూర్యవాద్యాలను మ్రోగించసాగారు. నటులు, నర్తకులు నాట్యమాడసాగారు.

ఆ ప్రభాసతీర్థంలో తీవ్రతేజస్సుగల యాదవులు పెద్ద ఎత్తున సురాసేవనాన్ని ఆరంభించారు. కృష్ణుని సన్నిధిలోనే కృతవర్మతో కలిసి బలరాముడు, యుయుధానుడు గదుడు, బభ్రుడు త్రాగసాగారు. అప్పుడు యుయుధానుడు (సాత్యకి) మదమత్తుడై ఆ

సభలో కృతవర్మను పరిహసిస్తూ, అవమానిస్తూ ఇలా అన్నాడు. "హార్దిక్యా! తనను కొట్టకుండా మృతుల వలె నిదురిస్తున్న వారిని చంపే క్షత్రియుడు నీవు తప్ప మరెవ్వడూ లేరు. నీవు చేసిన పనిని యాదవులెప్పుడూ క్షమించరు." సాత్యకి అలా అనగానే ప్రద్యుమ్నుడు కృతవర్మను అవమానిస్తూ ఆ మాటను ఆదరించాడు. దానితో తీవ్రకోపానికి లోనయి కృతవర్మ కుడిచేతి వ్రేలెత్తి చూపుతూ సాత్యకిని తృణీకరిస్తూ ఇలా అన్నాడు. "చేతులు తెగి, రణభూమిలో ప్రాయోపవేశం చేసిన భూరిశ్రవుని వీరుడ ననుకొనే నీవు క్రూరంగా ఎలా చంపావు ?" అలా పలికిన కృతవర్మ మాటను విని కృష్ణుడు తీవ్రంగా కోపించి, ఆ తీక్ష్ణ దృష్టితో కృతవర్మ వైపు అడ్డంగా చూశాడు. అప్పుడు సాత్యకి మధుసూదనునితో సత్రాజిత్తుకున్న శ్యమంతకమణి కథను వినిపించాడు.

కృతవర్మ మణికోసం సత్రాజిత్తును చంపించిన విషయం గుర్తు చేశాడు.

ఆ మాట విని సత్యభామ తీవ్రకోపంతో, ఏడుస్తూ, శ్రీకృష్ణుని కోపాన్ని పెంచుతూ ఆయన ఒడిలో వ్రాలింది. దానితో సాత్యకి కోపంతో లేచి ఇలా అన్నాడు. "నేను ద్రౌపది కొడుకులు అయిదుగురూ, ధృష్టద్యుమ్నుడు, శిఖండి వెళ్లవలసినదారిలో వెళ్తున్నాను. (వారి మరణానికి బదులు తీర్చుకొంటాను) సత్య ప్రమాణంగా శపథం చేస్తున్నాను. సుమధ్యమా! అశ్వత్థామ సహాయంతో పాపిష్ఠి కృత్యం చేసిన ఈ కృతవర్మ ఆయువు నేటితో ముగియబోతోంది. కీర్తి నశింపబోతోంది." అలా పలికి క్రుద్ధుడై కేశవుని సమీపంలోనే కృతవర్మ పైకి దూకి కత్తితో తలనరికి వేశాడు. అప్పుడు అదే రీతిగా తనచుట్టూ ఉన్న ఇతరులను కూడా చంపబోతున్న సాత్యకిని నివారించటానికి కృష్ణుడు ముందుకురికాడు. అప్పుడు కాలవైపరీత్యంతో ప్రేరేపింపబడిన భోజవంశీయులు, అంధకవంశీయులు అందరూ ఒక్కటై సాత్యకిని చుట్టుముట్టారు. జనార్దనుడు తీవ్రకోపంతో వేగంగా సాత్యకి మీదకు దూకుతున్న వారిని చూసి కూడా, కాల వైపరీత్యం తెలిసినవాడు కాబట్టి కోపించలేదు. మద్యపానమదం ఆవేశించి ఉండటంతో, కాలధర్మ ప్రేరణచే వారందరూ అప్పుడు ఎంగిలి గిన్నెలతో సాత్యకిని కొట్టారు. సాత్యకి అలా హింసింపబడుతుండగా, ప్రద్యుమ్నుడు సాత్యకిని విడిపించటానికి కోపంతో వారి మధ్యకు వచ్చాడు. ప్రద్యుమ్నుడు భోజవంశీయులతో కలబడ్డాడు. సాత్యకి అంధక వంశీయులతో కలబడ్డాడు. బాహుబల సంపన్నులు అయిన ఆ వీరులిద్దరూ ఎంతో శ్రమతో పోరాడసాగారు కానీ భోజాంధకవంశీయులు ఎక్కువ మంది కావటం వలన కృష్ణుడు చూస్తుండగానే సాత్యకి ప్రద్యుమ్నులు చంపబడ్డారు.

చనిపోయిన సాత్యకిని, తన కుమారుని చూసి కోపంతో కృష్ణుడు పిడికిలితో

ఏరకాలను (ఒక రకమైన గడ్డి) పట్టాడు. వెంటనే అది వజ్రసమానమై, లోహమయమైన భీకర ముసలంగా మారింది. దానితో కృష్ణుడు ఎదుట నిలిచిన అందరినీ కొట్టాడు. ఆపై కాలప్రేరితులైన అంధకులు, భోజులు, శినివంశీయులు, వృష్ణివంశీయులు అందరూ ఆ దొమ్మిలో ఆ రోకళ్ళతో ఒకరినొకరు కొట్టుకొనసాగారు. కోపంతో ఎవడు ఆ ఏరకతృణాన్ని చేతబట్టినా అది వజ్రంతో సమానంగా కనపడసాగింది. ఆ గడ్డి కూడా రోకలిగా మారుతూ అక్కడ కనిపించింది. అదంతా బ్రాహ్మణ శాపం వలన జరిగిందని గ్రహించు. ఆ గడ్డిని మీదవేస్తే అది అభేద్యులను కూడా బ్రద్దలు చేస్తోంది. అది వజ్రసమానమైన గట్టి రోకలిలా కనిపిస్తోంది. కొడుకు తండ్రిని చంపాడు. తండ్రి కొడుకును చంపాడు. మిడతలు అగ్నిలో పడినట్లు ఆ కుకుర-అంధక వంశీయులు పరస్పరం పోరాడుతూ మదంతో మీదపడుతున్నారు. దెబ్బతింటున్నా కూడా ఎవడికీ కూడా పారిపోదామనిపించటం లేదు. మహాబాహువైన మధుసూదనుడు కాలవైపరీత్యాన్ని చూస్తూ రోకలి నెత్తి పట్టుకొని నిలిచాడు. భారతా ! తన కుమారులైన సాంబుడు, చారుదేష్ణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు మరణించటం చూసి కృష్ణుడు కోపానికి లోనయ్యాడు. పడిపోయిన గదుని కూడా చూసి, తీవ్ర కోపంతో కూడి కృష్ణుడు అప్పుడు మిగిలిన యాదవులను సంహరించి, నిశ్శేషం చేశాడు. పరపురంజయుడు, మహాతేజస్వి అయిన బభ్రుడు, దారుకుడు అలా యాదవసంహారం చేస్తున్న కృష్ణునితో ఏమన్నారో విను. "భగవంతుడా ! అందరూ చనిపోయారు. ఎక్కువ మందిని నీవే చంపావు. బలరాముడెక్కడున్నాడో వెతుకుతూ అందరం వెళదాం."

4. బలరామశ్రీకృష్ణులు పరమధామము చేరుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "ఆపై దారుకుడు, కృష్ణుడు, బభ్రువు, బలరాముని అడుగుజాడలను చూస్తూ నడవసాగారు. కొద్దిసేపటి తరువాత అనంతబలుడైన బలరాముడు ఒక చెట్టు క్రింద ఒంటరిగా ఆలోచిస్తూ కనిపించాడు. మహానుభావుడైన ఆ బలరాముని సమీపించి, అప్పుడు కృష్ణుడు దారుకునితో ఇలా అన్నాడు. "కురుదేశానికి వెళ్ళి ఈ యదువంశ వధరూపమైన మహావృత్తాంతాన్ని అర్జునునకు చెప్పు. బ్రాహ్మణ శాపం వలన యాదవులు చనిపోయారని విన్న వెంటనే అర్జునుడు వేగంగా ఇక్కడకు రావాలి." కృష్ణుడలా ఆదేశించగానే దారుకుడు రథమెక్కి దాదాపు అచేతనంగా కురుదేశానికి బయలుదేరాడు. దారుకుడు వెళ్ళిపోగానే దగ్గరనే ఉన్న బభ్రువును చూసి కేశవు డిలా అన్నాడు. "నీవు వెంటనే స్త్రీలను రక్షించటానికి వెళ్ళు. లేకపోతే దొంగలు డబ్బుమోది ఆశతో వారిని

హింసించవచ్చు. మదాతురుడై, దాయాదుల మరణంతో బాధపడుతున్న బభ్రువు అప్పుడే కృష్ణుని దగ్గర విశ్రాంతి తీసికొంటున్నాడు. అంతలోనే కృష్ణుడు బయలుదేరమని ఆదేశించాడు. అతడు బయలుదేరబోతుండగా బ్రాహ్మణశాప ప్రభావంతో పుట్టిన ముసలం ఒక బోయవాని బాణంతో పాటు వచ్చి బభ్రువును చంపింది. బభ్రువు చనిపోగానే ఉగ్రతేజస్వి అయిన కృష్ణుడు సోదరునితో ఇలా అన్నాడు. "బలరామా ! నేను స్త్రీలను జ్ఞాతుల కప్పగించి వస్తాను. అప్పటి దాకా నీవిక్కడే నాకై నిరీక్షించు." అలా పలికి జనార్దనుడు ద్వారకకు వెళ్ళి తండ్రితో ఇలా అన్నాడు.

"అర్జునునికై ఎదురుచూస్తూ, ఆయన వచ్చేదాకా మన స్త్రీలను నీవు రక్షించు. బలరాముడు అరణ్యంలో నాకై ఎదురుచూస్తున్నాడు. ఇప్పుడు నేను ఆయనతో కలుస్తాను. గతంలో కురుశ్రేష్ఠులయిన రాజుల మరణాన్ని చూశాను. ఇప్పుడు యాదవుల వినాశాన్ని చూశాను. యదువంశీయులు లేని-ఈ యాదవపురిని నేనిప్పుడు చూడలేను. నా మాట గ్రహించు. రాముని తో కలిసి అరణ్యానికి పోయి తపస్సు నాచరిస్తాను." అని పలికి కృష్ణుడు తలతో తండ్రి పాదాలను తాకి వేగంగా వెళ్ళిపోయాడు. అంతలో ఆ నగరంలో స్త్రీలు, పిల్లలు పెద్దగా ఏడ్చిన మహాధ్వని వినిపించింది. అప్పుడు అలా ఆక్రోశిస్తున్న ఆడవారి విలాపాన్ని విని, కేశవుడు మరలి వచ్చి, వారితో ఇలా అన్నాడు. "అర్జునుడు ఈ నగరానికి వస్తాడు. ఆ నరోత్తముడు మిమ్ము దుఃఖం నుండి విడిపిస్తాడు." ఆపై కృష్ణుడు వెళ్లి, అరణ్యంలో ఏకాంతంలో ఒంటరిగా నిలిచి ఉన్న బలరాముని చూశాడు. బలరాముడు యోగసమాధిలో ఉన్నాడు. ఆయన ముఖం నుండి తెల్లగా ఉన్న ఒక పెద్దపాము బయటకు వస్తూ కృష్ణునకు కనిపించింది. కృష్ణుడు చూస్తుండగానే అది సముద్రమున్న వైపు సాగిపోయింది. ఆ సర్పం తన పూర్వ శరీరాన్ని విడిచి ఈ విధంగా కనిపించింది. దానికి వేయి తలలున్నాయి. పర్వతమంత పెద్ద శరీరం. ఎర్రటి ముఖం. సాగరుడు, సర్పాలు, దివ్య పుణ్యనదులు తగినరీతిగా దానిని స్వాగతించారు. రాజా ! కర్కోటకుడు, వాసుకి, తక్షకుడు, పృథుశ్రవుడు, అరుణుడు, కుంజరుడు, మిశ్రీ, శంఖుడు, కకుదుడు, పుండరీకుడు, మహాత్ముడైన ధృతరాష్ట్రుడు, హ్రాదుడు, క్రాధుడు, శితికంఠుడు, ఉగ్రతేజుడు, చక్రమందుడు, అతిషండుడు, నాగశ్రేష్ఠుడైన దుర్ముఖుడు, అంబరీషుడు స్వయంగా వరుణరాజు ఆ సర్పాన్ని స్వాగతించారు. ఎదురువచ్చి స్వాగతంతో అభినందించి వారు అర్ఘ్యపాద్యక్రియలతో అర్చించారు.

ఆపై సోదరుడు వెళ్ళిపోగానే వాసుదేవుడు దివ్యదృష్టితో సర్పగతులను గ్రహించి, శూన్యవనంలో సంచరిస్తూ, ఏదో ఆలోచింపసాగాడు. ఆ శ్రేష్ఠతేజస్వి నేలపై పడుకొన్నాడు.

గాంధారి తనను శపించినప్పుడే కృష్ణుడు ఇదంతా ఇలా జరుగుతుందని గ్రహించి ఉన్నాడు. ఎంగిలి పాయసాన్ని శరీరానికి పూసినప్పుడు దుర్వాసుడు అన్న మాటను కూడా అప్పుడు స్మరించాడు. ఆ మహానుభావుడు అంధక, వృష్ణి, కురువంశ, వినాశనాన్ని గురించి ఆలోచింపసాగాడు. లోకత్రయాలను రక్షించటానికీ, దుర్వాసుని మాటను పాటించటానికీ తనకు తగిన సమయం సంక్రమించిందని భావించి ఇంద్రియాలను నిరోధించాడు. సకలార్థతత్త్వవేత్త అయిన శ్రీకృష్ణదేవుడు కూడా దేహాన్ని వదలటానికి కారణాన్ని అభిలషించాడు. ఆయన ఇంద్రియాలను, వాక్కును, మనస్సును నిరోధించి మహాయోగాన్ని పొంది శయనించాడు. మృగాలను వేటాడగోరి 'జరా' అనే పేరుగల బోయవాడు ఆ ప్రదేశానికి వచ్చాడు. ఆ భీకరుడు యోగయుక్తుడై పడుకొని ఉన్న కేశవుని చూశాడు. మృగాసక్తుడైన అతడు కృష్ణుని మృగమనుకొని త్వరపడుతూ బాణంతో అరికాలిపై కొట్టాడు. ఆపై ఆ మృగాన్ని తీసికోవాలని దగ్గరగా వెళ్ళాడు. కానీ అక్కడ అనేకబాహువై, పీతాంబరుడై, యోగయుక్తుడైన పురుషుని చూశాడు. తాను అపరాధం చేసినట్లు భావించి ఆ బోయవాడు మనస్సులో శంకిస్తూ ఆయన పాదాలు పట్టుకొన్నాడు.

ఆ మహాత్ముడు తనశోభతో భూమ్యాకాశాలను వ్యాపించి పైకి వెళుతూ అతనిని ఓదార్చాడు. ఆయన అంతరిక్షానికి చేరగానే ఇంద్రుడు, అశ్వినులు, రుద్రులు, ఆదిత్యులు, వసువులు, విశ్వేదేవులు, మునులు, సిద్ధులు, గంధర్వశ్రేష్ఠులు, అప్సరసలు ఆయనకు ఎదురువచ్చారు. రాజా ! ఆపై ఉగ్రతేజస్వి, జగదుత్పత్తిహేతువు, అవ్యయుడు, మహాత్ముడు, యోగాచార్యుడు అయిన నారాయణ భగవానుడు తన కాంతితో భూమ్యాకాశాలను వ్యాపించి అప్రమేయమైన తన నివాసానికి వెళ్ళాడు. రాజా ! ఆ పై కృష్ణుడు గంధర్వశ్రేష్ఠులు, దివ్యాప్సరసలు, సిద్ధులు, సాధ్యులు వినయంతో పూజించుచుండగా దేవతలతో, ఋషులతో, చారణులతో కూడా కలిశాడు. రాజా ! దేవతలు ఆయనను అభినందించారు. మునిముఖ్యులు ఋక్కులతో ఆ భగవానుని అర్చించారు. గంధర్వులు కూడా ఆయనను స్తుతిస్తూ నిలిచారు. ఇంద్రుడు కూడా ప్రేమతో ఆయనను అభినందించాడు."

5. అర్జునుడు ద్వారకకు వచ్చుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "దారుకుడు కూడా కురుదేశానికి వెళ్ళి, మహారథులైన పాండవులను చూసి, ముసలం కారణంగా పరస్పరం సంహరించుకొన్న వృష్ణివంశీయులను గూర్చి చెప్పాడు. వృష్ణివంశీయులు భోజ, అంధక, కురువంశస్థులతో పాటు నశించిపోయారని

విని పాండవులు శోకసంతప్తులయ్యారు. వారి మనస్సులు బెదరిపోయాయి. ఆ తరువాత కృష్ణుని ప్రియసఖుడైన అర్జునుడు వారి వద్ద సెలవు తీసికొని మేనమామను చూడటానికి బయలు దేరాడు. "ఇలా జరిగి ఉండదు" అని కూడా అన్నాడు. రాజా ! ఆ వీరుడు దారుకునితో కలిసి వృష్ణినిలయమైన ద్వారకకు వెళ్ళి అనాథస్త్రీవలె ఉన్న ఆ నగరాన్ని చూశాడు. అంతకు ముందు లోకనాథుడైన కృష్ణుని రక్షణలో సనాథలుగా ఉన్న వాసుదేవుని భార్యలు పదహారువేలమంది ఇప్పుడు అనాథలై ఉన్నారు. రక్షకుడుగా వచ్చిన అర్జునుని చూసి వారు అక్రోశించారు. తమ దగ్గరకు వచ్చిన అర్జునుని చూడగానే వారు పెద్దగా ఆర్తనాదాలు చేశారు. వారిని చూసినంతనే అర్జునుని కళ్ళు కన్నీటితో నిండిపోయాయి. కృష్ణుడు, కుమారులు లేని వారి వైపు చూడలేకపోయాడు.

ఆ ద్వారక నదివలె ఉన్నది. వృష్ణి-అంధక వంశీయులు అక్కడ నీరు, గుర్రాలు చేపలు. రథాలు తెప్పలు వాద్యధనులు, రథఘోషలు నీటి కలకల ధ్వనులు. ఇళ్ళే తీర్థాలు జలాశయాలు. రత్నాలు నాచుసమూహం. వజ్రప్రాకారాలు దాని ఒడ్లు. వీథులు జలప్రవాహం, ప్రవాహంలోని సుడులు. కూడళ్ళు నిలకడగా ఉన్న మడుగులు. రామకృష్ణులు పెద్ద సొరచేపలు. కాలపాశమే మొసళ్ళు. అది వైతరణి వలె భీకరమైన నది. అది వృష్ణిపుంగవులు లేకపోవటంవలన కాంతిని కోల్పోయి ఆనందశూన్యంగా ఉంది. ధీమంతుడైన అర్జునుడు శిశిరంలోని తామరపూవువలె ఉన్న ఆ ద్వారకను చూశాడు. అర్జునుడు ఆ ద్వారకను, ఆ కృష్ణుని కాంతలను చూసి ఏడుస్తూ, కన్నీటిని విడుస్తూ, నేలపై పడిపోయాడు. రాజా ! అప్పుడు సత్రాజిత్తు కూతురు సత్యభామ, రుక్మిణి ముందుకురికి ధనంజయుని చుట్టి నిలిచి రోదించసాగారు. ఆపై మహాత్ముడైన ఆ అర్జునుని లేవదీసి, బంగారు పీఠంపై కూర్చుండబెట్టి, మౌనంగా అతని చుట్టూ కూర్చున్నారు. ఆ తరువాత అర్జునుడు కృష్ణుని స్తుతిస్తూ ఆయనను గురించి తగిన రీతిగా మాటాడి, ఆ స్త్రీలను అనునయించి మేనమామను చూడటానికి వెళ్ళాడు."

6. ద్వారకలో అర్జున వసుదేవ సంభాషణ.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "పుత్రశోకంతో తపిస్తూ పండుకొనియున్న మహాత్ముడు, వీరుడు అయిన ఆ వసుదేవుని కురుశ్రేష్ఠుడైన అర్జునుడు చూశాడు. ఆ వసుదేవుడు మహాభుజుడు. విశాలమైన వక్షఃస్థలం గలవాడు. ఆర్తుడై కళ్ళనిండా నీరు కుక్కుకొని ఉన్నాడు. ఆర్తతరుడైన అర్జునుడు ఆ పాదాలను పట్టుకొన్నాడు. మహాబాహువు,

శత్రుసూదనుడైన వసుదేవుడు మేనల్లుని శిరస్సు నాఘ్రాణింపగోరాడు. కానీ అలా చేయలేకపోయాడు. మహాభుజుడైన ఆ వృద్ధుడు భుజాలతో అర్జునుని కౌగిలించుకొని, కొడుకులనందరినీ తలచుకొంటూ రోదించాడు. సోదరులను, పుత్రులను, పౌత్రులను, దౌహిత్రులను, మిత్రులను కూడా తలచుకొని కలతపడి విలపించాడు. వసుదేవు డిలా అన్నాడు. "అర్జునా ! వందలకొలదిగ రాజులను, దైత్యులను ఓడించిన వారిని ఇప్పుడు నేను చూడలేకపోతున్నాను. అయినా బ్రతికియే ఉన్నాను. నాకు చావు రాదు. పార్థా ! నీ శిష్యులై, నీ కిష్టులై, నీవు ఎప్పుడూ మెచ్చుకొనే ఆ ఇద్దరి (సాత్యకి, ప్రద్యుమ్నులు) అవినీతివలన వృష్ణివంశీయులందరూ మరణించారు. వృష్ణివీరులలో మహారథులుగా పరిగణింపబడినవారు ఇద్దరే. వారే సాత్యకి ప్రద్యుమ్నులు. నీవు కూడా వారిని శ్లాఘిస్తూ ప్రశంసిస్తుంటావు. కృష్ణునకు కూడా వారు ప్రీతిపాత్రులు. కానీ వారే. ఆ ఇద్దరే వృష్ణివంశవినాశానికి ముఖ్యకారకులయ్యారు.

అలా అని నేను సాత్యకిని, కృతవర్మను, అక్రూరుని, ప్రద్యుమ్నుని నిందించటం లేదు. మునిశాపమే ఇక్కడ కారణం. పార్థా ! మధుసూదనుడు పరాక్రమించి కేశిని, కంసుని దేహబంధం నుండి విడిపించినవాడు. బలగర్వితుడైన శిశుపాలుని, నిషాదరాజైన ఏకలవ్యుని, కళింగరాజును, మగధదేశీయులను, గాంధారులను, కాశిరాజును, మరుభూములలోని రాజులను, ప్రాచ్యులను, దాక్షిణాత్యులను, పర్వతప్రాంతరాజులను సంహరించిన జగత్ప్రభువు. బాలకుల అవనీతి వలన కలిగిన ఈ స్థితిని అపేక్షించాడు. దివ్యుడు, సనాతనుడు, అనఘుడు, అచ్యుతుడు అయిన ఆ గోవిందుని నీవు, నారదుడు, మునులు ఎరుగుదురు. సర్వవ్యాపకుడైన ఆ అధోక్షజుడు దాయాదుల వినాశాన్ని ఉపేక్షించాడు. నా కుమారుని రూపంలో ఉన్న ఆ జగత్ప్రభువు గాంధారి శాపాన్ని, మహర్షుల శాపాలను అన్యథాకరించాలని కోరుకోలేదు. అందుకే ఆయన నా ఇబ్బందిని ఎప్పుడూ ఉపేక్షించాడు. నీవు ప్రత్యక్షంగానే చూశావు. అశ్వత్థామ చంపిన నీ మనుమడు ఆ కృష్ణుని తేజస్సుతో మరలా బ్రదికాడు. ఆ నీ మిత్రుడు తన దాయాదులను ఈ వృష్ణి వంశీయులను రక్షించటానికి మాత్రం ఇష్టపడలేదు. కడకు చచ్చిపడి ఉన్న కొడుకులను, మనుమలను, సోదరులను, మిత్రులను చూసి నాతో ఇలా అన్నాడు.

"పురుషర్షభా ! ఈ వంశానికి ఇప్పుడు ఇలా అంత్యకాలం సమీపించింది. అర్జునుడు ఈ ద్వారకా నగరానికి వస్తాడు. అతని ఈ మహావృష్ణివంశ వినాశనాన్ని గూర్చి చెప్పాలి. రాజా ! మహాతేజస్వి అయిన అర్జునుడు యదువంశవినాశనాన్ని విని,

వేగంగా ఇక్కడికి వస్తాడు. ఈ విషయంలో మరో ఆలోచన అవసరం లేదు. భారతా ! నన్ను అర్జునునిగా గ్రహించు. అర్జునుడు నేనని గ్రహించు. అర్జునుడు ఎలా చెపితే అలా చేయాలి అని తెలిసికో. ఆ స్త్రీలను ప్రసవసమయం వచ్చినప్పుడు వారిని, బాలకులను అర్జునుడు చూసికొనగలడు. నీకు ఔర్ధ్వదేహిక సంస్కారాలను కూడా నిర్వహించగలడు. ధనంజయుడు విడిచి వెళ్ళగానే ప్రాకారాలు, సౌధోపరిభాగాలతో సహా ఈ నగరాన్ని సముద్రం ముంచివేస్తుంది. నేను ఏదో ఒక పుణ్యప్రదేశంలో నియమాలను ఆశ్రయించి, బలరాముని తో సహా శీఘ్రంగా కాలునికై నిరీక్షిస్తాను. అలా పలికి అచింత్యపరాక్రముడైన ఆ ప్రభువు హృషీకేశుడు – బాలకులతో పాటు నన్ను విడిచి ఏ దిక్కునకో వెళ్ళిపోయాడు. ఆ స్థితిలో నేను నీ సోదరులైన ఆ మహాత్ములను గురించీ, ఘోరమైన జ్ఞాతివధను గురించి ఆలోచిస్తూ శోకంతో కృశించి తిండికూడా తినలేదు. పాండునందనా ! భాగ్యం కొద్దీ నీవు వచ్చావు. ఇక నేను భుజించను. జీవించను కూడా. పార్థా ! కృష్ణుడు చెప్పినదంతా చేయి. ఈ రాజ్యం, ఈ స్త్రీలు, ఈ రత్నాలు నీవే. ఇష్టమైన నా ఈ ప్రాణాలను నేను విడుస్తాను."

7. వృష్ణికళత్రాదుల రాక.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "పరంతపా ! మేనమామ అలా అనగానే అర్జునుడు విమనస్కుడై, దీనవదనుడై వసుదేవునితో ఇలా అన్నాడు. "మామా ! వృష్ణివీరుడైన కృష్ణుడు, బంధువులు లేని ఈ భూమిని నేను ఏ స్థితిలోనూ చూడలేకపోతున్నాను. యుధిష్ఠిరుడు, భీమసేనుడు, సహదేవుడు, నకులుడు, ద్రౌపది – మేము ఆరుగురమూ ఒకే మనస్సుగలవారం. యుధిష్ఠిరనరపాలునకు కూడా పరలోక గమన సమయం నిశ్చయంగా వచ్చింది. ఆ కాలమే ఇప్పుడు కూడా వచ్చిందని గ్రహించు. ఏమైనా సరే ! నేను వృష్ణివంశకాంతలను, బాలురను, వృద్ధులను తీసికొని ఇంద్రప్రస్థానికి వెళ్తాను" వసుదేవునితో అలా అని అర్జునుడు "వృష్ణివీరుల మంత్రులను చూడాలి. ఆలస్యం కాకూడదు" అని దారుకునితో అన్నాడు. దారుకునితో అలా అని శూరుడైన అర్జునుడు చనిపోయిన మహారథులను గురించి శోకిస్తూ యాదవసభ అయిన సుధర్మలో ప్రవేశించాడు. ఆ సభలో సింహాసనాసీనుడైన అర్జునుని దగ్గరకు అమాత్యులు మొదలయిన ప్రకృతులందరూ వేదవేత్తలైన పండితులూ వచ్చి చుట్టూ కూర్చున్నారు. వారంతా దీనమనస్కులై, చైతన్యశూన్యులై, విమూఢులై ఉన్నారు. అలాగే అర్జునుడు మరీదీనుడై ఆ కాలానికి తగినట్లు ఇలా అన్నాడు.

వృష్ణి-అంధకవంశజనాన్ని నేను స్వయంగా ఇంద్రప్రస్థానికి తీసికొని పోతాను. ఈ నగరాన్ని మొత్తంగా సముద్రం ముంచేస్తుంది. వాహనాలను, వివిధరత్నాలను సిద్ధం చేసికోండి. ఇంద్రప్రస్థంలో ఈ వజ్రుడు మీకు రాజు అవుతాడు. నేటి నుండి ఏడవరోజున నిర్మలంగా సూర్యుడు ఉదయించగానే మనమంతా నగరం వీడి బయలుదేరుదాం సిద్ధంకండి. జాగు చేయకండి." ఆపై అర్జునుడు అలా చెప్పగానే వారందరూ స్వాభీష్టసిద్ధికై ఉత్సాహంతో వెంటనే సిద్ధపడసాగారు. అర్జునుడు ఆ రాత్రి కృష్ణుని భవనంలోనే నివసించాడు. భవనంలోనికి ప్రవేశిస్తూనే అర్జునుడు తీవ్రంగా శోకమోహాలకు లోనయ్యాడు. ఆపై తెల్లవారగానే శూరసుతుడు అయిన వసుదేవుడు మనస్సును పరమాత్మతో అనుసంధించి ఆ యోగంతో ఉత్తమగతిని పొందాడు. ఆపై వసుదేవుని భవనంలోని స్త్రీలు ఏడుస్తూ ఆక్రోశించసాగారు. వారి ఆర్తనాదం మహాభయంకరంగా వినిపించింది. ఆ స్త్రీలు జుట్టు విరబోసికొని, ఆ భరణాలను మాలలను విడిచి, చేతులతో గుండెలు బాదుకొంటూ దీనంగా విలపించారు. నారీమణు లయిన దేవకి, భద్ర, రోహిణి, మదిర - వీరందరూ అప్పుడు భర్తతో పాటు చితినెక్కటానికి సిద్ధపడ్డారు.

భారతా ! అప్పుడు అర్జునుడు ఎంతో విలువయిన గొప్ప వాహనాన్ని తయారు చేయించి, మనుష్యులచేత మోయింపజేస్తూ వసుదేవుని శవాన్ని నగరం వెలుపలకు తీసికొనిపోయాడు. ద్వారకావాసులైన సమస్తపౌరులు, జానపదులు, హితాభిలాషులు దుఃఖశోక సమన్వితులై ఆ వసుదేవుని శవం వెంట నడిచారు. ఆ వాహనానికి ముందు అశ్వమేధయాగంలో వాడిన గొడుగును, ప్రజ్వలిస్తున్న అగ్నులను తీసికొని యాజకులు నడిచారు. రాణులు చక్కగా అలంకరించుకొని వేలకొలది స్త్రీలు, కోడళ్ళు చుట్టూనడవగా ఆ వీరుని అనుసరించారు. మహాత్ముడైన వసుదేవుడు బ్రతికియున్నప్పుడు ఇష్టపడుతున్న ప్రదేశంలోనే చితిని కల్పించి ఆ వసుదేవునకు పితృమేధాన్ని చేశారు. చితిమీది అగ్నిలో శయనించి ఉన్న ఆ వీరశౌరిని పతిలోకానికి వెళ్ళగోరిన శ్రేష్ఠకాంతలైన నలుగురు రాణులు ఆయన వెంట చితినెక్కారు. ఆ నలుగురు రాణులతో అనుసరింపబడుతున్న ఆ వసుదేవుని అర్జునుడు గంధపుకట్టెలతో, వివిధ గంధద్రవ్యాలతో దహనం చేయించాడు. ఆపై మండుతున్న అగ్నిధ్వని, సామగానఘోష, నరులరోదనధ్వని వినిపించసాగాయి. అప్పుడు వజ్రుడు మొదలుగా గల వృష్ణి - అంధక కుమారులు, స్త్రీలు మహాత్ముడైన ఆ వసుదేవునకు ఉదక క్రియలు చేశారు. భరతర్షభా ! ధర్మలోపంలేని ఆ అర్జునుడు ధర్మకర్మలు నిర్వర్తింపజేసి, వృష్ణివంశీయులు మరణించిన తావునకు వెళ్ళాడు. అక్కడ రణభూమిలో పడి ఉన్న వారిని చూసి

తీవ్రదుఃఖానికి లోనయ్యాడు అర్జునుడు. బ్రాహ్మణశాపం వలన ఏరకత్వణం నుండి పుట్టిన ముసలాలతో చనిపోయిన యదువంశీయులకు ప్రాధాన్యక్రమంలో అప్పుడు చేయవలసిన అంత్యసంస్కారాలను చేశాడు. ఆపై విశ్వసనీయ పురుషుల ద్వారా బలరామకృష్ణులిద్దరి శరీరాలను వెదికించి వాటిని దహనం చేయించాడు. అర్జునుడు యథావిధిగా వారికి ప్రేతకార్యాలను జరిపించి ఏడవరోజు రథాన్ని ఎక్కి వేగంగా బయలుదేరాడు.

శోకంతో కృశించిన వృష్ణివీరుల కాంతలు కూడా రోదిస్తూ గుర్రాలు పూన్చిన రథాలపై, గోవులపై, గాడిదలపై, ఒంటెలపై మహాత్ముడు అయిన అర్జునుని అనుసరించారు. ఆపై అంధకవృష్ణివంశీయుల సేవకులు, రౌతులు, రథికులు, పౌరులు, జానపదులు అర్జునుని ఆదేశంతో వృద్ధులతో, బాలురతో కూడిన ఆ విధవా స్త్రీలకు రక్షణగా చుట్టునిలిచి బయలుదేరారు. పర్వతాలవలె ఉన్న ఏనుగులనెక్కి హస్తిపకులు ఆయుధాలను చాటుగా ఉంచుకొని ఏనుగుల పాదరక్షకులతో సహా బయలుదేరారు. అంధక వృష్ణివంశీయుల పుత్రులందరూ అర్జునుని అనుసరించేవారు. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, మహాధనులైన శూద్రులు, వాసుదేవుని అంతఃపురకాంతలు పదహారువేల మందీ ధీమంతుడూ, కృష్ణుని మనుమడు అయిన వజ్రిని ముందు నిలుపుకొని బయలుదేరారు. భర్తలు చనిపోయిన భోజ-వృష్ణి-అంధక స్త్రీలు వేలకొలదిగ, లక్షలకొలదిగ, అర్బుదాలకొలదిగ ఉన్నారు. వారంతా ప్రయాణమయ్యారు. మహాసమృద్ధమైన ఆ వృష్ణి చక్రం మహాసాగరంవలె ఉంది. పరపురంజయుడు, రథిక శ్రేష్ఠుడు అయిన అర్జునుడు వారిని నడిపించాడు. అప్పుడు వారు వెళ్ళిపోగానే మకరాలయుడైన సాగరుడు రత్నాలతో నిండిన ఆ ద్వారకను నీటితో ముంచివేశాడు. పురుషశ్రేష్ఠుడైన అర్జునుడు ఆ భూమిని వీడినంత మేర సాగరుడు నీటితో దానిని ముంచివేయసాగాడు.

ఆ అద్భుతాన్ని చూసి ద్వారకావాసులైన జనులు మరీ వేగంగా పయనించసాగారు. 'దైవమెంతటిది !' అని అనుకోసాగారు. అందమైన వనాలలో, పర్వతాలపై, నదీ తీరాలలో విడిది చేస్తూ అర్జునుడు వృష్ణివంశకాంతలను తీసికొనిరాసాగాడు. ధీమంతుడు, సమర్థుడు అయిన ఆ అర్జునుడు పరమసంపన్నమై, గోపశుధాన్య సమృద్ధమైన పంచనదీదేశాన్ని చేరి అక్కడ విడిది చేశాడు. భారతా ! అప్పుడు అర్జునుడు ఒక్కడే తీసికొని వెళుతున్న విధవలను చూసి అక్కడున్న దొంగలలో ఆశపుట్టింది. అప్పుడు లోభంతో మనస్సులు చెడి, పాపకృత్యాలు చేసే భీకరాకారులైన ఆభీరులు కలిసి ఆలోచించుకొన్నారు. విల్లుచేతబట్టి ఈ ఒంటరి అర్జునుడు, తేజోహీనులైన ఈ యోధులు మనలను అతిక్రమించి వృద్ధులను,

బాలురను విధవలను కొనిపోతున్నారు. ఆపై వృష్ణివంశీయ జనాన్ని కొల్లగొట్టడానికి వేలకొలదిగ దొంగలు కర్రలు చేతబట్టి వారిపై దాడి చేశారు. కాలవైపరీత్యం యొక్క ప్రేరణచే వారు పెద్దపెట్టున సింహనాదాలు చేస్తూ, వారినందరినీ చంపగోరి ఆ దొంగలు బెదరగొడుతూ మీదపడ్డారు. దానితో వెంటనే మహాబాహుడైన అర్జునుడు అనుచరులతో పాటు వెనుకకు వచ్చి, నవ్వుతూ వారితో ఇలా అన్నాడు.

"అధర్మపరులారా ! జీవించాలని కోరుకొంటుంటే వెనుకకు వెళ్ళిపోండి. లేకపోతే ఇప్పుడు నా బాణాలదెబ్బకు చీలిపోతారు. ఏడవవలసి వస్తుంది." వీరుడైన అర్జునుడు అలా అనగా ఆ మాటను లెక్క చేయకుండా ఆ మూఢులు మాటిమాటికీ వారింపబడుతూ కూడా జనం మీద పడ్డారు. అప్పుడు అర్జునుడు దివ్యమూ, అజరమూ అయిన ఆ మహాగాండివ ధనుస్సును ప్రయత్నపూర్వకంగా ఎట్టకేలకు ఎక్కుపెట్టడానికి ప్రారంభించాడు. భీకర సంహారం జరుగుతుంటే ఎంతో కష్టం మీద వాటిని ఎక్కుపెట్టగలిగాడు. అస్త్రశస్త్రాలను స్మరించాడు. కానీ అవి గుర్తుకు రాలేదు. పోరాడవలసినచోట తన భుజబలంలో వచ్చిన ఈ మార్పును చూసి, దివ్యమహాస్త్రాలు గుర్తుకు రాకపోవటం గమనించి అర్జునుడు సిగ్గుపడ్డాడు. ఆ వృష్ణియోధులు, హస్తిపకులు, ఆశ్వికులు, రథికులు అందరూ కూడా దొంగల బారినపడ్డ ఆ జనాన్ని వెనుకకు మరలించలేకపోయారు. జనంలో ఆడవారే ఎక్కువ. దొంగలేమో ఏదో ఒక వైపు నుండి మీదపడుతున్నారు. అయినా అర్జునుడు ఆ జనాన్ని రక్షించాలని ప్రయత్నించాడు. ఆ యోధులందరూ చూస్తుండగానే నాలుగువైపుల నుండి ఆ దొంగలు ఆ కాంతామణులను లాగికొనిపోయారు. కొందరు ఇష్టపడి వెళ్ళిపోయారు. ఆపై అర్జునుడు వేలకొలదిగ ఉన్న వృష్ణియోధులతో కలిసి ఉద్వేగంతో, గాండీవం నుండి వెలువడిన బాణాలతో ఆ దొంగలను కొట్టాడు. రాజా ! క్షణంలోనే ఆ అర్జునుని బాణాలు క్షీణించి పోయాయి. గతంలో అవి గాయాలను భుజిస్తూ అక్షయాలుగా ఉండేవి. అప్పుడు బాణాలు క్షీణించిపోవటంతో, దుఃఖశోకాలకు లోనైన అర్జునుడు వింటికొనతో దొంగలను సంహరించసాగాడు. జనమేజయా ! అర్జునుడు చూస్తుండగానే వృష్ణి-అంధక స్త్రీల నందరినీ తీసికొని ఆ మ్లేచ్ఛులు అన్ని వైపులకు పారిపోయారు.

అర్జునుడు సమర్థుడు. అయినా ఆ వైఫల్యాన్ని దైవికంగా భావించాడు. దుఃఖశోకాలకు లోనయ్యాడు. తీవ్రంగా నిట్టూర్చసాగాడు. అస్త్రాలు నశించాయి. బాహుబలం నశించింది. ధనుస్సు మాట వినలేదు. శరాలు క్షీణించాయి. దీనితో అర్జునుడు విమనస్కుడయ్యాడు. ఇదంతా విధివిధానమని తలచాడు. రాజా ! ఆపై అర్జునుడు

పోరాటం నుండి మరలాడు "ఇదేదీ నిలిచేది కాదు" అని కూడా అనుకొన్నాడు. ఆ తరువాత ధీమంతుడైన అర్జునుడు అపహరణకు గురికాగా మిగిలిన వృష్ణికాంతలు, కొల్లబోగా మిగిలిన రత్నాలను తీసికొని కురుక్షేత్రంలో విడిది చేశాడు. ఈ రీతిగా అపహరణకు గురికాగా మిగిలిన వృష్ణికాంతలను వెంటబెట్టుకొని కురువంశీయుడైన అర్జునుడు అక్కడక్కడ విడిది చేయించాడు. కృతవర్మ కొడుకూ, అపహరణకు గురికాగా మిగిలిన భోజరాజ పరివారానికి సంబంధించిన స్త్రీలతో నరోత్తముడైన అర్జునుడు మార్తికావతమనే నగరంలో విడిదిచేశాడు. ఆ తరువాత వీరులు లేని వృద్ధులను, బాలురను, స్త్రీలను అందరినీ తీసికొని పాండునందనుడు ఇంద్రప్రస్థంలో నివేశింపజేశాడు. ధర్మాత్ముడైన అర్జునుడు సాత్యకి ప్రియపుత్రుడైన యౌయుధానిని వృద్ధులతో, బాలురతో సహా సరస్వతీ నదీ తీర దేశంలో నివసింపజేశాడు. పరవీరసూదనుడైన అర్జునుడు వజ్రునకు ఇంద్రప్రస్థ రాజ్యాన్ని ఇచ్చాడు. వజ్రుడు వారిస్తున్నా కూడా అక్రూరుని భార్యలు సంన్యసించారు. రుక్మిణి, గాంధారి, శైబ్య, హైమవతి, జాంబవతీదేవి అగ్ని ప్రవేశం చేశారు. రాజా ! సత్యభామ, అలాగే కృష్ణునకు ఇష్టులైన ఇతర దేవులు తపస్సు చేయటానికి నిశ్చయించుకొని అరణ్యంలో ప్రవేశించారు. అర్జునుని అనుసరించి వచ్చిన ద్వారకావాసులైన పురుషులను తగిన రీతిగా విభజించి అర్జునుడు వజ్రున కప్పగించాడు. ఆ సమయానికి తగినరీతిగా అదంతా ముగించి అర్జునుడు కళ్ళనిండా నీరు కుక్కుకొని వ్యాసాశ్రమానికి వెళ్ళి అక్కడ కూర్చొని ఉన్న ఆయనను సందర్శించాడు."

8. అర్జున వ్యాసుల సంభాషణ.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "రాజా ! సత్యవాది అయిన వ్యాసుని ఆశ్రమంలో ప్రవేశించి అర్జునుడు ఏకాంతంగా కూర్చొని ఉన్న సత్యవతీ సుతుడైన వ్యాసమునిని చూశాడు. మహావ్రతుడు, ధర్మజ్ఞుడైన ఆ వ్యాసుని సమీపించి "నేను అర్జునుడను" అని పేరు చెపుతూ, పాదాలను నమస్కరించి, నిలిచాడు. సత్యవతీసుతుడైన వ్యాసముని "నీకు స్వాగతం" అన్నాడు. ఆపై ప్రసన్నమనస్కుడై ఆ మహర్షి 'కూర్చో' అన్నాడు. అప్పుడు అర్జునుడు అశాంతమనస్కుడై, మాటిమాటికీ నిట్టూర్పులు విడుస్తున్నాడు. మనస్సు నిర్వేదానికి గురి అయింది. ఆ అర్జునుని చూసి వ్యాసుడు ఇలా అన్నాడు. "గోళ్ళు, వెంట్రుకలు, గుడ్డపీలికలు పడి అపరిశుభ్రమైన కుండలోని నీళ్ళతో స్నానం చేశావా ? రజస్వలతో సంగమించావా ? బ్రాహ్మణుని చంపావా ? యుద్ధంలోకాని ఓడిపోయావా ?

తేజోవిహీనుడవుగా కనిపిస్తున్నావు. భరతర్షభా ! నువ్వు ఎప్పుడూ ఓడిపోయినట్లు నేనెరుగను. మరి ఏమిటిది ? పార్థా ! నేను వినదగినదయితే వెంటనే చెప్పు.

అర్జునుడు చెప్తున్నాడు. "మేఘశ్యాముడు, శ్రీమంతుడు, పుండరీకాయతాక్షుడు అయిన ఆ కృష్ణుడు శరీరాన్ని విడిచి బలరాముని తో పాటు పరంధామాన్ని చేరాడు.

:కృష్ణవాక్య శ్రవణం, కృష్ణస్పర్శ, కృష్ణదర్శనం - వాటితో లభించే సుఖం అమృతం వంటిది. అమృతాత్ముడైన ఆ దేవదేవుని తలచుకొంటూ మోహానికి లోనవుతున్నాను.

బ్రాహ్మణశాపం వలన ముసలం కారణంగా ప్రభాసతీర్థంలో వృష్ణివీరవినాశం రోమాంచజనకంగా జరిగింది. వీరులందరూ చనిపోయారు. బ్రాహ్మణా ! ఈ భోజవృష్ణి - అంధక వంశీయులు శూరులు, మహాత్ములు, సింహగర్వం గలవారు, మహాబలులు. వారు పోరాడుకొని ఒకరినొకరు చంపుకొన్నారు. పరిఘల వంటి బాహువులు గలవారు గదలను, పరిఘలను, శక్తులను సహింపగలవారు. కానీ ఏరకాల దెబ్బతిని చనిపోయారు. కాలమెంత విపరీతమో చూడు. బాహుబలశాలులైన వారు అయిదు లక్షలమంది ఒకరితో ఒకరు కలబడి చావు తెచ్చుకొన్నారు. అమితతేజస్వులయిన వారి వినాశనాన్ని నేను సహించలేక పోతున్నాను. మాటిమాటికి దుఃఖిస్తున్నాను. యశస్వి అయిన కృష్ణుడు, యాదవుల మరణాన్ని గురించి ఆలోచిస్తున్నాను. శ్రీకృష్ణ మరణం సముద్రం ఎండిపోవటం వంటిది. పర్వతం కదలటం వంటిది. ఆకాశం పడటం వంటిది. అగ్నిలోని చల్లదనం వంటిది. అది నమ్మదగినదిగా నా కనిపించటం లేదు. కృష్ణుడు లేకుండా ఈ లోకంలో నిలవా లనుకోవటం లేదు.

తపోధనా ! ఇంత కన్న కష్టతరమైనది మరొకటి ఉంది. విను. బ్రాహ్మణా ! ఈ విషయాన్ని పదేపదే ఆలోచిస్తుంటే నా మనస్సు బ్రద్దలవుతోంది. పంచనదీ ప్రాంతీయులైన ఆభీరులు నన్ను వెన్నంటి పోరాడి వేలకొలదిగ ఉన్న వృష్ణివంశీయుల భార్యలను అపహరించుకొనిపోయారు. నేను వింటిని తీసికొని కూడా అక్కడ దానిని ఎక్కుపెట్టలేకపోయాను. నా భుజాలకు అంతకు ముందున్న భుజబలం నాకప్పుడు లేదు. మహామునీ ! నా వివిధాస్త్రాలూ నశించిపోయాయి. క్షణకాలంలోనే బాణాలన్నీ క్షీణించాయి. అప్రమేయుడు, శంఖచక్రగదాధారి, చతుర్భుజుడు, పీతాంబరుడు, శ్యామలవర్ణుడు, పుండరీకనేత్రుడు, మహాతేజస్వి అయిన ఆ పురుషుడు - కృష్ణుడు నా రథానికి ముందు నిలిచి గతంలో శత్రువులను దహించేవాడు. కానీ ఆ అచ్యుతుడిప్పుడు కనిపించటం లేదు. గతంలో శత్రుసేనలను తన తేజస్సుతో తాను ముందు దహించేవాడు. ఆపై

గాండీవం నుండి వెలువడిన బాణాలతో నేను నశింపజేసేవాడను. సత్యమా ! ఆ కృష్ణుడు కనిపించక నేను విషాదానికి లోనవుతున్నాను. నాకు తల తిరుగుతున్నట్లుంది. మనస్సును నిండుగా నిర్వేద మావహించింది. శాంతిని పొందలేకపోతున్నాను. దేవకీనందనుడు, వాసుదేవుడు, అజుడు, ప్రభువు, వీరుడు అయిన ఆ జనార్దనదేవుడు లేకుండా బ్రతకాలని ఉత్సాహపడటం లేదు. సత్తమా ! కృష్ణుడు వెళ్ళిపోయాడని విని నాకు కూడా దిక్కు తెలియటం లేదు. జ్ఞాతులను, శత్రులను పోగొట్టుకొని, శూన్యుడనై, పారిపోతున్న నాకు శ్రేయస్సు నుపదేశించటానికి తమరే తగినవారు."

వ్యాసుడు చెపుతున్నాడు. "యదువంశీయు లందరూ దైవాంశసంభూతులు. దేవదేవునితో కలిసి వచ్చారు, కలిసి వెళ్ళిపోయారు. ధర్మవ్యవస్థను సంరక్షించటానికి కృష్ణుడు వారిని ఉపేక్షించాడు.

కురుశార్దూలా ! వృష్ణి - అంధక మహారథులందరూ బ్రాహ్మణ శాపదగ్ధులై నశించిపోయారు. వారిని గురించి శోకింపదగదు. అది అలా జరుగవలసి ఉంది. వారి ప్రారబ్ధం అలా ఉంది. శ్రీకృష్ణుడు ఇబ్బందులను తొలగించగలిగి కూడా ఉపేక్షించాడు. లేకపోతే స్థావరజంగమాత్మకాలయిన మూడులోకాలను కూడా మార్చివేయగలవానికి ఆ మహాత్ముల శాపాన్ని మరలించటం ఎంత పని ?

యాదవకాంతలు కూడా గతంలోనే అష్టావక్రుని చూసి నవ్వినందువలన కోపించిన ఆ మునిచే శపింపబడ్డారు. అందుకే నీ బలం క్షీణించింది.

స్నేహం కారణంగా నీ రథానికి ముందు నడుస్తున్న వాసుదేవుడు సాక్షాత్తు చక్రగదాధరుడు, చతుర్భుజుడు, ప్రాచీనముని అయిన నారాయణుడే. విశాలనేత్రుడైన కృష్ణుడు భూభారాన్ని దించి శరీరాన్ని త్యజించి ఉత్తమమైన తనస్థానాన్ని చేరాడు. పురుషశ్రేష్ఠా ! నీవు కూడా భీమ నకుల సహదేవుల సహాయంతో దేవతల మహాకార్యాన్ని చేసి పెట్టావు. కురుపుంగవా ! మీరు కూడా కృతకృత్యులై సిద్ధి పొందారని నా అభిప్రాయం. మీకు కూడా ఇది పరలోకానికి వెళ్ళేకాలమే. అదే మీకు శ్రేయస్కరం. **భారతా ! ఈ రీతిగా బుద్ధి, తేజస్సు, జ్ఞానం - ఇవి పుట్టవలసిన వేళలో పుడతాయి. విపరీత సమయంలో నశించిపోతాయి.***

ధనంజయా ! అన్నింటికీ కాలమే మూలం. సర్వజగత్తుకు కూడా కాలమే

---

* **ఏవం బుద్ధిశ్చ తేజశ్చ ప్రతిపత్తిశ్చ భారత ॥ 32**
భవంతి భవకాలేషు వివిపద్యంతే వివర్యయే ।

మూలం. మరలా అనుకోకుండా కాలమే అన్నింటిని ఉపసంహరిస్తుంది. ఆ కాలమే ఒకప్పుడు బలశాలియై, ఇంతలో దుర్బలమవుతుంది. ఒకప్పుడు తానే మొత్తాన్ని శాసిస్తుంది. మరల ఇతరుల ఆదేశాలకు లొంగిపోతుంది. నీ అస్త్రాలు పనిముగించుకొని వచ్చిన రీతిలోనే వెళ్ళిపోయాయి. మరల సమయం సమీపించినప్పుడు నీ చేతికి రాగలవు. భారతా ! ఉత్తమగతిని పొందటానికి మీకు కూడా ఇదే తగిన కాలం. భరతర్షభా ! మీకిదే పరమశ్రేయస్సని నేను భావిస్తున్నాను." "అమితతేజస్వి అయిన వ్యాసుని ఈ మాటలను అవగతం చేసికొని, ఆయన అనుమతి తీసికొని, అర్జునుడు హస్తినాపురికి వెళ్ళిపోయాడు. ఆ వీరుడు హస్తినాపురిలో ప్రవేశించి, యుధిష్ఠిరుని కలిసి, వృష్ణి-అంధక వంశాలను గురించి జరిగినది జరిగినట్లు చెప్పాడు."

ఇది మౌసల పర్వం

। శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
మహాప్రస్థానిక పర్వం

1. ద్రౌపదీ పాండవుల మహాప్రస్థానము.

నారాయణం నమస్కృత్య వరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరుల మనస్సులే నివాస స్థానమైన నారాయణునికీ, నరోత్తమునికీ, సరస్వతీ దేవికీ, వ్యాసమహర్షికీ నమస్కరించి శ్రీమహాభారతమును చదువవలెను/ చెప్పవలెను.

జనమేజయుడిలా అడిగాడు. "ఈ రీతిగా వృష్ణి అంధకవంశాలలో ముసలం కారణంగా జరిగిన యుద్ధాన్ని గూర్చి విని, శ్రీకృష్ణుడు పరమపదాన్ని పొందగా పాండవులు ఏం చేశారు?" వైశంపాయనుడు చెప్తున్నాడు. "కురురాజైన ధర్మనందనుడు వృష్ణివంశంలో పుట్టిన మహాసంగ్రామాన్ని గూర్చి విని, మహాప్రస్థానంపై బుద్ధిని నిలిపి అర్జునునితో ఇలా అన్నాడు. "మహామతీ! కాలమే సర్వప్రాణులనూ పక్వం చేస్తుంది. నేను కాలపాశానికి లోబడబోతున్నాను. నీవు కూడా ఆ విధంగానే ఆలోచించు." యుధిష్ఠిరుడు అలా అనగానే అర్జునుడు "కాలం కాలమే" అంటూ ధీమంతుడైన పెద్దన్న మాటను ఆమోదించాడు. అర్జునుని అభిప్రాయాన్ని గ్రహించి, భీమసేనుడు, నకుల సహదేవులు అర్జునుడు చెప్పిన మాటను ఆమోదించారు. ఆ తరువాత యుధిష్ఠిరుడు యుయుత్సుని పిలిపించి, ధర్మాసక్తితో రాజ్యాన్ని వీడి వెళుతూ వైశ్యాసుతుడైన యుయుత్సునకు రాజ్యబాధ్యత నంతా అప్పగించాడు. ఆపై తన రాజ్యానికి పరిక్షితుని రాజుగా అభిషేకించి పాండవాగ్రజుడైన యుధిష్ఠిరుడు దుఃఖార్తుడై సుభద్రతో ఇలా అన్నాడు.

"ఈ నీ మనుమడు కురురాజు అవుతున్నాడు. యదువులలో మిగిలినవారికి వజ్రుడు రాజుగా చేయబడ్డాడు. హస్తినపురంలో పరీక్షిత్తును, శక్రప్రస్థంలో యాదవరాజైన వజ్రుని నీవు రక్షించాలి. అధర్మంపై మనసు పెట్టవద్దు." ధర్మాత్ముడైన ధర్మరాజు ఆ

రీతిగా పలికి ధీమంతుడైన వాసుదేవునకు, వృద్ధుడైన మేనమామకు (వసుదేవుడు), బలరామాదులకు సోదరులతో కలిసి అలసత లేకుండా జలాంజలిని సమర్పించి, ఆ తరువాత వారినుద్దేశించి యథావిధిగా శ్రాద్ధకర్మను కూడా చేశాడు. ధర్మరాజు వ్యాసుని, నారదుని, తపోధనుడైన మార్కండేయుని, భారద్వాజుని, యాజ్ఞవల్క్యుని రుచికర పదార్థాలతో భుజింపజేశాడు. ఇదంతా శ్రీకృష్ణుని ఉద్దేశించి చేశాడు. శ్రీకృష్ణుని నామాన్ని కీర్తిస్తూ బ్రాహ్మణ శ్రేష్ఠులకు రత్నాలను, వస్త్రాలను, గ్రామాలను, గుర్రాలను, రథాలను, స్త్రీలను వందలు, వేల కొలదిగా దానం చేశాడు. ఆపై ధర్మరాజు గురువైన కృపుని అర్చించి, పురజనులతో సహా పరిక్షిత్తును ఆయనకు శిష్యునిగా సమర్పించాడు. ఆపై రాజర్షి అయిన యుధిష్ఠిరుడు ప్రకృతులను (ప్రజలు, మంత్రులు వగైరా) అందరినీ రప్పించి తాను చేయదలచుకొన్న విషయమంతా చెప్పాడు. పౌరులు, జానపదులు అయిన ఆ జనులందరూ ఆ ధర్మజుని మాటను వినినంతనే మనస్సులలో తీవ్రంగా కలవరపడ్డారు. ఆయన మాటను అంగీకరించలేకపోయారు. "అలా చేయవద్దు" అని వారు ధర్మరాజుతో అన్నారు. కానీ ధర్మజునకు కాలపరిభ్రమణంలో సంభవించే ధర్మస్వరూపం బాగా తెలుసుకాబట్టి ప్రజాభిప్రాయాన్ని మన్నించలేదు.

ఆ తరువాత ధర్మ స్వరూపుడైన ధర్మజుడు పౌరులను, జానపదులను ఒప్పించి, వారి అనుమతి పొంది, వెళ్ళిపోవటానికే నిశ్చయించుకొన్నాడు. అప్పుడు ఆయన సోదరులు కూడా అదే నిర్ణయంలో ఉన్నారు. ధర్మసుతుడు అయిన యుధిష్ఠిర నరపాలుడు శరీరం నుండి ఆభరణాలను తొలగించుకొని వల్కలాలు ధరించాడు. అదేరీతిగా భీమార్జున నకుల సహదేవులు, యశస్విని అయిన ద్రౌపది అందరూ వల్కలాలను స్వీకరించారు. అప్పుడు యథావిధిగా ప్రస్థాన కాలంలో చేయవలసిన ఇష్టిని జరిపించి, ఆ నరోత్తములందరూ అగ్నులను నీటిలో విడిచిపెట్టి బయలుదేరారు. ఆ తరువాత గతంలో జూదంలో ఓడిపోయినప్పుడు వెళ్ళినట్లు, ద్రౌపదితో సహా ఆరుగురై బయలుదేరిన ఆ నరోత్తములను చూసి స్త్రీలందరూ రోదించారు. కానీ తమ ప్రస్థానం ఆ సోదరులకు అందరకూ హర్షాన్ని కలిగించింది. యుధిష్ఠిరుని అభిప్రాయాన్ని గ్రహించి, వృష్ణి వంశవినాశనాన్ని చూసి, ఆ సోదరులు అయిదుగురు, ఆరవదిగా ద్రౌపది, ఏడవదిగా కుక్క - కలిసి బయలుదేరారు. పౌరులు, అంతఃపురకాంతలు అందరూ చాలా దూరం తోడు నడవగా, ఆ ఆరుగురితో కలిసి ఏడవవాడైన ధర్మరాజు హస్తినాపురం నుండి బయలుదేరాడు. ఒక్కరు కూడా 'వెనుదిరగండి' అని ప్రయాణాన్ని ఆపలేకపోయారు. ఆపై నగరవాసులు అందరూ వెనుదిరిగారు.

కృపుడు మొదలయినవారు కూడా యుయుత్సుని చుట్టూ నడుస్తూ వెనుకకు వచ్చారు. కౌరవ్యా! నాగరాజకుమారి అయిన ఉలూపి గంగలో ప్రవేశించింది. చిత్రాంగద మణిపూర నగరానికి వెళ్ళిపోయింది. మిగిలిన తల్లులు అందరూ పరిక్షితుని చుట్టూ నిలిచి వెనుదిరిగారు.

ఆపై మహాత్ములైన పాండవులు, కీర్తిమతి అయిన ద్రౌపది ఉపవాసవ్రతాన్ని పాటిస్తూ తూర్పుదిశగా బయలుదేరారు. మహాత్ములైన వారందరూ యోగయుక్తులై, త్యాగధర్మాన్ని పరిపాలిస్తూ, అనేకదేశాలను, నదులను, సముద్రాలను సందర్శించారు. ముందు యుధిష్ఠిరుడు, ఆ వెనుక భీముడు, అతనివెంట అర్జునుడు, అర్జునుని అనుసరిస్తూ క్రమంగా నకుల సహదేవులు నడవసాగారు. పద్మదళేక్షణ, స్త్రీజాతిలో మేటి అయిన ద్రౌపది వారందరి వెనుక నడవసాగింది. వనానికి బయలుదేరిన ఆ పాండవులను ఒక కుక్కకూడా అనుసరించింది. క్రమంగా సాగుతున్న ఆ వీరులు ఎర్రని నీరుగల సముద్రపు ఒడ్డుకు చేరారు. రత్నలోభంతో అర్జునుడు తన దివ్య గాండీవాన్ని, అక్షయతూణీరాలను విడిచిపెట్టలేదు. అప్పుడు వారు పురుషవిగ్రహాన్ని ధరించి, కొండవలె ఎదుట నిలిచి దారి నడ్డగించి ఉన్న సాక్షాత్తు అగ్నిదేవుని వారు చూశారు.

ఆ అగ్నిదేవుడు పాండవులతో ఇలా అన్నాడు. "వీరపాండు కుమారులారా! నన్ను అగ్నిగా తెలిసికోండి. యుధిష్ఠిరా! భీమసేనా! అర్జునా! నకుల సహదేవులారా! నా మాట వినండి. నేను అగ్నిని. అర్జున, నారాయణుల ప్రభావంతో నేను ఖాండవవనాన్ని దహించాను. ఈ మీ సోదరుడు అర్జునుడు పరమాయుధమైన గాండీవాన్ని వదలి అరణ్యానికి వెళ్ళాలి. దానితో మీకిక ఏ ప్రయోజనమూ లేదు. మహాత్ముడైన కృష్ణుని చేతిలో అంతకు ముందున్న చక్రరత్నం కూడా వెళ్ళిపోయింది. అవసరపడినప్పుడే అది మరలా వస్తుంది. ధనుస్సులలో శ్రేష్ఠమైన ఈ గాండీవాన్ని నేను గతంలో అర్జునుని కోసం వరుణుని నుండి తెచ్చాను. తిరిగి దానిని వరుణునకే ఇవ్వండి". అప్పుడు సోదరులందరూ అర్జునుని గాండీవాన్ని త్యజించమని ప్రోత్సహించారు. అర్జునుడు ఆ వింటిని, అక్షయ తూణీరాలను నీటిలోనికి విసిరాడు. ఆపై అగ్ని అక్కడే అదృశ్యమయ్యాడు. వీరులైన ఆ పాండవులు దక్షిణాభిముఖులై వెళ్ళారు. ఆ తరువాత వారు లవణ సముద్రపు ఉత్తరతీరంపై నైరృతి మూలవైపుగా ముందుకు సాగారు. ఆ తరువాత వారు కేవలం పడమటి వైపుకు తిరిగారు. సాగరంలో మునిగి ఉన్న ద్వారకాపురిని చూశారు. యోగధర్మంలో నిలిచిన ఆ భరతసత్తములు మరల అక్కడనుండి వెనుదిరిగి భూప్రదక్షిణం చేయదలచి ఉత్తరదిక్కుగా నడవసాగారు."

2. ద్రౌపదీ సహదేవ నకుల అర్జున భీమసేనుల పతనము.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "ఆ తరువాత మనస్సులను నియంత్రించుకొని ఉత్తరదిక్కును ఆశ్రయించిన యోగయుక్తులైన ఆ పాండవులు మహాపర్వతమైన హిమగిరిని చూశారు. దానిని కూడా అతిక్రమించి, వారు ఇసుకసముద్రాన్ని చూశారు. పర్వతశ్రేష్ఠమై, మహాపర్వతమైన మేరువును కూడా చూశారు. యోగధర్మంలో నిలిచి వారందరూ వేగంగా నడుస్తుండగా యోగభ్రష్టయై ద్రౌపది నేల గూలింది. పడిపోయిన ఆ ద్రౌపదిని చూసి, మహాబలుడైన భీమసేనుడు ద్రౌపదిని చూపిస్తూ ధర్మరాజుతో ఇలా అన్నాడు. "ఈ రాజకుమారి ఏ అధర్మమూ చేయలేదు. ఈ ద్రౌపది నేలబడిపోవటానికి కారణమేమిటో చెప్పు". యుధిష్ఠిరుడిలా చెప్పాడు "పురుషశ్రేష్ఠా! ఈమెకు అర్జునునిపై పక్షపాత మెక్కువ. దాని ఫలితాన్ని ఈమె ఇప్పుడు ఇలా అనుభవిస్తోంది." వైశంపాయనుడు చెప్పాడు. అలా పలికి ఆమె వైపు చూడకుండానే భరతసత్తముడు, పురుషశ్రేష్ఠుడు, ధర్మాత్ముడు, ధీమంతుడు అయిన యుధిష్ఠిరుడు మనస్సును ఏకాగ్రతతో నిలిపి ముందుకుసాగాడు. ఆపై పండితుడైన సహదేవుడు నేలపై పడిపోయాడు. అతడు కూడా పడటం చూసి భీముడు ధర్మరాజును ఇలా అడిగాడు. "మన అందరిని సేవిస్తూ, అహంకారం లేకుండా జీవించిన ఈ మాద్రికొడుకు ఎందుకు నేలపై పడిపోయాడు?" యుధిష్ఠిరుడిలా చెప్పాడు. "ఇతడు ఇతరులనెవ్వరినీ తనంత మేధావిగా భావించలేదు. ఆ దోషం వలన ఈ రాజకుమారుడు పడిపోయాడు." వైశంపాయనుడు చెప్తున్నాడు. "అలా పలికి కుంతికొడుకైన యుధిష్ఠిరుడు అప్పుడు సహదేవుని వదలి, ఇతర సోదరులతో, కుక్కతో సహా ముందుకు సాగాడు.

ద్రౌపది, సహదేవుడు పడిపోవటం చూసి, ఆర్తుడు, బంధుప్రియుడు, శూరుడు అయిన నకులుడు పడిపోయాడు. వీరుడు, సుందరుడు అయిన నకులుడు పడిపోగానే భీముడు మరల ధర్మరాజు నిలా అడిగాడు. "ఈ నకులుడు ధర్మాన్ని ఎప్పుడూ భంగపరచనివాడు, మన ఆదేశాలను పాటించేవాడు, సాటిలేని సౌందర్యవంతుడు. ఈ మన సోదరుడు ఎందుకు నేలబడిపోయాడు?" భీమసేనుడు అలా అడగగానే సర్వబుద్ధిమంతులలో ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడు నకులుని గురించి ఇలా అన్నాడు. "రూపంలో నా అంతటివాడు లేడని ఇతని భావం. నేనొక్కడనే అందంలో అందరినీ మించినవాడ నని కూడా ఇతని మనస్సులో ఉంది. కాబట్టి నకులుడు పడిపోయాడు. భీమసేనా! నీవు రా! వీరా! ఎవరికి ఏది విధింపబడి ఉంటుందో దాన్ని అతడు తప్పక అనుభవించాలి." ఆ తరువాత అర్జునుడు వారంతా పడిపోవటం చూసి శోకసంతప్తుడై

తానూ పడిపోయాడు. అర్జునుడు ఎవ్వరూ ఎదిరింపలేనివాడు. ఇంద్రుని వంటి తేజస్సు గలవాడు. పురుషశ్రేష్ఠుడైన ఆ అర్జునుడు కూడా పడిపోవటం చూసి భీముడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

"ఈ మహాత్ముడు సరదాకు కూడా అసత్యమాడినట్లు గుర్తులేదు. మరి ఏ పరిణామం కారణంగా ఇతడు నేలపై పడిపోయాడు?" యుధిష్ఠిరుడన్నాడు. "ఒక్క రోజులో శత్రువులనందరినీ దహించివేస్తానని అర్జునుడు అన్నాడు. కానీ ఆ పనిచేయలేదు. అందువల్ల తననుతాను శూరుడ ననుకొనే అర్జునుడు పడిపోయాడు. ఈ అర్జునుడు ఇతర ధనుర్ధారుల నందరినీ అవమానించాడు. దాని ఫలితమిది. శ్రేయస్కాముడు అలా ప్రవర్తించదగదు." "అలా చెప్పి యుధిష్ఠిరుడు బయలుదేరాడు. అప్పుడు భీముడు పడిపోయాడు. నేలబడి, భీముడు యుధిష్ఠిరుడైన ధర్మజుని ఇలా అడిగాడు. 'రాజా! చూడు. నీకు ప్రియుడనైన నేను పడిపోయాను. నీకు తెలిస్తే నేను ఏ కారణంగా పడిపోయానో చెప్పు!' యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు. 'నీవు ఎక్కువ తింటావు. ఇతరులను ఏమీ పట్టించుకోకుండా నీ బలంతో ప్రగల్భిస్తుంటావు. అందువలన నేలపై పడిపోయావు.' అలా పలికి యుధిష్ఠిరుడు భీమునివైపు చూడకుండా వెళ్ళిపోయాడు. నేనింతకుముందు చాలాసార్లు ప్రస్తావించిన కుక్క కూడా ఆయనను అనుసరించింది."

3. యుధిష్ఠిరుడు స్వర్గమున కేగుట.

"ఆ తరువాత భూమ్యాకాశాలను దద్దరిల్లజేస్తూ ఇంద్రుడు రథంపై యుధిష్ఠిరుని దగ్గరకు వచ్చి "ఎక్కు," అని ధర్మజునితో అన్నాడు. యుధిష్ఠిరుడైన ధర్మరాజు తన సోదరులందరు పడిపోవటం చూసి, శోకసంతప్తుడై ఇంద్రునితో ఇలా అన్నాడు. "నా సోదరులందరూ ఇక్కడ పడిపోయారు. నాతోపాటు వారు కూడా రావాలి. సురేశ్వరా! నా సోదరులు లేకుండా స్వర్గానికి వెళ్ళటానికి నేను ఇష్టపడటం లేదు. సుఖాలకు తగిన సుకుమారి ఈ రాజకుమారి ద్రౌపది. ఆమె కూడా మాతో రావాలి. దానిని నీవు అనుమతించు." ఇంద్రుడిలా అన్నాడు. "భరతర్షభా! ద్రౌపదితో కలిసి నీ సోదరులందరూ ముందే స్వర్గానికి వెళ్ళిపోయారు. వారిని అక్కడ చూడవచ్చు. బాధపడవద్దు. వారు మానవశరీరాన్ని వీడి స్వర్గానికి వెళ్ళారు. నీవు ఈ శరీరంతో స్వర్గానికి చేరగలవు. సందేహం లేదు."

యుధిష్ఠిరు డడిగాడు. "నీవు భూతభవిష్యత్తులకు నిర్దేశకుడవు. ఈ కుక్క నిత్యమూ భక్తితో నన్ను సేవిస్తుంది. నాతో పాటు అది కూడా రావాలి. నా బుద్ధి

క్రూరంగా ప్రవర్తించలేదు." ఇంద్రుడన్నాడు. "నీవు నేడు అమర్త్యత్వాన్ని, నాతో సమానత్వాన్ని, మహాసిద్ధిని, పూర్ణసంపదను, స్వర్గసుఖాలను పొందావు. ఈ కుక్కను విడిచిపెట్టు. అలా ప్రవర్తించటం క్రూరత్వం కాదు." యుధిష్ఠిరుడు అన్నాడు. "ఆర్యా! ఆర్యుడు అమర్యాదగా ప్రవర్తించలేడు. దీనిని విడవటం కష్టం. భక్తజనాన్ని వీడి రావలసినంత సంపదతో కలయిక నాకు అవసరం లేదు." ఇంద్రుడన్నాడు. "స్వర్గలోకంలో కుక్కతోపాటు నివసించే వారికి స్థానం లేదు. వారి ఇష్టాపూర్తాలను (యజ్ఞాదిఫలం, పుణ్య కర్మఫలం) క్రోధవశులనే రాక్షసులు హరిస్తారు. కాబట్టి ధర్మరాజా! ఆలోచించి ప్రవర్తించు. కుక్కను విడచిపెట్టు. ఇది క్రూరత్వం కాదు." యుధిష్ఠిరుడన్నాడు. "మహేంద్రా! భక్తులను విడనాడటం తీవ్రమైన పాపం. లోకంలో అది బ్రహ్మహత్యతో సమానం. కాబట్టినేను ఎప్పుడూ ఏ రీతిగానూ నా సుఖం కోసం దీనిని విడువను. భయపడిన భక్తుని, మరోగతి లేదని వచ్చిన ఆర్తుని, తనను తాను రక్షించుకొనలేకపోయినా బ్రతుకుమీద ఆశగలవానిని ప్రాణాలు పోయినాసరే నేను విడిచే ప్రయత్నం చేయను. ఇది నా నిత్యవ్రతం." ఇంద్రుడన్నాడు. "మనిషి దానం, యజ్ఞం, స్వాధ్యాయం, హోమం వంటి పుణ్యకర్మలు చేసినా వాటిపై కుక్కచూపు పడితే క్రోధవశులు ఆ ఫలాన్ని హరిస్తారు. కాబట్టి ఈ కుక్కను విడిచిపెట్టు. అప్పుడే నీవు దేవలోకంలో ప్రవేశించగలవు. వీరా! నీ సోదరులను, ప్రియభార్యఅయిన ద్రౌపదిని వీడి, నీ కర్మ ఫలితంగా ఈలోకాన్ని చేరబోతున్నావు. ఈ కుక్కను ఎందుకు వదిలిపెట్టవు? అంతా త్యజించి కూడా మరల మోహానికి గురి అవుతున్నావు."

యుధిష్ఠిరుడన్నాడు. "చనిపోయిన వారితో సంధి కానీ, యుద్ధం కానీ లేదన్నది లోకనిష్ఠం. వారిని నేను బ్రతికింపజేయలేక పోయాను. అందుకే విడిచిపెట్టాను కానీ బ్రతికి ఉన్నప్పుడు వీడలేదు. ఇంద్రా! శరణాగతుని భయపెట్టడం, స్త్రీ వధ, బ్రాహ్మణ ధనాపహరణం, మిత్రద్రోహం - ఈ నాలుగింటితోనూ భక్త పరిత్యాగ మొక్కటే సమానం అని నా అభిప్రాయం." "ధర్మస్వరూపుడైన ఆ ధర్మజుని మాటలను విని, పూజ్యుడైన ధర్మరాజు (కుక్క రూపంలో నున్న ధర్మదేవత) ప్రశంసా పూర్వకంగా మృదుమధుర వచనాలతో యుధిష్ఠిర నరపాలునితో ఇలా అన్నాడు." "రాజేంద్రా! భారతా! నీ నడవడితో, ప్రజ్ఞతో, ఈ సర్వభూతదయతో ఉత్తమ వంశంలోని పుట్టుకను సార్థకం చేసికొన్నావు. నాయనా! గతంలో కూడా నీటికోసం పరాక్రమించి, నీ సోదరులు మరణించినపుడు ద్వైతవనంలో నిన్ను నేను పరీక్షించాను. నీ తోడబుట్టిన వారైన భీమార్జునులను కూడా కాదని తల్లులకు సమానత్వాన్ని ఆశించి, నకులుని బ్రతికించమన్నావు. ఈ కుక్క నీ భక్తుడంటూ దేవరథాన్ని కూడా పరిత్యజించగలిగావు. కాబట్టి స్వర్గంలో నీవంటి రాజు

మరొకడెవ్వడూ లేడు. అందువలననే నీకు నీ శరీరంతోనే అక్షయలోకప్రాప్తి, దివ్యమైన ఉత్తమగతి కూడా నీకు లభించింది." "ఆపై ధర్ముడు, ఇంద్రుడు, మరుద్గణాలు, అశ్వినులు, దేవతలు, దేవర్షులు యుధిష్ఠిరుని రథంపైకి ఎక్కించుకొని తమతమ విమానాలలో, బయలుదేరారు. వారంతా కామచారులు, రజోగుణ శూన్యులు, పుణ్యాత్ములు, మనసా వాచా, కర్మణా పుణ్యకర్ములు, సిద్ధులు కూడా. ధర్మరాజు ఆ రథాన్ని ఎక్కి, తన తేజస్సుతో భూమ్యాకాశాలను నింపుతూ వేగంగా పైకి పయనించసాగాడు.

ఆపై సర్వలోకవేత్త, మహాతపస్వి, వాగ్మి అయిన నారదుడు దేవతల మధ్యలో నిలిచి పెద్దగా ఇలా అన్నాడు. "ఎందరో రాజర్షులు స్వర్గంలో ఉన్నారు. వారంతా వచ్చారు. ధర్మరాజు వారందరి కీర్తినీ కప్పివేసి తాను పైచేయిగా వెలుగుతున్నాడు. యశస్సుతో, తేజస్సుతో, శీలసంపదతో లోకాలను ఆవరించి, సశరీరంగా స్వర్గానికి వచ్చినవాడు ధర్మరాజు. యుధిష్ఠిరా! నేలపై నుండి నీవు ఆకాశంలోని తేజస్సులనెన్నింటినో చూశావు. ఇదిగో, అవన్నీ వేలకొలదిగ ఉన్న దేవలోకాలు. గమనించు." నారదుని మాట విని, ధర్మాత్ముడైన ధర్మరాజు దేవతలు, స్వపక్షీయులైన రాజుల అనుమతితో ఇలా అన్నాడు. "శుభమైనా, అశుభమైనా నా సోదరులు పొందే స్థానమేదో అదే నేనూ పొందగోరుతున్నాను. ఇతరలోకాలు నాకు ఇష్టం లేదు." ధర్మరాజు మాటవిని దేవరాజైన ఇంద్రుడు మృదువుగా యుధిష్ఠిరునకిలా బదులిచ్చాడు.

"రాజేంద్రా! ఈ స్థానంలో నివసించు. నీవు నీ శుభకర్మలతో దీనిని గెలుచుకొన్నావు. ఇప్పటికీ నీవు మానవలోకంలోని స్నేహబంధాలను ఎందుకు లాగుతున్నావు. కురునందనా! మరే మగవానికీ ఎక్కడా సాధ్యపడని పరమసిద్ధిని పొందావు. నీ సోదరులు అటువంటి స్థానాన్ని పొందలేదు. రాజా! ఇప్పటికీ నీ మనస్సు మానుషభావాన్నే స్పృశిస్తోంది. ఇది స్వర్గం. ఇక్కడున్న దేవర్షులను, సిద్ధులను గమనించు." ఇలా పలుకుతున్న లోకపాలకుడైన దేవేంద్రుని మాట విని ధీమంతుడైన ధర్మరాజు సార్థకంగా మరలా ఇలా అన్నాడు. "వారు లేకుండా ఇక్కడ నివసించటానికి నేను ఇష్టపడటం లేదు. నా సోదరులు వెళ్ళిన చోటకే నేను కూడా వెళ్ళాలనుకొంటున్నాను. ఉన్నతమైన ఆకారంతో, బుద్ధిసత్త్వగుణాలతో, శ్యామల వర్ణంతో గూడిన ద్రౌపది ఉన్న చోటికే నేను కూడా వెళ్ళాలనుకొంటున్నాను".

ఇది మహాప్రస్థానిక పర్వం

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
స్వర్గారోహణ పర్వం

1. నారద యుధిష్ఠిర సంవాదము.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరుల మనస్సులే నివాస స్థానమైన నారాయణునికీ, నరోత్తమునికీ, సరస్వతీ దేవికీ, వ్యాసమహర్షికీ నమస్కరించి శ్రీమహాభారతమును చదువవలెను/ చెప్పవలెను.

జనమేజయుడు అడిగాడు. "నా పూర్వపితామహులైన పాండవ ధార్తరాష్ట్రులు త్రిలోక సమాహారరూపమైన స్వర్గలోకాన్ని చేరి ఏయే స్థానాలను పొందారు? దీనిని వినాలనుకొంటున్నాను. అద్భుతకృత్యాలు చేసే వ్యాసమహర్షి అనుజ్ఞతో నీవు సర్వవేత్తవు అయ్యావని నా అభిప్రాయం." "నీ పూర్వపితామహులైన ధర్మరాజాదులు త్రిలోక సమాహారరూపమైన స్వర్గాన్ని చేరి ఏం చేశారో చెపుతాను విను. త్రిలోక సమాహారరూపమైన స్వర్గాన్ని చేరి ధర్మరాజు సింహాసనంపై కూర్చొని వెలిగిపోతున్న దుర్యోధనుని చూశాడు. అతడు వీరశోభతో గూడి సూర్యునివలె దేదీప్యమానుడై ఉన్నాడు. ప్రక్కల తేజస్వులయిన దేవతలు, పుణ్యకర్ములయిన సాధ్యులు ఆసీనులై ఉన్నారు. ఆపై యుధిష్ఠిరుడు దుర్యోధనునీ, దుర్యోధనునిలోని తేజస్సును చూసి, అసహనంతో వెంటనే వెనుదిరిగాడు. వెనుదిరిగి పెద్ద గొంతుతో వారందరితో ఇలా అన్నాడు.

"నేను దుర్యోధనునితో కలిసి ఈ పుణ్యలోకాలను పొందా లనుకోవటం లేదు. ఇతడు లుబ్ధుడు. దూరదృష్టిలేనివాడు. ఇతని కారణంగానే మేము బలపూర్వకంగా యుద్ధంలో మిత్రులను, బంధువులను చంపవలసివచ్చింది. భూమినంతా నాశనం చేయవలసి వచ్చింది. మహావనంలో ఎన్నో కష్టాలను పొందవలసి వచ్చింది. ధర్మచారిణి, అనవద్యాంగి

అయిన పాంచాలరాజకుమారి ద్రౌపది మా ధర్మపత్ని, సభామధ్యంలో, గురువుల సన్నిధిలో ఈడ్చబడింది. దేవతలారా! నాకు సుయోధనుని చూడా లనిపించటం లేదు. నా సోదరులున్నచోటికే నేను వెళ్ళగోరుతున్నాను." ఆ మాటలు విని నారదుడు నవ్వుతూ "లేదు. లేదు. అలా అనకూడదు. రాజేంద్రా! స్వర్గనివాసంలో శత్రుత్వం కూడా నశించిపోతుంది. యుధిష్ఠిరా! మహాబాహూ! ఏ రీతిగానూ దుర్యోధనుని గురించి ఇలా మాటాడరాదు. నా ఈ మాట విను. ఈ దుర్యోధన నరపాలుని దేవతలతో పాటు ఎప్పటినుండియో స్వర్గలోకంలో ఉన్న ఈ రాజశ్రేష్ఠులు కూడా సమ్మానిస్తున్నారు. యుద్ధంలో తాను తనుత్యాగం చేసి వీరులగతిని పొందాడు. యుద్ధంలో దేవతాతుల్యులైన మీ అందరినీ ఎదిరించి నిలిచాడు. మహాభయసమయంలో కూడా నిర్భయంగా నిలిచాడు. ఆ రీతిగా తన క్షాత్రధర్మంతో ఈ స్థానాన్ని పొందాడు. నాయనా! జూదం వలన జరిగిన దానిని మనస్సులో పెట్టుకోవద్దు. ద్రౌపది పొందిన కష్టాన్ని గురించి కూడా ఆలోచింపనవసరం లేదు. ఇవేగాక జ్ఞాతిత్వం వలన మీరు పడిన ఇతర కష్టాలను - అవి రణభూమిలో కావచ్చు, అన్యత్ర కావచ్చు - తలచుకొనరాదు. రాజా! యధాన్యాయంగా దుర్యోధనుని చేరు. ఇది స్వర్గం. ఇక్కడ శత్రుత్వాలుండవు."

నారదుడు అలా పలుకగానే మేధావి, కురురాజైన యుధిష్ఠిరుడు తన సోదరులను గురించి అడుగుతూ ఇలా అన్నాడు. "దుర్యోధనుడు అధర్మజ్ఞుడు, పాపి, లోకంలోని మిత్రులకు ద్రోహం చేసినవాడు, అతనివలననే గుర్రాలు, సైనికులు, ఏనుగులతో సహా భూమి నశించింది. మేము కూడా శత్రుత్వానికి బదులు తీర్చుకోవాలని కోపంతో దహించుకొని పోయాం. ఇటువంటి దుర్యోధనుడే ఇక్కడుంటే మహాత్ములు, మహావ్రతులు, సత్యప్రతిజ్ఞులు, సత్యవాదులు, శూరులు అయిన నా సోదరులు పొందిన లోకాలేవి? వారిని నేను చూడగోరుతున్నాను. మహాత్ముడు, సత్యప్రతిజ్ఞుడు, కౌంతేయుడు అయిన కర్ణుని కూడా చూడగోరుతున్నాను. ధృష్టద్యుమ్నుని, సాత్యకిని, ధృష్టద్యుమ్నుని కొడుకులను చూడగోరుతున్నాను. బ్రహ్మ స్వరూపా! నారదా! క్షాత్రధర్మాన్ని పాటిస్తూ యుద్ధంలో ఆయుధాల ద్వారా మరణించిన రాజులెక్కడ? వారినందరినీ చూడగోరుతున్నాను. విరాటుని, ద్రుపదుని, ధృష్టకేతువు మొదలయిన పాంచాల రాజకుమారులను, శిఖండిని, ద్రౌపది కొడుకులనందరినీ, దుర్ధర్షుడైన అభిమన్యుని చూడగోరుతున్నాను."

2. యుధిష్ఠిరుడు నరకమును దర్శించుట.

యుధిష్ఠిరు డడిగాడు. "దేవతలారా! అమిత బలశాలి అయిన రాధేయుడు ఇక్కడ కనిపించటం లేదు. సోదరులు, మహాత్ములు అయిన యుధామన్యువు, ఉత్తమౌజులు కూడా కనిపించటం లేదు. రణాగ్నిలో తమ శరీరాలను ఆహుతి చేసిన మహారథులు, రణభూమిలో నాకై చనిపోయిన రాజులు, రాజకుమారులు శార్దూలం వంటి పరాక్రమం గలవారు. ఆ మహారథులందరూ ఎక్కడ? ఆ పురుషశ్రేష్ఠులు కూడా ఈ స్వర్గలోకాన్ని గెలుచుకొన్నారా? దేవతలారా! ఆ మహారథులందరూ ఈ లోకాలను పొంది ఉంటే నన్ను కూడా మహాత్ములతో పాటే ఉన్నట్టు భావించండి. ఒకవేళ ఆ రాజులు ఈ అక్షయ శుభలోకాలను పొందనట్లయితే, నేను ఆ సోదరులు, దాయాదులు లేకుండా ఇక్కడ వినోదించలేను. యుద్ధం ముగిసిన తరువాత జలాంజలిని సమర్పిస్తున్న సమయంలో "కర్ణుని కూడా జలాంజలిని ఇవ్వ"మని నా తల్లి పలికిన మాట విన్నప్పటి నుండి అతనికై తపించిపోతున్నాను. దేవతలారా! 'నా తల్లి పాదాలవంటి కర్ణుని పాదాలను చూసి కూడా నేను శత్రుబలపీడకుడైన కర్ణుని అనుసరించలేకపోయాను.' అన్నది నన్ను అదేపనిగా తపింపజేస్తున్నది. మేము కర్ణునితో కలిసి ఉంటే ఇంద్రుడు కూడా మమ్ములను యుద్ధంలో గెలువలేడు. ఆ కర్ణుడెక్కడున్నా సరే నేను చూడగోరుతున్నాను. సోదరుడని తెలియక నేను అర్జునుని ద్వారా అతనిని చంపించాను. భీముడు నా ప్రాణాలకన్న నాకిష్టమైనవాడు, భీమపరాక్రముడైన అతనిని, ఇంద్రతుల్యుడైన అర్జునుని, యమ సమానులైన నకుల సహదేవులను, ధర్మచారిణి అయిన ద్రౌపదిని చూడగోరుతున్నాను. నాకు ఇక్కడ ఉండాలని లేదు. ఇది సత్యం. మీకు చెప్తున్నాను. దేవతాశ్రేష్ఠులారా! సోదరులు లేని నాకు స్వర్గమెందుకు? వారున్న చోటే నాకు స్వర్గం. వారు లేకపోతే నా దృష్టిలో ఇది స్వర్గమే కాదు."

దేవతలిలా అన్నారు. "నాయనా! నీకు వారిమీదనే శ్రద్ధ ఉంటే అక్కడకే వెళ్ళు. జాగు చేయవద్దు. దేవరాజశాసనాన్ని అనుసరించి నీకిష్టమైన పనినే మేము చేయాలి?" వైశంపాయనుడు చెప్తున్నాడు. "పరంతపా! ఆ రీతిగా పలికి వారు యుధిష్ఠిరుని ఆత్మీయులను చూపించు" అని దేవదూతను ఆదేశించారు. రాజశార్దూలా! ఆ తరువాత యుధిష్ఠిరుడు, దేవదూత కలిసి పురుషశ్రేష్ఠులైన భీమసేనాదులున్నచోటికి బయలుదేరారు. ముందు దేవదూత, వెనుక యుధిష్ఠిరుడు. పాపకర్ములు వెళ్ళే అశుభ మార్గంలో వెళ్ళసాగారు. ఆ దారిన వెళ్ళటమే కష్టంగా ఉంది. అక్కడ గాఢాంధకారం. ఆ బాట వెంట్రుకలతో, నాచుతో, గడ్డితో నిండి ఉంది. పాపాత్ములకది తగినది. దుర్గంధాలతో, రక్తమాంసాలతో

ఏర్పడిన బురదతో అది నిండి ఉంది. ఈగలు, అడవి ఈగలు, దోమలవంటి ఎగిరే ప్రాణులు, ఎలుగుబంట్లు అక్కడ సంచరిస్తున్నాయి. అక్కడక్కడ అన్నివైపులా శవాలు పడి ఉన్నాయి. ఎముకలు, వెంట్రుకలు అక్కడ చెల్లాచెదురుగా పడిఉన్నాయి. క్రిములు, కీటకాలు నిండి ఉన్నాయి. మండుతున్న అగ్ని ఆ బాటను చుట్టుముట్టి ఉంది. ఇనుపముక్కులు గల కాకులు, గ్రద్దలు వలయాకారంలో ఎగురుతున్నాయి. సూదులవంటి ముఖాలు, వింధ్యపర్వతం వంటి ఆకారాలతో ప్రేతాలు అంతటా తిరుగుతున్నాయి. అక్కడక్కడ శవాలు పడి ఉన్నాయి. వీటిలో కొన్నిటినుండి నెత్తురు, మేదస్సు కారుతున్నాయి. కొన్నింటి చేతులు, తొడలు, భుజాలు తెగి ఉన్నాయి. కొన్నింటి పాట్టలు, పాదాలు తెగి ఉన్నాయి. అశుభకరమై, రోమాలు నిక్కబొడుచుకొనేటట్లున్న ఆ శవాల దుర్వాసనను గూర్చి ఎంతో ఆలోచిస్తూ వాటి మధ్యగా నడిచివెళ్ళాడు ధర్మాత్ముడైన ధర్మరాజు. దాటవీలుగాని రీతిగా వేడినీటితో నిండుగా ప్రవహిస్తున్న నదిని చూశాడు. అసిపత్రవనాన్ని చూశాడు. అక్కడి చెట్ల ఆకులు పదునైన ఛురికలవలె ఉన్నాయి. కొన్నితావులలో వేడివేడి ఇసుక పరుపులున్నాయి. కొన్నిచోట్ల కాలుతున్న ఇనుపచట్లు విడివిడిగా ఉన్నాయి. అన్నివైపులా ఇనుపబాణళ్ళలో మానెను కాస్తున్నారు. తాకడానికి కూడా వీలుకాని వాడి మొనల ముళ్ళతో నిండిన బూరుగు చెట్లు కనిపిస్తున్నాయి. యుధిష్ఠిరుడు పాపపు పనులు చేసినవారు పడుతున్న యాతనలను కూడా చూశాడు. యుధిష్ఠిరుడు ఆ దుర్గంధాన్ని పీల్చుతూ దేవదూతతో ఇలా అన్నాడు.

"ఇటువంటి దారిలో ఇంకా ఎంతదూరం వెళ్ళాలి? నా సోదరుడెక్కడ? ఇది ఏ దేవతలు నివసించే ప్రదేశం? ఇదంతా తెలియగోరుతున్నాను. నాకు చెప్పాలి." ధర్మరాజు మాటను విని దేవదూత వెనుదిరిగాడు. యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "ఇంతవరకే నీ గమనం.రాజేంద్రా! ఇక వెనుదిరగాలి. యుధిష్ఠిరుడు అలసిపోయిన తావునుండి వెనుకకు తీసికొని రావాలి అని దేవతలు నన్ను ఆదేశించారు. అలసి ఉంటే ఇక వెళదాం." యుధిష్ఠిరుడు ఆ దుర్గంధంతో కలవరపడి ఉన్నాడు. మూర్ఛ వచ్చేటట్లుంది. దానితో వెనుదిరగాలని మనసా నిశ్చయించుకొని వెనుకకు మరలాడు. దుఃఖశోకాలతో దెబ్బతిని ధర్మాత్ముడైన ఆ ధర్మరాజు వెనుదిరుగుతూ అన్నివైపుల నుండి దీనంగా వినిపిస్తున్న మాటలను విన్నాడు. "ఓయీ ధర్మజా! రాజర్షీ! పవిత్ర వంశంలో పుట్టినవాడా! పాండునందనా! మాపై అనుగ్రహంతో ముహూర్తకాలం ఇక్కడే ఉండు. దుర్దర్షుడైన నీవు రాగానే పవిత్రమైన గాలి వీస్తోంది. ఆదీ నీ శరీరంలోని సుగంధాన్ని స్వీకరించి ప్రసరిస్తోంది. మాకు సుఖంగా ఉంది. పార్థా! పురుషశ్రేష్ఠా! రాజసత్తమా! మేము చాలాకాలం తర్వాత నిన్ను చూడటంతో

సుఖాన్ని అనుభవిస్తున్నాం. మహాబాహూ! భారతా! కౌరవ్యా! ముహూర్తకాలమైనా నిలు. నీవు ఉంటే యాతన మమ్ము బాధించటం లేదు." రాజా! ఈ రీతిగా వేదనల ననుభవిస్తున్నవారు అన్నివైపుల నుండి రకరకాలుగా దీనంగా మాటాడుతుంటే ఆ మాటలు విన్నాడు ధర్మరాజు. దీనంగా పలుకుతున్న వారి ఆ మాటలను విని, యుధిష్ఠిరుడు దయామయుడై "ఆహా! ఎంత కష్టం" అంటూ అక్కడే నిలిచాడు. బలహీనులై, దుఃఖితులై వారు పలుకుతున్న ఆ మాటలను యుధిష్ఠిరుడు ఒకేసారి విన్నా అవి చెవులలో గింగురులు తిరుగుతున్నాయి.

కానీ యుధిష్ఠిరుడు వాటిని గుర్తించలేకపోయాడు. ఆ మాటలను గుర్తించలేక ధర్మపుత్రుడైన యుధిష్ఠిరుడు "మీరెవరు? ఇక్కడెందుకున్నారు?" అని అడిగాడు. యుధిష్ఠిరుడలా అడగగానే వారందరూ అన్నిదిక్కుల నుండి "రాజా! నేను కర్ణుడిని నేను భీమసేనుడిని నేను అర్జునుడిని నేను నకులుడను. నేను సహదేవుడను. నేను ధృష్టద్యుమ్నుడను. నేను ద్రౌపదిని. మేము ద్రౌపదికొడుకులం" అంటూ వారు ఆక్రోశించారు. రాజా! అప్పుడు ఆ ప్రదేశానికి తగినట్లుగా ఉన్న వారి ఆ మాటలను విని, యుధిష్ఠిరుడు "ఇదంతా దైవ కృత్యమా?" అని ఆలోచించాడు. "ఈ మహాత్ములు ఏ పాపకృత్యాన్ని చేశారు? కర్ణుడు కానీ, ద్రౌపది కొడుకులు కానీ, పాంచాల రాజకుమారులు కానీ, ద్రౌపదికానీ, ఏ పాపపుపని చేశారు? దుర్గంధభరితమైన ఈ భీకర ప్రదేశంలో వీరు ఉండవలసి వచ్చింది. పుణ్యకర్ములయిన వీరు ఎప్పుడు ఏ పాపం చేశారో తెలియటం లేదు. ధృతరాష్ట్ర కుమారుడైన సుయోధనుడు ఏ పుణ్యం చేసి, పాపాత్ములైన తన అనుచరులతో పాటు అలా శోభను పొందగలిగాడు ? లక్ష్మీసంపన్నుడైన మహేంద్రునివలె గొప్ప పూజలనందుకొంటున్నాడు. వీరంతా నరకంలో పడ్డారు. ఏ కర్మల పరిణామమిది ? నా సోదరులు సర్వధర్మవేత్తలు. శూరులు. సత్యవచనులు. ఆగమానుగుణంగా చరించేవారు. క్షత్రధర్మాసక్తులు. సజ్జనులు, యాజకులు, భూరిదక్షిణల నిచ్చేవారు. నేను నిదురిస్తున్నానా? మేల్కొని ఉన్నానా? నాలో చైతన్యముందా? లేదా? ఆహా! ఇది చిత్తవికారమా? లేక నా లోని చిత్తవిభ్రమమా?" యుధిష్ఠిర నరపాలుడు దుఃఖశోకాలకు లోనై, చింతతో ఇంద్రియాలు కళవళపడగా, ఇలా అనేక విధాలుగా ఆలోచించాడు. ధర్మసుతుడైన ఆ రాజు తీవ్రంగా కోపించాడు. ఆ యుధిష్ఠిరుడు దేవతలను, ధర్మాన్ని కూడా నిందించాడు. ఆ తీవ్రదుర్గంధంతో తపించి యుధిష్ఠిరుడు దేవదూతతో ఇలా అన్నాడు. "నీవు ఎవరి దూతవో వారి దగ్గరకే వెళ్ళు. నేను అక్కడకు రావటం లేదు. ఇక్కడే నిలిచానని వారికి చెప్పు. నేను ఇక్కడే ఉన్నందువలన ఈ నా సోదరులు

సుఖంగా ఉన్నారు." ధీమంతుడైన యుధిష్ఠిరుడు అలా అనగానే ఆ దూత దేవరాజైన ఇంద్రుడున్నచోటికి వెళ్ళిపోయాడు. రాజా! ధర్మరాజు చేయదలచిన పనిని ఆ ధర్మజుడు చెప్పిన రీతిగా పూర్తిగా నివేదించాడు."

3. యుధిష్ఠిర తనుత్యాగము.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "కౌరవ్యా! యుధిష్ఠిరుడు ముహూర్తకాలమక్కడ నిలిచాడు. ఇంతలోనే దేవేంద్రునితో సహా దేవతలు అక్కడకు వచ్చారు. ధర్ముడు (ధర్మదేవత) కూడా రూపుదాల్చి ధర్మరాజును చూడాలన్న కోరికతో కురురాజైన ఆ యుధిష్ఠిరుడు ఉన్న చోటికి వచ్చాడు. రాజా! పుట్టుకతో, కర్మలతో పవిత్రులైన ఆ దేవతలు దేదీప్యమాన శరీరాలతో అక్కడకు రాగానే ఆ చీకటి అంతరించింది. అక్కడ పాపాత్ములు అనుభవిస్తున్న యాతనలు, వైతరణీనది, కూటశాల్మలీ వృక్షం, లోహకుంభాలు, కాలుతున్న లోహశిలలు అన్నీ అదృశ్యమయ్యాయి. కౌరవ్యా! అంతకుముందు అన్నివైపుల ధర్మరాజుకు కనిపించిన వికృతశరీరాలు కనిపించకుండా పోయాయి. భారతా! అప్పుడు పుణ్యగంధాలను ప్రసరింపజేస్తూ. పవిత్రమైన గాలి దేవతలకు దగ్గరగా చల్లగా వీచసాగింది. ఆ గాలితాకిడి సుఖావహంగా ఉంది. ఇంద్రుడు, దేవతలు, వసువులు, అశ్వినులు, సాధ్యులు, రుద్రులు, ఆదిత్యులు, ఇతర స్వర్గవాసులు, సిద్ధులు, పరమఋషులు అందరూ మహాతేజస్వి అయిన ధర్మరాజు నిలిచి ఉన్న చోటికి వచ్చారు. ఆపై పరమశోభతో ప్రకాశిస్తున్న దేవేంద్రుడు అనునయపూర్వకంగా యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు.

"మహాబాహూ! నీవు అక్షయలోకాలను పొందావు. జరిగిందేదో జరిగిపోయింది. మాతో రా! నీవు సిద్ధి పొందావు. రాజా! నీవు అక్షయ లోకాలను పొందావు. నీవు కోపగించవద్దు. నా మాట విను నాయనా! రాజులందరూ తప్పక నరకాన్ని చూడవలసిందే. పురుషశ్రేష్ఠా! శుభాలు, అశుభాలు కూడా విడివిడిగా రాసులై ఉంటాయి. ముందు సుకృత ఫలాన్ని అనుభవిస్తే ఆ తరువాత నరకానికి వెళ్ళాలి. **ముందు నరకాన్ని అనుభవిస్తే ఆ తరువాత స్వర్గానికి వెళతారు. పాపాలు ఎక్కువచేసినవాడు ముందుగా స్వర్గాన్ని అనుభవిస్తాడు.*** రాజా! అందుకే నీ శ్రేయస్సు కోరే నేను ముందుగా నిన్ను ఇట్లు పంపాను. నీవు అశ్వత్థామ విషయంలో ఏదో నెపం పెట్టి ద్రోణుని నమ్మించావు. అందుకే

---

* పూర్వం నరకభాగ్ యస్తు పశ్చాత్ స్వర్గముపైతి నః ।
భూయిష్ఠం పాపకర్మా యః స పూర్వం స్వర్గమశ్నుతే ॥ 14

నేను కూడా నెపంతో నీకు నరకాన్ని చూపించాను. నీలాగే భీముడు, అర్జునుడు, నకులసహదేవులు, ద్రౌపది వేరే నెపంతో నరకానికి వెళ్ళారు. నరశ్రేష్ఠా! రా! వారు కూడా పాపవిముక్తులయ్యారు. నీ వైపు నిలిచి నీ కోసం యుద్ధంలో మరణించిన రాజులందరూ కూడా స్వర్గానికే వచ్చారు. భరతర్షభా! చూడు. నీవు కర్ణునికోసం పరితపిస్తున్నావు. సర్వశస్త్రధారులలో శ్రేష్ఠుడు, మేటివిలుకాడు అయిన కర్ణుడు కూడా ఉత్తమసిద్ధిని పొందాడు. రాజా! స్వర్గంలో తన స్థానంలో నిలిచి ఉన్న కర్ణుని ఆ పురుషశ్రేష్ఠుని చూడు. శోకాన్ని విడిచిపెట్టు. నీ సోదరులు, నీవైపు నిలిచిన రాజులు తమకు తమకు తగిన స్థానాలను పొంది ఉన్నారు. చూడు నీ మనస్సులోని చింత తొలగిపోవాలి.

కౌరవా! ముందుగా కష్టాన్ని అనుభవించావు. ఇకనుండి శోకరహితుడవై, రోగరహితుడవై నాతో కలిసి విహరించు. నాయనా! పుణ్యకర్మలతోనూ, తపస్సుతోనూ, దానాలతోనూ స్వయంగా సంపాదించుకొన్న ఫలితాన్ని పొందు. ఇప్పటినుండి దేవతలు, గంధర్వులు, దివ్యాప్సరసలు నిర్మలవస్త్రాలను, ఆభరణాలను ధరించి స్వర్గలోకంలో నిన్ను సేవిస్తారు. మహాబాహూ! నీవు రాజసూయంతో గెలుచుకొని, అశ్వమేధంతో పెంపొందించుకొన్న పుణ్యలోకాలను పొందు. తపస్సు యొక్క మహాఫలితాన్ని అనుభవించు. యుధిష్ఠిరా! నీవు సంపాదించుకొన్న లోకాలు హరిశ్చంద్రుడు పొందిన లోకాలవలె సర్వరాజన్యుల లోకాలకు సైన ఉంటాయి. అక్కడ నీవు విహరిస్తావు. రాజర్షి అయిన మాంధాత, భగీరథ నరపాలుడు, భరతుడు ఉన్న లోకాలలో నీవు విహరించగలవు. కౌంతేయా! ఇది పవిత్రమైన దేవనది - ఆకాశగంగ, మూడులోకాలనూ పవిత్రం చేయగలది. దీనిలో స్నానంచేసి నీవు ఆ లోకాలను చేరగలవు. ఇక్కడ స్నానం చేస్తే నీ మానుషభావం తొలగిపోతుంది. శోకం దూరమవుతుంది. ఆయాసం అదృశ్యమవుతుంది. శత్రుత్వం విడిచి వెళుతుంది." కౌరవరాజైన యుధిష్ఠిరునితో దేవేంద్రుడు ఇలా పలకగా రూపుదాల్చిన ధర్ముడు తన కొడుకుతో ఇలా అన్నాడు.

"రాజా! మహాప్రాజ్ఞా! కుమారా! నాపైనున్న భక్తివలన, సత్సవాక్కాలన వలన, శమదమాలవలన ఎంతో ప్రసన్నుడనైనాను. రాజా! నేను ఇలా మూడవసారి నిన్ను పరీక్షించాను. పార్థా! కానీ ఏ కారణం చేతనూ నీ స్వభావం నుండి నిన్ను చలింపజేయలేకపోయాను. గతంలో ద్వైతవనంలో అరణి కాష్ఠాలను అపహరించి, నిన్ను ప్రశ్నించి, పరీక్షించాను. దానిలో నెగ్గావు. భారతా! సోదరులు, ద్రౌపది మరణించిన తరువాత శునక రూపంలో మరల నేను నిన్ను అక్కడ పరీక్షించాను. ఇది మూడవసారి సోదరులకోసం ఇక్కడే

నిలువ దలిచావు. మహాభాగా! నీవు పవిత్రుడవు. పాపవిముక్తుడవై సుఖించు. రాజా! కౌంతేయా! నీ సోదరులు నరకానికి వెళ్ళవలసినవారు కారు. దేవరాజైన దేవేంద్రుని ద్వారా నేనే ఇలా ఏర్పాటు చేయించాను. నాయనా! రాజులు అందరూ నరకాన్ని చూడవలసినవారే, అందువలన నీవు కూడా ముహూర్తకాలం ఈ మహాదుఃఖాన్ని పొందవలసి వచ్చింది. రాజా! అర్జునుడు కానీ, భీముడు కానీ, పురుషశ్రేష్ఠులైన నకులసహదేవులుకానీ, సత్యవచనుడైన కర్ణుడు కానీ చిరకాలం నరకంలో ఉండదగినవారు కారు. రాజకుమారి అయిన ద్రౌపది కూడా ఏ రీతిగానూ నరకానికి వెళ్ళదగినది కాదు. భరతశ్రేష్ఠా! రా! త్రిలోకగామిని అయిన గంగను చూడు."

వైశంపాయనుడు చెప్తున్నాడు. "నీ పూర్వపితామహుడు, రాజర్షి అయిన ధర్మరాజు వారి మాటలు విని, ధర్మునితో, దేవతలతో కలిసి వెళ్ళిపోయాడు. ఆపై పుణ్యప్రదయై, పవిత్రయై, ఋషుల ప్రశంసలనందుకొన్న ఆ దేవనదిలో – గంగలో మునిగి తన మానుష శరీరాన్ని విడిచిపెట్టాడు.

ఆపై యుధిష్ఠిరుడైన ధర్మరాజు దివ్యశరీరాన్ని ధరించాడు. ఆ గంగలో మునిగినందువలన శ్రమత్వం, సంతాపం నశించాయి.

ఆ తరువాత మహర్షుల స్తుతుల నందుకొంటూ, ధర్మునితో కలిసి, దేవతల మధ్యనిలిచి ఆ కురురాజు పురుషోత్తములు, శూరులు అయిన పాండవధార్తరాష్ట్రులు తమ తమ స్థానాలను పొంది ఉన్న తావుకు బయలుదేరాడు."

4. యుధిష్ఠిరుడు స్వర్గలోకమున అర్జునాదులను చూచుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "ఆ పై యుధిష్ఠిర నరపాలుడు దేవతలచే, ఋషులచే మరుద్గణాలచే ప్రస్తుతింపబడుతూ కురుపుంగవు లున్నచోటికి వెళ్ళాడు. అక్కడ బ్రాహ్మశరీరంతో ఉన్న గోవిందుని చూశాడు. ఆ రూపం అంతకుముందు చూసిన రూపంతో సమానంగానే కనిపిస్తోంది. తన శరీరకాంతితో ఆయన వెలిగిపోతున్నాడు. చక్రం మొదలయిన భీకరదివ్యాస్త్రాలు పురుషరూపాలను ధరించి ఆయనను సేవిస్తున్నాయి. మహాతేజస్వి, వీరుడు అయిన అర్జునుడు ఆయనను ఉపాసిస్తున్నాడు. ఆ రూపంలోనున్న మధుసూదనుని చూశాడు ధర్మరాజు. దేవపూజితులయిన ఆ పురుషోత్తములిద్దరూ యుధిష్ఠిరుని చూసి యథావిధిగా ఆయనను సమ్మానించారు. మరొకవైపు శస్త్రధారులలో శ్రేష్ఠుడైన కర్ణుడు ద్వాదశాదిత్యులతో కూడి ఉండటం చూశాడు ధర్మరాజు. మరొకవైపు మరుద్గణ

పరివేష్టితుడై, పూర్వశరీరం వంటి దివ్యశరీరాన్ని ధరించి ఉన్న భీమసేనుని చూశాడు. ఆ రాజు ఆకృతి దాల్చిన వాయుదేవునకు ప్రక్కన కూర్చొని ఉన్నాడు. పరమకాంతితో ప్రకాశిస్తున్నాడు. ఉత్తమసిద్ధిని పొంది ఉన్నాడు. తమ తేజస్సుతో వెలుగొందుతూ అశ్వినుల స్థానంలో ఉన్న నకుల సహదేవులను చూశాడు ధర్మరాజు. అదే రీతిగా కమలాలు, కలువల మాలలను ధరించి తన శరీరశోభతో స్వర్గాన్ని ఆక్రమించి సూర్యతేజస్సుతో విరాజిల్లుతున్న పాంచాలిని చూశాడు.

ఇదంతా చూసి, యుధిష్ఠిరుడు వెంటనే ఏదో ప్రశ్నించబోయాడు. ఇంతలో పూజ్యుడైన దేవేంద్రుడు ఆయనతో ఇలా అన్నాడు. "యుధిష్ఠిరా! ద్రౌపదీరూపంతో కనిపిస్తున్న ఈమె సాక్షాత్తు లక్ష్మియే. ఈమె అయోనిజ. లోకకమనీయ. పుణ్య గంధవతి. మీ కోసం మానుషత్వాన్ని పొందింది. సాక్షాత్తు శూలపాణియైన శంకరుడే మీ ఆనందం కోసం ఆమెను కల్పించాడు. ద్రుపదుని ఇంటబుట్టి ఈమె మీ అందరి ఆదరణను పొందింది. రాజా! అగ్నితేజస్సుతో, మహాభాగులై కనిపిస్తున్న ఈ అయిదుగురు గంధర్వులు అమితవీర్యసంపన్నులైన మీకు ద్రౌపదికి పుట్టిన కొడుకులు. చూడు! ధీమంతుడైన ఈ గంధర్వరాజే ధృతరాష్ట్రుడు. ఈయనను మీ తండ్రికి అన్నగా గ్రహించు. ఇదిగో! అగ్నితేజస్సుగల ఈ కౌంతేయుడు నీకు అన్న. సూతపుత్రులలో పెద్దవాడు. శ్రేష్ఠుడు. రాధేయుడని ప్రసిద్ధి గన్నవాడు. ఆదిత్యులతో కూడి వెళుతున్న ఈ పురుషశ్రేష్ఠుని కర్ణుని చూడు. ఇక సాధ్యులు, విశ్వేదేవులు, మరుత్తుల గణాలలో వృష్ణి అంధక వంశాలకు చెందిన మహారథులను, సాత్యకి మొదలైన వీరులను, మహాబలసంపన్నులైన భోజవంశస్థులను చూడు. ఓటమి నెరుగని సుభద్రా సుతుడు - అభిమన్యుని చూడు. ఈ మేటివిలుకాడు చంద్రకాంతితో, చంద్రునితో కలిసి కూర్చొని ఉన్నాడు. ఇదిగో! మేటివిలుకాడైన పాండురాజు నీ తండ్రి కుంతితో, మాద్రితో కలిసి నిత్యమూ విమానంలో మన దగ్గరకు వస్తాడు. శంతనుసుతుడైన భీష్మనరపాలుడు వసువులతో కలిసి ఉన్నాడు చూడు. బృహస్పతికి దగ్గరగా నీ గురువు - ద్రోణుడు ఉన్నాడు చూడు. పాండునందనా! ఇంకా ఇతర రాజులు, నీయోధులు ఇటు గంధర్వులతో, యక్షరాక్షసులతో కలిసి వెళ్తున్నారు. కొందరు రాజులు గుహ్యకుల గతిని కూడా పొందారు. పవిత్రవచనాలు, ఆలోచనలు, కర్మల ఫలితంగా మరణానంతరం స్వర్గాన్ని పొందగలిగారు.

5. భీష్మాదులు తమ మూలస్వరూపాలను పొందుట - మహాభారతమాహాత్మ్యము.

జనమేజయుడు అడిగాడు. "మహాత్ములైన భీష్మద్రోణులు, ధృతరాష్ట్ర నరపాలుడు, విరాటద్రుపదులు, శంఖుడు, ఉత్తరుడు, ధృష్టకేతువు, జయత్సేనుడు, సత్యజిత్‌నరపాలుడు, దుర్యోధనుని కొడుకులు, సుబలసుతుడైన శకుని, పరాక్రమవంతులైన కర్ణసుతులు, జయద్రథుడు, ఘటోత్కచాదులు వీరందరిని గురించి చెప్పలేదు. దీప్తమూర్తులు, వీరులు అయిన కొందరు రాజులను గురించి చెప్పావు. వీరంతా స్వర్గలోకంలో ఎంతకాలమున్నారు? నాకు చెప్పు. ద్విజోత్తమా! వారికి స్వర్గలోకంలో శాశ్వతనివాసమా? కర్మలు గడచిన తర్వాత ఆ నరశ్రేష్ఠులు ఏ గతిని పొందారు? ద్విజోత్తమా! దీనిని చెపుతుంటే వినాలనుకొంటున్నాను. ఉజ్జ్వలతపస్సుతో నీవు సర్వమూ చూడగలవు." సౌతి ఇలా అన్నాడు. "జనమేజయుడు అలా అడగగానే మహాత్ముడైన వ్యాసుని అనుమతితో విప్రర్షి అయిన వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు." "రాజా! కర్మఫలానుభవం ముగిసిన తర్వాత అందరూ పూర్వస్థితినే పొందలేరు. నీవు చక్కగా ప్రశ్నించావు. రాజా భరతర్షభా! ఇది గూఢమైన దేవరహస్యం. దీనిని ప్రతాపవంతుడు, దివ్యనేత్రుడు, మహాతేజస్వి అయిన వ్యాసమహర్షి చెప్పాడు. కౌరవ్యా ! సర్వకర్మల ఫలితాలను ఎరిగినవాడు పరాశరసుతుడైన వ్యాసుడు. ఆ ప్రాచీనముని మహావ్రతుడు. లోతైన బుద్ధిగలవాడు. సర్వజ్ఞుడు. వారంతా కర్మఫలానుభవం ముగిసిన పిదప తమ మూల శరీరాలనే పొందారని ఆ వ్యాస మహర్షి చెప్పాడు.

మహాతేజస్వి, మహాద్యుతి అయిన భీష్ముడు వసువులను చేరాడు. భరతర్షభా! వసువులు ఎనిమిది మంది మాత్రమే (భీష్ముడు మిగిలిపోతే ఆ సంఖ్య తొమ్మిది కావలసివస్తుంది). ద్రోణుడు అంగిరసులలో శ్రేష్ఠుడైన బృహస్పతిలో ప్రవేశించాడు. హృదికపుత్రుడైన కృతవర్మ మరుద్గణాలలో ప్రవేశించాడు. ప్రద్యుమ్నుడు తాను వచ్చిన రీతిగానే సనత్కుమారునిలో ప్రవేశించాడు. ధృతరాష్ట్రుడు పొందటానికి కష్టమైన కుబేరలోకాలను పొందాడు. యశస్విని అయిన గాంధారి కూడా ధృతరాష్ట్రునితో పాటే. పాండురాజు భార్యలతో సహా మహేంద్రభవనానికి వెళ్ళాడు. విరాటద్రుపదులు, ధృష్టకేతు మహారాజు, నిశఠుడు, అక్రూరుడు, సాంబుడు, భానుడు, కంపుడు, విధూరధుడు, భూరిశ్రవుడు, శలుడు, భూరిరాజు, కంసుడు, ఉగ్రసేనుడు, ఉత్తరుడు, అతని సోదరుడు శంఖుడు ఈ నరోత్తములందరూ విశ్వేదేవతలలో లీనమయ్యారు. చంద్రుని కొడుకు వర్చుడనేవా

డుండేవాడు. అతడు మహాతేజస్వి, ప్రతాపవంతుడు. అతడు నరోత్తముడైన అర్జునుని కొడుకుగా - అభిమన్యుడుగా జన్మించాడు. అతడు క్షాత్రధర్మంలో మరేపురుషుడూ, ఎక్కడా చేయని రీతిలో యుద్ధం చేశాడు. కర్మఫలం ముగిసిన తరువాత ధర్మాత్ముడు, మహారథుడు అయిన అతడు చంద్రునిలో ప్రవేశించాడు. పురుషర్షభుడైన కర్ణుడు చనిపోయి సూర్యునిలో ప్రవేశించాడు. శకుని ద్వాపరునిలో ప్రవేశించాడు. ధృష్టద్యుమ్నుడు అగ్నిలో ప్రవేశించాడు. ధృతరాష్ట్రుని కొడుకులందరు మౌలికంగా బలోన్మత్తులైన రాక్షసులు. సమృద్ధశాలులైన ఆ మహాత్ములు శస్త్రాహతాలతో పవిత్రులై స్వర్గానికి వెళ్ళారు.

విదురుడు, యుధిష్ఠిరుడు ధర్మునిలో ప్రవేశించారు. బ్రహ్మ ఆదేశంతో యోగశక్తితో భూమిని ధరిస్తున్నవాడు, అనంతుడు, అతడే బలరాముడు. ఆ బలరాముడు మరల రసాతలంలో ప్రవేశించాడు. సనాతనుడు, దేవదేవుడు అయిన నారాయణుని అంశయే వాసుదేవుడు, కర్మఫలానుభవం తర్వాత వాసుదేవుడు నారాయణునిలో ప్రవేశించాడు. జనమేజయా! వాసుదేవుడు పెండ్లాడిన పదహారు వేలమంది కాంతలు తగిన వేళలో సరస్వతీనదిలో మునిగిపోయారు. అక్కడ శరీరాలను విడిచి మరల స్వర్గానికి చేరారు. వారే అప్సరసలై వాసుదేవుని సేవకై నిలిచారు. ఆ మహా సంగ్రామంలో మరణించిన వీరమహారథులు ఘటోత్కచాదులు దేవతాలోకాలకు, యక్షలోకాలకు వెళ్ళారు. రాజా! దుర్యోధనుని సహాయకులుగా కీర్తింపబడిన రాక్షసులు క్రమంగా ఉత్తమలోకాలన్నింటిలో ప్రవేశించారు. ఆ పురుషశ్రేష్ఠులు మహేంద్రలోకంలో, ధీమంతుడైన కుబేరునిలోకంలో, వరుణుని లోకంలో ప్రవేశించారు.

మహాతేజస్వీ! భారతా! ఇలా నీకు కౌరవపాండవ చరిత్రను పూర్తిగా, సవిస్తరంగా చెప్పాను." సౌతి ఇలా చెప్తున్నాడు. "యజ్ఞ కర్మల మధ్యలో ఈ మహాభారతాన్ని విని జనమేజయ మహారాజు, ద్విజోత్తములు ఎంతో ఆశ్చర్యానికి లోనయ్యారు. ఆపై జనమేజయుని యాజకులు యాగకర్మను ముగించారు. పాములను విడిపించి ఆస్తీకుడు కూడా ఎంతో ఆనందించాడు. ఆ తరువాత ఆ బ్రాహ్మణులనందరినీ దక్షిణలతో సంతోషపెట్టాడు. రాజపూజను పొంది, వారు వచ్చిన రీతిగానే వెళ్ళిపోయారు. జనమేజయ నరపాలుడు కూడా ఆ విప్రులను పంపి, ఆపై తక్షశిల నుండి మరల హస్తినపురికి వచ్చాడు. జనమేజయుని సర్పయాగంలో వ్యాసుని అనుమతితో వైశంపాయనుడు చెప్పినదానిని, నా తండ్రి ద్వారా నేను విన్నదానిని నీకు పూర్తిగా చెప్పాను. బ్రాహ్మణా! ఇది పుణ్యప్రదమైన ఇతిహాసం.

పరమపవిత్రం. ఉత్తమం. సత్యవాది అయిన వ్యాసమహర్షి నిర్మించిన దిది. వ్యాసుడు సర్వజ్ఞుడు, విధిజ్ఞుడు, ధర్మజ్ఞాని, సజ్జనుడు, ఇంద్రియాతీత జ్ఞానసంపన్నుడు. పవిత్రుడు, తపస్సుచే హృదయాన్ని పవిత్రం చేసికొన్నవాడు. ఐశ్వర్య సంపన్నుడు, సాంఖ్యయోగవేత్త. అనేకశాస్త్ర ద్రష్ట. ఆయన దివ్యనేత్రంతో చూసి మహోత్ములైన పాండవులు, ధన సంపన్నులు, తేజస్వులయిన ఇతర క్షత్రియులు - వీరి కీర్తిని లోకంలో విస్తరింపజేస్తూ ఈ ఇతిహాసాన్ని నిర్మించారు.

ప్రతిపర్వకాలంలోనూ దీనిని వినిపించిన పండితుడు పాపవిముక్తుడై స్వర్గాన్ని గెలుచుకొని బ్రహ్మ భావాన్ని పొందటానికి సమర్థుడవుతాడు. వ్యాసనిర్మితమైన ఈ వేదాన్ని ఏకాగ్రతతో పూర్తిగా విన్నవాని బ్రహ్మహత్యాది పాపాలు కోట్లకొలది నశిస్తాయి. శ్రాద్ధకాలంలో దీనిలో కొంతభాగమైనా బ్రాహ్మణులకు వినిపిస్తే అతని పితరులకు అక్షయంగా అన్నపానాలు లభిస్తాయి. మనస్సుతో కానీ, ఇంద్రియాలతో కానీ పగలు చేసిన పాపం మహాభారతాన్ని చెపితే సాయం సంధ్యవేళకే విడిచివెళ్తుంది. బ్రాహ్మణుడు స్త్రీ సమూహాల మధ్య రాత్రివేళ చేసిన పాపం మహాభారతం చెపితే పూర్వసంధ్యవేళకే వీడివెళ్తుంది. ఇది భరతవంశీయుల ఉత్తమజన్మకు సంబంధించినది కాబట్టి భారతం. **మహత్త్వం, భారవత్త్వం కారణంగా మహాభారతం. మహాభారతవ్యుత్పత్తినెరిగినవాడు సర్వపాప విముక్తుడవుతాడు.*** వేదమహాసముద్రమై, అష్టాదశ పురాణాలను వ్రాసిన మహోత్ముడైన ఆ వ్యాసమహర్షి చేస్తున్న సింహనాదాన్ని వినండి. "అష్టాదశపురాణాలను, సర్వధర్మశాస్త్రాలను వేదాలను, వేదాంగాలను ఒకవైపు ఉంచండి. భారతమొక్కటే వాటికి సరితూగుతుంది." పూజ్యమహర్షి అయిన కృష్ణద్వైపాయనుడు సమర్థుడై ఈ భారతమంతా మూడు సంవత్సరాలలో వ్రాశాడు. భక్తితో జయాఖ్యమయిన ఈ మహా భారతాన్ని వింటే శ్రీ, కీర్తి, విద్య కలిసి సదా సమకూరుతాయి. **భరతర్షభా! ధర్మార్థకామమోక్షాలకు సంబంధించి భారతంలో ఉన్నదే ఇతరత్ర ఉంటుంది. ఇక్కడ లేనిది ఎక్కడా ఉండదు.**** మోక్షాన్ని కోరుతున్న ఆ బ్రాహ్మణుడు కానీ, రాజు కానీ, గర్భిణి అయిన స్త్రీ కానీ జయమనే పేరుగల ఈ

---

* మహత్త్వాద్ భారవత్త్వాచ్చ మహాభారతముచ్యతే ।
నిరుక్తమస్య యో వేద సర్వపాపైః ప్రముచ్యతే ॥ 45

** ధర్మే చార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ ।
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న కుత్రచిత్ ॥ 50

ఇతిహాసాన్ని వినాలి. స్వర్గకామునకు స్వర్గం లభిస్తుంది. విజయాభిలాషికి విజయం లభిస్తుంది. గర్భవతికి కొడుకు పుడతాడు. కన్య మహాభాగ్యవతి అవుతుంది. నిత్యసిద్ధమోక్ష స్వరూపుడైన కృష్ణద్వైపాయనుడు సమర్థుడై ధర్మకాంక్షతో ఈ మహాభారత కావ్యాన్ని రచించాడు. ముందు అరవైలక్షల శ్లోకాలతో మహాభారత సంహితను రచించాడు. ముప్పయిలక్షల శ్లోకాలు దేవలోకంలో వ్యాప్తిచెందాయి. పితృలోకంలో పదిహేనులక్షల శ్లోకాలు, యక్ష లోకంలో పదునాలుగులక్షల శ్లోకాలు కీర్తినందాయి. మానవలోకంలో ఈ లక్ష శ్లోకాలు ప్రచారంలోనికి వచ్చాయి. దేవతలకు నారదుడు, పితరులకు అసితదేవలుడు, రాక్షసులకు, యక్షులకు శుకుడు, మానవులకు వైశంపాయనుడు దీనిని చెప్పారు. శౌనకా! మహార్థమై, వేదసమ్మితమై, పుణ్య ప్రదమైన ఈవ్యాసేతిహాసాన్ని బ్రాహ్మణులతోపాటు విన్న నరుడు సర్వకామనలను, కీర్తిని ఇహలోకంలో పొంది, మరణానంతరం ఉత్తమసిద్ధిని పొందగలడు. ఈ విషయంలో సంశయం లేదు. శ్రద్ధతో పరమభక్తితో మహాభారతంలోని నాలుగవ భాగాన్ని విన్నా, వినిపించినా కూడా భారతాన్ని పూర్తిగా అధ్యయనం చేసిన పుణ్యం లభిస్తుంది. పుణ్యప్రదమైన ఈ సంహితను తన కుమారుడైన శుకునకు నేర్పిన వ్యాసమహర్షి ఇలా ఉపదేశించాడు. "లోకంలో వేలకొలదిగా తల్లిదండ్రులు, వందలకొలదిగ భార్యాపుత్రులు అనుభవంలోనికి వచ్చారు, వస్తున్నారు, రాగలరు కూడా.*

ప్రతిదినమూ ఆనందింపదగిన సంఘటనలు వేలకొలదిగ ఉంటాయి. భయపడవలసిన సంఘటనలు వందలకొలదిగ ఉంటాయి. కానీ అవి మూఢునిపై ప్రభావం చూపుతాయి. కానీ పండితుని ఏమీ చేయలేవు.**

బాహువులు పైకెత్తి ఇలా ఆక్రోశిస్తున్నాను. అయినా ఎవ్వరూ నా మాట వినటం లేదు. ధర్మంతో అర్థకామాలు సిద్ధిస్తాయి. ఆ ధర్మాన్ని ఎందుకు సేవించరు ?***

---

* మాతాపిత్రసహస్రాణి పుత్రదారశతాని చ ।
సంసారేష్వనుభూతాని యాంతి యాస్యంతి చాపరే ॥ 60

** హర్షస్థానసహస్రాణి భయస్థానశతాని చ ।
దివసే దివసే మూఢమావిశంతి న పండితమ్ ॥ 61

*** ఊర్ధ్వబాహుర్విరౌమ్యేష న చ కశ్చిచ్ఛృణోతి మే ।
ధర్మాదర్థశ్చ కామశ్చ స కిమర్థం న సేవ్యతే ॥ 62

కామం వలన కానీ, భయంవలన కానీ, లోభం వలన కానీ, ఆత్మరక్షణ కోసమైనా కానీ ధర్మాన్ని వీడరాదు. ధర్మం నిత్యం, సుఖదుఃఖాలు అనిత్యాలు, జీవుడు నిత్యుడు. జీవబంధనాలు అనిత్యాలు."* ఉదయమే లేచి ఈ భారతసావిత్రిని పఠించినవాడు పూర్తిగా భారతాన్ని అధ్యయనం చేసిన ఫలాన్ని పొంది, పరబ్రహ్మను చేరుతాడు. పూజ్యుడైన సముద్రుడూ, హిమవత్పర్వతమూ రత్న నిధులుగా ప్రసిద్ధులు. అదే రీతిగా భారతం కూడా రత్ననిధి. ఈ కృష్ణద్వైపాయన వేదాన్ని వినిపించిన బ్రాహ్మణుడు అర్థాన్ని పొందగలడు. ఈ మహాభారతాఖ్యానాన్ని ఏకాగ్రతతో చదివినవాడు పరమసిద్ధిని పొందగలడు. నాకీ విషయంలో సంశయం లేదు. భారతం వ్యాసుని పెదవులనుండి వెలువడినది. అసామాన్యమైనది. పుణ్యప్రదం, పాపహరం, శుభకరం, పవిత్రం. దానిని చెపుతుంటే విన్న వానికి ఇక పుష్కరజలాలలో మునగవలసిన అవసరం లేదు. బంగారు కొమ్ములు గల గోవులను వేదవేత్త, బహుశాస్త్రపండితుడు అయిన బ్రాహ్మణునకు దానమిచ్చిన వానికీ, పుణ్యప్రదమైన భారతకథను సతతమూ విన్నవానికీ ఫలితం సమానంగా లభిస్తుంది.

ఇది స్వర్గారోహణ పర్వం
ఇది శ్రీమహాభారతం

* న జాతు కామాన్న భయాన్న లోభాద్ ధర్మం త్యజేజ్జీవితస్యాపి హేతోః ।
నిత్యో ధర్మః సుఖదుఃఖే త్వనిత్యే జీవో నిత్యో హేతురస్య త్వనిత్యః ॥ 63

॥ శ్రీమాత్రే నమః ॥

మహాభారత శ్రవణ విధి

మాహాత్మ్యము, శ్రవణవిధానము, ఫలము.

జనమేజయు డడిగాడు. "భగవానుడా ! పండితులు మహాభారతాన్ని ఏ రీతిగా వినాలి ? దాని ఫలమేమిటి ? ఈ పురాణాన్ని వినేటప్పుడు ఏయే దేవతలను పూజించాలి ? ప్రతిపర్వ సమాప్తిలోను ఏ దానం చేయాలి ? ఈ కథను చెప్పేవాడు ఎలా ఉండాలి ? నాకు చెప్పవలసినది." వైశంపాయనుడు చెప్తున్నాడు. "రాజా ! మహాభారత శ్రవణవిధిని, శ్రవణఫలాన్ని విను. రాజేంద్రా ! నీవు తెలియదలచి నన్ను అడిగినదంతా చెప్పబోతున్నాను. రాజా ! దేవలోకంలోని దేవతలు భగవల్లీలలో సహకరించటానికై భూలోకానికి వచ్చారు. వచ్చినపని ముగించుకొని మరలా స్వర్గానికి వెళ్ళారు. ఈ భూతలం మీదకు దేవతలు, ఋషులు వచ్చినరీతిని నీకు ఇప్పుడు చెప్పబోతున్నాను. సావధానంగా విను. భరతశ్రేష్ఠ ! ఈ మహాభారత సందర్భంలో రుద్రులు, సాధ్యులు, సనాతనులైన విశ్వేదేవులు, సూర్యుడు, అశ్వినులు, లోకపాలకులు, మహర్షులు, గుహ్యకులు, గంధర్వులు, నాగులు, విద్యాధరులు, సిద్ధులు, ధర్ముడు, స్వయంభువుడైన బ్రహ్మ, శ్రేష్ఠుడైన కాత్యాయన ముని, కొండలు, సముద్రాలు, నదులు, అప్సరోగణాలు, గ్రహాలు, సంవత్సరాలు, ఆయనాలు, ఋతువులు, స్థావరజంగమాత్మకమైన సర్వజగత్తు, దేవతలు, అసురులు – వీరందరూ ఒక్కచోటగా కనిపించారు. ఘోరపాతకాలు చేసిన మానవుడైనా వారందరి ప్రతిష్ఠను విని, వారిపేర్లను నిత్యమూ కీర్తించటం ద్వారా వెంటనే పాపవిముక్తిని పొందగలడు. భారతా ! మనిషి మనస్సును అదుపులో ఉంచుకొని పవిత్రుడై ఈ భారతేతిహాసాన్ని క్రమంగా, యథాతథంగా విని, ఆ పని ముగిసిన పిమ్మట, దానిలో మరణించిన వానికి శ్రాద్ధాలు పెట్టాలి. భరతర్షభా ! బ్రాహ్మణులకు యథాశక్తిగా భక్తితో రత్నదానం మొదలయిన వివిధ మహాదానాల నివ్వాలి. గోవులను, పాలుపితికే కంచుపాత్రలను, చక్కగా అలంకరింపబడి సర్వకామగుణాలతో కూడిన కన్యలను, వివిధ ప్రయాణ సాధనాలను, విచిత్రభవనాలను, భూమిని, వస్త్రాలను, సువర్ణాన్ని, వాహనాలను, గుర్రాలను, మదపుటేనుగులను, శయ్యలను, పల్లకీలను, సిద్ధంచేసిన రథాలను, ఇంటిలోనికి అవసరమైన శ్రేష్ఠ వస్తువులను, మహాధనాన్ని బ్రాహ్మణులకు దానమివ్వాలి. భార్యాపుత్రులతో సహా తమ శరీరాన్ని వారి సేవకై వినియోగించాలి. పరమశ్రద్ధతో క్రమంగా ముగిసేదాకా కథను పూర్తిగా వినాలి. యథాశక్తిగా ప్రసన్నహృదయంతో శ్రవణాసక్తితో

వికల్పాలకు అవకాశమివ్వకుండా వినాలి. సత్యం, నిజాయితీ, ఇంద్రియ సంయమనం, పవిత్రత, శౌచాచారం పాటిస్తూ, క్రోధాన్ని వీడి శ్రద్ధాళువై వినాలి. అలా విన్నవాడు పొందే సిద్ధిని గురించి చెపుతాను విను.

పవిత్రుడు, శీలవంతుడు, సదాచారుడు, నిర్మలవస్త్రాలను ధరించినవాడు, జితేంద్రియుడు, సంస్కారవంతుడు, సర్వశాస్త్రవేత్త, శ్రద్ధాళువు, అసూయారహితుడు, రూపవంతుడు, భాగ్యశాలి, మనస్సును అదుపులో నుంచినవాడు, సత్యవాది, జితేంద్రియుడు అయిన పండితుని సత్కరించి, తగిన దానమిచ్చి వాచకునిగా (కథ చెప్పేవాడు) చేసికోవాలి. కథకుడు మరీ నెమ్మదిగా కానీ, మరీ తొందరగా కానీ చెప్పకూడదు. ప్రశాంతంగా, మెల్లగా అక్షరాలను, పదాలనూ స్పష్టంగా పలుకుతూ, భావార్థాన్ని గ్రహించి తగిన స్వరయోజనతో కథను చెప్పాలి. వాచకుడు అరవై మూడు అక్షరాలను వాటివాటి ఉత్పత్తిస్థానాలయిన ఎనిమిదింటి ద్వారా చక్కగా ఉచ్చరించాలి. కథ చెప్పే సమయంలో ఆరోగ్యంగా, సావధానంగా ఉండాలి. సుఖాసనాసీనుడై కథ చెప్పాలి. నరుల మనస్సులే నివాసస్థానమైన నారాయణునికీ, నరోత్తమునికీ సరస్వతీదేవికి, వ్యాసమహర్షికీ నమస్కరించి శ్రీమహాభారతమును చదువువలెను/ చెప్పవలెను. రాజా ! భారతా ! ఇటువంటి కథకుని ద్వారా నియమ పరాయణుడై, పవిత్రుడైన శ్రోత మహాభారతాన్ని విని ఫలాన్ని పొందగలడు. ప్రథమపారణ సమయంలో బ్రాహ్మణులకు అభీష్ట పదార్థాల నిచ్చి తృప్తిపరచాలి. దానితో అగ్నిష్టోమయాగఫలాన్ని పొందుతాడు. అప్సరోగణాలతో కూడిన మహావిమానాన్ని పొందగలడు. తాను ప్రసన్నుడై, ఏకాగ్రచిత్తుడై దేవతలతో పాటు స్వర్గానికి వెళతాడు. ద్వితీయపారణను పూర్తి చేసిన తరువాత అతిరాత్ర యాగఫలాన్ని పొందగలడు. సర్వరత్నమయమైన దివ్య విమానాన్ని ఎక్కగలరు. దివ్యమాలలనూ, దివ్యవస్త్రాలనూ ధరించి, దివ్యగంధాలను అలంకరించుకొని, దివ్యాంగదాలను ధరించి నిత్యమూ దేవలోకంలో వెలుగొందగలడు. మూడవసారి పారణను ముగిస్తే ద్వాదశాహయాగఫలాన్ని పొందగలడు. దేవతలవలె స్వర్గలోకంలో వేలసంవత్సరాల పాటు నివసిస్తాడు. నాలుగవసారి పారణను ముగించి వాజపేయయాగఫలాన్ని, ఐదవసారి పారణను ముగించి దానికి రెట్టింపు ఫలితాన్ని పొందుతాడు. ఉదయిస్తున్న సూర్యునివలె, ప్రజ్వలిస్తున్న అగ్నివలె ప్రకాశిస్తున్న విమానాన్ని ఎక్కి, దేవతలతో పాటు స్వర్గలోకానికి వెళతాడు. అక్కడ ఇంద్రభవనంలో పదివేల సంవత్సరాల పాటు ఆనందంగా ఉండగలడు. ఆరవసారి పారణను ముగిస్తే దానికి రెట్టింపు ఫలం, ఏడవ పారణను ముగిస్తే మూడురెట్ల ఫలం దక్కుతుంది. కైలాసశిఖరం వలె ప్రకాశవంతమై, వైడూర్యమణి వేదికలతో అలంకృతమై,

వైడూర్యమణి భూషితమై, అనేక రీతులుగా సిద్ధం చేయబడి, అప్సరోగణసేవితమైన రథాన్ని ఎక్కి రెండవ సూర్యునివలె సర్వలోకాలలోనూ సంచరింపగలడు. ఆ విమానం ఎలా కావాలంటే అలా వెళుతుంది. ఎనిమిదవసారి పారణ పూర్తి అయిన తరువాత రాజసూయ యాగఫలితాన్ని పొందుతాడు. చంద్రోదయంవలె ఆందమైన రథాన్ని ఎక్కుతాడు. దానికి చంద్రకిరణాలవలె ప్రకాశిస్తూ మనోవేగం గల గుర్రాలను పూన్చుతారు. చంద్రుని కన్న అందమైన వదనాలు గల స్త్రీలచే సేవింపబడుతూ, అందగత్తెల ఒడిలో సుఖంగా నిదురించి, వారి మేఖలల ధ్వనులతో, నూపురనినాదాలతో మేల్కొలుపబడతారు. భారతా ! తొమ్మిదవసారి పారణ చేసినప్పుడు యాగరాజమైన అశ్వమేధయాగఫలాన్ని పొందుతాడు. సువర్ణస్తంభాలతో, బంగారు ముంజూరులతో, వైడూర్యవేదికలతో అన్నివైపులా సువర్ణగవాక్షాలతో అలంకరింపబడి, స్వర్గనివాసులయిన అప్సరసలతో, గంధర్వులతో సేవింపబడుతూ పరమశోభతో ప్రకాశిస్తున్న. దివ్యవిమానాన్నిఎక్కి, స్వర్గంలో మరొక దేవతవలె దేవతలతో కూడి సుఖిస్తాడు. దివ్యమాలలను, దివ్యవస్త్రాలను ధరించి, దివ్యచందనాలను అలదుకొంటారు. పదవపారణను ముగించి, బ్రాహ్మణులకు నమస్కరిస్తే పుణ్యనికేతనమైన విమానాన్ని అనాయాసంగా పొందుతాడు. మణితోరణాలు, సువర్ణగవాక్షాలు, పగడాల ముంజూరులు దానికి శోభను కలిగిస్తాయి. గాన కోవిదులయిన గంధర్వులు, అప్సరసలు దానికి అందాన్ని చేకూరుస్తారు. ఆ విమానంపై అగ్నివర్ణంగల కిరీటాన్ని, సువర్ణాభరణాలను ధరించి, దివ్యచందనాలను శరీరానికి అలదుకొని, దివ్యమాలలతో అలంకరించుకొని ఉంటాడు. దివ్యభోగాలతో కూడి దివ్యలోకాలలో సంచరిస్తాడు. దేవతల అనుగ్రహంతో పరమశోభను పొందగలడు. ఈ రీతిగా సంవత్సరాల పర్యంతం స్వర్గలోకంలో విరాజిల్లుతాడు. ఆ తరువాత ఇరవైయొక్క వేల సంవత్సరాల పాటు గంధర్వులతో కూడి రమ్యమైన ఇంద్రభవనంలో ఇంద్రునితో సహా సుఖిస్తారు. దివ్యరథాలు, దివ్యవిమానాలు ఎక్కి వివిధలోకాలలో సంచరిస్తాడు. దివ్యకాంతలతో కూడి అమరునివలె సంచరిస్తాడు. ఆ తరువాత సూర్యలోకానికి, చంద్రలోకానికి, శివలోకానికి, విష్ణులోకానికీ వెళతాడు.

మహారాజా ! ఇది ఇలాగే ఉంటుంది. అన్యధా ఆలోచింపనవసరం లేదు. ఈ మహాభారత మాహాత్మ్యఫలాలపై శ్రద్ధతో ఆలోచించాలని మా గురువు చెప్పాడు. మహాభారతాన్ని చెప్పినవానికి అతని మనస్సు కోరుకున్నవన్నీ ఇవ్వాలి. ఏనుగులు, గుర్రాలు, రథాలు, పల్లకీలు, ఇతరవాహనాలు విశేషంగా దానం చేయాలి. కంకణాలను, కుండలాలను, యజ్ఞోపవీతాన్ని, విలువైన వస్త్రాలను, విశిష్టగంధాలను కథకుని కిచ్చి దేవతలనువలె

పూజించాలి. అలా పూజించినవాడు విష్ణులోకాన్ని చేరగలడు. భారతా ! భరతశ్రేష్ఠా ! ఇక మీద మహాభారతకథను చెప్తున్నప్పుడు ప్రతిపర్వంలోనూ క్షత్రియులు జాతిని, దేశాన్ని, సత్యశీలతను, మాహాత్మ్యాన్ని, ధర్మప్రవృత్తిని, వృత్తిని తెలిసికొని బ్రాహ్మణుల కివ్వవలసిన దానాలను గురించి చెపుతాను. ముందు బ్రాహ్మణులచే స్వస్తివాచనం చేయించి ఆ తర్వాత మహాభారత ప్రవచనాన్ని ప్రారంభింపజేయాలి. పూర్తి అయిన తరువాత బ్రాహ్మణులను యథాశక్తిగా పూజించాలి. రాజా ! ఆదిపర్వం పూర్తి అయిన తరువాత ప్రవాచకునకు నూతనవస్త్రాలను కట్టబెట్టి పూజించాలి. ఆ తరువాత యథావిధిగా తీయగా ఉన్న మంచిపాయసాన్ని తినిపించాలి. రాజా ! ఆపై ఆస్తీకపర్వం ముగిసిన తరువాత తేనె, నేయి కలిపిన పాయసాన్ని తినిపించాలి. దానిలో పండ్లు, దుంపలు బాగా ఉండాలి. ఆపై పొంగలి పెట్టాలి. రాజేంద్రా ! సభాపర్వం ముగిసిన తరువాత బ్రాహ్మణులకు మినపరొట్టెలు, అప్పాలు, లడ్లతో సహా పాయసాన్ని భుజింపజేయాలి. ఆరణ్యకపర్వంలో ఫలమూలాలతో బ్రాహ్మణులను తృప్తి పరచాలి. అరణీపర్వంలో నీటితో నింపిన కలశాలను దానం చేయాలి. అరణ్యంలో దొరికే మంచి మంచి పండ్లను, మూలాలను తృప్తి పడేవరకు ఇవ్వాలి. ఇష్టమైన సర్వపదార్థాలతో కూడిన అన్యాన్ని బ్రాహ్మణులకు పెట్టాలి. భరతోత్తమా ! విరాటపర్వంలో వివిధవస్త్రాలను, ఉద్యోగ పర్వంలో గంధమాల్యాలతో బ్రాహ్మణులను అర్చించి సర్వగుణ సంపన్నమైన అన్నాన్ని వారికి సమకూర్చాలి. రాజేంద్రా ! భీష్మపర్వంలో మంచి ప్రయాణసాధనాన్ని ఇచ్చి, ఆపై చక్కగా వండిన, సర్వగుణసంపన్నమైన అన్నాన్ని భుజింపజేయాలి. రాజేంద్రా ! ద్రోణ పర్వంలో బ్రాహ్మణులకు ఉత్తమ భోజనాన్ని పెట్టి, ధనుర్బాణాలను, మంచి కత్తిని దానం చేయాలి.

కర్ణపర్వంలో కూడా అలాగే నియతమనస్కుడై చక్కగా వండిన సర్వగుణ సంపన్నమైన భోజనాన్ని బ్రాహ్మణులకు పెట్టాలి. రాజేంద్రా ! శల్యపర్వంలో కూడా లడ్లు, పొంగలి, అప్పాలు, తృప్తికరాలయిన ఇతర పదార్థాలతో సర్వ సంపూర్ణమైన భోజనాన్ని పెట్టాలి. అదే రీతిగా గదాపర్వంలో కట్టెపొంగలి పెట్టాలి. స్త్రీ పర్వంలో బ్రాహ్మణోత్తములను రత్నదానాలతో తృప్తి పరచాలి. ఐషీక పర్వంలో ముందు నేతి అన్నాన్ని, ఆ తరువాత చక్కగా వండిన, సర్వగుణసంపన్నమైన అన్నాన్ని పెట్టాలి. అదేరీతిగా శాంతి పర్వంలో బ్రాహ్మణులచే హవిష్యాన్ని భుజింపజేయాలి. ఆశ్వమేధిక పర్వంలో అందరిరుచులను అనుసరించి భోజనం పెట్టాలి. అలాగే ఆశ్రమవాస పర్వంలో ద్విజులకు హవిష్యభోజనాన్ని అందించాలి. మౌసలపర్వంలో సర్వగుణసంపన్నమైన అన్నాన్ని, గంధాలను, మాల్యాలను,

గ్రంథాలను దానం చేయాలి. మహాప్రస్థానిక పర్వంలో కూడా అదేరీతిగా సర్వగుణ సంపన్నమైన అన్నాన్ని, స్వర్గపర్వంలో హవిష్యాన్ని బ్రాహ్మణులకు పెట్టాలి. హరివంశం పూర్తి అయిన తరువాత వేయిమంది ద్విజులకు భోజనం పెట్టాలి. ఒక బంగారునాణెంతో కూడా గోవును బ్రాహ్మణునకు దానం చేయాలి. రాజా ! దరిద్రుడైతే కనీసం వాటిలో సగమైనా దానం చేయాలి. ప్రతిపర్వం ముగిసిన తరువాత వివేకి సువర్ణసహితంగా పుస్తకదానం చేయాలి. భరతర్షభా ! హరివంశంలో కూడా ప్రతిపారణ ముగిసిన తరువాత బ్రాహ్మణులచే యథావిధిగా పాయసాన్ని భుజింపజేయాలి. రాజా ! ఈ రీతిగా శాస్త్రకోవిదుడైన పురుషుడు సర్వసంహితలను ఏకాగ్రమనస్కుడై ముగింపజేసి, ఆ సంహితలను పట్టుబట్టలతో కప్పి పవిత్రప్రదేశంలో ఉంచి, తాను తెల్లని వస్త్రాలను ధరించి, పవిత్రుడై, పూలమాలలను అలంకరించుకొని యథావిధిగా ఆ సంహితాగ్రంథాలను విడివిడిగా గంధమాల్యాలతో సావధానంగా అర్చించాలి. ఆపై ఉత్తమ భక్ష్యాలను, పానీయాలను, పూలమాలలను, కమనీయ వస్తువులను కానుక చేయాలి. ఆపై హిరణ్యదానం, సువర్ణదానం చేయాలి. అన్ని సంహితాగ్రంథాల మీద నియతమనస్కుడై మూడు పలాల సువర్ణాన్ని ఉంచాలి. దానిలో పగమైనా, కనీసం నాలుగో భాగమైనా నిలపాలి. విత్తలోభాన్ని మాత్రం విడనాడాలి. తనకు ఇష్టమైన వస్తువుల నన్నింటిని బ్రాహ్మణులకు దానం చేయాలి. కథను ప్రవచించినవాడు తనకు గురువు వంటివాడు. ఆయనను భక్తితో ఆనందింపజేయాలి. సర్వ దేవతలనూ, నరనారాయణులనూ కీర్తించాలి. ఆపై గంధమాల్యాలతో ద్విజోత్తములను అలంకరించి వారి కిష్టమైన వివిధ పదార్థాలనూ, ఇతరాలైన చిన్నా పెద్ద వస్తువులను దానం చేయాలి. అలా చేసినందువలన మానవుడు అతిరాత్రయజ్ఞ ఫలాన్ని పొందుతాడు. అలాగే ప్రతిపర్వంలోనూ బ్రాహ్మణ సమర్చనవలన యాగఫలాన్ని పొందగలడు. భరతశ్రేష్ఠా ! కథను చెప్పేవాడు పండితుడై ఉండాలి. అక్షరాలను, పదాలను, స్వరాలను స్పష్టంగా పలకాలి. భారతాన్ని, హరివంశంలోని భవిష్యపర్వాన్ని ఆయన ప్రవచించాలి. భరతశ్రేష్ఠా ! ప్రవచనం ముగిసిన తరువాత బ్రాహ్మణులు భోజనం చేసిన తరువాత యథోచితంగా దానాలు ఇప్పించాలి. ప్రవచనం చేసినవానిని కూడా చక్కగా అలంకరించి, భుజింపజేయాలి. కథకుడు ఆనందించినప్పుడే శుభాస్పదమైన ఉత్తమప్రీతి కలుగుతుంది. బ్రాహ్మణులు ఆనందించినప్పుడే సర్వదేవతలు ప్రసన్నులవుతారు. కాబట్టి భరతశ్రేష్ఠా ! సజ్జనులు యథాన్యాయంగా బ్రాహ్మణులను (కథకులను) వరించి, వివిధప్రకారాలైన వారి కోరికలను అన్నింటినీ తీర్చి అర్చించాలి. మనుజశ్రేష్ఠా ! నీవడిగిన దానికి సమాధానంగా మహాభారత

శ్రవణపారాయణాల విధానాన్ని నీకు తెలియజేశాను. దీనిని శ్రద్ధగా ఆలోచించాలి. రాజా ! రాజశ్రేష్ఠా ! ఉత్తమ శ్రేయస్సును ఆశించేవాడు మహాభారతాన్ని వినటంలోనూ, పారాయణ చేయటంలోనూ సర్వదా ప్రయత్నశీలుడై ఉండాలి.

భారతాన్ని నిత్యమూ వినాలి. భారతాన్ని నిత్యమూ చదవాలి. ఇంట్లో భారతముంటే విజయం చేతిలో ఉన్నట్లే ! భారతం పరమ పుణ్యగ్రంథం. భారతంలో వివిధకథలు ఉన్నాయి. భారతాన్ని దేవతలు కూడా సేవిస్తారు. అది మోక్ష స్వరూపం. భరతర్షభా ! సర్వశాస్త్రాలలోనూ ఉత్తమమైనది భారతం. భారతం ద్వారా మోక్షం లభిస్తుంది. నీకు వాస్తవం చెప్తున్నాను. **మహాభారతాఖ్యానాన్ని, భూమిని, గోవును, సరస్వతిని, బ్రాహ్మణులను, కేశవుని కీర్తించినవాడు ఇబ్బందులలో పడడు. భరతర్షభా ! వేదంలో, రామాయణంలోనూ, పవిత్రమైన మహాభారతంలోనూ ఆదిమధ్యాంతాలలో హరిసంకీర్తన చేయబడుతుంది. విష్ణుమూర్తి యొక్క దివ్యగాథలు, సనాతన శ్రుతులు నెలకొన్న మహాభారతాన్ని మోక్షంపై కోరిక గలవాడు తప్పక వినాలి.** ఇది పరమపవిత్రం. ఇది ధర్మ నిదర్శనం. శ్రేయఃకాముకుడు సర్వగుణసంపన్నమైన దీనిని వినాలి. మహాభారత శ్రవణం వలన మనోవాక్కాయాలతో చేసిన పాపం సూర్యోదయంతో చీకటివలె పూర్తిగా నశిస్తుంది. విష్ణుభక్తుడు అష్టాదశ పురాణాలు వినటం ద్వారా పొందే ఫలాన్ని మహాభారత శ్రవణం ద్వారా పొందవచ్చు. ఈ విషయంలో సంశయం లేదు. మహాభారత శ్రవణం వలనల స్త్రీలు, పురుషులు కూడా విష్ణుపరంధామాన్ని చేరుతారు. పుత్రకామనగల స్త్రీలు విష్ణుకీర్తిగాన రూపమైన మహాభారతాన్ని వినాలి. శాస్త్రోక్తమైన ఫలితాన్ని పొందగోరినవాడు కథకునకు అయిదు బంగారు నాణేల దక్షిణను కూడా ఇవ్వాలి. ఆత్మశ్రేయస్సును కోరుకొనేవాడు బంగారుకొమ్ములు గల కపిలగోవును, వస్త్రాలతో అలంకరించి దూడతో పాటు కథకునకు దానమివ్వాలి. భరతర్షభా ! చేతులకు అలంకారాలను (కంకణాలను) కూడా ఇవ్వాలి. కర్ణాభరణాన్ని, విశేషధనాన్ని కూడా ఇవ్వాలి. రాజా ! కథకునకు భూదానం కూడా చేయాలి. భూదానంతో సమానమైన దానం ఇంతవరకు లేదు. ఇక మీద ఉండదు. సతతమూ మహాభారతాన్ని విననరుడూ, వినిపించిన నరుడూ కూడా సర్వపాపవిముక్తుడై విష్ణుపరంధామాన్ని చేరుతాడు. భరతర్షభా ! అతడు పదకొండు తరాలలోని తన పితరులను, తనను, భార్యనూ, పుత్రులను కూడా తరింపజేస్తారు. రాజా ! మహాభారతాన్ని వినిన తరువాత దానిలో పదవవంతు హోమం కూడా చేయాలి. నరోత్తమా, ఇలా నేను నీకు చెప్పవలసిన దంతా చెప్పాను.

మహాభారత మాహాత్మ్యము

ఈ మహాభారతం ఒక నిర్మలమైన పద్మం. ఇది వ్యాస మహర్షి యొక్క వాణి అనే సరోవరంలో పుట్టింది. ఇది గీతార్థం అనే సుగంధం విరజిమ్ముతోంది. నానావిధాలయిన ఆఖ్యానాలనే కేసరాలు దీనికి ఉన్నాయి. ఈ పద్మం హరి యొక్క కథలనే సూర్యకిరణాలతో వికసిస్తుంది. సజ్జనులనే తుమ్మెదలు నిరంతరమూ దాని రసాన్ని ఆస్వాదిస్తారు. అంతేకాదు కలికాలం యొక్క పాపం అనే మాలిన్యాన్ని పోగొట్టుతోంది. అటువంటి ఈ మహాభారత పద్మం మాకు శ్రేయోదాయక మగుగాక. ఇందులో విష్ణు కథలూ, సనాతనమైన వేదాలూ నిండి ఉన్నాయి. పరమపదం కోరే మానవులు దీన్ని తప్పక వింటారు. వినండి ఆ సింహనాదం. పద్దెనిమిది పురాణాలు వ్రాసిన వేద సముద్రుడయిన వ్యాస భగవానుని సింహనాదం అది. అపరిమిత బుద్ధిశాలి అయిన వ్యాసమహర్షి చెప్పిన ఈ మహాభారతం పవిత్రమయిన ధర్మశాస్త్రం. శ్రేష్ఠమయిన ధర్మశాస్త్రం. సర్వోత్తమమయిన ధర్మశాస్త్రం కూడ. అందుకే మహా భారతం సకశాస్త్రాలలోను ఉత్తమం. అందుకే అందరూ ఇపుడూ చదువుతున్నారు వింటున్నారు. ఇక ముందూ వింటారు, వినిపిస్తారు. నియమపరుడై వర్షాకాలం నాలుగు నెలలూ భారతం చదివితే సర్వపాపాలు నశిస్తాయి. శుచియై కురు వంశాన్ని కీర్తిస్తే తన వంశం వృద్ధి పొంది పూజ్యతమం అవుతుంది. ఈ భారతం పరమ పవిత్రమయినది. ధర్మస్వరూపానికి ప్రమాణప్రాయమయినది. సర్వసద్గుణాలూ కలిగినది. ఐశ్వర్యం కోరేవాడు వినాలి. వాక్కుతో మనశ్శరీరాలతో చేసిన పాపమంతా సూర్యోదయంతో చీకటి నశించి పోయినట్లు పోతుంది. పుణ్యార్థం ఈ భారతాన్ని పవిత్ర బ్రాహ్మణులకు వినిపించేవాడు మహాపుణ్యమూ సనాతన ధర్మాన్నీ పొందుతాడు. మహాభారతాన్ని భూమిని, ఆవును, సరస్వతిని, విప్రుని, కేశవుని కీర్తించేవాడు ఎన్నడూ దుఃఖం పొందడు. సతతమూ మహాభారతాన్ని విన్నా, వినిపించినా ఆ మానవుడు సర్వపాపాల నుండి విముక్తి పొంది విష్ణుపదం పొందుతాడు. ఇటుపది తరాలూ అటు పది తరాలూ పితరులను ఉద్ధరిస్తాడు. తననూ, భార్యాపుత్రులను కూడ సముద్ధరిస్తాడు. సముద్రమూ మేరుపర్వతమూ రత్ననిధులని ప్రసిద్ధి. అటువంటిదే భారతమూ. ఈ భారతాన్ని చదివినా విన్నా తుష్టి, మహాపుణ్యమూ కలిగినట్లుగా స్వర్గానికి చేరినా కూడా అంత తుష్టి కలగదు. ఈ భారతం విన్న మానవునికి

వాఙ్మనశ్శరీరాలతో చేసిన పాపం వెంటనే పోతుంది. అసూయారహితులై భరతవంశస్థుల చరిత్ర విన్నవారికి వ్యాధి భయమే కలగదు. ఇక పరలోక భయం ఎక్కడిది ?

ఈ మహాభారతం వేదతుల్యమయినది. (పంచమవేదం) ఉత్తమం పవిత్రం కూడా. వినసొంపైనది. శ్రుతిహితంగా, శీలం వృద్ధి పొందించేది. అటువంటి ఈ భారతాన్ని చదివే వానికి ఇచ్చేవాడు సముద్ర పర్యంతమయిన భూమిని దానం చేసిన ఫలితం పొందుతాడు. అష్టాదశ పురాణాలు, ధర్మశాస్త్రాలన్నీ, సాంగములయిన వేదాలూ ఒక వైపున భారతం ఒకవైపున పెట్టి తూచితే మహత్త్వమూ భారవత్త్వము ఉండటం చేత మహాభారతం వైపే మొగ్గు చూపుతుంది. ఇది తెలిసిన వాని పాపం పటాపంచలవుతుంది. ఇది జయమనే పేరు గల ఇతిహాసం, మోక్షం కోరుకొనే బ్రాహ్మణుడు కాని రాజు కాని; గర్భిణికాని తప్పక వినాలి. ఇది వింటే స్వర్గం కోరే వానికి స్వర్గమూ, జయం పొందాలనుకొనే వానికి విజయమూ, గర్భవతికి పుత్రుడు కాని భాగ్యవతి అయిన పుత్రికకాని కలుగుతుంది. బంగారు కొమ్ములు కల నూరు ఆవులను, వేదవేత్త అయిన బహుశ్రుతునకు దానం చేసిన వాడూ, మహాభారతం విన్నవాడూ ఇద్దరూ సమాన ఫలితం పొందుతారు. కృష్ణద్వైపాయనుడు వ్రాసిన (పంచమ) వేదం ఇది. దీన్ని ఏకాగ్రచిత్తంతో విన్నవానికి బ్రహ్మహత్యాది పాతకాలు కోట్ల కొలదీ నశిస్తాయి. వాని కుమారులు తండ్రి మాట వింటూ, సేవకులై ప్రియంగా మెలగుతారు. భరతవంశస్థుల మహిమాన్విత జన్మలు వివరించడం చేతనే ఇది మహాభారతమయింది.

మహాభారతంలో దేవతలూ, రాజర్షులూ, పుణ్యాత్ములయిన బ్రహ్మర్షులూ, కీర్తింపబడ్డారు. కేశవుడు కీర్తింపబడ్డాడు. ఉమామహేశ్వరులూ కార్తికేయుని జన్మమూ కీర్తింపబడ్డాయి. గో బ్రాహ్మణుల మాహాత్మ్యం ఇందులో వర్ణింపబడింది. ఇది అంతా వేదసముదాయం. ధర్మబుద్ధి కలవారు వినదగింది. రాహువు నుండి చంద్రునికి కల్గినట్లు సర్వపాపాల నుండి విన్నవారికి ముక్తి కలుగుతుంది. **ఇది జయమనే ఇతిహాసం. జయం కావలసినవారు కోరదగింది. ఇందులో అర్థకామాలు సంపూర్ణంగా వివరింపబడ్డాయి. మహాపుణ్యప్రదమయిన ఈ భారతం వింటే బుద్ధి పరమాత్మ మీద లగ్నం అవుతుంది. అందుకే భారతం నిత్యమూ వినాలి. కీర్తించాలి. భారతం ఇంట్లో ఉన్నా చాలు జయం హస్తగతమైనట్లే.** కృష్ణద్వైపాయన మహర్షి సత్యవాది, విధిజ్ఞుడూ, సర్వజ్ఞుడు. ధర్మజ్ఞానాలు కల సత్పురుషుడు. అతీంద్రియ శక్తులు కల శుచిమంతుడు. తపస్వి, సాంఖ్యయోగాల వైభవం పూర్తిగా తెలిసినవాడు. ఎన్నో తంత్ర

విజ్ఞానాలు కల వ్యాసుడు దివ్యదృష్టితో చూసి, పాండవుల కీర్తినీ, ఇంకా ఇతర రాజుల అధికైశ్వర్యతేజస్సునూ లోకానికి చాటి చెప్పాలని పవిత్రమూ ఉత్తమమూ అయిన ఈ ఇతిహాసాన్ని నిర్మించాడు / చెప్పాడు. అష్టాదశ పురాణాలూ వింటే కలిగే ఫలాన్ని విష్ణుభక్తుడు కేవలం భారతాన్ని వింటేనే పొందుతాడు. సందేహం లేదు. స్త్రీ పురుషులు విష్ణుపదాన్ని పొందుతారు. పుత్రులను కోరే స్త్రీలు వైష్ణవ యశస్సుమ గూర్చి వినాలి. ధర్మాభిలాషి అయిన మానవుడు ఈ ఇతిహాసమంతా చదివితే సిద్ధి పొందుతాడు. పుణ్యశీలుడు శ్రద్ధతో దీన్ని చదివినా, వినిపించినా రాజసూయ - అశ్వమేధ యాగాల ఫలితాని పొందుతాడు. కృష్ణద్వైపాయన మహర్షి మూడు సంవత్సరాల పాటు ప్రయత్నశీలుడై శుచియై తపోనియమంతో ఈ భారతం చెప్పాడు. అందుచేత దీన్ని విప్రులు నియమసహితులై వినాలి. ఈ భారతాన్ని వింటే రాజులు శత్రువులను జయించి రాజ్యం పొందుతారు. సత్పుత్రులను శుభాలను పొందుతారు. యువరాజు తన ధర్మపత్నితో కలిసి వింటే వీరుడయిన పుత్రుడు పుడతాడు. రాజ్యాన్ని పొందే కన్యనయినా కంటాడు. ప్రతి పర్వదినంలోనూ దీన్ని వినిపిస్తే, వింటే వానికి పాపం నశించి, స్వర్గం లభిస్తుంది. శ్రాద్ధ సమయంలో ఒక పాదం విన్నా పితరులకు అక్షయమైన అన్న పానాలు లభించినట్లే. పుణ్యప్రదం, మహార్థం ఇచ్చేది, వేదప్రమాణమయిన భారతాన్ని, బ్రాహ్మణుని ముందిడుకొని విన్నవాడు, ఇక్కడ సర్వకామాలనూ, కీర్తినీ పొంది పరమసిద్ధిని, పదాన్ని పొందుతాడు. సందేహం లేదు. ఈ భారతాన్ని శ్రాద్ధంలో బ్రాహ్మణులకు ఒక్క పాదమయినా వినిపిస్తే వాని పితరులకది అక్షయ మవుతుంది. భారతం పరమ పుణ్యప్రదం. ఇందులో ఎన్నో వివిధ కథలున్నాయి. దేవతలు కూడ దీన్ని సేవిస్తారు. **భారతం పరమపద ప్రాప్తి నిస్తుంది.** సర్వశాస్త్రాల్లో భారతం ఉత్తమమయినది. భారతం వల్ల మోక్షం పొందవచ్చు. ఇది యథార్థం. ఇందులో ఆలోచింపవలసినది లేదు. శ్రద్ధాళువు ఇలా భావించాలి అని నా గురువు గారు చెప్పారు. వేదంలో, రామాయణంలో, పుణ్యప్రదమయిన భారతంలో, ఆది మధ్యాంతా లన్నిటా హరి కీర్తింపబడుతున్నాడు. **మోక్షాన్ని కాంక్షించేవాడు సదా ప్రయత్నపరుడై మహాభారత శ్రవణంకాని పారాయణం కాని చేస్తూ ఉండాలి.**

తప్పు-ఒప్పుల పట్టిక

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
ఆది పర్వం - 1			
7	6	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
7	14	కృతాజ్ఞతాబద్ధులమై	కృతజ్ఞతాబద్ధులమై
150	26	అ నీ పూర్వులు	నీ పూర్వులు
161	9	బలశాలలులైన	బలశాలులైన
177	28	రెండవాడు	రెండవవాడు
218	3	అని దేవయాని	దేవయాని
235	5	అభిషేకిద్దా	అభిషేకిద్దాం
241	20	భౌముములూ	భౌమములూ
245	11	లేని	లేనివాని
245	23	పౌరలౌకిక	పారలౌకిక
268	17	అప్పుడే	అప్పుడే
282	17	కృష్ణద్వైపాయనుని	కృష్ణద్వైపాయనుని
283	3	దొంగలించిన	దొంగిలించిన
ఆది పర్వం - 2			
7	6	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
7	14	కృతాజ్ఞతాబద్ధులమై	కృతజ్ఞతాబద్ధులమై
16	22	యమ	మయా
18	19	మూడులోకాలోనూ	మూడులోకాల్లోనూ
21	23	వెన్ను కుదిరిగేదాకా	వెన్నుకు తిరిగేదాకా
25	13	అపహరి పంచిన	అపహరించిన
26	3	తల్లి	తల్లికీ,
30	18	ఊర్లనాభుడు,	ఊర్ణనాభుడు,

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
32	5	అభిషిస్తూ	అభిలషిస్తూ
33	3	జతకట్టాడు.	జతకట్టాను.
34	22	అంతకరణమాలిన్యాన్ని	అంతఃకరణమాలిన్యాన్ని
46	5	సంన్నులయిన	సంపన్నులయిన
48	చివరి	పవిత్రహిమలయ	పవిత్రహిమాలయ
50	5	బాహుబాలాన్ని	బాహుబలాన్ని
66	20	స్నానాంతరం	స్నానానంతరం
69	22	వచ్చార,	వచ్చారని,
97	6	'నాబాహుబాలనికి	'నాబాహుబలానికి
99	12	రోగ్రగ్రస్తమో	రోగగ్రస్తమో
124	7	దుర్మార్గులారా!	దుర్మార్గురాలా !
124	9	ఈమానవనమాత్రుల్ని	ఈమానవమాత్రుల్ని
127	1	రక్షిస్తారు	రక్షిస్తారు అన్నాడు.
209	4	వినాలనుకొంటున్నాముంది.	వినా లనుకొంటున్నా మంది.
212	3	వస్తాం.జ వజ్రదారి	వస్తాం. వజ్రధారి
234	25	మార్పువిషంలో	మార్పువిషయంలో
235	15	సౌహర్దంతో	సౌహార్దంతో
236	9	ఆవయవాలతో	అవయవాలతో
242	20	అపరహరణకు	అపహరణకు
243	6	అపహరించపబడితే	అపహరింపబడితే
246	23	అందాన్ని	ఆమె అందాన్ని
253	14	నగరంపైపు	నగరంవైపు
257	11	అభరణాలతో	ఆభరణాలతో
263	12	క్రతుశ్రద్ధ	క్రతుశ్రద్ధ

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
266	14	ఖాండవనదహనంలో	ఖాండవ వనదహనంలో
277	21	ఏంది	ఏది
		సభా పర్వం	
7	6	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
7	14	కృతాజ్ఞతాబద్ధులమై	కృతజ్ఞతాబద్ధులమై
30	26	పొందడవీ	పొందడం
46	8	జంగమాత్మాకమైన	జంగమాత్మకమైన
58	18	నిరుత్సాహ	నిరుత్సాహం
69	12	బ్రాహ్మణలవేషాలు	బ్రాహ్మణులవేషాలు
69	23	మ్రాన్నువలె ఉన్నతాలైనుల	మ్రానువలె ఉన్నతాలై
90	17	శిశుపాలుడు	శిశుపాలునికి
104	15	సబంధం	సంబంధం
124	26	పదుకొండు	పదకొండు
132	చివరి	అధికరాం	అధికారం
135	14	వపర్వతానికి	పర్వతానికి
143	3	ఇంద్రద్వీపాని	ఇంద్రద్వీపాన్ని
143	18	స్వస్థానికి	స్వస్థానానికి
151	23	చూడు.	చూడ.
157	5	సుబలుని,	శకునిని,
172	17	బాహ్లీక	బాహ్లీ
178	17	స్వకార్యతత్పరులమయిన	స్వకార్యతత్పరు లమయిన
180	17	విదురుడు	టటవిదురుడు
223	6	మూడులోకాల్లోనూ	మూడులోకాలోనూ
234	7	పెద్దయుద్ధం	పెద్దయుద్ధం

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
		వన పర్వం - 1	
7	6	కృతజ్ఞతాంజలులు	కృతాజ్ఞతాంజలులు
7	14	కృతజ్ఞతాబద్దులమై	కృతాజ్ఞతాబద్దులమై
29	24	సూర్యుని,	సూర్యునికి,
46	11	పంచి	పంచె
48	16	కోపించి	కోపించిన
48	18	లోకాన్నింటికి	లోకాలన్నింటికి
55	23	పాండవీరులంతా	పాండవవీరులంతా
73	25	టయుధిష్ఠిరమహారాజా	యుధిష్ఠిరమహారాజా
109	25	పుట్టుకుండు	పుట్టకుండు
116	1	పర్వతామోద	పర్వతాలమోద
119	2	దృష్టిచో	దృష్టిచే
123	11	స్వర్గమార్గాన్ని	స్వర్గమార్గాన్ని
123	18	నిర్ఘురజలాలను	నిర్ఝురజలాలను
126	13	సహమైన	సహజమైన
126	24	శాసన,	దుఃశాసన,
174	5	ఈమె	ఈమెను
185	8	కుండిననగరాన్ని	కుండిననగరాన్ని
187	23	నడివడి	నడవడి
188	20	మహత్ముని	మహాత్ముని
194	14	'ధానైషధా!	నైషధా !
199	10	'ధర్మాతా!	'ధర్మాత్మా !
222	28	పొందుతానని	పొందుతాడని
236	13	వాలిఖిల్యులు	వాలఖిల్యులు
245	10	దుర్జయమణీమతీ	దుర్జయమణిమతీ

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
254	13	దధీచి	దధీచి అని
260	17	చేరిన ఋషులు,	ఋషులు,
283	1	అతని	అతనిని
309	26	నుభరించే	నుధరించే
319	1	రైభ్యుడుదని	రైభ్యుడు
343	20	తత్వాములు,	తత్వాలు,
361	5	పాండవులకప్పచెప్పి,	పాండవులనప్పచెప్పి,
363	24	చరియల్లోని	చరియల్లో
వన పర్వం - 2			
7	6	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
7	14	కృతాజ్ఞతాబద్ధులమై	కృతజ్ఞతాబద్ధులమై
13	9	కువళాశ్వుడు	కువళాశ్వుడు
17	6	రావణుడు	రాముడు
17	14	రాముడు	రావణుడు
20	9	పర్వదినా సంధికాలంలో	పర్వదినాల సంధికాలంలో
30	6	పర్వతరాజ్యాన్ని	పర్వతరాజాన్ని
42	6	దీనవల్ల	దీనివల్ల
43	3	విచిత్రా ఆయుధాలను	విచిత్రాయుధాలను
43	12	వారికీ, మధ్య జరిగిన ఆ నాకూ.	వారికీ, నాకూ మధ్య జరిగిన
62	7	నిరుత్సాహాలవుతారని	నిరుత్సాహులవుతారని
80	22	గ్రహించుం.	గ్రహించు.
83	9	హిమవచ్ఛిశిఖరం	హిమవచ్ఛిఖరం
83	10	హిమవచ్ఛిశిఖరానికి	హిమవచ్ఛిఖరానికి
145	20	ఆదివ్యాధులు	ఆధివ్యాధులు

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
222	6	సహ	సహా
229	11	శత్రుసంహార్తా!	శత్రుసంహార్తా !
230	8	తపోవనానికి	ద్వైతవనానికి
235	13	సౌభాగ్యపలం.	సౌభాగ్యఫలం.
235	15	నరాధిపుడైన	నరాధిపుడైన
252	23	జయద్రధుని	జయద్రథుని
252	23	సహయకులతో	సహాయకులతో
271	13	'రాజురాజు'	'రాజరాజు'
276	13	తండ్రిమాట	తండ్రి మాట
280	17	రావణుడు	రాముడు
290	16	అయిన సుగ్రీవుడు	సుగ్రీవుడు
294	8	శ్రీమాన్ దధిముఖుడనే	నదధిముఖుడనే
300	22	రాముడు	రావణుడు
341	9	ఆవాహించాను	ఆవహించాను
352	19	లోబడినవారు.	లోబడనివారు.
విరాట పర్వం			
7	6	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
7	14	కృతాజ్ఞతాబద్ధులమై	కృతజ్ఞతాబద్ధులమై
119	10	ఎలా	ఇలా
169	8	యుద్ధం భూమిలో	యుద్ధభూమిలో
178	11	తిరిగి తెచ్చావు.	తిరిగి వచ్చావు.
ఉద్యోగ పర్వం - 1			
7	6	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
7	14	కృతాజ్ఞతాబద్ధులమై	కృతజ్ఞతాబద్ధులమై
131	7	క్రోధాదిరూ మయిన	క్రోధాదిరూపమయిన

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
164	6, 7	యుద్ధసన్నద్ధులయ్యారు.	యుద్ధసన్నద్ధు లయ్యారు.
		ఉద్యోగ పర్వం - 2	
7	6	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
7	14	కృతాజ్ఞతాబద్ధులమై	కృతజ్ఞతాబద్ధులమై
83	15	రాజాశ్రేష్ఠులు	రాజశ్రేష్ఠులు
162	18	ధర్మనం - దనుడు	ధర్మనందనుడు
198	2	టమహారాజా !	మహారాజా !
213	13	ఉద్ధరించ.'	ఉద్ధరించు.'
232	17	"ననే	ననే
236	21	"కన్య పుట్టి	"కన్యగా పుట్టి
236	21	పురుషుడవుతాడతా"స్తాని	పురుషుడవుతాడని
		భీష్మ పర్వం	
9	5	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
9	13	కృతాజ్ఞతాబద్ధులమై	కృతజ్ఞతాబద్ధులమై
13	8	ఉత్తరుకురు	ఉత్తరకురు
25	11	పుసుపు	పసుపు
33	14	ఉత్తరుకురు	ఉత్తరకురు
37	25	బుషికుల్య	ఋషికుల్య
41	20	ఉండదు.	ఉండడు.
59	16	శిరస్సునీ'పై	శిరస్సుపై
63	10	దేవ త్తాన్ని	దేవదత్తాన్ని
67	26	ద్వందాలకు	ద్వంద్వాలకు
90	14	అంటుంతోంది	అంటుతోంది
92	16	అన్యన్య	అనన్య

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
117	17	శ్రుతవర్మ	శ్రుతకర్మ
139	20	ప్రతావంతుడైన	ప్రతాపవంతుడైన
146	25	అశోకుడు	విశోకుడు
147	11	ఏదువందల	ఏడువందల
158	28	గాయపడాయి.	గాయపడ్డాయి.
163	10	భూరిశ్రవడు	భూరిశ్రవుడు
174	17	వి(అ)శోకునితో	విశోకునితో
187	1	బుషులు	ఋషులు
205	7	సంచరిస్తున	సంచరిస్తున్న
212	16	భరతరశ్రేష్ఠ	భరతశ్రేష్ఠ
219	3	తరముతుంటే	తరుముతుంటే
236	14	వేగంతో	వేగంలో
241	19	దీర్ఘనిశ్శాసలు	దీర్ఘనిశ్శ్వాసలు
255	19	ధ్వసంమయిన	ధ్వంసమయిన
256	18	మృగచర్మాససనాల	మృగచర్మాసనాల
257	29	తర్వగా	త్వరగా
266	చివర	యమందండం	యమదండం
297	20	ఇవ్యగా	ఇవ్వగా
315	11	ఉపపాండవులు	ఉపపాండవులు
327	3	క్షత్రియలు	క్షత్రియులు
ద్రోణ పర్వం - 1			
9	5	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
9	13	కృతాజ్ఞతాబద్ధులమై	కృతజ్ఞతాబద్ధులమై
26	7	దహిస్తుంటారు.	దహిస్తుంటాయి.
56	25	సంచిరిస్తూ	సంచరిస్తూ

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
57	12	వాఘ్రదత్తుల	వ్యాఘ్రదత్తుల
57	28	గాండీవధన్వి	గాండీవధ్వని
61	22	బాణలు	బాణాలు
63	23	ఉత్తిరీయాలను	ఉత్తరీయాలను
63	26	శత్రుసంహార్తా!	శత్రుసంహర్తా !
81	26	వస్తుంటే	వస్తూ
89	చివర	అని అర్జునుడు కృష్ణునితో	-
108	26	టవెళ్ళకు,	వెళ్ళకు,
108	26	ఉన్నాను.జ	ఉన్నాను.
113	15	చూస్తి	చూసి
119	3	(సైంధవుడ)	(సైంధవుడు)
121	19	సుకర్ణాభరణాలతో	సువర్ణాభరణాలతో
149	21	ఉంటే	ఉండే
151	15	పుణ్యలలోకాలకు	పుణ్యలోకాలకు
153	22	బ్రాహ్మణులకు	బ్రాహ్మణులకు
163	17	చెప్పు.జ	చెప్పు.
224	21	చంపివేశారు.	చంపివేశాడు.
230	6	కర్ణికారష్పాలతో	కర్ణికారపుష్పాలతో
231	25	విసింది.	తోచింది.
ద్రోణ పర్వం - 2			
9	5	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
9	13	కృతాజ్ఞతాబద్ధులమై	కృతజ్ఞతాబద్ధులమై
18	23	జలంధరుని	జలసంధుని
36	4	సాత్యకి నిరోధించారు.	నిరోధించారు. సాత్యకి
36	18	అతనిని	అతని

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
46	4	అనుసరించి.	అనుసరించి
60	4	రాజాన్నీ	రాజ్యాన్నీ
72	24	మహాబాహహువయిన	మహాబాహువయిన
86	చివర	పాండవులను	పాండవసేనను
92	4	మహాబావువయిన	మహాబాహువయిన
93	1	సముచితం.	సముచితం కాదు.
105	28	వేడి	వెండి
118	16	నశింపజేని,	నశింపజేసి,
155	4	బుుతువులో	ఋతువులో
163	11	చెప్పను'	చెప్పను ?'
165	23	శయ్యలమై	శయ్యలపై
168	14	కొడుకులను	కొడుకులకు
183	2	గరుడతక్షకులయి,	గరుడతక్షకులయి,
185	17	ములకులు	ములుకులు
199	9	కాని ఆయనను	ఆయనను
200	16	అర్జునుడున్న చోటికి	అర్జునుడన్న చోటికి
201	3	నించారు	నింపారు.
203	12	సూణాకర్ణాస్త్ర	స్థూణాకర్ణాస్త్ర
213	18	నిలీనులయినట్లు	విలీనులయినట్లు
231	25	ఇతనికి విసింది.	ఇతనికి తోచింది.
279	14	శ్రేషుడు	శేషుడు
280	6	అసూయగ్రస్తుడయిన	అసూయగ్రస్తుడయిన
కర్ణ పర్వం			
9	5	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
9	13	కృతాజ్ఞతాబద్దులమై	కృతజ్ఞతాబద్దులమై

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
33	3	కప్పాములు,	కప్పములు,
45	25	రథాకులను,	రథికులను,
46	12	పించాలు	పించాలు
50	2	శ్రుతకీర్తి	శ్రుతవర్మ
77	4	ప్రేక్షలులాగా	ప్రేక్షకులులాగా
78	12	కర్ణుడ	కర్ణుడు
87	26	పెవుల	పెదవుల
99	9	పారిపోవుదుగాక.	పారిపోవుదురుగాక.
101	27	భయంర కమయిన	భయంకరమయిన
102	1	ఇంద్రినిగ్రహం,	ఇంద్రియనిగ్రహం,
127	25	శత్రువువు	శత్రువుకు
132	20	ఎగరటాతో	ఎగరటాలతో
134	13	అవృతమయిన	ఆవృతమయిన
138	14	జయించిన తనిని	జయించిన అతనిని
160	21	పాండవీరులు	పాండవవీరులు
163	1	పలుకు.	పలుకకు.
164	20	చేస్తోది.	చేస్తోంది.
210	4	గుర్రాలనన్నింటనీ	గుర్రాలనన్నింటినీ
220	1	పదమూడూ సంవత్సరాలు	పదమూడు సంవత్సరాలూ
223	25	అనుష్ఠానంలో	అనుష్ఠానంలో
247	23	కృపుని; అతని	కృపుని
284	3	దు;దుభి	దుందుభి
297	6	వాయవాయస్త్రంతో	వాయవ్యాయస్త్రంతో
306	24	గురిపెట్టినందువల	గురిపెట్టినందువల్ల
327	20	గురించి	గుర్తించి

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
		శల్య సౌప్తిక స్త్రీ పర్వాలు	
9	5	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
9	14	కృతాజ్ఞతాబద్ధులమై	కృతజ్ఞతాబద్ధులమై
17	13	విదురురుడు	విదురుడు
18	14	శ్రాద్ద	శ్రాద్ధ
23	10	బృహదల్బుడు	బృహద్బలుడు
23	13	గోపాలుయిన	గోపాలురయిన
29	20	పరాభావాన్ని	పరాభవాన్ని
94	3	మడగువైపు	మడుగువైపు
124	12	నివిసిస్తుంటాయి.	నివసిస్తుంటాయి.
143	8	భిషగర్వులైన	భిషగ్వరులైన
150	2	సహో	సహా
161	12	అదృశ్యయ్యాడు	అదృశ్యడయ్యాడు
180	చివర	కనుకొనులతో	కనుకొనలతో
193	16	ఖజనాను,	ఖజానాను,
196	2	అందరూ భారతా!	భారతా! అందరూ
197	15	అనునయించి	అనునయించాడు.
198	14	అతిక్రమించలేదు.	అతిక్రమించలేరు.
199	6	వారిని	వారికి
217	22	శ్మశానవాసిని,	శ్మశానవాసివి,
228	6	కొందరు	కొందరి
259	1	చుట్టేస్తున్నారు.	చుట్టేస్తున్నాయి.
274	28	కోల్పోయాం.	కోల్పోయాం.
286	20	చూటముచ్చటైన	చూడముచ్చటైన
296	8	నడచిపోయిన	గడచిపోయిన

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
శాంతి పర్వం - 1			
9	5	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
9	13	కృతాజ్ఞతాబద్ధులమై	కృతజ్ఞతాబద్ధులమై
36	7	నిందిపందగినవాడు	నిందింపదగినవాడు
40	4	బుషులు	ఋషులు
41	6	మూడుక్షరాలు	మూడక్షరాలు
49	28	వెడతున్నారు	వెడుతున్నారు
53	చివర	బుషులున్నారు	ఋషులున్నారు
71	2	సాధారాణంగా	సాధారణంగా
86	7	సదా ర్మయుతంగా	సదాధర్మయుతంగా
93	17	అపకీర్ణ	అవకీర్ణ
93	చివర	బ్రహ్మచర్మంతో	బ్రహ్మచర్యంతో
117	8	షినాకమనే	పినాకమనే
131	6	చెప్పుం."	చెప్పు."
138	4	బాహుపుత్రుడైన	బహుపుత్రుడైన
156	25	బాధ్యలు	బాధ్యతలు
179	7	సామోయంతో	సామోపాయంతో
185	16	బ్రాహ్మణుని	బ్రాహ్మణుని
196	23	ఆలోచననలను	ఆలోచనలను
234	9	సంవాదము - 1.	సంవాదము.
246	13	శత్రుసైన్నిన్ని	శత్రుసైన్యాన్ని
250	5	ఐశ్వరం	ఐశ్వర్యం
251	13	ఉంటకిస్తూ	ఉటంకిస్తూ
305	28	వదిలివేస్తావు.	వదిలివేసావు.

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
		శాంతి పర్వం - 2	
9	5	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
9	13	కృతాజ్ఞతాబద్ధులమై	కృతజ్ఞతాబద్ధులమై
31	24	కాలతీతమై	కాలాతీతమై
45	22	విడినాడి,	విడనాడి,
49	4	అయిపోయిపోతే	అయిపోతే
53	8	వీడిస్తున్నారు.	పీడిస్తున్నారు.
56	26	తిరుగూతూ	తిరుగుతూ
59	18	మాంతగుడు	మాతంగుడు
83	5	తెలితక్కువగా	తెలివితక్కువగా
94	6	భోగపరాఙ్ముఖుడై	భోగపరాఙ్ముఖుడై
101	10	తెలివితక్కువతన వల్లనే	తెలివితక్కువతనంవల్లనే
107	23	శాననాన్ని	శాసనాన్ని
113	18	దైవకార్యకర్తలు,	దైవకార్యకర్తలు,
194	7	ప్రవాహనుగుణంగా	ప్రవాహానుగుణంగా
197	18	పాప్యుపాయము	ప్రాప్యుపాయము
205	10	ప్రాచీన, బర్హి.	ప్రాచీనబర్హి.
206	14	(బుచీకుని	(బుచీకుని
209	25	మనస్సు.	నమస్సు.
219	24	బుద్ధిని	బుద్ధిని
228	16	(పైవంచె,	(పైపంచె,
250	13	"ద్విజత్తోములారా !	"ద్విజోత్తములారా !
256	19	తపింపిజేస్తూ	తపింపజేస్తూ
258	26	విరాజిల్లూతూ	విరాజిల్లుతూ
260	17	శుక్ర	శక్ర

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
260	21	శుక్ర	శక్ర
261	1	శుక్ర	శక్ర
261	5	శుక్ర	శక్ర
261	14	శుక్ర	శక్ర
261	18	శుక్ర	శక్ర
261	22	శుక్ర	శక్ర
261	28	శుక్ర	శక్ర
261	3	శుక్ర	శక్ర
262	7	శుక్ర	శక్ర
262	11	శుక్ర	శక్ర
267	25	బుషభుడు,	ఋషభుడు,
273	22	నిత్యాగ్ని హోత్రాలు,	నిత్యాగ్నిహోత్రులు,
291	5	ప్రవిహిస్తుంటుంది.	ప్రవహిస్తుంటుంది.
291	7	బుతువులు	ఋతువులు
శాంతి పర్వం - 3			
9	5	కృతాజ్ఞతాంజలులు	కృతజ్ఞతాంజలులు
9	13	కృతాజ్ఞతాబద్దులమై	కృతజ్ఞతాబద్దులమై
20	11	ఎనిమిదవాడు.	ఎనిమిదవవాడు.
23	4	సాగారాన్ని	సాగరాన్ని
23	9	అత్యంతం	అత్యంత
25	13	బుక్కులను,	ఋక్కులను,
39	17	ఆచారిస్తున్నారు.	ఆచరిస్తున్నారు.
40	17	అన్నారు.	అన్నాడు.
43	6	మహతపస్వి	మహాతపస్వి
48	23	బుత్విక్కులు	ఋత్విక్కులు

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
53	5	చేయలా ?	చేయాలా ?
59	16	త్రికాకాలలోని	త్రికాలాలలోని
65	8	సురక్షింతగా	సురక్షితంగా
89	10	ఒక్కొప్పుడు	ఒక్కొకప్పుడు
104	26	దేవికి కోపం వచ్చిందని తెలిసి సర్వాత్మకు డయిన శంకరునికి కోపం వచ్చింది. యజ్ఞాన్నో, బ్రాహ్మణులనో చూడటానికి కుతూహలంతో వచ్చిన వాడినీ కాదు.	యజ్ఞాన్నో, బ్రాహ్మణులనో చూడటానికి కుతూహలంతో వచ్చిన వాడినీ కాదు. దేవికి కోపం వచ్చిందని తెలిసి సర్వాత్మకు డయిన శంకరునికి కోపం వచ్చింది.
124	2	హంతూలికాతల్పం,	హంసతూలికాతల్పం,
130	4	అదరపాత్రుడు	ఆదరపాత్రుడు
161	13	తెలుసుకొనవాలి.'	తెలుసుకొనాలి.
161	14	బుతువుల	ఋతువుల
178	11	అతీతతమైన	అతీతమైన
181	8	అజరామరమర	అజరామర
184	1	తెలియదిగినది.	తెలియదగినది.
184	1	పరమవిధి	పరమావధి
191	7	మాటిమాటిమాటికి	మాటిమాటికి
192	25	బుజుప్రవర్తనకలవాడు,	ఋజుప్రవర్తనకలవాడు,
192	చివర	బుగ్వేదం,	ఋగ్వేదం,
194	12	విప్రశేష్ఠా !	విప్రశ్రేష్ఠా !
199	27	మిద	మీద
205	17	ఆరునెలలో	ఆరునెలల్లో
218	22	అనర్థంలోగాని,	అర్థంలోగాని,

పుట సంఖ్య	పంక్తి సంఖ్య	తప్పు	ఒప్పు
262	23	బుద్ధిని	బుద్ధిని
268	1	వదులు.	వదలు
269	1	బుషులతో	ఋషులతో
279	20	బుషులకు	ఋషులకు
279	23	బుగ్యజు	ఋగ్యజు
294	24	కన్పించేసినట్లు,	కన్పింపజేసినట్లు,
311	6	జల్పించే	జ్వలించే
311	24	ధరిస్తారు.	ధరిస్తాడు.
316	8	బుషులు	ఋషులు
319	5	బుషి	ఋషి
319	12	బుషులు	ఋషులు
319	20	శరీ వర్ణం	శరీర వర్ణం
322	24	అపశకునాలు	అపశకునాలు
323	17	బుషులు	ఋషులు
326	15	బుషులు	ఋషులు
353	10	ధర్మాను	ధర్మాలను
358	13	ఇంతరవరకూ	ఇంతవరకూ



భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా పెరగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందం తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నపుడే భారతం చదివితే ఇరుపది సార్లు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.